'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 313

మంగళవారం 3-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆడకుంటే మీకే నష్టం

పాకిస్తాన్ బోర్డుకు ఐసీసీ హెచ్చరిక
పరిష్కారం చూడాలని సూచన - 14లో

వెండి వికెట్ డౌన్

మరో రూ.52,000 పతనం
రూ. 2.60 లక్షలకు చేరిక - 15లో

సభలో 'చైనా' రగడ!

'చైనా రగడ' లోక్‌సభను కుదిపేసింది. 2020 నాటి భారత్, చైనా ఘర్షణలపై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు గందరగోళానికి దారితీశాయి.

వివరాలు 6లో ▸

సీఈసీ భేటీ నుంచి వాకౌట్

ఢిల్లీలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో భేటీ అయిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అర్థాంతరంగా సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

వివరాలు 6లో ▸

దలైలామాకు గ్రామీ అవార్డు

ఆధ్యాత్మిక గురువు దలైలామా 'గ్రామీ విజేత'గా నిలిచారు. సంగీతంలో ప్రతిష్టాత్మకమైన గ్రామీ అవార్డు ఆయనకు లభించింది.

వివరాలు 6లో ▸

మోమోల ఆశ చూపి..

యూపీలో బాలుడికి మోమోల ఆశ చూపి ముగ్గురు యువకులు అతడి ఇంటి నుంచి భారీగా నగలను దోచేశారు.

వివరాలు 6లో ▸

జంగిల్‌రాజ్‌పై

వెల్లువెత్తిన ఆగ్రహజ్వాల

పార్టీ నేతలపై దాడులను తీవ్రంగా పరిగణించిన వైఎస్సార్‌సీపీ

- రెడ్‌బుక్ రాజ్యాంగంతో బిహార్‌లా మార్చేశారు
- టీడీపీ గూండాలు, అరాచకశక్తుల విధ్వంస కాండపై రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కాపు, బీసీ, ప్రజా సంఘాల ఆగ్రహం
- చంద్రబాబు ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించాలని నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు
- తిరుమల లడ్డూ ప్రసాదంపై వివాదాస్పద ఫ్లెక్సీలు తక్షణమే తొలగించాలని డిమాండ్
- చంద్రబాబు, పవన్, లోకేశ్ నిరాధార ఆరోపణలతో హిందువుల మనోభావాలు దెబ్బతీశారని మండిపాటు
- మత విద్వేషాలు రెచ్చగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదులు
- మరోవైపు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నేతల భేటీ
- జంగిల్ రాజ్యాధిపతి అరాచకాలను జాతీయ స్థాయిలో ఎండగడతామన్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- పూర్తిగా శాంతి భద్రతలు క్షీణించాయని... తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్
- న్యాయస్థానాలు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని వెల్లడి
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నారనే కాపు నేత అంబటి రాంబాబు, బీసీ నేత జోగి రమేష్‌పై టీడీపీ గూండాల హత్యాయత్నం
- తిరుమల లడ్డూపై సీబీఐ సిట్ నివేదిక... గీతం వర్సిటీకి అడ్డగోలు భూ పందేరంపై డైవర్ట్ చేయడానికే ఈ దాడులు
- జంగిల్‌రాజ్ అరాచకాలను రాజ్యసభలోనూ కేంద్రం దృష్టికి తెచ్చిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు

5లో

అనంతపురంలోని పూలే విగ్రహం వద్ద బైఠాయించిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్ తదితరులు

రేపు గుంటూరుకు వైఎస్ జగన్

టీడీపీ రౌడీల చేతిలో దాడికి గురైన అంబటి కుటుంబానికి పరామర్శ

శుక్రవారం ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్‌ను పరామర్శించనున్న మాజీ సీఎం

2లో

కాపులను లక్ష్యంగా చేసుకున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ ఆగ్రహం

5లో



లడ్డూ ప్రసాదంపై బాబు అదే కుతంత్రం!

సీబీఐ తేల్చినా.. తప్పుడు ప్రచారమే!

జంతు కొవ్వు కలిసిందంటూ పదే పదే చంద్రబాబు దుష్ప్రచారం

- ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించినట్లు నిస్సిగ్గుగా అబద్ధాలు.. లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలవలేదని చార్జ్‌షీట్‌లో కోర్టుకు నివేదించిన సీబీఐ
- ఎన్‌డీఆర్‌ఐ నివేదికను చార్జిషీట్‌లో స్పష్టంగా ప్రస్తావిస్తూ.. జంతు కొవ్వు కలవలేదని తేల్చిచెప్పిన దర్యాప్తు సంస్థ
- టీటీడీ నెయ్యిలో చేప నూనె కలిసే అవకాశం లేదని నిర్ధారిస్తూ ఎన్‌డీడీబీ నివేదిక
- అయినా సరే..రాజకీయ స్వార్థంతో చంద్రబాబు పన్నాగాలు
- పాపభీతి లేకుండా.. దేశంలో ఏ సీఎం సాహసించని రీతిలో అదే బుకాయింపు
- చేసిన పాపానికి క్షమాపణలు చెప్పి చెంపలు వేసుకోవాల్సిందిపోయి కుట్రలతో మరింత దిగజారుడు
- ఈ దుష్ప్రచారం, అరాచకాలను ప్రశ్నిస్తున్న వారిపై బాబు సర్కారు అణచివేత చర్యలు
- జంగిల్ రాజ్ పాలనతో పోలీసుల సమక్షంలోనే పచ్చమూకల దాడులు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ పెద్దలు
- లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చెబుతున్నది నిజమే అయితే ఆ విషయాలను సీబీఐ తన చార్జ్‌షీట్‌లో పేర్కొనేది కదా?
- వారి పేర్లను అందులో చేర్చి అరెస్టు చేసేది కదా?

2లో

ఉద్యోగం నుంచి తొలగించడం పెద్ద శిక్ష



ఓ ఉద్యోగిని సర్వీసు నుంచి తొలగించడమనేది పెద్ద శిక్షే అవుతుందని, అంత పెద్ద శిక్ష వేస్తున్నప్పుడు ఆ ఉద్యోగికి ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని హైకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 16లో ▸

రాజకీయ విమర్శలపై ఇష్టారాజ్యంగా

కేసులు పెట్టలేరు

సోషల్ మీడియాలో పోస్టులపై కేసుల నమోదులో పోలీసులు హైకోర్టు మార్గదర్శకాలు పాటించాల్సిందే

- ఇష్టానుసారంగా కేసులు నమోదు చేస్తోన్న పోలీసుల తీరుకు సుప్రీంకోర్టు అడ్డుకట్ట
- ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహా తప్పనిసరి
- తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

■ రాజకీయ విమర్శలకు సంబంధించి ఇష్టానుసారంగా కేసులు నమోదు చేస్తోన్న పోలీసుల తీరుకు సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. ఈ మేరకు ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును దేశ సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది.

- వివరాలు 16లో

ఖజానాకు గండికొట్టి..

పచ్చజేబులు నింపుకొంటూ..

రాష్ట్రంలో యథేచ్ఛగా కల్తీ, అక్రమ మద్యం విక్రయిస్తున్న పచ్చమూకలు

- ఆ మొత్తం డబ్బు పచ్చబాబుల జేబుల్లోకి
- ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు ఈ ఆర్థిక ఏడాదిలో నవంబర్ నాటికి 13% వృద్ధి క్షీణించి రూ.1266 కోట్లు తగ్గిన రాబడి
- 'కల్తీ' వ్యవహారం తెలిసినా... ప్రభుత్వ పెద్దల మనసెరిగి మౌనం వహిస్తున్న ఎక్సైజ్ శాఖ కీలక అధికారులు
- పొరుగు రాష్ట్రాల్లో ఎక్సైజ్ ఆదాయంలో భారీ వృద్ధి.. ఏపీలో మాత్రం క్షీణత
- అదేబాటలో నవంబర్ నాటికి జీఎస్టీ రాబడి క్షీణత 0.04 శాతం
- మంత్రులు, కార్యదర్శుల భేటీలో ఇటీవల వెల్లడించిన ఆర్థిక శాఖ

10లో

లైనూ లేదు.. రైలూ లేదు

- పాత ప్రాజెక్టుల పాటనే 'నిర్మల'ంగా వినిపించిన కేంద్రం
- రైల్వే ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి ఈసారీ మొండిచెయ్యే
- రైల్వే ప్రాజెక్టుల సాధనలో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం

- వివరాలు 10లో

భారత్, అమెరికా

వాణిజ్య ఒప్పందం!

- టారిఫ్‌లు 18 శాతానికి తగ్గింపు: ట్రంప్
- అమెరికాపై భారత్ సుంకాల ఎత్తివేత!
- ప్రధానితో ఫోన్ చర్చల తర్వాత అధ్యక్షుడు
- మోదీ అభ్యర్థన మేరకే నిర్ణయమని వెల్లడి
- భారత్ ఇక మానుంచే చమురు కొంటుంది
- రష్యా చమురు కొనుగోళ్లకు గుడ్‌బై: ట్రంప్

16లో

6 వరకూ ఆధార్ క్యాంపులు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 6 వరకూ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.15 నుంచి 17 ఏళ్ల మధ్య వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. అలాగే ఈ నెల 16 నుంచి 20 వరకు మరో విడత పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనట్టు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

- ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌లో ఇంధన స్విచ్ ఆఫ్.. వరుసగా రెండు సార్లు విఫలమైన లాకింగ్ వ్యవస్థ
- తనిఖీ సందర్భంగా బయటపడిన ఘోర వైఫల్యం.. అప్పడే లండన్ నుంచి బెంగళూరు వచ్చిన విమానం

- వివరాలు 6లో

విశాఖ చేరుకున్న మత్స్యకారులు

■ బంగ్లాదేశ్ జైలులో నిర్బంధించిన తొమ్మిది మంది ఉత్తరాంధ్ర మత్స్యకారులు సోమవారం సురక్షితంగా విశాఖ నౌకాశ్రయానికి చేరుకున్నారు. మూడు నెలల తర్వాత విడుదలైన వీరికి విశాఖలో మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు ఘన స్వాగతం పలికారు.

వివరాలు 2లో ▸

డీడీసీ 0001 నంబర్ @ రూ.2.08 కోట్లు

దేశంలో అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్‌గా రికార్డు!

బీబీటీ వేలంలో దక్కించుకున్న గుంటూరు వ్యాపారవేత్త

- వివరాలు 3లో

పోరాటానికి సిద్ధం చేసే సైకో ఆంకాలజీ

- కేన్సర్ నయం చేయడంలో వైద్యంతో పాటు మనసునూ దృఢం చేయాలి
- సైకో ఆంకాలజిస్ట్‌ల స్పష్టీకరణ
- భారత్‌లో కేన్సర్‌తో పోరాడుతున్న 25 లక్షల మంది

- వివరాలు 13లో

క్లుప్తంగా...

రేపు గుంటూరుకు వైఎస్ జగన్

- టీడీపీ రౌడీల చేతిలో దాడికి గురైన అంబటి కుటుంబానికి పరామర్శ
- శుక్రవారం ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్‌ను పరామర్శించనున్న మాజీ ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరులో పర్యటించనున్నారు. టీడీపీ రౌడీల చేతిలో హత్యాయత్నానికి గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని ఆయన పరామర్శిస్తారు. టీడీపీ గూండాల దాడిలో విధ్వంసానికి గురైన ఆయన ఇంటిని పరిశీలించి, అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అలాగే, శుక్రవారం ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ సహా ఆయన కుటుంబాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు.

విశాఖ చేరుకున్న మత్స్యకారులు

బీచ్ రోడ్డు (విశాఖ): బంగ్లాదేశ్ జైలులో నిర్బంధంలో ఉన్న 9మంది ఉత్తరాంధ్ర మత్స్యకారులు సోమవారం సురక్షితంగా విశాఖ నౌకాశ్రయానికి చేరుకున్నారు. 2025 అక్టోబర్ 22న ఇంజిన్ వైఫల్యం కారణంగా వీరు ప్రయాణిస్తున్న పడవ బంగ్లాదేశ్ జలాల్లోకి కొట్టుకుపోవడంతో అక్కడి అధికారులు అరెస్టు చేశారు. 3 నెలల తర్వాత విడుదలైన వీరికి విశాఖలో మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు ఘనస్వాగతం పలికారు.

పశు వైద్యరంగంలో ఇద్దరికి అత్యున్నత పురస్కారాలు

సాక్షి, అమరావతి: పశు వైద్యరంగంలో సేవలందించిన వైద్యులకు జాతీయ స్థాయిలో ఇచ్చే 'డాక్టర్ సీఎం సింగ్ సుశ్రుత గౌరవ్ రత్న సమ్మాన్ 2025' అవార్డులకు రాష్ట్రానికి చెందిన ఇద్దరిని వెటర్నరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక చేసింది. ఒంగోలు వెటర్నరీ పాలీక్లినిక్‌లో పనిచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నల్లపాటి జగత్ శ్రీనివాస్, విశాఖపట్నంలో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాదిన ప్రసాదరావుకు ఇటీవల ఈ అవార్డులను ప్రదానం చేసింది. అడిషనల్ డైరెక్టర్లు డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ రజినీ కుమారి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ భూపాల్ రెడ్డి వారిని అభినందించారు.

భూసేకరణ పరిహారం రూ.3.14 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: హైకోర్టు ఆదేశాలతో తూర్పుగోదావరి జిల్లా వెలుగుబందలో జగనన్న కాలనీకి భూములు ఇచ్చిన రైతులకు చంద్రబాబు ప్రభుత్వం పరిహారాన్ని విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ సోమవారం ఉత్తర్వులిచ్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలో 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా నిర్మించిన జగనన్న కాలనీ కోసం సేకరించిన భూములకు ఇవ్వాల్సిన పరిహారం రూ.3.14 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేసింది. ఆ గ్రామంలోని సర్వే నంబర్ 51లో సుమారు 4.70 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వం మారిన తర్వాత చంద్రబాబు నిధుల చెల్లింపులో జాప్యం చేస్తుండడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీలో వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలతో పాటు మరిన్ని అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

నాపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

లీగల్ సెల్ ద్వారా అంబటి రాంబాబు ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/లక్ష్మీపురం: తనపై తెలుగుదేశం పార్టీ వారు జనవరి 31న దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పార్టీ లీగల్ సెల్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం న్యాయమూర్తి అనుమతితో ఫిర్యాదు కాపీలపై అంబటి రాంబాబు సంతకం చేశారు. గుంటూరు లీగల్ సెల్ న్యాయవాదులు మాధవి, సీడీ భగవాన్ తదితరులు పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో ఆ కాపీని అందజేశారు. తనపైన, తన కుటుంబ సభ్యులపైన, పార్టీ నాయకులు, కార్యకర్తలపైన దాడులు జరిగాయని, ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందని, ఆస్తుల విధ్వంసం జరిగిందని, మీ పరిధిలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

● లడ్డూ ప్రసాదంపై బాబు అదే కుతంత్రం!

సీబీఐ తేల్చినా.. తప్పుడు ప్రచారమే!

జంతు కొవ్వు కలిసిందంటూ పదేపదే చంద్రబాబు దుష్ప్రచారం

ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించినట్లు నిస్సిగ్గుగా అబద్ధాలు



సాక్షి, అమరావతి: బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు బరి తెగించి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆరాధ్య దైవం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందంటూ దారుణమైన ఆరోపణలు చేశారు. ఇందులో ఏమాత్రం నిజం లేదని ప్రఖ్యాత ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు నిర్వహించిన పరీక్షల్లో నిర్ధారణ కావడం.. సాక్షాత్తూ సీబీఐ కూడా దర్యాప్తులో అదే విషయాన్ని తేల్చి న్యాయస్థానానికి నివేదించడంతో దిక్కు తోచని చంద్రబాబు నిస్సిగ్గుగా బుకాయిస్తున్నారు. లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందని 'నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌డీడీబీ) పరీక్షల్లో నిర్ధారణ అయినట్టు చంద్రబాబు చెబుతుండటం విస్తుగొలుపుతోంది. తన రాజకీయ స్వార్థం కోసం ఎన్‌డీడీబీ నివేదికను వక్రీకరిస్తూ లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారానికి తెగబడుతున్నారు. టీటీడీ నెయ్యిలో చేప నూనె కలిసే అవకాశం లేదని నిర్ధారిస్తూ 2025 మార్చి 27న ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదిక ఇవ్వగా.. లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని ఎన్‌డీఆర్‌ఐ ల్యాబొరేటరీ 2025 మే 16న రిపోర్టు ఇచ్చింది. అదే విషయాన్ని తన దర్యాప్తులో నిర్ధారిస్తూ, లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు లేదని పేర్కొంటూ సీబీఐ ఈ ఏడాది జనవరి 23న న్యాయస్థానంలో చార్జిషీట్‌ను సమర్పించింది. అయినా సరే.. ఏమాత్రం పాపభీతి లేకుండా.. దేశంలో ఏ ముఖ్యమంత్రీ సాహసించని రీతిలో చంద్రబాబు మళ్లీ అవే అబద్ధాలాడుతున్నారు. లడ్డూ ప్రసాదం కోసం వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ నియమించిన సిట్ తేల్చిచెప్పినా... లెక్క చేయకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. చేసిన పాపానికి క్షమాపణలు చెప్పి చెంపలు వేసుకోవాల్సిందిపోయి రాజకీయ కుట్రలతో చంద్రబాబు మరింత దిగజారి వ్యవహరిస్తుండటం పట్ల శ్రీవారి భక్తుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. హైందవ ధర్మం, కలియుగ దైవం తిరుమల శ్రీవారి పట్ల ఏమాత్రం భయభక్తులు లేకుండా చంద్రబాబు అసత్యాలు వల్లిస్తుండటం.. లడ్డూ ప్రసాదం ప్రాశస్త్యాన్ని దెబ్బతీసేందుకు కుతంత్రాలకు పాల్పడటం పట్ల కన్నెర్ర చేస్తున్నారు. ఈ దారుణమైన అబద్ధాలు, నిందలను ప్రశ్నిస్తున్న వారిపై పోలీసుల సమక్షంలోనే దాడులకు పురిగొల్పుతూ ప్రభుత్వ పెద్దలు జంగిల్ రాజ్ పాలన సాగిస్తున్నారు. ఈ అరాచకాలను స్వయంగా పర్యవేక్షిస్తూ కుట్రలకు పదును పెడుతుండటం విభ్రాంతి కలిగిస్తోంది.

సీబీఐ తేల్చిచెప్పినా అదే కుట్రా బాబూ!

ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబొరేటరీల్లో తాము పరీక్షించిన నాలుగు నమూనాల్లోనూ పంది, గొడ్డు, చేప వంటి జీవుల కొవ్వు లేనే లేదని సీబీఐ తన చార్జిషీట్‌లో స్పష్టం చేసింది. నెయ్యి నాణ్యతను విశ్లేషించి నివేదికను ఇంగ్లిష్ అక్షర క్రమంలో పాయింట్ల వారీగా వివరించింది. అందులో ఏడో పాయింట్ (జి) లో సీబీఐ పేర్కొన్న విషయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో కొలెస్ట్రాల్ లేదని పరీక్షల్లో వెల్లడైందని తెలిపింది. జంతువుల కొవ్వులోనే కొలెస్ట్రాల్ ఉంటుంది. కొలెస్ట్రాల్ లేదని అంటే.. జంతువుల కొవ్వు కలవలేదని స్పష్టం చేసినట్టేనని ఆహార నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఈ విషయాలను జాతీయ మీడియా కూడా ప్రముఖంగా ప్రచురించింది. రాజకీయ స్వార్థంతోనే చంద్రబాబు లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేశారన్నది జాతీయ స్థాయిలో స్పష్టమైంది. అయితే ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎంతకైనా దిగజారుతానని ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే నిరూపిస్తున్నారు. అందుకు తిరుమల లడ్డూ ప్రసాదంపై చేస్తున్న దుష్ప్రచారమే తాజా తార్కాణం. 2024 అక్టోబర్‌లో మొదలు పెట్టిన ఈ కుతంత్రాన్ని ఏడాదిన్నరగా కొనసాగిస్తుండటం ప్రభుత్వ బరితెగింపునకు నిదర్శనం. అందుకే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలనే ఉద్దేశంతోనే వైఎస్సార్‌సీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బా రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఈ కేసు విచారణను చేపట్టింది. వేర్వేరు ట్యాంకర్ల నుంచి సేకరించిన నెయ్యి శాంపిళ్లను హర్యానాలోని ప్రతిష్టాత్మకమైన 'నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌డీఆర్‌ఐ)లో ల్యాబరేటరీకి పంపించి పరీక్షించింది. ఆ నెయ్యిలో ఎటువంటి జంతు కొవ్వు కలవలేదని ఆ పరీక్షల్లో వెల్లడైంది. ఈమేరకు శాస్త్రీయంగా విశ్లేషించి ఎన్‌డీఆర్‌ఐ 2025 మే 16న సాధికారికంగా వెల్లడించిన ఆ నివేదికనే సీబీఐ నెల్లూరు న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జిషీట్‌లో స్పష్టంగా పేర్కొంది. నాలుగు నెయ్యి నమూనాలను 'ట్రైగ్లిసరైడ్ ప్రొఫైల్'ను పరీక్షించి మరీ నిర్ధారించాయని తెలిపింది.

ఎన్‌డీడీబీ నివేదికను వక్రీకరిస్తూ చంద్రబాబు కుట్ర

లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారం బెడిసికొట్టడంతో చంద్రబాబు కంగు తిన్నారు. దాంతో రెండు రోజుల పాటు మౌనంగా ఉన్న ఆయన మళ్లీ అదే కుట్రను పదును పెట్టడం గమనార్హం. లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించడంతోనే తాను అలా మాట్లాడానని ఆయన చెప్పుకొచ్చారు. తద్వారా ఎన్‌డీడీబీ నివేదికను వక్రీకరిస్తూ దుష్ప్రచార కుట్రకు తెగబడుతున్నారు. వాస్తవానికి నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ కలసి ఉండొచ్చని ఎన్‌డీడీబీ నివేదిక అభిప్రాయపడింది. అంటే మొక్కల నుంచి వచ్చే వెజిటబుల్ ఫ్యాట్‌నే ఫారిన్ ఫ్యాట్ అని కూడా చెబుతూ నివేదికలో అభిప్రాయపడింది. అది సర్వసాధారణ అంశమే. పశువులు తినే మొక్కలు, దాణాను బట్టి అది ఆధారపడి ఉంటుందని ఆహార శాస్త్ర నిపుణులే చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. కానీ చంద్రబాబు మాత్రం ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకే టీటీడీ నెయ్యిపై దుష్ప్రచారం కొనసాగిస్తుండటం విభ్రాంతి కలిగిస్తోంది. టీటీడీ లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతు, చేప కొవ్వు కలిపే అవకాశం లేనే లేదని గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ పరీక్షల్లో వెల్లడైంది. అదే విషయాన్ని 2025 మార్చి 27న సీబీఐకి నివేదించింది. సీబీఐ ఇటీవల నెల్లూరు న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జిషీట్‌లోనూ అదే విషయాన్ని స్పష్టంగా పొందుపరిచింది. టీటీడీ నెయ్యిలో జంతు, చేప కొవ్వు కలిసే అవకాశమే లేదని చార్జిషీట్‌లోని 208వ పేజీలో పేర్కొంది. అయినాసరే చంద్రబాబు ఎన్‌డీడీబీ నివేదికను వక్రీకరిస్తూ లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచార కుట్రలను కొనసాగిస్తున్నారు. ఎన్‌డీడీబీ చెప్పని విషయాలను చెప్పినట్లుగా పదేపదే విష ప్రచారం చేస్తుండటం విభ్రాంతి కలిగిస్తోంది.

అదే నిజమైతే సీబీఐ ప్రస్తావించేది కదా!

లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించి ఉంటే... సీబీఐ తన చార్జిషీట్‌లో ఆ విషయాన్ని ప్రస్తావించేది కదా అని నిపుణులు చెబుతున్నారు. కానీ 219 పేజీల చార్జిషీట్‌లో సీబీఐ ఎక్కడా కూడా ఆ విషయాన్ని ప్రస్తావించనే లేదు. ఎన్‌డీడీబీ నివేదిక గురించి కూడా చార్జిషీట్‌లో ప్రస్తావించింది.. కానీ టీటీడీ నెయ్యిలో జంతు కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ పరీక్షల్లో వెల్లడైనట్టు ఎక్కడా పేర్కొననే లేదు. అదే సమయంలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని ఎన్‌డీఆర్‌ఐ ఇచ్చిన నివేదికనే సీబీఐ తన చార్జిషీట్‌లో ప్రముఖంగా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. కానీ జంతు కొవ్వు కలవలేదన్న వాస్తవాన్ని అంగీకరించేందుకు చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియా ఏమాత్రం ఇష్టపడటం లేదు. అందుకే ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని పరిశీలకులు విమర్శిస్తున్నారు.



ICAR-National Dairy Research Institute (ICAR-NDRI,Karnal),Haryana:

During the investigation, four sealed ghee samples drawn by TTD from four tankers of M/s A R Dairy Food Private Limited (A-1) on 06.07.2024 and 12.07.2024 at TTD Warehouse, Godown-IV, Tirumala, were sent through this Hon'ble Court to ICAR-NDRI, Karnal, Haryana, to test for the presence of lard and other animal fats. NDRI, Karnal, in its report dated 16.05.2025, stated that all four samples were analyzed using a PCR-based method (Ref. No NDRI/DC/VS/SOP-I), Limit of detection (LOD):>10%, but not detected LARD in any of the four samples.

తిరుమల లడ్డూ తయారీలో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేనే లేదని ఎన్‌డీఆర్‌ఐ పరీక్షల్లో వెల్లడైందని స్పష్టం చేసిన విషయాన్ని సీబీఐ సిట్ తన చార్జిషీట్‌లో పేర్కొన్న భాగం



d. In fatty acid analysis of Ghee samples received from TTD, presence of Eicosapentaenoicacid (C20:5 n-3) and Docosahexaenoic acid (C22:6, n-3) were found below the limit of quantification in all the four samples. This suggests that the chances for presence of Fish oil in the Ghee samples of TTD appears very rare.

తిరుమల లడ్డూల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో చేప నూనె కలిసే అవకాశం లేనేలేదని ఎన్‌డీడీబీ పరీక్షల్లో వెల్లడైందని సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్న అంశం



లడ్డూలో కల్తీ నెయ్యి ఉందని ఎన్డీడీబీ నివేదిక స్పష్టం చేసిందంటూ చంద్రబాబు టీడీపీ అధికారిక ఎక్స్ ఖాతాలో చేసిన పోస్టు

రాష్ట్రాన్ని 'జంగిల్ రాజ్' చేశారు

చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం

- పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు అత్యవసరంగా సమావేశమైన సీనియర్ నేతలు
- అంబటి రాంబాబుపై హత్యాయత్నం, జోగి రమేష్ ఇంటిపై జరిగిన దాడిపై చర్చ
- బాబు దుర్మార్గాలు జాతీయస్థాయిలో ఎండగడతామని వెల్లడి
- ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని మండిపాటు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని వెల్లడి
- దాడులతో మమ్మల్ని భయపెట్టలేరని స్పష్టీకరణ
- చంద్రబాబు దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- వెంకన్న భక్తుల మనసులను గాయపరిచిన చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్

సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, పార్టీ ముఖ్యనేతలు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని జంగిల్ రాజ్ చేశారని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు దుర్మార్గాలను జాతీయ స్థాయిలో ఎండగడతామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్ నేతలు సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. పార్టీ స్టేట్ కో– ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో నేతలు భేటీ అయ్యారు. రెండున్నర గంటలు జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు, అంబటిపై హత్యాయత్నం ఘటనలపై చర్చ జరిగింది. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలిపోయాయని నేతలు అన్నారు. చంద్రబాబు దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్రంలో పరిణామాలను జాతీయ స్థాయికీ తీసుకెళ్లాలని నిర్ణయించారు. తిరుమల శ్రీవారి భక్తుల మనసులను చంద్రబాబు గాయపర్చారని, ఆయనకు ఏ మాత్రమైనా పాపభీతి ఉంటే వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తప్పులను ప్రశ్నిస్తున్నందుకే వైఎస్సార్‌సీపీ నేతలపైన కుట్రలకు పాల్పడుతున్నారని తెలిపారు. మూడు రోజుల్లో ముగ్గురు మాజీ మంత్రులు, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలపై దాడులు చేశారని, అంబటి రాంబాబుపై ఏకంగా హత్యాయత్నం చేశారని, ఇవి చాలా దారుణ ఘటనలని అన్నారు. ఇలా దాడులతో భయపెడితే ఎవ్వరూ ప్రశ్నించరని చంద్రబాబు అనుకుంటున్నారని, కానీ, అది ఆయన అవివేకమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వ్యవస్థలను చంద్రబాబు పూర్తిగా దెబ్బతీశారన్నారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థ పూర్తిగా చెడిపోయిందని తెలిపారు. రక్షణ కోసం పార్టీ నాయకులు గంటల తరబడి ఫోన్లు చేసినా పోలీసు అధికారులు స్పందించకపోవడం ఆ వ్యవస్థ దిగజారిపోయిందనడానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇక సామాన్యులకు ఏం రక్షణ కల్పిస్తారని, పైగా బాధితులపైనే కేసులు పెడుతున్నారని చెప్పారు. అంబటి రాంబాబు ఇంటిపై ఆ స్థాయిలో దాడి జరిగినా, ఇప్పటివరకూ ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని నేతలు మండిపడ్డారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్, మేరుగు నాగార్జున, కారుమూరు నాగేశ్వరరావు, మాజీ ఎంపీ మార్గాని భరత్, నేతలు కరణం ధర్మశ్రీ, దేవినేని అవినాష్, పూనూరు గౌతమ్ రెడ్డి, వరికూటి అశోక్ బాబు, దూలం నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, నూరి ఫాతిమ, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యనేతలు ఏమన్నారంటే..

ఇంతటి దుర్మార్గాలు ఎప్పుడూ చూడలేదు : బొత్స సత్యనారాయణ

రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గాలు నా 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదు. రాజకీయంగా ప్రశ్నించే వారిపై చంద్రబాబు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. ఎవరో ఏదో చేస్తారని భయపడే రోజులు లేవు. అలా భయపడే వారెవరూ ఇక్కడ లేరు. ప్రభుత్వ దుర్మార్గాలకు వ్యతిరేకంగా పార్టీ కార్యక్రమాలు చేపడతాం. పెట్రోలు బాంబులు వేయడం అనే విష సంస్కృతిని చంద్రబాబు మళ్లీ తెచ్చారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్తాం. తిరుమల లడ్డూపై చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యలను దేశమంతా తప్పుపడుతోంది. క్షమాపణ చెప్పకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు తెగబడుతున్నారు

బాబు అరాచకాలు ఢిల్లీలో ఎండగడతాం : సజ్జల రామకృష్ణారెడ్డి

అంబటి రాంబాబు ఇంటిపై టీడీపీ గూండాలు విడతలవారీగా ఐదున్నర గంటల పాటు దాడులకు తెగబడ్డారంటే పోలీసులు ఎంత దారుణంగా వ్యవహరించారో అర్థం అవుతోంది. మరుసటి రోజే జోగి రమేష్ ఇంటిపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. పోలీసుల సమక్షంలోనే గంటల తరబడి దాడులు జరగడం శృతి మించిన అరాచకాలకు నిదర్శనం. తిరుమల లడ్డూ విషయంలో అబద్ధాలు రుద్దడంలో ఫెయిల్ కావడంతో, డైవర్షన్ కోసం ఇలా అడ్డదారిలో బరి తెగించారు. ఇవన్నీ ఢిల్లీలో ఎండగడతాం. కేంద్ర హోం శాఖ దృష్టికి కూడా తీసుకెళ్తాం. ప్రభుత్వ దుర్మార్గాలపై పార్టీ నాయకులంతా ఒక్కటై పోరాడతారు. విడదల రజిని, బొల్లా బ్రహ్మ నాయుడుపై దాడుల ఘటనల్లోనూ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వీటన్నింటిపై కోర్టుల్లో దావా వేస్తాం. జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్చార్సీ) దృష్టికి కూడా తీసుకెళ్తాం. లడ్డూ విషయంలో చంద్రబాబు క్షమాపణ చెప్పేవరకు వదిలి పెట్టేది లేదు. ఫ్లెక్సీలపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు మంగళవారమూ కొనసాగుతాయి.

సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన బాబు: కారుమూరు నాగేశ్వరరావు

చంద్రబాబు మానవ హక్కులు హరిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘించి పోస్టర్లు వేస్తూ, జంతు కొవ్వు కలిసిందని వారు చేసిన ఆరోపణలు నిజమని నమ్మించే కుట్రలు చేస్తున్నారు.

తిట్టకపోయినా తిట్టారనే రకం చంద్రబాబు: గుడివాడ అమర్నాథ్

అంబటి రాంబాబు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి, రోడ్డుపై వెళ్తుంటే టీడీపీ క్యాడర్ రెచ్చగొట్టిందని, ఆ ఇన్సిడెంట్‌లో అలా మాట్లాడకుండా ఉండాల్సిందని రాంబాబు ఒప్పుకున్నా టీడీపీ దౌర్జన్యం చేసింది. ఏమీ తిట్టకపోయినా తనను తిట్టారంటూ రాజకీయం చేసే వ్యక్తి చంద్రబాబు.

పక్కా ప్లాన్ ప్రకారమే దాడులు: మాజీ మంత్రి పేర్ని నాని

ప్రభుత్వ తప్పిదాలు, అరాచకాలు, అవినీతిపై గట్టిగా ప్రశ్నించే వారు ఎప్పుడు దొరుకుతారా అని చంద్రబాబు, లోకేశ్ ఎదురు చూస్తున్నారు. మా పార్టీ క్యాడర్‌ను భయపెట్టాలనే లోకేశ్ పన్నాగం పన్నారు. అయినా మేమంతా చాలా ధైర్యంగా నిలబడ్డాం. ఇంకా నిలబడతాం.

వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా మీరెందుకు మాట్లాడరు?

- ప్రభుత్వానికి మద్దతుగా, పార్టీపై వచ్చే విమర్శలన్నింటికీ నేనొక్కడినే మాట్లాడుతున్నా..
- 'లడ్డూ'పై వైఎస్సార్‌సీపీ ప్రచారాన్ని తిప్పికొట్టండి
- జనసేన జనరల్ బాడీ సమావేశ మధ్యలోనే వెళ్లిపోయిన అధినేత

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ వ్యవహారంలో జనసేన నేతలెవరూ వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా మాట్లాడడం లేదంటూ ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మండిపడ్డారు. సీబీఐ సిట్ చార్జిషీట్ దాఖలు చేశాక వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రబాబు, తనపై చేస్తున్న ప్రచారాన్ని పార్టీ నేతలెందుకు తిప్పికొట్టడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వానికి మద్దతుగా, పార్టీపై వచ్చే విమర్శలన్నింటికీ తానొక్కడినే మాట్లాడుతున్నానని.. ఇలా అయితే పార్టీ తరపున మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా, పొలిటికల్ అఫైర్స్ తదితర పార్టీ కమిటీల్లో సభ్యులుగా మీరందరు ఎందుకున్నారని పార్టీ నేతలకు ఆయన క్లాస్ తీసుకున్నారు. మంగళగిరిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్టీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. పవన్‌కళ్యాణ్ సా.3.50 నుంచి 5 గంటల వరకు ఉండి నేతలకు దిశానిర్దేశం చేశారు. నిర్ణీత ఎజెండా ప్రకారం సమావేశం కొనసాగించాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సూచించి ఆయన వెళ్లిపోయారు. అనంతరం.. తిరుమల లడ్డూ వ్యవహారంలో పార్టీ నేతలంతా గత వైఎస్ జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని తీర్మానించి ఆమోదించారు.

ఆ నెయ్యి అసలు నెయ్యే కాదు

అంతకుముందు పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందా? లేదా? అన్న విషయాన్ని సిట్ బహిర్గతం చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో తిరుమల లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యి అసలు నెయ్యే కాదని సిట్ తేల్చిందన్నారు. ఆ పార్టీ నేతలు మాట్లాడే భాష సరిగ్గాలేని కారణంగానే ఈరోజు దాడులు జరుగుతున్నాయని చెప్పారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారాన్ని పవన్ ప్రస్తావించి, నేతలందరూ తమ వ్యక్తిగత వ్యవహారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పినట్లు సమాచారం.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

సైబర్ నేరాల కట్టడికి కిల్ స్విచ్

బ్యాంకు లావాదేవీలు తక్షణం ఫ్రీజ్ చేసే సాధనం

ఈ నేరాలను బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు కమిటీ సిఫార్సు

కేంద్ర హోంశాఖ సూత్రప్రాయ నిర్ణయం

జాతీయ బ్యాంకులు, బీమా సంస్థలతో ఆర్బీఐ సమావేశం అయ్యాక తుది నిర్ణయం

సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర హోంశాఖ కార్యాచరణ

బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్

సాక్షి, అమరావతి: సైబర్ నేర ముఠాలు బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టకుండా చెక్ పెట్టేందుకు కేంద్ర హోంశాఖ సరికొత్త కార్యాచరణకు ఉపక్రమిస్తోంది. ఆన్‌లైన్, డిజిటల్, యూపీఐ చెల్లింపుల ప్రక్రియలో 'కిల్ స్విచ్'ను ప్రవేశపెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. డిజిటల్ అరెస్టులు, ఇతర సైబర్ నేరాల బాధితుల బ్యాంకు ఖాతాల లావాదేవీలను తక్షణం నిలుపుదల చేసేందుకు ఈ ప్రతిపాదనను తీసుకొచ్చింది. సైబర్ నేరాల కట్టడికి చేపట్టాల్సిన చర్యలపై సిఫార్సు చేసేందుకు కేంద్ర హోంశాఖ గత ఏడాది డిసెంబరులో ఓ ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. కేంద్ర హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి నేతృత్వంలోని ఈ కమిటీలో కేంద్ర న్యాయ, ఐటీ–టెలీ కమ్యూనికేషన్లు, వినియోగదారుల వ్యవహారాల శాఖలు, ఆర్బీఐ, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ తన సిఫార్సులను ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 'కిల్ స్విచ్' సాధనాన్ని అందుబాటులోకి తేవడంతో పాటు సైబర్ క్రైం నేరాలకు బీమా సౌకర్యం కల్పించాలని కూడా ప్రతిపాదించారు. నివేదికలోని ప్రధాన అంశాలివీ..

ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, యూపీఐ చెల్లింపుల విధానంలో ఈ 'కిల్ స్విచ్' అనే బటన్‌ను ప్రవేశపెట్టాలని కేంద్ర హోంశాఖ కమిటీ ప్రతిపాదించింది. ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేసింది. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లలోని బ్యాంకింగ్ యాప్‌లు, యూపీఐ యాప్‌లలో ఈ 'కిల్ స్విచ్' బటన్‌ను ఏర్పాటుచేస్తారు. డిజిటల్ అరెస్టు, ఇతర సైబర్ నేరాల బారిన పడ్డామని గుర్తించగానే ఆ 'కిల్ స్విచ్' బటన్‌ను నొక్కితే చాలు.. వారి అన్ని బ్యాంకు ఖాతాలు వెంటనే స్తంభించిపోతాయి. ఆ ఖాతాల నుంచి ఇతర ఖాతాలకు నగదు బదిలీగానీ ఇతర లావాదేవీలుగానీ సాధ్యంకాదు. దీంతో.. సైబర్ నేర ముఠాలు బెదిరింపులకు పాల్పడి సామాన్యుల బ్యాంకు ఖాతాల నుంచి నగదు బదిలీ చేయించుకోవడానికి అడ్డుకట్ట వెయ్యొచ్చని కేంద్ర హోంశాఖ కమిటీ భావిస్తోంది. ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడంతోపాటు సుప్రీంకోర్టుకు నివేదించింది. ఇదే అంశంపై ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రతినిధులతో కూడా సమావేశం నిర్వహించింది. సైబర్ నేరాలను బీమా పరిధిలోకి తీసుకొచ్చే అంశాన్ని కూడా ఈ కమిటీ సిఫార్సు చేసింది. బ్యాంకు ఖాతాలు ఉన్నవారు బీమా చేసుకుంటే.. సైబర్ నేరాలకు గురైతే బీమా పరిహారం పొందవచ్చు. ఈ ప్రతిపాదనపై ఆర్బీఐ దేశంలోని జాతీయ బ్యాంకులు, బీమా సంస్థలతో మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

సుప్రీంకోర్టు ఆగ్రహంతో కేంద్ర హోంశాఖ కార్యాచరణ

దేశంలో సైబర్ నేర ముఠాలు 2024–25లో దేశంలో రూ.34,771 కోట్లు కొల్లగొట్టాయి. డిజిటల్ అరెస్టులని బెదిరించి వీడియో కాల్స్‌లో గంటల తరబడి బంధించి రూ.3 వేల కోట్లు దోచుకున్నాయి. దీంతో.. తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించింది. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల కట్టడికి ఎలాంటి చర్యలు చేపడతారో చెప్పాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది. ఫలితంగా.. కేంద్ర హోంశాఖ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. 'కిల్ స్విచ్' బటన్ ఏర్పాటు, సైబర్ నేరాలకు బీమా భద్రతతోపాటు మరికొన్ని అంశాలను ప్రతిపాదించింది. సుప్రీంకోర్టు పరిశీలన అనంతరం కేంద్ర హోంశాఖ తదుపరి కార్యాచరణ చేపడుతుంది.

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కాకినాడ జిల్లాలోని అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి సోమవారం దర్శించుకుని, పూజలు చేశారు. దర్శనానంతరం, పండితులు వేదాశీస్సులు అందజేయగా, ఈవో స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

– అన్నవరం

వేంకటేశ్వరుని సన్నిధిలో భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు

తిరుమల శ్రీవారిని భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు సోమవారం దర్శించుకుంది. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు.

– తిరుమల

టీడీపీ గూండాలపై కేసులు పెట్టరా?

అంబటి అల్లుడు ఉపేష్ సూటి ప్రశ్న

భవిష్యత్తులో చక్రవడ్డీతో చెల్లిస్తాం

వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: 'మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు ఆఫీస్, ఇంటిపై టీడీపీ గూండాలు దాడులు చేశారు. కార్లు, ఇల్లు ధ్వంసం చేశారు. ఆఫీస్ తగులబెట్టేశారు. అయినా వారిపై ఇప్పటికీ ఎందుకు కేసులు నమోదు చేయలేదు' అని అంబటి రాంబాబు అల్లుడు ఉపేష్ ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబుతో ఉపేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ నాయకుడు అనిల్‌రెడ్డి సోమవారం ములాఖత్ అయ్యారు. అనంతరం సెంట్రల్ జైలు బయట ఉపేష్ మీడియాతో మాట్లాడుతూ.. 'అంబటిపై రెండు రోజులుగా హైడ్రామా నడుస్తోంది. వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లినప్పుడు టీడీపీ గూండాలు వచ్చి రెచ్చగొట్టి ఆయనతో మాట్లాడించారు. అంబటి రాంబాబుకు 24 గంటల్లో సినిమా చూపిస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త మా ఇంటిపైకి వచ్చి భయంకరంగా దాడులు చేశారు. దారుణమైన బూతులు తిట్టారు. మా దగ్గర ఎవిడెన్స్ ఉంది. మీరు కేసు పెడతారా?' అని సీఎం చంద్రబాబును నిలదీశారు. పోలీసులు, సీఐలు వెంకటేశ్వర్లు, వంశీ అంబటిని టార్చర్ చేశారని, పెమ్మసాని చెప్పిన సినిమా చూపించడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. తిరుమల ప్రసాదంలో పంది కొవ్వు, ఆవు కొవ్వు, ఫిష్ ఆయిల్ కలిసిందని చంద్రబాబు, లోకేశ్ స్టేట్మెంట్లు ఇచ్చారని, డైవర్షన్ కోసమే హైడ్రామా సృష్టించారని దుయ్యబట్టారు. 'గల్లా మాధవికి ఇల్లు లేదా? ఎల్లప్పుడూ మీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందా?' అని హెచ్చరించారు.

మాట్లాడుతున్న జక్కంపూడి రాజా. పక్కన అంబటి అల్లుడు ఉపేష్

చంద్రబాబు కళ్లు తెరవాలి

జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. ఏం చేసినా చెల్లుబాటవుతుందనే ధోరణితో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతలపై దాడులు చేసి.. తిరిగి వారి పైనే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా చంద్రబాబు కళ్లు తెరవాలని హితవు పలికారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా మాజీ సీఎం జగన్, వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిపై బురద జల్లే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. లడ్డూ ప్రసాదంలో ఎలాంటి కొవ్వు కలవలేదని సీబీఐ దర్యాప్తులో తేలినా.. రాజకీయ ప్రయోజనాల కోసం ఫ్లెక్సీలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. దీనిని తప్పుపట్టిన అంబటి రాంబాబు ఇంటిపై దాడులు చేయించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. 'మీరు ప్రారంభించిన సంప్రదాయాన్ని రేపు చక్రవడ్డీతో తిరిగి మీకు చెల్లిస్తాం' అని జక్కంపూడి రాజా హెచ్చరించారు.

సెంట్రల్ జైల్‌కు అంబటి

గుంటూరు కోర్టు ఆదేశాల మేరకు మాజీ మంత్రి అంబటి రాంబాబును సోమవారం వేకువజామున 3.45 గంటల సమయంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు. రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటికి స్నేహ బ్లాక్‌లో ఓ గది కేటాయించారు.

డీడీసీ 0001 నంబర్ @ రూ.2.08 కోట్లు

దేశంలో అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్‌గా రికార్డు!

బీబీటీ వేలంలో దక్కించుకున్న గుంటూరు వ్యాపారవేత్త

సాక్షి, అమరావతి: ఫ్యాన్సీ నంబర్ ప్లేట్ కోసం కొందరు ఎంత డబ్బు అయినా ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. తాజాగా మన రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఫ్యాన్సీ నంబర్ ప్లేట్ కోసం వేలంలో ఏకంగా రూ.2.08 కోట్లకు బిడ్ వేసి దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. లగ్జరీ, ప్రముఖులు వాడిన వస్తువులు, వాహనాలు, ఫ్యాన్సీ నంబర్లకు వేలం నిర్వహించే బిగ్ బాయ్ టాయ్జ్(బీబీటీ) యాప్... డీడీసీ 0001 అనే ఫ్యాన్సీ కార్ నంబర్ ప్లేట్‌ను వేలానికి పెడితే గుంటూరుకు చెందిన వ్యాపారవేత్త కిరణ్ కోల్పాకుల రూ.2.08 కోట్లకు బిడ్ వేసి దానిని పొందారు. ఈ విషయాన్ని బీబీటీ నిర్వాహకులు సోమవారం వెల్లడించారు. కిరణ్ కోల్పాకుల తన మారుతి సుజుకి ఇగ్నిస్ కారు కోసం ఈ నంబర్‌ను వేలంలో పొందారు. కాగా, ఒక కారు నంబర్ ప్లేట్‌కు ఇంత భారీ ధర పలకడం దేశంలో ఇదే ప్రథమం. దేశంలో అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్ కలిగిన వ్యక్తిగా కిరణ్ కోల్పాకుల రికార్డు సృష్టించారు. గతంలో బీబీటీ సంస్థ హెచ్ఆర్ 88బీ 8888 అనే నంబర్ ప్లేట్‌ను వేలానికి పెడితే హరియాణకు చెందిన వ్యక్తి రూ.1.17 కోట్లకు బిడ్ వేశారు. కానీ, డబ్బులు చెల్లించడంలో అతను విఫలం కావడంతో బీబీటీ ఆ బిడ్‌ను రద్దు చేసి మరోసారి వేలం నిర్వహించింది. రెండోసారి వేలంలో ఆ నంబర్ ప్లేట్ ధర రూ.26.7 లక్షలు పలకడం గమనార్హం.

సీమను ఎడారిగా మారుస్తున్న చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి
- 5న ఛలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు పిలుపు

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరూ కుమ్మక్కై రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపేసి సీమ రైతులు, ఆ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు రాకుండా చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకిస్తూ రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన కోసం ఈ నెల 5న ఉదయం 10 గంటలకు నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పోతిరెడ్డిపాడు వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సోమవారం రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన పార్టీ నేతలు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీఏసీ, సీఈసీ మెంబర్లు తదితరులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టు పెట్టి సీమ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమకు నీటిని అందించాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ పట్టుదలగా సీమ లిఫ్ట్ పనులు చేస్తే.. చంద్రబాబు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగా ఛలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు పిలుపునిచ్చారు. కలిసివచ్చే పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని ముందుకెళతామని సజ్జల స్పష్టం చేశారు.

విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు ఉరి తాళ్లతో నిరసన

విజయవాడలో వినూత్న ప్రదర్శన

సాక్షి, అమరావతి:/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): విద్యుత్ సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు రోడ్డెక్కారు. సంస్థ యాజమాన్యం, మంత్రులు మీటర్ రీడర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల కారణంగా తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చలో విజయవాడ పేరుతో మీటర్ రీడింగ్ కార్మికులు సోమవారం విజయవాడలో కదం తొక్కారు. ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఉరితాళ్లను మెడకు వేసుకుని వినూత్న ప్రదర్శన చేపట్టారు. ఈ మహాధర్నాకు సీపీఐ, ఏఐటీయూసీ మద్దతు ప్రకటించాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4వేల మంది మీటర్ రీడర్స్ స్మార్ట్‌మీటర్ల కారణంగా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం చేతగానితనం, మోసపూరిత వాగ్దానాలతో అన్ని వర్గాలను మోసం చేసిందని దుయ్యబట్టారు.

పీఏసీఎస్ ఉద్యోగుల గోడు సర్కార్‌కు వినపడదా?

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కర్నూలు, అన్నమయ్య జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు

ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంబాబు

పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటన

కొరిటెపాడు(గుంటూరు): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు (పీఏసీఎస్) 55 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. గుంటూరులో పీఏసీఎస్ ఉద్యోగులు వారం రోజులుగా చేస్తున్న నిరసన, వంటావార్పు కార్యక్రమంలో సోమవారం రాంబాబు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిరసనలో కర్నూలు, అన్నమయ్య జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి పీఏసీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీఏసీఎస్ ఉద్యోగులకు మద్దతుగా డీసీసీబీలు, కమర్షియల్ బ్యాంకులు, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులు కూడా వీరికి మద్దతుగా నిలబడతామని స్పష్టం చేశారు. ఈ నెల 16 నుంచి పీఏసీఎస్ ఉద్యోగులు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారని, ఈలోగా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాగా కో–ఆపరేటివ్ బ్యాంకుల జాతీయ ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వై.రాధాకృష్ణ కూడా తమ మద్దతు ప్రకటించారు.

ఇండిగోకు రూ.22.20 కోట్ల జరిమానా

రాజ్యసభలో కేంద్ర పౌరవిమానయాన శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: గతేడాది డిసెంబర్ మొదటి వారంలో ఇండిగో విమానయాన సంస్థ సృష్టించిన సంక్షోభంపై కేంద్రం చర్యలు తీసుకున్నట్లు పౌర విమానయాన శాఖ పేర్కొంది. ప్రజలను ఇబ్బందులకు గురి చేసినందుకు రూ.22.20 కోట్లు జరిమానా విధించినట్లు ఆ శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహల్ చెప్పారు. ఇకపై ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు చేయబోమని ఇండిగో విమాన సంస్థ భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. సంక్షోభంపై ఇండిగో మేనేజ్‌మెంట్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

26 నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు



తిరుమల: శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2 వరకు జరుగనున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఫిబ్రవరి 26న శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తిగా, 27న రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామిగా, 28న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారుగా మూడుసార్లు పుష్కరిణిలో చుట్టి భక్తులను అనుగ్రహిస్తారు. శ్రీమలయప్పస్వామివారు మార్చి 1న ఐదుసార్లు, 2న ఏడుసార్లు పుష్కరిణిలో విహరించి భక్తులను కటాక్షిస్తారు. ఈ కారణంగా ఫిబ్రవరి 26, 27 తేదీల్లో సహస్ర దీపాలంకార సేవ, ఫిబ్రవరి 28న, మార్చి 1, 2 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

రెండో విడత భూసమీకరణపై రైతులు గరంగరం

అభిప్రాయాలు సేకరించకుండా నోటిఫికేషన్ ఎలా ఇస్తారంటూ ఆగ్రహం

తాడికొండ: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత భూములు తీసుకునేందుకు జారీచేసిన నోటిఫికేషన్ ప్రక్రియపై రైతులు మండిపడుతున్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు సేకరించకుండా నేరుగా నోటిఫికేషన్ ఎలా ఇచ్చారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలోని రైతులు వేణుగోపాల స్వామి గుడి నుంచి ర్యాలీగా బయలుదేరి గ్రామంలోని సీఆర్డీఏ యూనిట్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని సీఆర్‌డీఏ తహసీల్దార్ రవికుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ల్యాండ్ పూలింగ్ అంశాలు తమకు నచ్చలేదని.. మరోమారు గ్రామసభ నిర్వహించాలని కోరారు. వడ్డమాను రైతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెండో విడత భూసమీకరణపై గ్రామసభ పెట్టి రైతుల నుంచి ఎలాంటి అభిప్రాయాలు స్వీకరించకుండా నోటిఫికేషన్ ఇచ్చారని.. ఇదేమని అడిగితే 5వ తేదీలోపు మీ అభిప్రాయాలు ఉంటే కార్యాలయంలో ఇవ్వమని సూచించారన్నారు. 2014 ల్యాండ్ పూలింగ్ చట్టం ప్రకారం కాకుండా 2026లో ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు రూపొందించాలని అడిగామని, రిటర్నబుల్ ప్లాట్లు గజాలు, కౌలు చెల్లింపు, ప్లాట్ల అభివృద్ధి కాలపరిమితి, జీవనోపాధి, ప్లాట్లు కేటాయింపు ఎక్కడ ఇస్తారనేది చెప్పాలని కోరామన్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను సేకరించాలన్నారు. మరోరైతు సాంబశివారెడ్డి మాట్లాడుతూ, అభ్యంతరాలు ఇవ్వాలని సీఆర్డీఏ కోరడంతో తామంతా వచ్చామని, మీటింగ్ పెట్టకుండా తమ అభ్యంతరాలను ఇలా స్వీకరించి.. భూమిని తీసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పుడు కేవలం రోడ్లు మాత్రమే వేస్తున్నారన్నారు. వడ్డమాను గ్రామం బయటకు వచ్చి చూస్తే భూములన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. గతంలో కంటే ఇప్పుడు రేట్లు పెరిగాయి కనుక 1600 గజాలు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వడంతో పాటు కౌలు పెంచాలని, కేటాయించిన ప్లాట్లు ఎక్కడిస్తారో చెప్పాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భవనాలు కడితే అభివృద్ధి జరగదని, ఐటీ కంపెనీలు వస్తేనే సాధ్యం అవుతుందన్నారు.

సీఆర్డీఏ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

శ్రీవారి సన్నిధిలో వ్యాసరాయ మఠం పీఠాధిపతి

విద్యశ్రీస తీర్థ స్వామీజీకి స్వాగతం పలుకుతున్న వేదపండితులు

తిరుమల: శ్రీవారిని వ్యాసరాయ మఠం పీఠాధిపతి విద్యశ్రీస తీర్థ స్వామీజీ సోమవారం దర్శించుకున్నారు. తిరుమల బేడీ ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీవారి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గ్రూప్-1, 2 ఫలితాల్లో విష్ణు ఐఏఎస్ అకాడమీ సత్తా

గ్రూప్–1 ఫలితాల్లో 40 శాతానికి పైగా విజేతలు

గ్రూప్–2లో 200లకు పైగా ర్యాంకులు

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఇటీవల విడుదల చేసిన గ్రూప్–1, 2 ఫలితాల్లో విష్ణు ఐఏఎస్ అకాడమీ అత్యుత్తమ ఫలితాలను సాధించింది. గ్రూప్–1 ఫలితాల్లో మొత్తం విజేతల్లో 40 శాతం మంది విష్ణు ఐఏఎస్ అకాడమీ విద్యార్థులేనని ఆ సంస్థ ప్రకటించింది. గ్రూప్–2 ఫలితాల్లోనూ రాష్ట్రంలో అత్యధికంగా 200లకు పైగా ర్యాంకులను సాధించామని వెల్లడించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు తమ సంస్థలో కోచింగ్ తీసుకుని ఐఏఎస్, ఐపీఎస్, డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ తదితర ఉద్యోగాలు సాధించారని తెలిపింది. పోటీ పరీక్షల శిక్షణ రంగంలో తమకు 20 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉందని పేర్కొంది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED FACULTY
DIRECT RECRUITMENT for a reputed Institution in TAMILNADU for NEET/JEE & Foundation in
Physics · Chemistry · Maths · Biology
Academic Coordinator
Need a right minded work attitude person
Working Hours: 8.30 AM to 5.00 PM
08-02-2026 (Sunday) from 09.00 AM to 5.00 PM
SRI SAI SAMRUDH VIDYANIKETHAN
Krishna Collge Back Side, Bhanu Nagar, Maddilapalem, Visakhapatnam-530022.
MASTERJEE IITJEE | Medical | Foundations
Salary: Upto ₹ 24 Lakhs P.A.
Send your resume @ avsmasterjee@gmail.com
Contact: 939393 9457, 90257 58340

WANTED PASTOR
for CANTONMENT BAPTIST CHURCH
Cantonment, Vizianagaram - 535 003, Andhra Pradesh
Applications are invited from qualified and committed Baptist Pastors for pastoral ministry at Cantonment Baptist Church.
About Church:
Established in 1961, Cantonment Baptist Church has a congregation of approximately 2,500, with two worship services (Telugu and English). The church emphasizes spiritual growth and evangelism, encouraging believers to grow in Christ.
Requirements: Qualification & Experience
1. Bachelor of Divinity (B.D) or higher theological degree from Serampore University or institutions affiliated to Serampore University
2. Baptist background with sound Baptist doctrine
3. Ordained and married (Marriage Licence is mandatory)
4. Born-again Christian with a clear calling to pastoral ministry
5. Proficient in English and Telugu, with the ability to lead the English service
6. Age between 35 - 45 years
7. Minimum 8 years of pastoral experience in Baptist churches
Facilities Provided
• Free accommodation
• Yearly bonus and other benefits as per church norms
Interested candidates may apply on or before 28 February 2026, submitting bio-data, copies of certificates, and relevant documents (hard and soft copies).
Email: cbcvizianagaram1961@gmail.com
Short listed candidates will be called for trail message
Rev. Dr.R.Madhusudhan Rao
(Deacon Board Chairman) Cantonment Baptist Church, Cantonment, Vizianagaram - 535003
Contact phone for any information :-
Ph : 9490662958, 6281025304

డబ్బు కేవలం ఒక ఉపకరణం మాత్రమే!
డబ్బు మిమ్మల్ని, మీరు కోరుకున్న చోటుకు తీసుకెళ్లగలదు.
కానీ మిమ్మల్ని డ్రైవింగ్ సీట్లో కూర్చుబెట్టలేదు.
– అయాన్ ర్యాండ్

సాక్షి
మంగళవారం, 3 ఫిబ్రవరి 2026

అనిశ్చితిలో ఆచితూచి...

ప్రపంచమంతటా అనిశ్చితి అలుముకున్న తరుణంలో పెద్దగా జనాకర్షణల జోలికి పోకుండా, ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు పెద్ద పీట వేసే గత సంప్రదాయాలకు భిన్నంగా, ఆచితూచి వేసిన అంచనాలతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం 2026–27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వరసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించిన ఆమె... స్థిరంగా ముందుకు సాగుతున్న ఆర్థిక వృద్ధిని అదే స్థాయిలో ముందుకు నడిపించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకూ, తయారీరంగ పరిశ్రమల పెంపునకూ తోడ్పడే ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ఈ బడ్జెట్‌లో కూడా ఏవో అద్భుతాలుంటాయని ఎప్పటిలాగే మధ్యతరగతి, వ్యాపార వర్గాలు ఆశించిన మాట వాస్తవమే అయినా ఇప్పుడున్న పరిస్థితుల్లో నేల విడిచి సాము మంచిది కాదన్న ధోరణినే కనబరిచారు. అవసరమైనచోట్ల వెసులుబాట్లకు కూడా చోటిచ్చారు. 17 రకాల క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయటం అందులో ఒకటి. వ్యక్తిగత వినియోగానికి దిగుమతి చేసుకునే వస్తువుల కస్టమ్స్ సుంకాన్ని 10 శాతం మేర తగ్గించటం కూడా మంచి నిర్ణయం.

మూలధన వ్యయం ఈసారి రూ. 12.22 లక్షల కోట్ల వరకూ ఉండాలన్నది బడ్జెట్ లక్ష్యం. నిరుటి ప్రతిపాదన రూ. 10.96 లక్షల కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువే. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో దీన్ని వ్యయం చేయటానికి సంకల్పించారు. పర్యవసానంగా హైవేలూ, సరుకు రవాణా కారిడార్లూ, ఓడరేవులు, జాతీయ జల రవాణా మార్గాలు, పట్టణప్రాంత ప్రజా రవాణా తదితర రంగాలు బహుముఖంగా విస్తరిస్తాయి. ఇదంతా దక్షిణాది రాష్ట్రాల్లో పరిశ్రమల విస్తరణకూ, ఉద్యోగాల కల్పనకూ ఎంతగానో దోహద పడుతుంది. పెంచిన ఈ మూలధన వ్యయాన్ని రాష్ట్రాలు వడ్డీరహిత రుణాలు పొంది, పెట్టుబడులు పెట్టడానికి వినియోగిస్తామని చెప్పారు. దానికే పరిమితమైతే లక్ష్యసాధనకు ఎంతమాత్రం సరిపోదు. తయారీ రంగంలో ఫార్మా, సెమీ కండక్టర్లు, రసాయనాలు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, భారీ యంత్రాలు, క్రీడా పరికరాలు, రసాయనాలు తదితరాల ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు చేసిన ప్రతిపాదనలు సైతం మెచ్చదగ్గవే. అయితే ప్రస్తుతం అన్ని రంగాలనూ ఏలుతున్న ఏఐ ఆధారిత సాంకేతికత ఇక్కడ కూడా గణనీయంగా ఉంది. అందువల్ల ఈ రంగాలు తీసుకు రాబోయే ఉద్యోగకల్పనపై మరీ ఆశ పెట్టుకోనవసరం లేదు. విచక్షణారహితంగా సుంకాలు విధించే అమెరికా ధోరణి వల్ల ప్రైవేటు మదుపుదారులు ఉత్సాహంగా ముందుకొచ్చే అవకాశాలు తక్కువ. ఈ బడ్జెట్‌లో మెచ్చదగ్గ ప్రతిపాదన కర్బన ఉద్గారాల నియంత్రణకు దోహదపడే సాంకేతికతలకై వచ్చే అయిదేళ్లలో రూ. 20,000 కోట్ల వ్యయం చేస్తామని చెప్పటం! స్వచ్ఛ ఇంధనానికి తోడ్పడే ఈ ప్రతిపాదనకు మరింత కేటాయిస్తే బాగుండేది. అలాగే కార్బన్ డై ఆక్సైడ్ తొలగింపునకూ, దాన్ని నిల్వ చేసి ఉత్పత్తులకు తోడ్పడటానికీ అవసరమైన పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వటంపై కూడా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

మన వృద్ధి రేటు దాదాపు 7 శాతం ఉంది. ద్రవ్యోల్బణం సైతం అదుపులో ఉంది. విదేశీ మారక నిల్వలకు కూడా లోటు లేదు. కానీ దాదాపు అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలూ పడుతూ లేస్తూ సాగుతున్న క్రమంలో, అంతర్జాతీయంగా అంత సానుకూల వాతావరణం కనబడని స్థితిలో జాగ్రత్తగా అడుగులేయటం మంచిదే. ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతం మించనీయరాదన్న గత బడ్జెట్ లక్ష్యాన్ని సాధించటంలో విజయం సాధించినట్టేనని గణాంకాలు చెబుతున్నాయి. దీన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో మరింత తగ్గించి 4.3 శాతానికి పరిమితం చేస్తామని నిర్మలా సీతారామన్ చెబుతున్నారు. కానీ అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పొదుపు మంత్రాన్ని పఠించటం అంత సులభం కాదు. తయారీరంగ పరిశ్రమల విస్తరణ ఉపాధి కల్పనకు తోడ్పడి, ప్రజల్లో కొనుగోలుశక్తిని పెంచుతుంది. ఆ దిశగా ప్రయత్నించటానికి ఈ బడ్జెట్ ప్రతిపాదనలు దోహదపడతాయనే చెప్పాలి. ఎంతో ఆచితూచి, జాగ్రత్తగా అడుగులేసిన ఈ బడ్జెట్ చూడటానికి నిరాశ కలిగించవచ్చుగానీ... ఈ అనిశ్చితిలో దూకుడుగా పోకుండా భయ భక్తులతో మెలగటమే క్షేమదాయకం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.విదియ రా.2.14 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మఖ రా.11.55 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.12.02 నుండి 1.37 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.35 వరకు తదుపరి రా.10.56 నుండి 11.48 వరకు, **అమృత ఘడియలు:** రా.9.32 నుండి 11.07 వరకు.

సూర్యోదయం: 6.36
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

జీరో బడ్జెట్

ప్రకృతి వ్యవసాయం అంటే జీరో బడ్జెట్ వ్యవసాయం. అందులో వ్యయం శూన్యం. రైతుకు అసలు ఖర్చే ఉండదు. ఖర్చే లేనప్పుడు రైతు అప్పులు చేయటం ఉండదు. రైతుల ఆత్మహత్యల్ని నివారించటానికి జీరో బడ్జెట్ వ్యవసాయమే ఏకైక మార్గం.

– సుభాష్ పాలేకర్, వ్యవసాయవేత్త

పని

కీర్తి నీడ లాంటిది. మీరు మీ పని వెలుగులో నిలబడి ఉన్నంత కాలం అది మీ నీడలా ఉంటుంది. మీరు పని చేయటం ఆపేసిన మరుక్షణం వెలుగు క్షీణిస్తుంది. నీడ మాయమైపోతుంది. పేరు ప్రతిష్ఠలు చాలా వేగంగా పూర్వ వైభవం అయిపోతాయి.

– బ్రహ్మానందం, నటుడు

కట్టుబాటు

మీ నిర్ణయం వల్ల కొన్నిసార్లు మీకు అనుకూలంగా జరగవచ్చు, కొన్నిసార్లు అది మీకు వ్యతిరేకంగా ఉండవచ్చు. ఏదైనా సరే, మొదట మీరు నేర్చుకోవలసింది, మీ నిర్ణయానికి మీరు కట్టుబడి ఉండటం. ఆటల్లోనూ, జీవితంలోనూ అది ప్రాథమికమైన నీతి.

– అజయ్ జడేజా, మాజీ క్రికెటర్

పోలిక

మీరు ప్రత్యేకంగా ఉండటానికి జన్మించినప్పుడు, విజేతల్లా ఉండేందుకు ప్రయత్నించకండి. వారి నుంచి ప్రేరణ పొందండి కానీ వారిని అనుకరించకండి. మీ మొదటి అధ్యాయాన్ని వేరొకరి 20వ అధ్యాయంతో పోల్చుకుంటే చివరికి అసంతృప్తే మిగులుతుంది.

– షమితా శెట్టి, బాలీవుడ్ నటి

మరవొద్దు!

ముప్పై మందికి ఒకే టాయిలెట్ ఉన్న అటవీ ప్రాంతంలో నేను 33 సంవత్సరాలు జీవించాను. నేనిప్పుడు విలాసవంతుడిని. కానీ నా హృదయం ఇంకా అక్కడే ఉంది. పెద్ద ఇంటి గోడలకు మీ ఆత్మను బంధించే అవకాశం ఇవ్వకండి. మనిషిలా ఉండండి.

– జాకీ ష్రాఫ్, నటుడు

విద్యాసేవ

మిమ్మల్ని మీరు కనుగొనటానికి ఉత్తమ మార్గం, ఇతరుల సేవలో మిమ్మల్ని మీరు కోల్పోవటం. విద్యను పొందలేకపోతున్న వారికి విద్యను అందించటాన్ని మించిన సేవ లోకంలో వేరేదీ లేనే లేదు. విద్యా సేవలో ఉన్నవారు సజీవంగా ఉండిపోతారు.

– ఊడే పి. కృష్ణ, విద్యావేత్త

ఆర్థిక క్రమశిక్షణ

సందర్భం

డా॥ తమ్మా కోటిరెడ్డి

ఇప్పటికే అమలులో ఉన్న నిర్మాణాత్మక సంస్కరణల కొనసాగింపు, మౌలిక సౌకర్యాల కల్పనను వేగవంతం చేయడం, తయారీ రంగాన్ని పటిష్ఠపరచడం, స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించడం దిశగా 2026–27 కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఆర్థిక లోటు 2025–26లో జీడీపీలో 4.4 శాతం కాగా, 2026–27లో 4.3 శాతంగా ప్రతిపాదించడం, కేంద్ర ప్రభుత్వ రుణంలోనూ 2025–26తో పోల్చినప్పుడు (జీడీపీలో 56.1 శాతం), 2026–27లో జీడీపీలో 55 శాతంగా ప్రతిపాదించడం ఆర్థిక క్రమశిక్షణలో భాగంగా పేర్కొనవచ్చు. ఆర్థిక క్రమశిక్షణపై ప్రభుత్వం దృష్టి సారించినట్లయితే ప్రభుత్వానికి వడ్డీ చెల్లింపుల భారం తగ్గి ప్రాధాన్యతా రంగాలకు అధిక వనరులు సమకూరడంతోపాటు ద్రవ్యోల్బణంలో క్షీణత, స్థిర స్థూల ఆర్థిక వాతావరణం లాంటి ప్రయోజనాలు సిద్ధిస్తాయి. మరోవైపు సంక్షేమంపై వ్యయం తగ్గినట్లయితే వినియోగం, సమష్టి డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది.

కనెక్టివిటీ సానుకూలం

ఆర్థిక వృద్ధి సాధనలో ప్రధాన అంశమైన మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా ఏడు కొత్త హై–స్పీడ్ రైలు కారిడార్‌ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ చర్యతో రోజువారీ ప్రయాణ సౌకర్యాల మెరుగుదల, ప్రాంతాల మధ్య ఆర్థిక సంబంధాల మెరుగుదల, వివిధ ప్రాంతాల మధ్య వస్తు ప్రవాహం, ఉత్పాదకత పెరుగుదల, ప్రయాణ సమ యాలలో తగ్గుదల వలన 'ఆర్థిక హబ్'ల మధ్య కనె క్టివిటీ లాంటి ప్రయోజనాలు సిద్ధిస్తాయి. కారిడార్ల నిర్మాణం వలన తయారీ రంగం, సేవలు, నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

2025–26 బడ్జెట్‌తో పోల్చినప్పుడు 2026–27 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మూలధన వ్యయంలో పెరుగుదలను 11.5 శాతంగా ప్రతిపాదించారు. తద్వారా నిర్మాణ రంగం, సిమెంటు, స్టీల్, యంత్రాలు, సేవలకు సంబంధించి డిమాండ్‌లో పెరుగుదల ఏర్పడవచ్చు. నిర్మాణ రంగంలోని శ్రామికులకు ప్రత్యక్షంగా ఉపాధి పెరగడంతోపాటు, లాజిస్టిక్స్; సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల సప్లయ్ గొలుసులో పరోక్షంగా ఉపాధి అవకాశాలు ఎక్కువవుతాయి. మౌలిక సౌకర్యాలపై ప్రభుత్వ పెట్టుబడులలో పెరుగుదల వలన ప్రైవేటు సంస్థల వ్యయం, నష్ట భయం తగ్గుతాయి. ఆర్థిక వ్యవస్థ స్వల్ప కాలంలో పురోగమించడం ద్వారా 5 ట్రిలియన్ డాలర్ లక్ష్య సాధనకు వీలవుతుంది.

ఆర్థిక క్రమశిక్షణ వల్ల ప్రభుత్వానికి వడ్డీ చెల్లింపుల భారం తగ్గి ప్రాధాన్యతా రంగాలకు అధిక వనరులు సమకూరతాయి. కానీ సంక్షేమంపై వ్యయం తగ్గితే సమష్టి డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది.

ఈక్విటీ డెరివేటివ్స్ అయిన ఫ్యూచర్స్, ఆప్షన్లపై సెక్యూరిటీల లావాదేవీ పన్నును పెంచడం వలన నిఫ్టీ, బీఎస్ఈ సెన్సెక్స్‌లో క్షీణత ఏర్పడింది. సెక్యూరిటీల లావాదేవీల పన్నును పెంచడంలో ట్రేడింగ్ కార్యకలాపాలు తగ్గుముఖం పడతాయి. పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని పెంపొందించడం, విదేశీ సంస్థాగత పెట్టుబడు (ఎఫ్ఐఐ)లను ఆకర్షించడంతో పాటు, ఉన్న పెట్టుబడులను నిలుపుకొనే విధంగా చర్యలు తీసుకోవడం, రాబోయే రోజుల్లో కార్పొరేటు రాబడులు మెరుగవుతాయనే విశ్వాసం కల్పించడం లాంటి అంశాలు మార్కెట్ పుంజుకోవడానికి దోహదపడతాయి.

వ్యాసకర్త వైస్ ఛాన్స్‌లర్ (ఇన్‌ఛార్జి), ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్

పాలనకు పరీక్ష

అభిప్రాయం

ప్రొ॥ బి. సుధాకర్ రెడ్డి

కేంద్ర బడ్జెట్ 2026–27 భారత ఆర్థిక విధానంలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తోంది. తాత్కాలికంగా ప్రజలను ఆకట్టుకునే హామీలకు బదులు, దీర్ఘకాల ఆర్థిక స్థిరత్వం, క్రమశిక్షణ, అభివృద్ధిపై ఈ బడ్జెట్ దృష్టి సారించింది. కరోనా తర్వాత ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకుంటున్న సమయంలో, భవిష్యత్ వృద్ధికి బలమైన పునాది వేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఖర్చులు–ఆదాయాల మధ్య సమతుల్యతకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. 2026–27లో ఆర్థిక లోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలనీ, 2030 నాటికి ప్రభుత్వ అప్పును తగ్గించాలనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంధన ధరలు పెరగడం, ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతలు లేదా విదేశీ పెట్టుబడులు తగ్గిపోవడం లాంటి పరిస్థితులు ఎదురైతే మాత్రం ఈ లక్ష్యాలు కష్టమవుతాయి.

బడ్జెట్‌లో రోడ్లు, రైల్వేలు, సరుకు రవాణా మార్గాలు, నగరాల అభివృద్ధి వంటి మౌలిక వసతులపై భారీగా ఖర్చు పెంచారు. ప్రభుత్వ పెట్టుబడులు పెరిగితే ప్రైవేట్ రంగం కూడా పెట్టుబడులు పెడుతుందని ప్రభుత్వం నమ్ముతోంది. మౌలిక సదుపాయాలు మెరుగైతే సరుకుల రవాణా సులభమవుతుంది, ఖర్చులు తగ్గుతాయి, ఉత్పాదకత పెరుగుతుంది. అయితే ప్రజల వినియోగం ఇంకా బలహీనంగానే ఉంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆశించిన స్థాయిలో లాభాలు పొందకపోతే, వృద్ధి పూర్తిగా ప్రభుత్వ ఖర్చులపై ఆధారపడే ప్రమాదం ఉంది.

అందని పరిష్కారాలు

సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, రక్షణ, వస్త్ర పరిశ్రమల వంటి కొన్ని రంగాలకు ఈ బడ్జెట్ ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తోంది. దీని వల్ల భారత్ ప్రపంచ మార్కెట్లలో పోటీగా నిలబడాలన్న ఉద్దేశం ఉంది.

అయితే ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇచ్చే చిన్న, కార్మికాధారిత పరిశ్రమలకు తగినంత ప్రాధాన్యం దక్కలేదు. ఎమ్ఎస్ఎమ్ఈల కోసం రుణాలు సులభంగా అందేలా, బకాయిలు త్వరగా చెల్లించేలా కొన్ని చర్యలు తీసుకున్నారు. అయితే మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉండటం, పెద్ద సంస్థల నుంచి చెల్లింపులు ఆలస్యం కావడం, నైపుణ్యాల కొరత వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇవి పరిష్కారం కాకపోతే, ఈ మద్దతు తాత్కాలికమే కావచ్చు.

పన్నుల చెల్లింపులో సరళత్వం, అనవసర కేసులు తగ్గించడం వంటి చర్యలు పెట్టుబడిదారులకు నమ్మకం కలిగిస్తాయి. షేర్ మార్కెట్ లావాదేవీలపై పన్ను పెరగడం చిన్న పెట్టుబడిదారులను ప్రభావితం చేస్తుంది.

పన్నుల చెల్లింపులో సరళత్వం, అనవసర కేసులు తగ్గించడం వంటి చర్యలు పెట్టుబడిదారులకు నమ్మకం కలిగిస్తాయి. అయితే షేర్ మార్కెట్ లావాదేవీలపై పన్ను పెరగడం చిన్న పెట్టుబడిదారులను ప్రభావితం చేయవచ్చు. రాష్ట్రాలకు పన్నుల్లో వాటా కొనసాగించినప్పటికీ, కేంద్ర సహాయం సంస్కరణల అమలుతో అనుసంధానమవుతోంది. ఇది పనితీరు ఆధారంగా నిధులు ఇచ్చే విధానంగా మారుతోంది. ప్రభుత్వ ఖర్చులు క్రమంగా నియంత్రణలోకి వస్తున్నాయి. అప్పులు రోజువారీ ఖర్చులకు కాకుండా, అభివృద్ధి పనులకు వినియోగించాలన్న దిశగా మార్పు కనిపిస్తోంది. మొత్తం మీద ఈ ఏడాది బడ్జెట్ పెద్ద మార్పులు తీసుకువచ్చేది కాదు. కానీ ప్రభుత్వ పాలనా సామర్థ్యాన్ని పరీక్షించే బడ్జెట్.

వ్యాసకర్త డీన్, ఆర్థిక శాస్త్ర సీనియర్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

కుటిల రాజకీయాల 'కూటమి'

అభిప్రాయం

ఆర్.కె. రోజా

కోట్లాది మంది శ్రీవారి భక్తుల హృదయాల్లో నెలకొన్న ఆందోళనలకు, సందేహాలకు ఎట్టకేలకు తెరపడింది. పవిత్రమైన లడ్డూ ప్రసాదంపై కూటమి నేతలు సాగించిన అత్యంత దారుణమైన విషప్రచారానికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన 'సిట్' దాఖలు చేసిన తుది ఛార్జ్‌షీట్‌తో గట్టి అడ్డుకట్ట పడింది. ఇంతకాలం తాము పరమ పవిత్రంగా భావించి స్వీకరించిన శ్రీవారి లడ్డూ ప్రసాదాలు ఎలాంటి అపవిత్రం కాలేదని, వాటిలో ఎటువంటి జంతువుల కొవ్వూ కలవలేదని విచారణలో సుస్పష్టంగా తేలడం భక్తులకు కొండంత ఊరటనిచ్చింది. రాజకీయ లబ్ధి మాత్రమే పరమావధిగా భావించి, పరమ పవిత్రమైన ప్రసాదాలను అపవిత్రం చేశారంటూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తమ హోదాలను విస్మరించి చేసిన దుష్ప్రచారం ఎంత దారుణమో ఇప్పుడు లోకానికి తెలిసింది.

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పచ్చిపాల లాంటి స్వచ్ఛమైన శ్రీవారి సేవకుడు. ఆయన టీటీడీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించారు. భక్తుల సౌకర్యాలు, ఉద్యోగుల సంక్షేమం, ధర్మ ప్రచార కార్యక్రమాల్లో త్రికరణ శుద్ధిగా నిమగ్నమయ్యారు. పచ్చిపాలు ఎలాగైతే ఎటువంటి కల్తీ లేకుండా, బాహ్య అలంకరణలు లేకుండా సహజ సిద్ధమైన పవిత్రతతో ఉంటాయో, జగన్ శ్రీవారి సేవ కూడా అదేవిధంగా నిష్కళంకంగా సాగింది.

◆ కూటమి ప్రభుత్వం నియమించిన అధికారుల ఏలుబడిలోనే 4 ట్యాంకుల కల్తీ నెయ్యి వచ్చినట్లు సిట్ నివేదికలో నిర్ధారణ అయింది. ఆ తప్పును కూడా జగన్‌పై నెట్టాలని చూడటం చంద్రబాబు కుటిల రాజకీయాలకు నిదర్శనం.

జగన్ హయాంలో టీటీడీ ప్రతిష్ఠను శిఖరాగ్రాన నిలిపిన నిర్ణయాల్లో 'పద్మావతి హృదయాలయం' నిర్మాణం అత్యంత కీలకమైనది. 'మానవ సేవే మాధవ సేవ' అనే గొప్ప సిద్ధాంతాన్ని ఆయన అక్షరాలా ఆచరణలో చూపి భక్తుల మన్ననలు పొందారు. గుండె సంబంధిత వ్యాధులతో పుట్టి, వైద్యం చేయించుకోలేని దీన స్థితిలో ఉన్న పేద చిన్నారుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా దేశంలోనే తొలిసారిగా టీటీడీ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 3,500 మందికి పైగా చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించి, వేలాది కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు. 15 ఏళ్ల సుదీర్ఘ పాలనలో చంద్రబాబుకు కనీసం తట్టని ఈ మానవీయ ఆలోచన, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించే జగన్‌కు మాత్రమే కలిగింది. జనం బాధలను తీర్చడం తన బాధ్యతగా భావించే ఆ పచ్చిపాల మనస్తత్వమే ఇంతటి మహత్కార్యానికి కారణమైంది.

2019కి పూర్వం చంద్రబాబు ప్రభుత్వ హయాంలో టీటీడీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన ఉదంతాలు ఉన్నా, జగన్ అధికారంలోకి వచ్చాక ఆ పొరపాట్లను అంతర్గతంగా చక్కదిద్దారు. విలువైన డిపాజిట్లను కాపాడటమే కాకుండా, భక్తుల మనోభావాలు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో ఆ తప్పులను రాజకీయంగా వాడుకోవాలని చూడలేదు. కానీ చంద్రబాబు తీరు ఇందుకు పూర్తిగా విరుద్ధం. జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక, ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారంటూ అత్యంత హేయమైన ఆరోపణలు చేశారు.

'సిట్' నివేదికలోని వాస్తవాలను పరిశీలిస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారు నియమించిన అధికారుల ఏలుబడిలోనే 4 ట్యాంకుల కల్తీ నెయ్యి వచ్చినట్లు నిర్ధారణ అయింది. ఆ తప్పును కూడా జగన్‌పై నెట్టాలని చూడటం చంద్రబాబు కుటిల రాజకీయాలకు నిదర్శనం. వైసీపీ ప్రభుత్వ హయాంలో తయారు చేసిన లడ్డూలను గానీ, వాడిన నెయ్యిని గానీ నేటి వరకు ఎలాంటి పరీక్షలూ చేయలేదని సుప్రీంకోర్టు సైతం గుర్తించింది. అంటే జగన్ పాలనపై సాగిన కల్తీ ప్రచారం కేవలం రాజకీయ కక్షతో కూడిన అపోహ మాత్రమేనని తేలిపోయింది. దేవుడంటే భయం, భక్తి లేని వారు మాత్రమే ఇలాంటి నీచమైన రాజకీయాలకు పాల్పడతారని జగన్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

వ్యాసకర్త మాజీ మంత్రి, వైసీపీ అధికార ప్రతినిధి

కర్తవ్యాల సాధన సాధ్యమేనా!

అభిప్రాయం

డా॥ తిరుణహరి శేషు

మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మూడో బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి 'యువ శక్తి' బడ్జెట్‌గా అభివర్ణించారు. వేగవంతమైన – స్థిరమైన వృద్ధిని సాధించటం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటం, 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' లాంటి మూడు కర్తవ్యాలను సాధించడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి, వృద్ధికి స్థిరమైన పునాదులు, ప్రజలు కేంద్రంగా అభివృద్ధి, నమ్మకమైన పాలన, సులభతరమైన వాణిజ్య జీవనం, ద్రవ్య అంశాలు లాంటి కీలకమైన ఆరు రంగాలలో సంస్కరణల ద్వారా ఉపాధి కల్పనకూ, ఉత్పాదకత పెంపునకూ, వృద్ధిరేటును పెంచడానికీ అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. కాబట్టే బడ్జెట్‌లో ఈ అంశాలను గ్రోత్ పిల్లర్స్‌గా పేర్కొన్నారు.

నిరుద్యోగాన్ని నియంత్రించటానికి, ఉపాధి కల్పన కోసం తయారీ రంగం, ఎంఎస్ఎంఈ రంగాలను నమ్ముకున్నట్లు కనిపిస్తుంది. కానీ నిరుద్యోగ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు ఏవీ బడ్జెట్‌లో ప్రకటించకపోవటం; వేతన జీవులు, మధ్యతరగతి ప్రజలు ఆశించినట్లుగా పన్ను శ్లాబ్‌లను మార్చకపోవటం నిరాశ కలిగించింది. బడ్జెట్‌లో సాంకేతిక, తయారీ రంగానికి అవసరానికి మించిన ప్రాధాన్యం ఇస్తూ రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్య తరగతి ప్రాధాన్యాలు, ప్రయోజనాలు విస్మరించారనే భావన కలుగుతోంది. కేటాయింపుల పరంగా చూస్తే 53.47 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లో రవాణా రంగానికి 5.98 లక్షల కోట్ల రూపాయలను కేటాయించి పెద్దపీట వేశారు. అదే సమయంలో గ్రామీణ అభివృద్ధి రంగానికి కేవలం 2.73 లక్షల కోట్ల రూపాయల నిధులను మాత్రమే కేటాయించారు. (గత బడ్జెట్‌లో కేటాయించింది 2.66 లక్షల కోట్లు). వ్యవసాయ రంగానికి, విద్య, ఆరోగ్య రంగాలకు కూడా నిధుల కేటాయింపు సంతృప్తికరంగా లేదనే చెప్పాలి.

గత బడ్జెట్‌లో మొత్తం ఆదాయంలో 24 పైసలు అప్పుల ద్వారా సమకూర్చుకుంటే, ఈ బడ్జెట్‌లో కూడా అంతే 24 పైసలు సమకూర్చుకుంటున్నాం. కేంద్ర పన్నులలో తమ వాటా పెరగాలని రాష్ట్రాలు కోరినా అది 22 పైసలు గానే ఉండటం చూస్తుంటే బడ్జెట్‌లో కేవలం అంకెలు మారినట్లుగానే కనిపిస్తుంది తప్ప నిర్మాణాత్మకమైన మార్పులు లేవు.

అభివృద్ధికి సహకరించే మూలధన వ్యయం 11 లక్షల కోట్ల నుండి 12 లక్షల కోట్ల రూపాయలకు పెరగటం, 'స్వయం సమృద్ధి భారత్'కు 2 వేల కోట్ల రూపాయల ఫండ్ కేటాయింపు, 'మహాత్మ స్వరాజ్య స్కీమ్', ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం ఏర్పాటు, 40 వేల కోట్లతో 'సెమీ కండక్టర్ల మిషన్' ఏర్పాటు, ఐదు రీజినల్ మెడికల్ హబ్స్, మూడు ఆల్ ఇండియా ఆయుర్వేద కళాశాలల ఏర్పాటు, వాటర్ వే కారిడార్ల ఏర్పాటు లాంటి కొత్త ప్రతిపాదనలు తప్ప మొత్తంగా బడ్జెట్ కొత్త సీసాలో పాత సారా లాంటిదే.

వ్యాసకర్త అర్థశాస్త్ర బోధకులు, కాకతీయ విశ్వవిద్యాలయం

డేటా పాయింట్

పట్టణాల్లో తిండి ఖర్చు ఇలా...

కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ జరిపే 'హౌజ్‌హోల్డ్ ఎక్స్‌పెండిచర్ కన్సంప్షన్ సర్వే'లో పట్టణ కుటుంబాలు తమ ఆదాయంలో దాదాపు 60 శాతం ఆహారేతర అవసరాలకు వెచ్చిస్తున్నాయని తేలింది. 2022–23, 2023–24 సంవత్సరాలకు జరిగిన ఈ సర్వే ప్రకారం పట్టణ కుటుంబాలు సుమారు 40 శాతం ఆహార పదార్థాలకు వెచ్చిస్తున్నాయి.

నూరు రూపాయల్లో ఆహారానికి వెచ్చించే మొత్తం ఇలా:

	2022-23	2023-24
పానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్	10.64	11.09
పాలు, పాల పదార్థాలు	7.22	7.19
కూరగాయలు	3.80	4.12
గుడ్లు, చేపలు, మాంసం	3.57	3.56
పప్పు దినుసులు	3.62	3.76
వంట నూనెలు	2.37	1.82
పళ్లు	3.81	3.87
ఇతర ఆహార పదార్థాలు	4.14	4.27

ఈ క్షణమే మధురం

ఒక ప్రసిద్ధ జెన్ గురువు తన జీవితపు చరమాంకానికి చేరుకున్నారు. మరణశయ్యపై ఉన్న ఆయన్ని చూసేందుకు శిష్యులు, సన్నిహితులు తరలివచ్చారు. 'నేను ఈ సాయంత్రానికి తుదిశ్వాస విడుస్తాను' అని గురువు స్వయంగా ప్రకటించడంతో అందరిలోనూ ఆందోళన. ఆ క్లిష్ట సమయంలో ఒక శిష్యుడు హఠాత్తుగా బజారు వైపు వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. గురువు మరణానికి సిద్ధంగా ఉంటే, ఈ సమయంలో బయట ఏం పని అంటూ కొందరు అతడిని అడిగారు. దానికి ఆ శిష్యుడు, 'గురువుగారికి అరటి పండు అంటే చాలా ఇష్టం. అది తీసుకు రావడానికే వెళ్తున్నాను' అని చెప్పి వెళ్ళిపోయాడు. కాసేపటికే గురువు కళ్లు తెరిచి ఎవరి కోసమో వెతుకుతున్నట్లు చూశారు. సరిగ్గా అదే సమయానికి ఆ శిష్యుడు రెండు అరటి పండ్లతో తిరిగి వచ్చాడు. అతడిని చూడగానే గురువు ఆనందంగా ఆ పండ్లను అందుకున్నారు.

మరికొద్ది సేపట్లో ఆయన ప్రాణాలు పోతాయని గ్రహించిన శిష్యులు గురువుకు నమస్కరించి, 'అయ్యా, మేము గుర్తుంచుకోవలసిన మీ చివరి సందేశం ఏమిటి?' అని కోరారు. ఆ మాటలకు గురువు మరోసారి నవ్వుతూ, 'ఈ అరటి పండు ఎంత రుచికరంగా ఉందో కదా!' అని పలికి కన్ను మూశారు. ఆయన చివరి మాటలే ఒక గొప్ప జీవన పాఠాన్ని బోధించాయి. గడిచిన కాలం కానీ, రాబోయే క్షణం కానీ మనవి కావు. కేవలం ఈ 'వర్తమానం' మాత్రమే వాస్తవం. ఎదురుగా ఉన్న క్షణాన్ని అరటి పండంత తీయగా, సంపూర్ణంగా గడపడమే జీవితం అని ఆయన తన ప్రాణత్యాగ సమయంలోనూ చాటిచెప్పారు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

ప్రజాస్వామ్యం ఖూనీ

- చంద్రబాబుది ఆటవిక పాలన
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం క్రైమ్ : ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నిట్ట నిలువునా ఖూనీ చేస్తోందని, జంగిల్ రాజ్‌లా వ్యవహరిస్తున్న చంద్రబాబు ఆటవిక పాలన చేస్తున్నారని అసెంబ్లీ మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతా రాం ధ్వజమెత్తారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల నివాస గృహాల వద్ద జరిగిన దాడులు, దారుణాలు ఘోరమన్నారు. శ్రీకాకుళంలో సోమవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటివి ఎప్పుడూ చూడలేదని, రాష్ట్రంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, అసలు ప్రభుత్వం నడుస్తుందా లేదా అన్న అనుమానం కలుగుతోందన్నారు. తిరు పతి లడ్డూలో ఎలాంటి జంతువుల కొవ్వు లేదని సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సిట్ చెప్పినా బాధ్యత గల ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు చేస్తున్న చేష్టలు, చర్యలేంటని ప్రశ్నించారు.

జంగిల్ రాజ్‌తో రాజ్యాంగాన్ని కాపాడతావా?

- మాజీ ఎంపీ మార్గాని భరత్

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో జంగిల్ రాజ్ విధానాలు తీసుకొచ్చి, సోషల్ మీడియాలో మాత్రం రాజ్యాంగాన్ని కాపాడుతున్నట్టు సీఎం చంద్రబాబు కపట నాటకం ఆడుతున్నాడని వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూల్ ఆఫ్‌లా అమలు చేసే వాడైతే అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేశానని స్వయంగా చెప్పిన ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్తపై కేసు పెట్టి ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ మద్దతుతో బీసీలు, కాపులు ఎదుగుతుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని, అందుకే పథకం ప్రకారం దాడులు చేస్తున్నాడని ఆయన ధ్వజమెత్తారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు జరుగుతుంటే అక్కడే ఉన్న పోలీసులు గూండాలకు ఎస్కార్టుగా వ్యవహరించారని ఆరోపించారు. తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు.

టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలి

చంద్రబాబు సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న పలు ఘటనల నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలు సంయమనంగా ఉండాలని చంద్రబాబు సూచించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఆ విషయాలను వారికి తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన మార్గం కాదన్నారు. తప్పుచేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పకుండా ఉంటాయన్నారు.

కక్ష రాజకీయాలు రాష్ట్ర శ్రేయస్సుకే ప్రమాదకరం

బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి

సాక్షి, అమరావతి: కక్ష రాజకీయాలు రాష్ట్ర శ్రేయస్సుకే ప్రమాదకరమంటూ బీజేపీ ఎమ్మెల్యే, సుజనా చౌదరి పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'రాష్ట్రంలో జరుగుతున్న వరుస పరిణామాలు ఆవేదన కల్గిస్తున్నాయి. అసభ్యంగా మాట్లాడడం ఖండించాల్సిన విషయం. అయితే, వ్యక్తిగత, భౌతిక దాడులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. కక్ష రాజకీయాలు రాష్ట్ర శ్రేయస్సుకు ప్రమాదకరం' అంటూ పేర్కొన్నారు.

భౌతిక దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదం

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సాక్షి, అమరావతి: రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, అంతేగానీ భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై అధికార పార్టీ వాళ్లు భౌతిక దాడులకు దిగడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని దాడులను ప్రోత్సహిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు.

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే దాడులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే చంద్రబాబు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేశ్ సొత్తు కాదని, ప్రజల ఆస్తి అని గ్రహించాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై టీడీపీ శ్రేణులు దాడులకు దిగడం విచారకరమన్నారు.

జంగిల్‌రాజ్‌పై వెల్లువెత్తిన ఆగ్రహజ్వాల

తిరుపతిలో జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బీసీ నాయకులు

నెల్లూరు జిల్లా వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాకాణి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు

గుంటూరు జిల్లా పొన్నూరు సీఐ వీరానాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న అంబటి మురళీకృష్ణ

మార్కాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : టీడీపీ జంగిల్‌రాజ్‌కు వ్యతిరేకంగా, తిరుమల లడ్డూపై పచ్చ మూక చేస్తున్న దుష్ప్రచారానికి వ్యతిరేకంగా ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పార్టీ నేతలు, ప్రజా సంఘాలు, బీసీ నేతలు నిరసనకు దిగారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు అండ్ కో సాగిస్తున్న అసత్య ప్రచారం... బాబు అబద్ధాలకు మద్దతుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎక్కడికక్కడ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. నల్ల బ్యాడ్జీలు కట్టుకుని నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విశాఖలో రూ.5 వేల కోట్ల భూములను గీతం సంస్థకు కట్టబెట్టడంపై తాము చేస్తున్న పోరాటాన్ని పక్కదారి పట్టించేందుకే టీడీపీ ఈ కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయా జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణకు సోమవారం వినతిపత్రమిచ్చారు. పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంపై ఆరోపణలన్నీ అవాస్తవమని సీబీఐ సిట్ నివేదిక ఇచ్చినా ఇంకా టీడీపీ నేతలు, పచ్చమీడియా అసత్యాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ దుష్ప్రచారం సాగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి నెల్లూరు నగరంలోని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్ నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. నిసిగ్గుగా అసత్యాలతో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆ ఫ్లెక్సీలను తొలగించమని కోరితే మాజీ మంత్రుల ఇళ్లపై దాడి చేస్తారా? మీరు చేసే తప్పులను ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తారా? చంపేస్తారా? అని ప్రశ్నించారు. కర్నూలు, నంద్యాలలో టీడీపీ నాయకులపై కేసు నమోదు చేయాలని పోలీసులకు వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసాలు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సిట్ తేల్చినా కూటమి నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. గత ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఏర్పాటు చేస్తున్న పోస్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ వీరా నాయక్‌కు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో వారం రోజులుగా ఆటవిక, రాక్షస పాలనను తలపించేలా కూటమి ప్రభుత్వ పాలన ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. దాడులు అరికట్టాలని పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లాలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఒంగోలులో ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, కనిగిరిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్‌లపై టీడీపీ గూండాలు చేసిన దాడులకు నిరసనగా సోమవారం అనంతపురం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు ఆందోళన చేపట్టారు. చంద్రబాబు ప్రభుత్వం ఆటవికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే దాడులు చేస్తున్నారని, ఇలాగే కొనసాగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రశ్నిస్తే దాడులతో అరాచకం సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు.ఆంధ్రప్రదేశ్‌ను జంగిల్ రాజ్‌గా మార్చిన ఘనత చంద్రబాబుదేనని మండిపడ్డారు. వివాదాస్పద ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజయవాడలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, తదితరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంతకుముందు నేతలు ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

విశాఖలో సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు కేకే రాజు, వరుదు కల్యాణి తదితరులు

రెడ్‌బుక్ పాలనే... ప్రజా పాలన లేదు

తిరుపతిలో జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద బీసీ సంఘ నాయకులు ఆందోళన

తిరుపతి మంగళం: చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజకీయ కక్షతో రెడ్‌బుక్ పాలనే తప్ప, ప్రజా పాలన సాగించడం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ నాయకుడు తొండమల్ల పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు చిన్నియాదవ్, వాసుయాదవ్ ఆరోపించారు. మాజీ మంత్రులు జోగి రమేశ్, అంబటి రాంబాబు ఇళ్లపై కూటమి గూండాలు చేసిన దాడులను ఖండిస్తూ సోమవారం తిరుపతి బాలాజీకాలనీలోని జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా రాజకీయ కక్షలు మానడంలేదని, రెడ్‌బుక్ పాలన సాగిస్తూ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కొవ్వు ఉందంటూ చేసిన ఆరోపణలు సీబీఐ నివేదికతో పటాపంచలయ్యాయన్నారు. అందువల్లే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు.

పథకం ప్రకారమే మారణాయుధాలతో
అంబటి హత్యకు పన్నాగం

ఎమ్మెల్యే గళ్లా మాధవి డైరెక్షన్‌లోనే అంబటి కార్యాలయం, ఇంటిపై దాడులు

- కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని మహిళలపై దాడి చేయించడం ఏంటి ?
- ఇలాంటి పైశాచిక దాడులను హోం మంత్రి అనిత సమర్థిస్తారా ?
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బలం చూసుకునే దాడి చేశారు
- చంద్రబాబు గతంలో వైఎస్ జగన్ తల్లిని దూషించలేదా ?
- విలేకరుల సమావేశంలో అంబటి రాంబాబు కుమార్తె మౌనిక

మాట్లాడుతున్న అంబటి మౌనిక

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : '' పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసి మారణాయుధాలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై, పార్టీ కార్యాలయం, ఇంటిపై దాడి చేశారు. హత్య చేసేందుకు ప్రయత్నించారు.. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి డైరెక్షన్‌లో టీడీపీ శ్రేణులు ఒక ప్లాన్ ప్రకారం దాడులకు తెగబడ్డారు'' అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె అంబటి మౌనిక ఆరోపించారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు నివాసం వద్ద సోమవారం ఆయన భార్య విజయలక్ష్మి, కుమార్తెలు మౌనిక, మనోజ్ఞ మీడియాతో మాట్లాడారు. అంబటి మౌనిక మాట్లాడుతూ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆమె భర్త తమ ఇంటిపైకి వచ్చారని, ఆమె చెయ్యెత్తగానే టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారని ఆరోపించారన్నారు. గళ్లా మాధవికి కూడా ఓ కుటుంబం ఉందనేది గుర్తించుకోవాలని, దాడి జరిగే సమయంలో ఇంటిలో మహిళలు, పిల్లలు ఉన్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు చెబుతున్నా ఇంటి ఆవరణలో ఉన్న కారు అద్దాలు, తలుపులు, కిటికీలను కర్రలు, ఇనుపరాడ్లతో ధ్వంసం చేశారని అన్నారు. ఇటువంటి పైశాచిక దాడిని హోంమంత్రి అనిత సమర్థిస్తారా అని ప్రశ్నించారు. వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వస్తున్న అంబటి రాంబాబును టీడీపీ మహిళలు అసభ్యపద జాలంతో దూషిస్తున్న వీడియోను, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి దాడికి దిగిన వీడియోను ఆమె మీడియాకు చూపించారు.

పోలీసులు ఎందుకు స్పందించరు ?

కూతవేటు దూరంలో రాష్ట్ర డీజీపీ కార్యాలయం ఉందని, పోలీస్ బలగాలు ఉన్నా ఎందుకు స్పందించలేదని ఆమె ప్రశ్నించారు. ఒక డాక్టర్ అయిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సినిమా చూపిస్తామని అంటున్నారని.. సినిమా చూపించడమంటే మహిళలపై దాడి చేయడమేనా అని ప్రశ్నించారు. దీనిపై పెమ్మసాని సతీమణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గతంలో చంద్రబాబు ఏంఅన్నారు ?

గతంలో చంద్రబాబు పబ్లిక్ మీటింగ్‌లో మాజీ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి ఏం మాట్లాడారు ? నీ పుట్టుక తప్పుడు పుట్టుక అని అనలేదా అని ఆమె ప్రశ్నించారు. మరి మాజీ సీఎం వైఎస్ జగన్ తల్లిని దూషించిన చంద్రబాబు ఎప్పుడైనా క్షమాపణ చెప్పారా అని ప్రశ్నించారు. కానీ అంబటి రాంబాబు సంజాయిషీ చెప్పారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మహిళల భద్రత, రక్షణపై మాట్లాడుతున్నారని, మీ బలం చూసి కదా తమపై దాడులకు తెగబడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ పార్టీ కార్యాలయం, ఇంటిపై జరిగిన విధ్వంసకాండపై ఫిర్యాదులు చేస్తే పోలీసులు తీసుకోవడం లేదని అన్నారు. ఎనిమిది గంటలకు పైగా కార్యాలయం, ఇంటి వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు భయానక వాతావరణం సృష్టించారని అన్నారు.

కాపులను లక్ష్యంగా చేసుకున్న చంద్రబాబు

- ఎమర్జెన్సీ కోసం ప్రధానిని కోరండి బాబు...
- అప్పుడు ప్రతిపక్షం మొత్తాన్ని జైలులో పెట్టొచ్చు
- నెయ్యి కల్తీ కాలేదని సీబీఐ సిట్ నివేదిక ఇచ్చింది
- మీరు చెప్పింది అబద్ధమని తేలిపోయింది
- బీసీ రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేయలేదా?
- సీఎం చంద్రబాబుకు ముద్రగడ లేఖ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్న దహనకాండ చూస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీ విధించాల్సిందిగా ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరాలి. ఎందుకంటే ఎమర్జెన్సీ విధిస్తే ప్రతిపక్షం మొత్తాన్ని చంద్రబాబు తన పదవీకాలం పూర్తయ్యేత వరకూ జైలులో పెట్టడానికి ఉపయోగపడుతుంది' అని ఎద్దేవా చేశారు. ఈ మేరకు చంద్రబాబుకు ముద్రగడ పద్మనాభం రాసిన లేఖను సోమవారం ఇక్కడ మీడియాకు విడుదల చేశారు. మాజీ మంత్రులు విడదల రజినీ, అంబటి రాంబాబు, జోగి రమేష్‌ను ఘోరాతి ఘోరంగా అవమానించడం ఎంత వరకూ న్యాయమని ముద్రగడ ప్రశ్నించారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి పాలన ఉందా? అని నిలదీశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యిలో కల్తీ జరగలేదని సీబీఐ సిట్ నివేదిక ఇవ్వడంతో చంద్రబాబు చెప్పింది అబద్ధమని తేలిపోయిందన్నారు. ఆ అబద్ధాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆయన పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావన్నారు. ఎప్పుడూ అబద్ధం ఆడొద్దని, ఒక అబద్ధానికి 100 అబద్ధాలు చెప్పినా సరి చేయలేమని తన తండ్రి చెప్పేవారని ఆయన గుర్తుచేశారు. ఈ రోజు చంద్రబాబు చెప్పిన అబద్ధానికి ఆయనకు, వారి పార్టీకి ప్రజల్లో తీవ్ర నష్టం జరిగిందన్నారు. సీబీఐ సిట్ నివేదిక ఇచ్చిన తర్వాత అయినా నెయ్యి కల్తీపై తాను చెప్పింది పొరపాటని చంద్రబాబు అంటే చాలా బాగుండేదని పేర్కొన్నారు.

కాపులను కట్టుబట్టలతో రాష్ట్రం నుంచి పంపించే పనులు చేయొద్దు

చంద్రబాబు పాలనలో కాపు సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ముద్రగడ ఆరోపించారు. గతంలో తన కుటుంబాన్ని, ఇప్పుడు అంబటి రాంబాబు కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారని పేర్కొన్నారు. గతంలో అధికారంలోకి రావడం కోసం కాపులకు బీసీ రిజర్వేషన్లు ఇస్తామని చంద్రబాబు చెప్పారని, అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపించడం అందరికీ తెలిసిందేనన్నారు. చంద్రబాబుపై కాపు సామాజికవర్గానికి కోపం ఉన్నా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై ప్రేమతో అంతా మద్దతిచ్చారని తెలిపారు. చంద్రబాబు జైలులో ఉండటంతో డీలా పడిపోయిన టీడీపీ కేడర్... పవన్ మద్దతివ్వడంతోనే రోడ్డు పైకి వచ్చిన సంగతి, అధికారంలోకి వచ్చిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. అయినప్పటికీ కాపు సామాజికవర్గంపై ఎప్పుడూ చంద్రబాబు రగిలిపోతూనే ఉన్నారన్నారు. కాపు సామాజికవర్గాన్ని రాష్ట్రం నుంచి వేరే రాష్ట్రానికి కట్టుబట్టలతో పంపించే కార్యక్రమం చేయవద్దని చంద్రబాబును ముద్రగడ కోరారు.

పోలీసులే బాధ్యత వహించాలి

పోలీస్ కమిషనర్‌కు హైకోర్టు కీలక ఆదేశాలు
పచ్చమూకల విధ్వంసంపై హైకోర్టును ఆశ్రయించిన జోగి రమేష్ కుమారుడు రోహిత్

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు జోగి రమేష్ ఇంటిపై టీడీపీ గూండాల దాడి నేపథ్యంలో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జోగి రమేష్ ఇంటికి భద్రత కల్పించాలని ఆదేశించింది. జోగి రమేష్ ఇంటివద్ద ఎలాంటి దాడులు జరిగినా పోలీసులదే బాధ్యత అని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. షాడో ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న నారా లోకేశ్‌ను విమర్శించారంటూ టీడీపీ మూకలు ఆదివారం రాత్రి జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు విసిరి ఆ ఇంటిని తగులబెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జోగి రమేష్ కుమారుడు రోహిత్ సోమవారం అత్యవసరంగా లంచ్ మోషన్ రూపంలో హైకోర్టును ఆశ్రయించారు. తమ ఇంటిని తగులబెట్టి విధ్వంసం సృష్టించిన వారిపై కేసు పెట్టకుండా పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, ఈ నేపథ్యంలో తమ ఇంటివద్ద తగిన భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు విచారణ జరిపారు.

శాంతి భద్రతలను గాలికొదిలేశారు

పిటిషనర్ తరఫు న్యాయవాదులు వేలూరి మహేశ్వర్ రెడ్డి, సానేపల్లి రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో శాంతి భద్రతలను పోలీసులు గాలికొదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లు, ఆస్తులే లక్ష్యంగా అధికార పార్టీ మూకలు విధ్వంసం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని రామలక్ష్మణరెడ్డి వివరించారు. మూడు రోజుల్లో ఇలా విధ్వంసం చేయడం ఇది రెండోసారి అని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు.

అక్కడ ఎలాంటి మూకలు లేవు

ఈ వాదనలపై మీరేమంటారని పోలీసుల తరఫున వాదనలు వినిపిస్తున్న ప్రభుత్వ న్యాయవాది అడుసుమిల్లి జయంతిని న్యాయమూర్తి ప్రశ్నించారు. సీఎంతోపాటు మంత్రి లోకేశ్‌పై జోగి రమేష్ చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలే ఈ విధ్వంసానికి దారి తీశాయన్నారు. జోగి రమేషే చట్టాన్ని ఉల్లంఘించారని తెలిపారు. ఇప్పుడు రక్షణ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, ఆయనకు ఎలాంటి ఉపశమనం కలిగించాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం జోగి రమేష్ ఇంటివద్ద ఎలాంటి మూకలు లేవని తెలిపారు. 15 మందితో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. విధ్వంసం సృష్టించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు వివరించారు.

ఆ ఇంట్లో ఎవరున్నారు?

ఆ సమయంలో న్యాయమూర్తి పిటిషనర్ రోహిత్ తన వ్యాజ్యంతో పాటు జత చేసిన ఫోటోలను పరిశీలించారు. కాలిపోతున్న ఇంటిలో ఉన్న వ్యక్తులు ఎవరని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలా అని అడిగారు. పార్టీ కార్యకర్తలతో పాటు ఆ ఇంటిలో పనిచేస్తున్న పని మనుషులని జయంతి చెప్పారు.

ఇంటిని తగలబెట్టేస్తున్నా పోలీసులు చూస్తూ ఉన్నారు

ఈ సమయంలో రామలక్ష్మణ్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. వారంతా జోగి రమేష్ కుటుంబ సభ్యులని తెలిపారు. ఘటన జరిగినప్పుడు ఇంట్లో జోగి రమేష్ లేరన్నారు. 85 ఏళ్ల వృద్ధులైన తల్లిదండ్రులు, మరికొందరు ఉన్నారని తెలిపారు. ఇంటిని తగలబెట్టేస్తున్నా పోలీసులు మౌనంగా చూస్తూ ఉన్నారన్నారు. ఇలాంటి పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదని తెలిపారు. అధికార పార్టీ నేతలకు చట్టం అన్నా.. పోలీసులన్నా గౌరవం లేదన్నారు. పోలీసులను సైతం కొందరు నేతలు తరిమికొట్టారని, అయినా వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రమేష్ ఇంటివద్ద తగిన భద్రత ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి స్పందిస్తూ.. జోగి రమేష్ ఇంటి వద్ద తదుపరి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు స్పష్టం చేశారు.

లోకేశ్ నుంచి ప్రాణహాని

నాకు, నా కుటుంబానికి ఏం జరిగినా లోకేశ్ బాధ్యుడు
లోకేశ్ ఆదేశాలతో కేశినేని చిన్ని నేతృత్వంలో దాడి
దాడులతో బీసీలను వైఎస్సార్‌సీపీకి దూరం చేసే కుట్ర
వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్

సాక్షి ప్రతినిధి, విజయవాడ : రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ నుంచి తనకు ప్రాణహాని పొంచి ఉందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. భవిష్యత్‌లో తనకు, తన కుటుంబానికి ఏ హాని జరిగినా దానికి మంత్రి నారా లోకేశ్ పూర్తి బాధ్యుడని చెప్పారు. తన ఇంటిపై జరిగిన దాడి కూడా లోకేశ్ ఆదేశాలతో ఎంపీ కేశినేని చిన్ని నేతృత్వంలోనే జరిగిందన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని తన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన దైవం తిరుమలేశుడు అని, తన నాయకుడు వైఎస్ జగన్ అని చెప్పారు. తన ఇష్ట దైవంపైన, తమ నాయకుడిపై నిందలేస్తే ఎలా ఊరుకుంటామని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులు నొక్కాలని చూస్తున్నారని, తమను ఎలా, ఎంత వేధించినా ఎక్కడా వెనక్కి తగ్గబోమని తేల్చిచెప్పారు.

దాడులతో భయపెట్టలేరు

'వరుస దాడులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయపెట్టాలని చూస్తున్నారు. వందలాదిమంది టీడీపీ గూండాలను నా ఇంటి మీదకు పంపించి దాడి చేశారు. పోలీసుల సమక్షంలో జరిగిన ఈ దాడిని ప్రజాస్వామ్యంపైన, వెనుకబడిన వర్గాల పైన జరిగిన దాడిగానే చూడాలి. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) కనుసన్నల్లో విజయవాడ నుంచి బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌ని రంగంలోకి దించి నా ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడిచేసి నిప్పంటించారు. నన్ను, నా కుటుంబ సభ్యులను సజీవ దహనం చేసే కుట్రకు ప్రభుత్వం వెనుకాడలేదు. వైఎస్ జగన్ ప్రోత్సాహంతో వైఎస్సార్‌సీపీలో బీసీలు ఎదుగుతుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నాడు. నేను తప్పు చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేని, అక్రమ కేసులో 3 నెలలు జైలుకు పంపినా వారి కక్ష తీరలేదు' అని జోగి రమేష్ అన్నారు.

జంతువుల కొవ్వుపై ఆధారాలు చూపించమన్నా

'నేను ఏ తప్పూ చేయలేదని దుర్గమ్మ ఆలయంలో ప్రమాణానికి సిద్ధమని చెప్పాను. నార్కో అనాలిసిస్ టెస్టుకు సిద్ధమని సవాల్ చేశాను. సీబీఐ ఎంక్వైరీ అడిగాను. అవన్నీ చేయకుండా చేతిలో అధికారం ఉంది కదా అని అక్రమంగా నన్ను, నా కుమారుడిని, నా తమ్ముడిని జైలుకు పంపి ఇబ్బంది పెట్టారు. నేను జైలు నుంచి వచ్చాక వైఎస్సార్‌సీపీ తరఫున గళం వినిపిస్తుంటే చంద్రబాబుకి నచ్చడం లేదు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని టీడీపీ ఫ్లెక్సీలు వేసి శ్రీవారి ప్రతిష్టను దిగజార్చుతుంటే మనసు కన్నీరు పెట్టింది. తిరుమల లడ్డూ ప్రసాదంపై కూటమి నాయకుల తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ వారిని విమర్శిస్తే దాడులు చేస్తారా? లోకేశ్‌కి చిప్ దొబ్బింది అని ప్రశ్నించడం తప్పా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం? పక్కా ప్రణాళికతోనే ఇనుప రాడ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడులు చేశారు. చంద్రబాబు కొడుకు లోకేశ్ ఆదేశాలతోనే మా ఇంటిపై దాడి జరిగిందని ఆధారాలు చూపిస్తుంటే.. ఇందులో పాల్గొన్న వారు స్పష్టంగా కనిపిస్తుంటే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోకుండా.. నిందితులు ఎవర్నీ వదలొద్దు అంటూ చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు' అని జోగి రమేష్ పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎంపీలు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, స్వామిదాసు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పూనూరు గౌతమ్‌రెడ్డి, తన్నీరు నాగేశ్వరరావు, వరికూటి అశోక్‌బాబు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఉన్నారు.

మాజీ మంత్రి రజినిపై మరో అక్రమ కేసు

బీసీ మహిళపై కక్షకట్టిన చంద్రబాబు ప్రభుత్వం

సాక్షి, నరసరావుపేట: బీసీ మహిళానేత, మాజీ మంత్రి విడదల రజినిపై చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా పల్నాడు జిల్లా యడ్లపాడు పోలీసులు మరో కేసు నమోదు చేశారు. తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు అవశేషాలు కలవలేదన్న సీబీఐ సిట్ నివేదిక నేపథ్యంలో గత నెల 30వ తేదీన యడ్లపాడు మండలం బోయపాలెం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మాజీ మంత్రి రజిని, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బయటకు వచ్చిన మాజీ మంత్రి రజినిపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో పచ్చగూండాలు మూకుమ్మడిగా దాడిచేశారు. ఈ ఘటనపై అదే రోజు రాత్రి వైఎస్సార్‌సీపీ నేత వడ్డేపల్లి నరసింహారావు యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు.

దాడిచేసిన వారి ఫిర్యాదుతో కేసు నమోదు

మాజీ మంత్రి రజినిపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయకపోగా దాడిలో పాల్గొన్న షేక్ రాజా అహ్మద్ అనే టీడీపీ కార్యకర్త ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై యడ్లపాడు పోలీసులు గత నెల 31వ తేదీన కేసు నమోదు చేశారు. విడదల రజిని, వైఎస్సార్‌సీపీకి చెందిన మరో 21 మందిపై అక్రమ కేసు బనాయించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం



చంద్రబాబు ప్రభుత్వ అసమర్థ పాలనను ఎండగడుతున్న బీసీ, కాపు నేతలపై ప్రభుత్వ పెద్దలు దాడులు చేయిస్తున్నారు. నాతో పాటు అంబటి రాంబాబు, జోగి రమేష్ తదితరులపై పచ్చపార్టీ నేతలు దాడులు చేశారు.మాపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. రెడ్‌బుక్ పాలనతో రాష్ట్రంలో జంగిల్ రాజ్ సృష్టించారనడానికి ఇవే నిదర్శనాలు. చంద్రబాబు ఎంత భయపెట్టినా ప్రభుత్వ తప్పుడు విధానాలపై పోరాడుతూనే ఉంటాం. అక్రమ కేసులపై కోర్టులు, ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం. – విడదల రజిని, మాజీ మంత్రి

సభలో 'చైనా' రగడ!

మంత్రులు వర్సెస్ రాహుల్ • ఆర్మీ మాజీ చీఫ్ నరవణె పుస్తకంపై వివాదం

నరవణె చిత్రమున్న వ్యాసాన్ని చూపుతున్న రాహుల్ గాంధీ

- దాని గురించి ప్రస్తావించిన రాహుల్
- అనుమతించబోనన్న స్పీకర్ బిర్లా
- రాహుల్‌కు విపక్ష సభ్యుల మద్దతు
- అమిత్ షా, రాజ్‌నాథ్ అభ్యంతరం
- గందరగోళం, సభ నేటికి వాయిదా

న్యూఢిల్లీ: 'చైనా రగడ' సోమవారం లోక్‌సభను కుదిపేసింది. 2020 నాటి భారత్, చైనా ఘర్షణలకు సంబంధించి విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. వాటికి సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె పుస్తకంలోని పలు అంశాలను రాహుల్ సభలో ప్రస్తావించడం కలకలం రేపింది. విపక్ష నేత వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు బీజేపీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ప్రచురణ కాని పుస్తకంలోని అంశాలను ఉటంకించడాన్ని ఆక్షేపించారు. సభను ఆయన తప్పుదోవ పట్టిస్తున్నారంటూ దుయ్యబట్టారు. నరవణె పుస్తకం గురించిన ఉటంకింపులను అనుమతించబోనని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించినా రాహుల్ పట్టించుకోలేదు. పలువురు విపక్ష నేతలు ఆయనకు మద్దతుగా నిలవడంతో గందరగోళం నెలకొంది. అధికార, విపక్ష సభ్యులు పోటాపోటీ నినాదాలతో హోరెత్తించారు. దాంతో సభ రెండుసార్లు వాయిదా పడింది. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.



లోక్‌సభలో రాహుల్ వ్యాఖ్యలకు అభ్యంతరం తెలుపుతున్న రాజ్‌నాథ్, అమిత్ షా

ఒక్క వాక్యానికే భయమెందుకు?

సోమవారం లోక్‌సభ సమావేశమై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ చేపట్టింది. బీజేపీ సభ్యుడు తేజస్వి సూర్య మాట్లాడుతూ కాంగ్రెస్ దేశభక్తిపై పలు ప్రశ్నాస్త్రాలు సంధించారు. అనంతరం ప్రసంగించిన రాహుల్ వాటిపై మండిపడ్డారు. ''నెహ్రూ–చైనా అంశంపై మాట్లాడాలని నేను అనుకోలేదు. కానీ కనుక సూర్య చేసిన విమర్శలకు బదులుగా దానిపై మాట్లాడక తప్పడం లేదు. నెహ్రూ కేవలం తాను రాజనీతిజ్ఞుడినని చెప్పుకునేందుకు వేలాది ఎకరాల భూభాగాన్ని చైనాకు సరెండర్ చేశారని నిరాధారణ ఆరోపణలకు దిగుతున్నారు'' అన్నారు. ఆ క్రమంలో 2020 భారత్, చైనా గాల్వాన్ ఘర్షణల గురించి జనరల్ నరవణె తన పుస్తకంలో రాసిన అంశాలను ఉటంకించారు. అందుకు అమిత్ షా తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆ పుస్తకం ప్రచురణ అయిందో లేదో ముందుగా రాహుల్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దాంతో మొదలైన రగడ 50 నిమిషాలకు పైగా కొనసాగింది. ఈ అంశానికి సంబంధించి ఎలాంటి పుస్తకం, వార్తా పత్రిక క్లిప్పింగ్ తాలూకు అంశాలనూ సభలో ప్రస్తావించడానికి అనుమతి లేదని ఓం బిర్లా స్పష్టం చేశారు. వాటి ప్రస్తావనకు అడ్డంకులేమీ లేవని రాహుల్ వాదించారు. నరవణె పుస్తకం ప్రచురితం కాలేదని రాజ్‌నాథ్ అభ్యంతరం తెలిపారు. దానిపై ఒక మేగజైన్లో వచ్చిన వ్యాసంలోని అంశాలనే ఉటంకిస్తున్నానని రాహుల్ బదులిచ్చారు. ''ఉగ్రవాదంపై రాజీలేని పోరు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటారు. నేను ఒక్క వాక్యం చదివితే ఎందుకంతగా బెంబేలెత్తిపోతున్నారు?'' అంటూ ఎద్దేవా చేశారు. ఆ పుస్తక ప్రస్తావనను అనుమతించడం లేదని ఓం బిర్లా పునరుద్ఘాటించారు. 'అయితే నేనేం మాట్లాడాలో మీరే చెప్పండి' అని రాహుల్ అనడంతో, 'నేనేమీ మీ సలహాదారును కాదు' అంటూ స్పీకర్ ఆగ్రహించారు. స్పీకర్ రూలింగ్‌కు కట్టుబడకుంటే ఏం చర్యలు తీసుకోవాలో సభ నిర్ణయించాల్సి వస్తుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు హెచ్చరించారు. అయినా రాహుల్ వెనక్కు తగ్గకపోవడంతో పుస్తక ప్రస్తావన తగదంటూ ఆయన్ను బిర్లా పదేపదే వారించారు. పుస్తకాన్ని ప్రచురించొద్దంటూ నరవణెను కేంద్రం బెదిరించిందంటూ రాహుల్ తప్పుడు ఆరోపణలకు దిగుతున్నారని, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని రాజ్‌నాథ్ మండిపడ్డారు. అదే నిజమైతే దానిపై నరవణె కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. రాహుల్‌కు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మద్దతుగా నిలిచారు. ఆయనను మాట్లాడేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. వెంటనే అధికార, విపక్ష సభ్యులు పోటాపోటీ నినాదాలకు దిగారు. గందరగోళం నడుమ సభను మధ్యాహ్నం మూడింటిదాకా స్పీకర్ వాయిదా వేశారు. అనంతరం కూడా ఇండో–చైనా సరిహద్దు అంశాన్ని లేవనెత్తేందుకు రాహుల్ తిరిగి ప్రయత్నించారు. అందుకు అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సైన్యాన్ని న్యూనతపరిచే వ్యాఖ్యలకు దిగొద్దని రాహుల్‌కు రిజిజు సూచించారు. ప్రతిష్టంభన నడుమ సభ సాయంత్రం నాలుగింటిదాకా వాయిదా పడింది.

మోదీకి, మంత్రులకు నచ్చదు!

సభ మళ్లీ సమావేశమయ్యాక రాహుల్ తన ప్రసంగం కొనసాగించారు. తాను లేవనెత్తుతున్నది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని చెప్పారు. ''సహజంగానే ప్రధాని మోదీకి, రక్షణ మంత్రికి ఇది నచ్చదు. అందుకే నన్ను మాట్లాడనివ్వడం లేదు'' అంటూ దుయ్యబట్టారు. మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీ (టీఎంసీ), మనోజ్ ఝా (ఆర్జేడీ) తదితర విపక్ష సభ్యులు రాహుల్‌కు బాసటగా నిలిచారు.

మోదీ, రాజ్‌నాథ్ దోషులుగా తేలతారనే...
సభలో నన్ను అడ్డుకున్నారు: రాహుల్

''2020లో చైనాతో ఘర్షణ సందర్భంగా మన సైనిక బలగాల నమ్మకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వమ్ము చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె పుస్తకంలోని అంశాలు వెలుగులోకి వస్తే ఆ ఉదంతంలో వారిద్దరూ దోషులుగా రుజువవుతారు. ఆ భయంతోనే నేను సదరు అంశాలను ప్రస్తావించకుండా బీజేపీ సభ్యులు లోక్‌సభలో పదేపదే అడ్డుకున్నారు'' అని విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. సోమవారం సభ వాయిదా పడ్డాక పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''మోదీ, రాజ్‌నాథ్ గురించి ఆ పుస్తకంలో నరవణె రాశారు. చైనాతో ఘర్షణకు సంబంధించి వారిద్దరూ తనకు ఏం చెప్పిందీ, ఎలాంటి ఆదేశాలిచ్చిందీ స్పష్టంగా పేర్కొన్నారు. దాన్నే నేను సభలో ప్రస్తావించా. ఆ రెండు మూడు వాక్యాల్లో విషయమంతా స్పష్టంగా బయటపడిపోయేది. పైగా వాటిని రాసింది నాటి ఆర్మీ చీఫ్! కానీ ఆ మాత్రానికే మోదీ సర్కారు బెంబేలెత్తిపోతోంది. ఎందుకంటే అది వెలుగులోకి వస్తే వారిద్దరి బండారం బయటపడుతుంది'' అన్నారు. 2020లో చైనా చొచ్చుకొస్తున్నప్పుడు మోదీ 56 అంగుళాల ఛాతీ ఏమైపోయిందంటూ ఎద్దేవా చేశారు. ''అలాంటి పరిస్థితుల్లో దేశాన్ని నడిపే నాయకుడు స్పష్టంగా దిశానిర్దేశం చేయాలి. అంతే తప్ప నిర్ణయాలను ఇతరుల భుజస్కంధాలపై నెట్టి బాధ్యతల నుంచి తప్పించుకోవద్దు. కానీ మోదీ చేసింది సరిగ్గా అదే! ఆర్మీ మాజీ చీఫ్ రాసిన పుస్తకాన్ని ప్రచురణ కూడా కానివ్వడం లేదు'' అని రాహుల్ ఆరోపించారు.

నిబంధనల దుర్వినియోగం: కాంగ్రెస్

సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీని మోదీ సర్కారు అవహేళన చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. పైగా ఆయన గొంతు నొక్కేందుకు నిబంధనలను కూడా దుర్వినియోగం చేస్తోందంటూ మండిపడింది. నరవణె పుస్తకంలోని నిజాలు వెలుగులోకి వస్తాయన్న భయంతోనే చౌకబారు చేష్టలకు దిగారని కాంగ్రెస్ సీనియర్ నేత కె.సి.వేణుగోపాల్ ఆరోపించారు. ఇది నయా ఫాసిజానికి తిరుగులేని తార్కాణమంటూ ధ్వజమెత్తారు.

పార్లమెంటును కించపరిచారు

విపక్ష నేత రాహుల్‌గాంధీ తన ప్రవర్తనతో పార్లమెంటు గౌరవానికే భంగం కలిగించారని బీజేపీ దుయ్యబట్టింది. అంతేగాక భారత్–చైనా సరిహద్దు అంశంపై నిరాధారణ ఆరోపణలు, బాధ్యతారహిత వ్యాఖ్యలతో సైనికుల ఆత్మస్థైర్యాన్ని కూడా దెబ్బ తీశారంటూ ఆక్షేపించింది. రాహుల్ పూర్తిగా భారత వ్యతిరేక శక్తుల భాష మాట్లాడుతున్నారని మంత్రులు, బీజేపీ నేతలు మండిపడ్డారు. సభలో రాహుల్ ప్రవర్తన భారత్ పరువును మంటగలిపేందుకు పక్కా పథకం ప్రకారం పన్నిన కుట్రలో భాగమేనని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఆరోపించారు. పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. విలువైన సభా సమయాన్ని రాహుల్ వ్యర్థపరిచారని మండిపడ్డారు. ''జాతీయ భద్రతతో ఆటలాడొద్దు. దాన్ని రాజకీయ ఆయుధంగా మార్చుకోవద్దు'' అంటూ హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో భారత భూభాగాన్ని చైనాకు కోల్పోయినందుకు రాహుల్ తక్షణం దేశానికి క్షమాపణ క్షమాపణ చెప్పాలని రిజిజు డిమాండ్ చేశారు. రాహుల్ ఏకంగా నిండు సభలోనే మన దేశ శత్రువుల భాష మాట్లాడుతున్నారంటూ కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ మండిపడ్డారు.

ఆ పుస్తకంలో ఏముంది?

లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ, మంత్రుల నడుమ రగడకు కేంద్ర బిందువుగా మారిన ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణె పుస్తకంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆయన తన సైనిక జీవితం తాలూకు జ్ఞాపకాలకు 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరిట పుస్తక రూపమిచ్చారు. పెంగ్విన్ పబ్లిషింగ్ హౌజ్ దాన్ని ప్రచురించాల్సి ఉంది. అందుకు రక్షణ శాఖ అనుమతి కోసం ఏడాదికి పైగా ఎదురు చూస్తున్నట్టు నరవణె గత అక్టోబర్‌లో పేర్కొన్నారు! ఈ నేపథ్యంలో ఆ పుస్తకంపై ద కారవాన్ మేగజైన్ గత నెలలో కవర్ పేజీ వ్యాసం ప్రచురించింది. రాహుల్ సోమవారం సభలో ఉటంకించింది ఆ వ్యాసంలోని అంశాలనే! తద్వారా, గాల్వాన్ ఘర్షణ వంటి అతి కీలక ఉదంతంపై సరైన నిర్ణయం తీసుకోవడంలో మోదీ సర్కారు తాత్సారం చేసిందని చెప్పేందుకు ఆయన ప్రయత్నించారు.

నిర్ణయాన్ని నాకే వదిలారు: నరవణె

2020 జూన్15 రాత్రి తూర్పు లద్దాఖ్‌లోని గాల్వన్ లోయలో భారత, చైనా సైనిక దళాల మధ్య భారీ ఘర్షణ జరిగింది. వాటిలో కల్నల్ సంతోష్‌కుమార్‌తో సహా 20 మంది భారత సైనికులు అమరులయ్యారు. చైనావైపు కూడా భారీగా ప్రాణనష్టం జరిగినా డ్రాగన్ దేశం ఆ వివరాలను బయటికి రానివ్వలేదు. ఆ ఘర్షణల సమయంలో నరవణె ఆర్మీ చీఫ్‌గా ఉన్నారు. ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న వేళ 2020 ఆగస్టు 31న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో తన భేటీ గురించి పుస్తకంలో నరవణె రాశారు. ''(గాల్వాన్ ఉద్రిక్తతలపై) ప్రధాని మోదీతో మాట్లాడానని రాజ్‌నాథ్ నాకు చెప్పారు. 'అది పూర్తిగా సైనిక నిర్ణయం. మీకు ఏది సరైందనిపిస్తే అలా చేయండి' అన్నారు. దాంతో బాధ్యతంతా పూర్తి గా నాపైనే పడింది. 'చైనా దూకుడును అడ్డుకు నేందుకు) నేనే సరైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఏం చేయాలా అని కొద్ది నిమిషాలు మౌనంగా ఉండిపో యాను'' అని అందులో నరవణె రాసుకొచ్చి నట్టు కారవాన్ వ్యాసం పేర్కొంది. ''పుస్తకం బ్యాక్ కవర్‌పై 1999 కార్గిల్ యుద్ధ సమయంలో ఆర్మీ చీఫ్‌గా చేసిన జనరల్ వి.పి.మాలిక్ రాసిన అభిప్రాయం కూడా ఆసక్తికరంగా ఉంది. 'గాల్వన్ లోయ ఘర్షణ, దానికి ముందు, తర్వాత జరిగిన పలు ఉదంతాల గురించి పుస్తకంలో రాసిన అంశాలు చదువుతుంటే పాఠకులంతా భావోద్వేగాలతో ఊగిపోవడం ఖాయం' అని మాలిక్ రాసుకొచ్చారు'' అంటూ వ్యాసం ముక్తాయించింది.

దలైలామాకు గ్రామీ

- ఆడియో ఆల్బమ్‌కు ప్రతిష్టాత్మక సంగీత పురస్కారం
- ఆయనతో పాటు కె-పాప్, స్పీల్‌బర్గ్‌కు తొలిసారి గ్రామీలు



లాస్‌ఏంజెలెస్: టిబెటన్‌ల అత్యున్నత ఆధ్యాత్మిక నేత దలైలామాకు అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రామీ సంగీత పురస్కారం లభించింది. ఆయన ఆడియో ఆల్బం 'మెడిటేషన్స్: ద రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిజ్ హోలీనెస్ ద దలైలామా'కు ఈ గౌరవం దక్కింది. ఆడియో బుక్స్, నరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో ఆయనకు ఈ పురస్కారం లభించింది. కేథీ గేర్వర్, ట్రెవర్ నోవా, కెటాంజీ బ్రౌన్ జాక్సన్, ఫాబ్ మోర్వన్ తదితరులతో పోటీపడి మరీ దలైలామా గ్రామీ నెగ్గడం విశేషం. ఆదివారం రాత్రి లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన 68వ గ్రామీ వేడుకల్లో ఆయన తరఫున గాయకుడు రఫుస్ వెయిన్‌రైట్ అవార్డును స్వీకరించారు. కబీర్ సెహగల్ నిర్మాణంలో రూపొందిన దలైలామా 'మెడిటేషన్స్' ఆడియో ఆల్బంకు ప్రఖ్యాత సరోద్ నిపుణుడు ఉస్తాద్ అమ్జాద్ అలీ ఖాన్ సంగీతం అందించారు. ఆయన కుమారులు అమాన్ అలీ బంగాష్, అయాన్ అలీఖాన్, అమెరికా శాక్సోఫోనిస్ట్ టాడ్ నాష్, గాయక–రచయిత దేబీ నోవా తదితరులు కూడా ఆల్బం రూపకల్పనలో పాలుపంచుకున్నారు. 90 ఏళ్ల వయసులో తొలిసారిగా గ్రామీ అవార్డు దక్కించుకుని దలైలామా రికార్డు సృష్టించడం విశేషం. దాంతో దలైలామా నివాసముంటున్న హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన శిష్యులు, అనుయాయుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. చైనా మాత్రం దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని తీవ్రంగా విమర్శించింది.

మనోళ్లకు దక్కని గౌరవం

దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత కె–పాప్ బృందం కూడా ఈసారి తొలిసారిగా గ్రామీ పురస్కారం దక్కించుకుంది. వారి యానిమేటెడ్ మ్యూజికల్ యాక్షన్ మూవీ 'కే పాప్ డెమన్ హంటర్స్' ఆల్బంలో పాపులర్ గీతం 'గోల్డెన్'ను గ్రామీ వరించింది. అలాగే ప్రఖ్యాత దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ కూడా తొలిసారి గ్రామీ పురస్కారం దక్కించుకున్నారు. ఆయన రూపొందించిన మ్యూజిక్ ఫర్ జాన్ విలియమ్స్' డాక్యుమెంటరీకి మ్యూజిక్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. దాంతో ప్రఖ్యాత ఎమ్మీ, గ్రామీ, ఆస్కార్, టోనీ (ఈజీఓటీ) అవార్డులన్నింటినీ అందుకున్న అరుదైన ప్రముఖుల జాబితాలో స్పీల్‌బర్గ్ స్థానం సంపాదించుకున్నారు. భారత్ నుంచి అనౌష్క శంకర్, సిద్ధాంత్ భాటియాతో పాటు శక్తి ఫ్యూజన్‌బాండ్ కూడా పోటీపడ్డా ఎవరికీ అవార్డు దక్కలేదు.

దలైలామా హర్షం

ధర్మశాల: గ్రామీ అవార్డు పట్ల దలైలామా హర్షం వెలిబుచ్చారు. ''ఈ పురస్కారాన్ని సవినయంగా, కృతజ్ఞతాపూర్వకంగా స్వీకరిస్తున్నా. ఇది వ్యక్తిగత ఘనత కాదు. ప్రపంచ పౌరులందరి సమష్టి భాగస్వామ్యానికి గుర్తింపు. శాంతి, కరుణ, పర్యావరణ పట్ల శ్రద్ధ, మానవ ఐక్యతపై స్పష్టమైన అవగాహన మానవాళి శ్రేయస్సుకు చాలా ముఖ్యం. ఈ కీలక సందేశాన్ని మరింతగా చాటేందుకు గ్రామీ గుర్తింపు ఎంతగానో దోహదపడుతుంది. అందుకు నిర్వాహకులకు కృతజ్ఞున్ని'' అని పేర్కొన్నారు.

ఆయనకు అవార్డా: చైనా

బీజింగ్: దలైలామాకు గ్రామీ అవార్డు ప్రదానం చేయడాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. తద్వారా దక్కిన గుర్తింపును ఆయన చైనా వ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని పేర్కొంది. ''దలైలామా మత గురువే కాదు. ఆ ముసుగులో రాజకీయ ప్రవాసంలో గడుపుతూ చైనాకు వ్యతిరేకంగా వేర్పాటువాద కార్యకలాపాలకు నేతృత్వం వహిస్తున్నారు'' అంటూ చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఆక్షేపించారు. దలైలామా 1959లో చైనా నిర్బంధం నుంచి తప్పించుకుని భారత్ రావడం తెలిసిందే. అప్పటినుంచీ ఆయన ధర్మశాలలోనే ఆశ్రయం పొందుతున్నారు. టిబెట్ స్వాతంత్ర్యం కోసం చేస్తున్న శాంతియుత పోరాటానికి 1989లో దలైలామాకు నోబెల్ శాంతి పురస్కారం కూడా లభించింది.

ఆ నేరానికి తల్లిదండ్రులదే బాధ్యత

- పుణె పోర్షే ప్రమాద ఘటనపై సుప్రీం వ్యాఖ్య
- ముగ్గురు నిందితులకు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ: 2024నాటి పుణె పోర్షె కారు ప్రమాద ఘటనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మైనర్లు పాల్పడే ఇలాంటి ఘటనలకు తల్లిదండ్రులదే బాధ్యత అని, సంతానంపై వారికి నియంత్రణ లేకపోవడమే ఇందుకు కారణమని వ్యాఖ్యానించింది. ఏడాదిన్నరగా కస్టడీలో ఉన్న నిందితులు అమర్ సతీశ్ గైక్వాడ్, ఆదిత్య అవినాశ్ సూద్, ఆశిష్ సతీశ్ మిట్టల్‌కు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం సోమవారం బెయిల్ మంజూరు చేసింది. నిందితులు తమ పిల్లల రక్త నమూనాలకు బదులుగా ఇతరులవి ఇచ్చేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలున్నాయి. ''మైనర్ల తల్లిదండ్రులకు తమ పిల్లలపై అస్సలు నియంత్రణే లేదు. మత్తు పదార్థాల అలవాటు ఒక ఎత్తైతే, వారికి కారు తాళాలు ఇచ్చి, విలాసాల కోసం విచ్చలవిడిగా డబ్బులు ఇస్తున్నారు. ఇది ఏమాత్రం సరైంది కాదు'' అని ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది.

తప్పిన పెను ప్రమాదం

- లండన్–బెంగళూరు ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌లో ఆఫ్ అయిన ఇంధన స్విచ్
- వరుసగా రెండుసార్లు విఫలమైన లాకింగ్ వ్యవస్థ
- తనిఖీల సందర్భంగా బయటపడిన ఘోర వైఫల్యం
- విమానంలో 200 మంది ప్రయాణికులు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం గాల్లోకి ఎగిరిన కొన్ని సెకన్లకే కుప్పకూలిన ఘోర ప్రమాదఘటనను మర్చిపోకముందే దాదాపు అలాంటి మరో ఘోర ప్రమాదం అదృష్టవశాత్తు తప్పిపోయింది. విమానంలోని ఇంధన నియంత్రణ స్విచ్ దానంతట అదే ఆన్ పొజిషన్ నుంచి కటాఫ్ పొజిషన్‌కు మారింది. ఇది విమానం ల్యాండయ్యాక జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అసలేం జరిగింది?

లండన్ హీత్రూ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆదివారం రాత్రి ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ (బోయింగ్ 787–8) విమానం 200 మందికి పైగా ప్రయాణికులతో బెంగళూరు బయల్దేరింది. సోమవారం ఉదయం 11.54 గంటలకు బెంగళూరు విమానాశ్రయంలో సురక్షితంగా దిగింది. ల్యాండయ్యాక సాధారణ తనిఖీల్లో భాగంగా విమానంలోని ఇంధన స్విచ్‌లను పైలట్లు సరి చూశారు. ఎడమవైపు స్విచ్‌ను 'రన్' పొజిషన్‌లోకి మార్చారు. ఫ్యూయల్ కంట్రోల్ లాకింగ్ సిస్టమ్ సరిగా ఉంటే స్విచ్ అలాగే ఉండాలి. కానీ అది హఠాత్తుగా పడిపోయి కటాఫ్ పొజిషన్‌లోకి మారింది. స్విచ్‌ను మళ్లీ 'రన్' పొజిషన్‌లోకి మార్చినా అది వెంటనే కటాఫ్‌లోకి పడిపోయింది. ఈ ఘోర వైఫల్యాన్ని పైలట్లు వెంటనే డీజీసీఏ దృష్టికి తీసుకెళ్లడం, వాళ్లు సాంకేతిక నిపుణులతో తనిఖీ చేయించడం చకచకా జరిగిపోయాయి. డ్రీమ్‌లైనర్ రకం విమానాలన్నింటినీ తనిఖీ చేశామని, ఎలాంటి స్విచ్ లోపాలూ కన్పించలేదని ఎయిరిండియా ఒక ప్రకటనలో పేర్కొంది. స్విచ్ లోపాలపై ఈ ఉపకరణాలను తయారుచేసిన ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మ్యాను ఫ్యాక్చరర్ (ఓఈఎం)కు సమాచారం ఇచ్చామని, వాళ్లు పైలట్ల నుంచి సమాచారం తీసుకున్నారని పేర్కొంది. ఘటనపై సమగ్రస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది.

బాలునికి మోమోల ఆశ చూపి...
రూ.85 లక్షల నగలు నొక్కేశారు

దేవరియా (యూపీ): పాపం పిల్లవాడు! మోమోలంటే మనవాడికి మహా ఇష్టం. ఆ ఇష్టాన్ని కాస్తా మోమో స్టాల్ నడిపే ముగ్గురు యువకులు భారీగా 'సొమ్ము' చేసుకున్నారు! బాలుని ఇంటినుంచి ఏకంగా రూ.85 లక్షల విలువైన నగలను అతనితోనే ఒక్కొక్కటిగా తెప్పించి మరీ కాజేశారు. ఉత్తరప్రదేశ్‌లో దేవరియాలోని దుగ్రీ చౌరస్తాలో ముగ్గురు యువకులు మోమో స్టాల్ నడుపుతు న్నారు. ఏడో తరగతి చదువుతున్న ఓ పిల్లవాడు మోమోల కోసం తరచూ స్టాల్‌కు వెళ్లేవాడు. బాలుని అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న యువకులు, స్నేహం పేరుతో కొంతకాలం పాటు అతన్ని మచ్చిక చేసుకున్నారు. ఇంటి నుంచి నగలు తెచ్చిస్తే కావాల్సినన్ని మోమోలు ఫ్రీగా ఇస్తామంటూ ఆశ చూపారు. దాంతో బాలుడు రోజుకొకటి చొప్పున నగలు తీసుకెళ్లి వారికిస్తూ వచ్చాడు. బాలుని అత్త అవసరం నిమిత్తం నగలు అడగడంతో విషయం బయటపడింది. అప్పటికే నిందితులు నగలతో ఉడాయించారు.

సీఈసీ భేటీ నుంచి మమత వాకౌట్

- ఈసీ అబద్దాల చెత్త వాగుతోంది
- బాధితులను, టీఎంసీ నేతలను దారుణంగా అవమానించారు
- వాకౌట్ తర్వాత మీడియా ఎదుట మమత సంచలన ఆరోపణలు
- ఎస్ఐఆర్‌పై న్యాయపోరాటం కొనసాగుతుందని ప్రకటన

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్వే పేరిట బెంగాలీలను వేధిస్తున్నారంటూ, వాళ్ల సమస్యలను ఏకరువు పెట్టేందుకు ఢిల్లీలో ఎన్నికల సంఘం ప్రధానకార్యాలయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌తో భేటీ అయిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ అర్ధంతరంగా సమావేశం నుంచి వాకౌట్ చేశారు. బాధితులు, టీఎంసీ నేతలను ఈసీ అధికారులు దారుణంగా అవమానించారని మమత సంచలన ఆరోపణలు చేశారు. హఠాత్తుగా సమావేశం మధ్యలోంచి బయటికొచ్చిన మమత, తోటి టీఎంసీ నేతలతో కలిసి కమిషన్ కార్యాలయం బయట మీడియాతో మాట్లాడారు. తొలుత ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓట్లు కోల్పోయిన, ఎస్ఐఆర్ పనిఒత్తిడితో బలవన్మరణాలకు పాల్పడిన బూత్ లెవల్ ఆఫీసర్ల కుటుంబాలకు చెందిన పలువురు బాధితులను ఢిల్లీలోని ప్రధాన ఎన్నికల కమిషన్ కార్యాలయానికి తన వెంట తీసుకెళ్లిన మమత బెనర్జీ సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో 90 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఈసీ వైఖరికి నిరసనగా మమత నలుపురంగు శాలువా ధరించి వచ్చారు. ఆమె వెంట టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, పార్టీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ తదితరులు వచ్చారు. ''నిజమైన ఓటర్లకు చెందిన లక్షలాది ఓట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ఇదేంటని అడిగితే మాతో తప్పుగా ప్రవర్తించారు. అబద్ధాలు వల్లెవేశారు. తప్పుడు నివేదికలు చూపించారు. చిన్న చిన్న కారణాలు సాకుగా చూపి ఎస్ఐఆర్ తుది జాబితా నుంచి మొత్తం 58 లక్షల పేర్లు తొలగించారు. తీసేస్తున్నామని కనీసం ముందస్తు సమాచారం ఇవ్వలేదు. ఈసీ అనేది బీజేపీకి ఐటీ విభాగంగా తయారైంది. దీనినే మీరు ప్రజాస్వామ్యం అంటారా?'' అని మమత ప్రశ్నించారు. ఎస్ఐఆర్‌పై న్యాయపోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.

బీఎల్ఓలపై తీవ్ర ఒత్తిడి..

''ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను పర్యవేక్షించే బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్ఓ)లపై మోదీ సర్కార్ తీవ్రమైన ఒత్తిడిచేసింది. ఎస్సీలు, మైనారిటీల ఓట్లను ఎలాంటి హేతుబద్ధత లేకుండా తొలగించారు. వీళ్లను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? వీళ్లు మనుషులు కాదా?'' అని నిలదీశారు.

అందుకే మధ్యలో బయటికొచ్చాం..

''సమావేశంలో ఈసీ అధికారులు అన్నీ అబద్ధాలే చెబుతున్నారు. అవి వినలేక బహిష్కరించి మధ్యలోనే మేం బయటికొచ్చేశాం. ఎన్నికల కమిషన్‌కు దురహంకారం చాలా ఎక్కువ. మాతో అమర్యాదగా ప్రవర్తించింది. మమ్మల్ని ఉద్దేశపూర్వకంగా అవమానించారు. సీఈసీ చెప్పేవన్నీ శుద్ధ అబద్ధాలు. న్యాయం కోసం వీళ్లదగ్గరికొస్తే అన్యాయమే స్వాగతం పలికింది. డూప్లికేట్ ఓట్లు ఉన్నందుకే ఎస్ఐఆర్ చేపట్టామని వాళ్లు చెప్పారు. ఈ విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈసీ పట్టించుకోలేదు. ఈసీ కార్యాలయం వద్ద మీడియాను అడ్డుకున్నారు. ఇలాంటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను నా జీవితంలో ఏనాడూ చూడలేదు'' అని మమత వ్యాఖ్యానించారు.

అంతా చట్టప్రకారమే : ఈసీ

టీఎంసీ చేసిన వాదనలతో ఈసీ విభేదించిందని భేటీ వివరాలను విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బీఎల్ఓలపై పని ఒత్తిడి, ఓట్లను తొలగించారని సాకుగా చూపి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే టీఎంసీ వర్గాలపై కఠినచర్యలు తప్పవని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ గట్టిగానే హెచ్చరించారని తెలుస్తోంది. భేటీలో సీఈసీనుద్దేశించి పలువురు టీఎంసీ ఎమ్మెల్యేలు పరుష పదజాలంతో మాట్లాడినట్లు తెలుస్తోంది. అక్కడే ఉన్న ఈసీ ఉన్నతాధికారులతోనూ బెదిరింపు ధోరణిలో టీఎంసీ నేతలు వ్యవహరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బీఎల్ఓల గౌరవ వేతన అంశంపై ఈసీ సానుకూలంగా స్పందించింది. సమయానికి నిధులను మంజూరుచేస్తామని ఈసీ హామీ ఇచ్చింది. సబ్–డివిజినల్ మేజిస్ట్రేట్/ తహసీల్దార్‌ల స్థాయిలో ఎస్ఐఆర్ కోసం బెంగాల్ సర్కార్ నియమించిన ఈఆర్ఓ/అసిస్టెంట్ ఈఆర్ఓలు పనిచేయట్లేదని ఈసీ ఆక్షేపించింది. తమ ఎదుట ప్రస్తావించిన అంశాలపై ఈసీ తరఫున సీఈసీ జ్ఞానేశ్, ఇతర కమిషనర్లు ఎస్ఎస్ సంధూ, వివేక్ జోషిలు వివరణ ఇచ్చేలోపే టీఎంసీ నేతలు బయటకు వెళ్లిపోయారని ఈసీ అధికారులు తర్వాత చెప్పారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిల్వ 54.90 టీఎంసీలు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3400, గరిష్ట ధర రూ.4800, మోడల్ ధర రూ.4200 వరకు పలికింది.

దత్తపీఠంలో చండీహోమం

ఫిరంగిపురం:అమీనాబాద్ గ్రామంలోని దత్తపీఠంలో సోమవారం విశేష పూజలు, మహాచండీ హోమం నిర్వహించారు. నిర్వాహకులు జయశంకర్ తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

అర్ధాకలి చదువులు

- టెన్త్ పబ్లిక్ పరీక్షలకు నెలన్నరే వ్యవధి
- అల్పాహారానికి నోచుకోని విద్యార్థులు
- నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంతో నూరు రోజుల ప్రణాళిక
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా తరగతులు
- గుంటూరు మినహా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కడుపు మాడ్చుకుని చదువుతున్న విద్యార్థులు

టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

గుంటూరుఎడ్యుకేషన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అల్పాహారం కరువైంది. మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏకధాటిగా నిర్వహిస్తున్న రెగ్యులర్, అదనపు తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనంతో సరిపెట్టుకుని, సాయంత్రం అదనపు తరగతులు ముగిసే వరకు ఖాళీ కడుపులతో చదువుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 32,276 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

- గుంటూరు జిల్లాలో కలెక్టర్ ఆదేశాలతో గత నెల నుంచి అల్పాహార పంపిణీ ప్రారంభించారు. అయితే పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఇంకా ప్రారంభించలేదు. జెడ్పీ నుంచి నిధులు విడుదల చేసిన తరువాతే అల్పాహార పంపిణీ చేసేందుకు విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. ఈ విధంగా పల్నాడు జిల్లాలో 16,020, బాపట్ల జిల్లాలో 4,965 మంది విద్యార్థులు అల్పాహారం కోసం ఎదురు చూస్తున్నారు.

ఉదయం ఏడు గంటలకే పాఠశాలలకు పయనం

పట్టణ, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు దూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలకోర్చి ఉదయం 7 గంటలకే వస్తున్న విద్యార్థులు సాయంత్రం వరకు చదువులో నిమగ్నమై ఉంటున్నారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ఎస్సీఈఆర్టీ ద్వారా నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించిన ప్రభుత్వం పాఠశాలల్లో నిర్బంధంగా అమలు చేస్తోంది.

- గత ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు నిధులు కేటాయించిన జిల్లా పరిషత్, పరీక్షలకు కేవలం నెల రోజులు ముందు దానిని అమలు పర్చింది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా డిసెంబర్ మొదలు జనవరి, ఫిబ్రవరి నెలల్లో అదనపు తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్షలకు ముందుగా అదీ కేవలం నెల రోజుల పాటు అల్పాహారాన్ని అందించడం వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించ లేదు. విద్యార్థికి రూ.7.50 చొప్పున కేటాయించిన నిధులు వారి కడుపు నింపేందుకు ఉపయోగపడలేదు.
- ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 16 నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిపాదనలు సిద్ధం కాలేదు. ప్రతి పాఠశాల నుంచి నూరు శాతం ఉత్తీర్ణత పేరుతో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అంటూ హడావుడి చేస్తున్న విద్యాశాఖాధికారులు విద్యార్థులకు అల్పాహారాన్ని అందించే విషయమై కనీస ఆలోచన చేయడం లేదు. అర్ధాకలితో తరగతులకు హాజరు కావడం, హాజరైనా బోధనపై ఎంత వరకు దృష్టి కేంద్రీకరించగలరనే అంశాలను క్షేత్రస్థాయిలో విస్మరిస్తున్నారు. మరోవైపు నూరు శాతం ఉత్తీర్ణత అంటూ అధికారుల హెచ్చరికలు, ఆకస్మిక తనిఖీలతో ఉపాధ్యాయులు బెంబేలెత్తుతున్నారు.

బాధితుల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది పెండింగ్‌లో ఉన్న అర్జీలపై పూర్తి స్థాయి సమాచారమందించాలన్నారు. నిర్లక్ష్యంతో అర్జీలను పెండింగ్‌లో ఉంచిన వారిని గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసేవారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అర్జీదారులపట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు.

- రెవెన్యూ క్లినిక్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 243 వినతులు అందగా, రెవెన్యూ క్లినిక్‌కు 152 వినతులు. మొత్తం 395 అర్జీలను కలెక్టర్, జేసీ, డీఆర్వో షేక్ ఖాజావలి, శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి జిల్లా అధికారులు పరిశీలించారు.

నిర్మల స్కూల్ ఆగడాలను అరికట్టండి

ఆత్మకూరులోని నిర్మల స్కూల్లో మా పిల్లలు 2024-25 సీబీఎస్ఈ 10వ తరగతి ఉత్తీర్ణత సాధించారు. సీబీఎస్ఈ బోర్డు గత ఏడాది జూన్‌లో ఉత్తీర్ణతకు సంబంధించిన సర్టిఫికెట్లు పంపారు. స్కూల్ యాజమాన్యం వాటిని పోగొట్టింది. 10వ తరగతి ఒరిజినల్ మార్కుల మెమోలను అడుగుతుంటే పొంతనలేని సమాధానం చెబుతూ బెదిరిస్తున్నారు. మాకు న్యాయం చేయండి.

– బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు, ఆత్మకూరు.

వృద్ధాప్య పింఛన్ ఇప్పించండయ్యా...



నేను వృద్ధాప్య పింఛన్ కోసం ఏడాది నుంచి అర్జీలు పెడుతూనే ఉన్నాను. చూద్దాం, చేద్దాం అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నాను. పింఛన్ వస్తే ఈ వయస్సులో కొన్ని ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి. మొర ఆలకించి ఇబ్బంది పెట్టకుండా పింఛన్ మంజూరు చేస్తారని కోరుకుంటున్నాను.

– తమడ రాజారావు, గుంటూరు

న్యూస్‌రీల్

ఏపీ ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఏపీయూఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం గుంటూరు పట్టాభిపురం హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర మహిళా కన్వీనర్ పమిడి పద్మ మాట్లాడుతూ 1982లో ఆవిర్భవించిన ఏపీయూఎస్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విశేష కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మన్నవ సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, బాలచంద్రారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి వైఆర్‌కే ప్రసాద్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వీరబాబు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో సోమవారం హుండీ కానులు లెక్కించారు. రూ.18,83,646 ఆదాయం వచ్చినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టరు సి.హెచ్. వెంకట శ్రీనివాసులు, దేవాలయ ధర్మకర్త డి.రంగప్రసాద్, దేవస్థాన సిబ్బంది, అర్చక స్వాములు, స్వచ్ఛంద సేవా సంస్థలు, భక్తుల సమక్షంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.సునీల్ కుమార్ తెలిపారు.

కొండ గురునాథ స్వామికి హుండీ కానుకల ద్వారా ఆదాయం

నూజండ్ల: కొండ గురునాథస్వామి తిరునాళ్ళ అత్యంత వైభవంగా సాగింది. లక్ష మంది పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని అంచనా. ఈ మేరకు సోమవారం దేవదాయశాఖ, ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీ ద్వారా వచ్చిన విరాళాలు, కొబ్బరికాయ వేలం ద్వారా వచ్చిన రాబడిని లెక్కించారు. హుండీ ద్వారా 5 లక్షల 64 వేల రూపాయలు, కొబ్బరి చిప్పలు తలనీలాల వేలంపాట ద్వారా 2 లక్షల 50 వేల రూపాయలు ఆదాయం లభించినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మంజూష, ఈవో శివనాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నెమలిరెడ్డి, లక్ష్మయ్య, సుబ్బారెడ్డి, ఎ.వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు గుంటూరు భక్తుని విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు భక్తులు సోమవారం విరాళాలు అందజేశారు. గుంటూరు జిల్లా స్తంభాలగరువుకు చెందిన బండ్రెడ్డి దుర్గా పవన్ కుటుంబం అమ్మవారి ఉచిత ప్రసాద వితరణకు రూ.1,00,001 విరాళాన్ని ఆలయ ఏఈవో వెంకటరెడ్డికి అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 542.80 అడుగులకు చేరింది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,023, ఎడమ కాలువకు 7,852, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 18,375 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

రేపటి నుంచి మెడ్‌ఫ్యూజన్

- గుంటూరు వైద్య కళాశాలలో మెడికల్ ఎగ్జిబిషన్ ప్రారంభం
- 30 ఏళ్ల తరువాత తిరిగి ఏర్పాటు
- మానవ శరీర అవయవాలు ప్రత్యక్షంగా చూడవచ్చు
- ఆపరేషన్లు సైతం నేరుగా వీక్షించవచ్చు

గుంటూరు మెడికల్ కాలేజ్

గుంటూరు మెడికల్: మీ పిల్లలు డాక్టర్లు కావాలని కోరుకుంటున్నారా..

- గర్భిణీ ఒక బిడ్డకు జన్మనిచ్చేందుకు ఎంత కష్ట పడుతుందో, బిడ్డను భూమిపైకి తెచ్చి ఊపిరి పోసేందుకు వైద్యులు ఎంత కష్టపడతారో నేరుగా చూడాలనుకుంటున్నారా....
- గుప్పెడంత గుండె ఏ రంగులో ఉంటుంది. లబ్‌డబ్ అంటూ ఎలా కొట్టుకుంటుంది. గుండెకు చికిత్స ఎలా అందిస్తారు.
- ఆపరేషన్ థియేటర్‌లో మత్తు ఎలా ఇస్తారు. రోగికి నొప్పి లేకుండా వైద్యులు ఆపరేషన్ ఎలా చేస్తారనే ఆసక్తికర విషయాలను నేరుగా కళ్లతో చూడాలనుకుంటే..

గుంటూరు వైద్య కళాశాలకు రండి. ఆస్పత్రుల్లో ఉండే మర్మమైన, ఎన్నో గమ్మత్తైన విషయాలు, ఎప్పుడు కళ్లతో నేరుగా చూడలేని చికిత్సలు చూసే అత్యంత అద్భుతమైన అవకాశం వచ్చింది. అది గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రతి ఒక్కరు వైద్య రంగంలోని ఆసక్తికర విషయాలను ప్రత్యక్షంగా చూడొచ్చు. గుంటూరు వైద్య కళాశాలలో బుధవారం నుంచి మెడ్‌ఫ్యూజన్ పేరుతో మెడికల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇది మూడు వారాలపాటు కొనసాగనుంది.

ఎగ్జిబిషన్ ప్రత్యేకతలు...

గుంటూరు వైద్య కళాశాలలో 30 ఏళ్ల క్రితం మెడికల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి ఆధ్వర్యంలో బుధవారం ఎగ్జిబిషన్ ప్రారంభం కానుంది. 40 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం గుంటూరు వైద్య కళాశాల కాలేజీ డెవలప్‌మెంట్ సొసైటీ ఫండ్‌ను రూ.కోటిన్నర మేర ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ఎగ్జిబిషన్ వీక్షించేందుకు 2,500 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. సుమారు లక్షన్నర మంది వీక్షిస్తారని నిర్వాహకులు అభిప్రాయ పడుతున్నారు.

శరీరభాగాలు నేరుగా చూడొచ్చు....

ప్రతి అవయవాన్ని నేరుగా చూడొచ్చు. అస్థి పంజరం చూడొచ్చు. వ్యాధులు శరీరానికి ఏ విధంగా సోకుతాయి. అవయవాలు ఏ విధంగా పాడవుతాయి. వ్యాధులను ఏ విధంగా గుర్తిస్తారు. వ్యాధులకు చికిత్సలు, ఆపరేషన్లు ఎలా చేస్తారు ఇలా నేరుగా చూసి కూలంకుషంగా తెలుసుకుని సందేహాలు పూర్తిగా నివృత్తి చేసుకోవచ్చు.

ప్రతి ఒక్కరు సందర్శించి తెలుసుకోండి....

గుంటూరు వైద్య కళాశాలలో ఈనెల 4న ఏర్పాటు చేస్తున్న మెడికల్ ఎగ్జిబిషన్‌ను ప్రతి ఒక్కరు సందర్శించి వైద్య రంగం గురించి తెలుసుకోండి. సుమారు 30 ఏళ్ల తరువాత ఏర్పాటు చేస్తున్న మెడికల్ ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్కరికి వైద్య రంగంపై అవగాహన కల్పించటమే. గతంలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్‌ల ద్వారా ఎంతో మంది ప్రేరణ పొంది వైద్య రంగంలోకి వచ్చి ఎంతో మంది ప్రాణాలు రక్షిస్తున్నారు. స్కూల్, కాలేజ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా మెడికల్ ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తే మంచి అనుభూతి పొందుతారు.

– డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, ప్రిన్సిపాల్, గుంటూరు వైద్యకళాశాల,

చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిని ఉపేక్షిస్తే ఎలా?

- జనసేన అధికార ప్రతినిధి రజని
- ఫ్లెక్సీ ఘటనపై నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు
- కర్రలు చేత్తో పట్టుకుని తిరిగిన వారిపై చర్యలేవి?
- కొత్త సాంప్రదాయానికి తెర లేపొద్దు

ఫిర్యాదు కాపీని చూపుతున్న రజిని

సాక్షి ప్రతినిధి, గుంటూరు : చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఉపేక్షించడం సరికాదని, కర్రలు చేత్తో పట్టుకుని తిరుగుతూ దాడులు చేసిన వారిపై చర్యలు లేకపోతే ఎలా అని జనసేన అధికార ప్రతినిధి, న్యాయవాది కన్నా రజనీ ప్రశ్నించారు. గోరంట్లలో ఫ్లెక్సీ వద్ద జరిగిన ఘటనపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె సోమవారం నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఒక ఫ్లెక్సీ ఇన్ని గొడవలకు దారితీస్తుందని చూడగానే అనుకున్నాను. అది రెచ్చగొట్టే ధోరణితో ఉంది. సిట్, సీబీఐ కేసు విచారణ చేస్తుండగా ఇతనే నేరగాడంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. రెచ్చగొట్టే ధోరణితోనే, కొట్టుకోవాలనే ధోరణితోనే ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారన్నారు. అది ఒక చోట కాకుండా, రాష్ట్రమంతా వేశారన్నారు. అది హేయమైన చర్య అంటూ వాళ్లు చింపేస్తారని మీకు తెలిసే, అప్పుడు తిరగబడాలని అనుకున్నారేమో తనకు తెలియదన్నారు. ఏది ఏమైనా కర్రలు పట్టుకునే సంప్రదాయం సాధారణ పౌరులకు లేదని, కర్రలు పట్టుకునే హక్కు కేవలం పోలీసులకే ఉందని అది కూడా చట్టాన్ని పరిరక్షించడానికే అని రజని పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కర్రలు పట్టుకుని నిల్చోవడం, పక్కనే పోలీసులు ఉండటం చాలా ఆశ్చర్యమనిపించిందన్నారు. వెంటనే పోలీసులు వారి చేతుల్లో కర్రలు తీసుకుని ఉండాల్సింది. కానీ తీసుకోలేదు. ఈ రోజు కూడా సీఐని ఇదే అడిగానన్నారు. కర్రలు పట్టుకుని వారు నిల్చుంటే మీరు ఎందుకు ఉపేక్షించారంటే, అంబటి రాంబాబు కారులో కర్రలు ఉన్నాయంట అని సీఐ చెబుతున్నారు. అందుకనే వీరు కూడా కర్రలు పట్టుకుని నిల్చున్నారని సమర్థిస్తున్నారు. అసలు లా అండ్ ఆర్డర్ వాళ్ల చేతుల్లోకి తీసుకోవడానికి ఏం అధికారం ఉంది. వాళ్లు కర్రలు పట్టుకుని ఉంటే, మీరు పక్కన చోద్యం చూస్తున్నారా? చట్ట వ్యతిరేకం కదా అంటూ నిలదీశారు. ఇలాంటి కొత్త సాంప్రదాయానికి తెరలేపవద్దు. ఒకరికొకరు కొట్టుకుని చంపుకునే సంప్రదాయం వద్దు. కూటమి సర్కార్‌ను కష్టపడి అందరం కలిసి ఏర్పాటు చేశాం.

అది రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని, ఆడబిడ్డలకు రక్షణ కల్పిస్తారని, ఫ్లెక్సీలకు కాపలా కాస్తారని కాదని రజని విమర్శించారు. ఫ్లెక్సీ మీద చెయ్యి వెయ్యి, చెయ్యి విరగదీస్తా. నువ్వు రారా చూసుకుందాం. నువ్వు మోగోడివైతే రారా.. అని ఒక గ్రంథాలయ చైర్మన్ అంటే ఆమెపై చర్యలు తీసుకోవాలని కదా అని ప్రశ్నించారు. కర్రలు పట్టుకుని వచ్చిన వారిని అక్కడి నుంచి అదుపులోకి తీసుకుని నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తీసుకు వచ్చి ఉండవచ్చు కానీ మీరు ఊరంతా తిప్పారని ఆరోపించారు. కర్రలు పట్టుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్తి నష్టం కలుగచేసిన ప్రతి ఒక్కరి మీద చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్లెక్సీలు తీయించేది మున్సిపల్ అధికారుల బాధ్యత అంటున్నారని, వారిని కూడా నిలదీస్తానని అన్నారు.

రూ.కోటి అంచనా వ్యయంతో కొండవీడు ఉత్సవాలు

సమీక్ష చేసిన పల్నాడు జిల్లా కలెక్టర్

అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్, జేసీ

నరసరావుపేట: కోటి రూపాయల అంచనాతో కొండవీడు ఉత్సవాలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఫిబ్రవరి 7, 8 తేదీల్లో నిర్వహించే ఉత్సవాలపై అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.75 లక్షలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. ఫిబ్రవరి ఐదో తేదీన చిలకలూరిపేట పట్టణంలో 2కె రన్ ద్వారా ఉత్సవాలకు సంబంధించిన తొలి అంకానికి అడుగు వేయనున్నామన్నారు. దాదాపు 10 వేల మంది విద్యార్థులకు 7, 8 తేదీల్లో కొండపై వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. హెలీరైడ్, ఫుడ్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవాలన్నారు. హెలీరైడ్‌కి ఒక వ్యక్తికి రూ.3,500 ధర నిర్ణయించారు. ఉత్సవాల కోసం ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, ఆర్డీఓ కె.మధులత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	91,998
అమ్మకాలు	88,864
నిల్వ	16,212

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–23,000
నంబరు-5	13,500–23,000
341	14,000–25,000
సూపర్-10	14,000–22,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–22,000
నంబరు-5	13,500–21,500
341	13,000–23,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 20,000
బాడిగ-355	14,000 – 24,500
దేవనూరు డీలక్స్	15,000 – 26,000
ఆర్మూర్	12,000 – 17,500
తాలుకాయలు	8,000 – 12,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000–19,000
బాడిగ – 355	13,500–23,500
దేవనూరు డీలక్స్	15,000 – 25,000
తాలు	8,000 – 11,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 278

కొమ్ములు : 256 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
13,200	13,800	13,200

కాయలు : 22 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
13,500	13,500	13,500

మొత్తం అమ్మకాలు : 208.50 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ముగిసిన విజ్ఞాన్ బాల మహోత్సవ్

వివిధ అంశాల్లో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ

- ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ
- మహోత్సవ్ విజేతలకు ట్రోఫీలు, రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేత

చేబ్రోలు: చిన్న వయసులోనే లక్ష్యాన్ని నిర్ణయించుకుని, క్రమశిక్షణతో శ్రమిస్తే ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ (ఐఆర్ఎంఎస్) అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి రెండో ఎడిషన్ 'విజ్ఞాన్ బాల మహోత్సవ్–2కే26' వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. బాల మహోత్సవ్ గెజిట్ పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.5 లక్షల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

■ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లవరపు సూర్యతేజ మాట్లాడుతూ తాను చిన్నతనంలోనే ఐఏఎస్ కావాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకున్నానని, అప్పటి నుంచి ఆ దిశగా నిరంతరంగా కృషి చేశానని, లక్ష్యం స్పష్టంగా ఉంటే మార్గం కూడా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ కేవీ క్రిష్ణకిశోర్ మాట్లాడుతూ చదువు క్రీడలను సమతుల్యంగా కొనసాగించడమే సంపూర్ణ అభివృద్ధికి మార్గమని సూచించారు.

బాల మహోత్సవ్ 2కే26 విజేతలు వీరే...

రాష్ట్రస్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా మొత్తం 50 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు.

■ అండర్–17 మహిళల విభాగం వాలీబాల్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలను పెదకూరపాడు జీఆర్‌సీ ఆర్‌కే హైస్కూల్, కేవీఎస్‌ఏపీ పీఎం శ్రీ స్కూల్‌లు సాధించాయి.

■ కబడ్డీలో బాపట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పిడుగురాళ్ల తిరుమల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలు, చెస్‌లో మొదటి రెండు స్థానాలను బోయనపల్లి కుందన, సీహెచ్ దివ్యలు సాధించారు.

■ అండర్–17 బాలుర విభాగంలో బాస్కెట్‌బాల్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్, శేకూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు నిలిచాయి.

■ కబడ్డీలో బాపట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పిడుగురాళ్ల తిరుమల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలు విజేతలుగా నిలిచాయి.

■ 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్‌కే మక్బుల్ హుస్సేన్, పి.మనోజ్, 800 మీటర్ల పరుగు పందెంలో ఎస్‌కే మక్బుల్ హుస్సేన్, బీ.నాగ మణికంఠలు, 4 ఇంటు 100 మీటర్ల రిలేలో ఏఆర్ఎస్ఆర్ఎం హైస్కూల్ జట్టు, ఏపీఆర్ఎస్ స్కూల్, రాజంపేట జట్టు విజేతలుగా నిలిచారు.

■ లాంగ్‌జంప్‌లో పి.ప్రదీప్ కుమార్, పి.దేవకుమార్‌లు, షాట్‌పుట్‌లో బి.అశ్విన్, ఎం. నాగ అజయ్‌లు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐ మోడల్‌తో సుస్థిర అభివృద్ధికి బలమైన పునాది

మాట్లాడుతున్న లీనా మార్లే జోసెఫిన్ రోజ్బా

చేబ్రోలు: భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ ఖర్చుతో, స్వదేశీ అవసరాలకు అనుగుణంగా రూపొందించే ఓపెన్ సోర్స్, లో రిసోర్స్ ఏఐ మోడల్స్ భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధికి బలమైన పునాదిగా మారతాయని స్విస్‌నెక్స్ ఇన్ ఇండియా కంపెనీ అకడమిక్ ఎంగేజ్‌మెంట్ హెడ్ లీనా మార్లే జోసెఫిన్ రోజ్బా అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'కాన్ఫరెన్స్ ఆన్ రెస్పాన్సిబుల్ అండ్ సస్టెయినబుల్ ఏఐ' అనే అంశంపై సోమవారం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును 'బిల్డింగ్ బెటర్ విత్ ఏఐ : సస్టెయినబిలిటీ యాస్ ఎ బ్లూ ప్రింట్ ఫర్ ఇండియా' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్విస్‌నెక్స్ ఇన్ ఇండియా కంపెనీ అకడమిక్ ఎంగేజ్‌మెంట్ హెడ్ లీనా మార్లే జోసెఫిన్ రోజ్బా మాట్లాడుతూ.. తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతో రూపొందించే ఏఐ మోడల్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల వెనుకబడిన ప్రాంతాలకు కూడా ఆధునిక సాంకేతిక సేవలను అందించవచ్చని వివరించారు. ముందస్తు గుర్తింపు, జీనోమ్ విశ్లేషణ, వ్యక్తిగత వైద్య సేవల రూపకల్పనలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. బెంగళూరులోని సీఎంఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తస్నీర్ హసన్, అమృత విశ్వ విద్యాపీఠం ప్రొఫెసర్ శ్రీరామ్ దేవనాథన్, ఐఐటీ మద్రాస్ సీతలఆర్ఐఏ ఏఐ పాలసీ హెడ్ డాక్టర్ గీతా రాజు, ఐబీటీ – ఏఐసీఈ ప్రాజెక్ట్ సైంటిస్ట్ కె.రుత్విక్, డిజిటల్ ఫ్యూచర్ ల్యాబ్స్ రీసెర్చ్ మేనేజర్ హర్షిత్ కౌర్, టెడ్‌ఎక్స్ స్పీకర్ ఎమినెంట్ ఇంజినీర్, ఫోర్బ్స్ 200 డిజిఈఎంఎస్, మాజీ ఏసీఎం ఇండియా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ పద్మనాభుని మాట్లాడుతూ ఐటీ టెక్నాలజీ రంగంలో కొత్తదనాలు ఆవిష్కరణలు వ్యాధుల వర్సిటీ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిశోర్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6న సత్తెనపల్లిలో మెగా జాబ్ మేళా

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని ప్రధాన రహదారిలో గల విద్యా కేంద్రం డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో ఈనెల 6న ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్‌మేళా జరుగుతుందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 30 ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ (ఏదైనా ట్రేడ్/ డిప్లమా ఏదైనా శాఖ) ఏదైనా డిగ్రీ, బీటెక్, బీ.ఫార్మసీ, ఎంబీఏ విద్య నభ్యసించి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగులు ఈ మెగా జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.

అసత్య ప్రచార ఫ్లెక్సీలు వేసిన వారిపై
చర్యలు తీసుకోవాలి

అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఏది పాపం.. ఏది నిజం అని తిరుపతి కల్తీ లడ్డూల విషయమై అసత్య ప్రచార ఫ్లెక్సీలు వేసి హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్న వారి పై తక్షణ కఠినమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. ఈమేరకు గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు సీఐ ఆరోగ్య రాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిమ్మకాయల విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి అసత్య ప్రచార ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామన్నారు. దీనిపై స్పందించిన అరండల్‌పేట సీఐ తప్పుడు ప్రచారం చేసేవిధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే, ఉపేక్షించమని తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పడం జరిగిందని తెలిపారు. కార్పొరేటర్ రోషన్ మాట్లాడుతూ ఫ్లెక్సీలు వేస్తుంది ఎవరు అనేదాని పై చర్యలు తీసుకోవాల్సింది పోయి దాన్ని పక్కదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, పఠాన సుభానీ, అచ్చాల వెంకటరెడ్డి, బూసి రాజలత, గురవయ్య, పార్టీ నాయకులు గేదెల రమేష్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు

కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం ఏర్పాటు చేసి వీడియో కాన్ఫరెన్స్‌కు గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో రైల్వే డీఆర్ఎం సుధేష్ణ సేన్, ఏడీఆర్ఎం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి కోసం 2026-27 సంవత్సరానికి కేటాయించిన నిధుల వివరాలను కేంద్ర మంత్రి వెల్లడించారు.

– లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్)

పంట కాలువలో మహిళ మృతదేహం లభ్యం

చీరాల: పంట కాలువలో మహిళ మృతదేహం సోమవారం చీరాలలో కలకలం రేగింది. పంట కాలువలో మహిళ మృతదేహం లభించడంతో స్థానికంగా భయాందోళనకు గురిచేసింది. చీరాల మండలం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో తోటవారిపాలెం 216 హైవే పక్కన కాలువలో మహిళ మృతదేహం తేలుతూ కనిపించింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు వయస్సు 25–30 మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మరణించి రెండు, మూడు రోజులు అయి ఉంటుందని, మృతురాలికి సంబంధించిన ఆధారాలేమీ లభించలేదన్నారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ ఎండీ మొయిన్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. హత్య, ఆత్మహత్య అనే కోణంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda
లక్ష్మీపురం బ్రాంచి
డోర్ నెం. 5-87-6, లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, గుంటూరు - 522007. ఏపీ.

అమ్మకానికి ముందు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం – 2002 (SARFAESI చట్టం – 2002) లోని రూల్ 8 (6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.
టు,
ఋణగ్రహీత : 1) శ్రీ బోడపాటి సీతారామయ్య, తండ్రి : శ్రీ బి. లక్ష్మయ్య, ఆర్/ఓ. డి.నెం. 2-11-14, జయంతి గురుకులం స్కూల్ దగ్గర, గురజాల మండలం, గుంటూరు జిల్లా – 522415. ఎ.పి., ఇక్కడ కూడా : ఫ్లాట్ నెం. 501, డి.నెం. 276, 4వ అంతస్తు, జయంతి టవర్, 5వ లైన్, జయంతి నగర్, పెదపలకలూరు గ్రామం, గుంటూరు జిల్లా – 522009. ఎపి., హామీదారు : మిస్. బోడపాటి సీతారామలక్ష్మి, తండ్రి : శ్రీ లక్ష్మయ్య, డి.నెం. 2–114, జయంతి గురుకులం స్కూల్ దగ్గర, గురజాల మండలం, గుంటూరు జిల్లా, ఎపి – 522415.
డియర్ సార్/మేడమ్,
సబ్జెక్ట్ : సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేసి చట్టం – 2002) లోని రూల్ 8 (6) క్రింద నోటీసు.
బ్యాంక్ ఆఫ్ బరోడా, లక్ష్మీపురం బ్రాంచి యొక్క అధీకృత అధికారి, ఆ చట్టంలోని యు/సెక్షన్ 13 (2) రూల్ 3తో చదవబడిన అధికారాలను వినియోగించుకుని, డి. 17-03-2025న డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఋణగ్రహీతలు / హామీదారులు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసు ప్రకారం మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా తెలియజేశారు. మరియు ఋణగ్రహీతలు / హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆ చట్టంలోని యు/సెక్షన్ 13 (4) మరియు నిబంధనలలోని రూల్ 4 మరియు / లేదా రూల్ 8 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, డి. 24-06-2025 నాటి స్వాధీన నోటీసులో పూర్తిగా వివరించిన విధంగా సెక్యూర్డ్ ఆస్తులను (ఇక్కడ పేర్కొన్న ఆస్తి / ఆస్తులుగా సూచిస్తారు) స్వాధీనం చేసుకున్నారు మరియు సర్ఫేసి చట్టం క్రింద పరిగణించబడిన నియామకాలలోని రూల్ 8 (1) మరియు రూల్ 8 (2) కి అనుగుణంగా, స్థానిక భాషలో మరియు ఆంగ్ల వార్తా పత్రికలలో సంబంధిత తేదీలలో స్వాధీన నోటీసును ప్రచురించారు.
ఋణగ్రహీత / హామీదారు యొక్క స్థిరాస్తుల స్వాధీనానికి అనుగుణంగా, సర్ఫేసి చట్టం2002, సెక్షన్ 13(4)(ఎ) క్రింద ఇవ్వబడిన అధికారాను వినియోగించుకుని, క్రింది సంతకం చేసిన వ్యక్తి ఈ ఆస్తులను అమ్మకం ద్వారా బ్యాంక్ బకాయిలను వసూలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు.
అందువల్ల, సబ్జెక్టు చట్టం మరియు దాని క్రింద రూపొందించిన నిబంధనల ప్రకారం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 (6) ప్రకారం సంబంధిత తేదీలలో పూర్తి బాధ్యతను విడుదల చేయడానికి 30 రోజుల నోటీసును విక్రయానికి ముందు జారీచేయబడినది.
మీ అందరికి ఈ నోటీసు తేది నుండి 30 దినములలోగా దిగువ తెలిపిన పూర్తి బకాయి మొత్తమును ప్లస్ తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి, బ్యాంక్ స్వాధీనంలో నున్న దిగువ చెప్పబడిన ఆస్తిని విడిపించుకోవలసినదిగా చిట్టచివరి అవకాశం ఇవ్వబడినది. అట్లు చేయుటలో విఫలమైనచో, "ఎక్కడ ఏది ఉన్నదో అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" పద్ధతి ద్వారా నిబంధనలలో పేర్కొన్న రూల్ 8(5) క్రింది పద్ధతుల్లో దేనినైనా అనుసరించడం ద్వారా ఆస్తులు విక్రయించబడతాయి. :
(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులతో లావాదేవీలు చేస్తున్న వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట ద్వారా లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా
(సి) ఇ-వేలం పద్ధతి ద్వారాతో పాటు బహిరంగా వేలం నిర్వహించుట ద్వారా లేదా
(డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా.

స్థిరాస్తుల వివరణ

గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ డిస్ట్రిక్, మునుపటి అడవితక్కెళ్లపాడు గ్రామ పంచాయితీ ఏరియా లోనిది, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, 5వ లైన్, జయంతి నగర్, పెదపలకలూరు గ్రామం, డి.నెం. 276 వద్ద 522 1/2 చ॥గ॥లు (సమీప డోర్ నెం. 9-211/సి) విస్తీర్ణంలోని గల ఆర్‌సిసి రెసిడెన్షియల్ ఆస్తి. హద్దులు : తూర్పు : రావిపాటి మోహన్‌దాస్ గారికి చెందిన ఆస్తి – 56 అ॥, పడమర : ఇతరులకు చెందిన ఆస్తి – 56 అ॥, ఉత్తరం : వంగల చంద్రారెడ్డి, కావూరి నారాయణ రావు గార్లకు చెందిన ఆస్తి – 84 అ॥, దక్షిణం : 30 అ॥ వెడల్పు రోడ్డు – 84 అ॥. పై సరిహద్దుల మధ్య 522 1/2 చ॥గ॥లు లేదా 436.86 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస భూమి.
షెడ్యూల్-బి : పైన వివరించిన షెడ్యూల్-ఎ భూమి నందు మొత్తం 522 1/2 చ॥గ॥లు లేదా 436.86 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము నందు అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 52.25 చ॥గ॥లు లేదా 43.68 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలము తోపాటు అందలి నిర్మించిన జయంతి టవర్స్ నందు 1520 చ॥అ॥ల ప్లింత్ ఏరియా (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో కలిపి) విస్తీర్ణంతో నాల్గవ అంతస్తు (పడమర వైపున) నందు ఫ్లాట్ నెం. 501కి చెందిన ఒక రెసిడెన్షియల్ ఫ్లాట్. హద్దులు : తూర్పు : లిఫ్ట్ మరియు కారిడార్ మరియు మెట్లు, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై. వీటితోపాటు ఆస్తికి చెందిన అన్ని సౌకర్యాలతో పాటు, స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కార్ పార్కింగ్ ఏరియా కేటాయింపుతో సహా, సౌలభ్యాలు, ఉపకరణాలు మొదలైన వాటి హక్కులతో సహా దాని సాధారణ మరియు ఉమ్మడి హక్కులతో పాటు.

సౌకర్యాల వివరాలు	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనత నోటీసు తేది	స్వాధీనత నోటీసు ప్రచురించిన తేది
బరోడా హోమ్ లోన్ టు ఎస్ఆర్‌వి రూ. 47,00,000/- అకౌంట్ నెం. 35000600001044	17-03-2025	26-06-2025	24-06-2025
	తేది: 11-03-2025 నాటికి చెల్లించాల్సిన బకాయి మొత్తం డి. 11-03-2025 నాటికి రూ. 44,03,702.43/- (అక్షరాలా నలభై నాలుగు లక్షల మూడు వేల ఏడు వందల రెండు రూపాయల నలభై మూడు పైసలు మాత్రమే) + డి. 12-03-2025 నుండి చెల్లించని వడ్డీ మరియు ఇతర ఖర్చులు అమలు తేదీ వరకు ఏదైనా ఉంటే		

చట్టం నందు / అమలులోనున్న ఏదైనా ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.
తేది : 28-01-2026 ప్రదేశం : గుంటూరు
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి బ్యాంక్ ఆఫ్ బరోడా, గుంటూరు

పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- 170 ఫిర్యాదులు స్వీకరణ

అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ మేరకు బాధితుల నుంచి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలను ఆయన ఆలకించారు. సంబంధిత సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ మొబైల్‌ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్‌స్టేషన్ అధికారి పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు పరిష్కరించాక బాధితులకు తెలియజేయాలని చెప్పారు. ఫిర్యాదిదారుల అనుమతుల్లేకుండా ఏ ఫిర్యాదు ఆన్‌లైన్‌లో మూసివేయద్దని సూచించారు. 170 ఫిర్యాదులు స్వీకరించామని తెలిపారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి, డీఎస్పీలు అబ్దుల్‌అజీజ్ (గుంటూరు తూర్పు), శ్రీనివాస్‌రెడ్డి (మహిళా పీఎస్), బెల్లం శ్రీనివాసరావు (ట్రాఫిక్)లు ఫిర్యాదులు స్వీకరించారు.

మా సంస్థ పేరును ఇతరులు వాడుతున్నారు

గుంటూరులో 1960లో శాంతి ఆర్ట్స్ పేరుతో ప్రింటింగ్ యూనిట్‌ను మా తండ్రి పీఎం జైన్ ప్రారంభించారు. వందలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించాం. 1987లో రెడ్డిపాలెంలో సొంత ఫ్యాక్టరీ నెలకొల్పాం. అనేక ఉత్తమ జాతీయ, అంతర్జాతీయ అవార్డులను స్వీకరించాం. కొన్ని పరిస్థితుల దృష్ట్యా విక్రయించాం. అయితే యాజమాని మళ్లీ మాకే అద్దెకిచ్చారు. 2017 వరకు అక్కడే వ్యాపారం నిర్విర్తించాం. ఆ తర్వాత ఓబులునాయుడుపాలెంకు వెళ్లాం. దీంతో రెడ్డిపాలెంలోని గొడౌన్‌ను వేరే వారికి అద్దెకిచ్చారు. అయితే వారు మా సంస్థ పేరుతో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. న్యాయం చేయగలరు.

– విక్రమ్ జైన్, అరండల్‌పేట

నా మనవడు తల్లితో కలిసి ఉండేలా చూడండి..

సుమారు 14 ఏళ్ల క్రితం మా పెద్దమ్మాయికి పెళ్లయింది. ఏడాది లోపు అనారోగ్యంతో అల్లుడు మృతిచెందాడు. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. అయితే గతేడాది ప్రైవేటు ఉద్యోగం నిమిత్తం నా కుమార్తె ఊరెళ్లింది. దీంతో మనవడు నా వద్దనే ఉంటున్నాడు. ఉద్యోగం నిమిత్తం వెళ్లిపోయిన కుమార్తె ఊర్లోనే ఉంటుందని తెలిసి, మనవడితో కలిసి అక్కడికెళ్లాం. అయితే ఆమె ఓ పెద్దాయన్ని పెళ్లి చేసుకుందని గుర్తించాం. ప్రస్తుతం మనవడు పెదనందిపాడులో చదుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల నా మనవడు వాళ్ల అమ్మ వద్దకెళ్లినా పట్టించుకోలేదు. ప్రతి రోజు తల్లి కావాలని అడుగుతున్నాడు. వాడిని ఏమని సముదాయించను.. పోలీసులు జోక్యం చేసుకుని, నా మనవడు తల్లితో కలిసి ఉండేలా ఏర్పాటు చేయగలరు.

– వృద్ధురాలు, వరగాని, పెదనందిపాడు

మద్యం తాగి వ్యక్తి మృతి

కొల్లూరు: మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొల్లూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా ఆవులవారిపాలేనికి చెందిన సనక రామకృష్ణ(40) కుటుంబం కొన్నేళ్ల క్రితం కొల్లూరు బోస్‌నగర్ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్థిర పడింది. ఇటుకరాయి లోడింగ్ వంటి కూలి పనులు చేస్తున్న రామకృష్ణకు మద్యపానం అలవాటుంది. ఆదివారం కొల్లూరు లాక్ సెంటర్ ప్రాంతంలో మద్యం తాగి వినాయకుడి ఆలయం పక్క వీధిలోని సిమెంట్ రోడ్డుపై మత్తులో పడుకున్నాడు. గమనించిన స్థానికులు పక్కనే ఉన్న అరుగుపై పడుకోపెట్టారు. సోమవారం ఉదయం అతడిని లేపాలని ప్రయత్నించగా పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృతుడి తల్లి, భార్య మృతదేహాన్ని ట్రాలీ ఆటోలో తమ గృహానికి తరలించారు. ఇటీవల ఇటుక బట్టీలలో పనిచేసేందుకు వచ్చిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వలసకూలీ మద్యం తాగి అపస్మారక స్థితిలో వంతెన పై నుంచి పడి మృతి చెందడం, తాజాగా సనక రామకృష్ణ మృతితో మందుబాబులలో ఆందోళన నెలకొంది.

మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

ముగిసిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు

- హోరాహోరీగా సీనియర్ విభాగం పోటీలు
- ప్రథమస్థానంలో నిలిచిన బాపట్ల జిల్లా వేటపాలెం గిత్తలు



మొదటి బహుమతి బుల్లెట్‌ను సొంతం చేసుకున్న ఎడ్ల యజమానులు

పిడుగురాళ్ల: మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి కల్యాణం, తిరునాళ్లను పురస్కరించుకొని గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఆదివారం రాత్రి సీనియర్ ఎడ్ల బల ప్రదర్శనతో ముగిసింది. సీనియర్ సైజు ఎడ్ల జత బండలాగుడు ప్రదర్శన పోటీలు వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

■ సీనియర్ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిలకు చెందిన ఆర్‌కే బుల్స్ ఎడ్లజత 3210 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బండిని మోర్జంపాడుకు చెందిన రెడ్డిగారి అబ్బాయిలు విజేతలకు బహూకరించారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ పాపలపాడు గ్రామానికి చెందిన నందతేజ డైరీఫాం విపర్ల చిన్న వెంకటేశ్వర్లకు చెందిన ఎడ్ల జత 2780 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానం సాధించాయి. ఎడ్ల యజమానులకు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అంజిరెడ్డి హాస్పటల్స్ వారు హెచ్‌ఎఫ్ డీలెక్స్ ద్విచక్ర వాహనాన్ని అందించారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండకాటూరు గ్రామానికి చెందిన పోతిన రక్షిత్‌చౌదరికి చెందిన కేకే బుల్స్ ఎడ్ల జత 2400 అడుగుల దూరం లాగి మూడవ బహుమతి సాధించాయి. మూడవ బహుమతిగా రూ. 60 వేల నగదును బోగిరెడ్డి రమణారెడ్డి, రామలింగారెడ్డి, బాదం శివారెడ్డిలు అందించారు.

■ గుంటూరుకు చెందిన సోమిశెట్టి వెంకాయమ్మ, పి.పేరయ్య, సోమిశెట్టి ఆంజనేయులకు చెందిన ఎడ్లజత 2337.6 అడుగుల దూరం లాగి 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు రూ. 40 వేల నగదును బాదం వెంకట ప్రసాద్‌రెడ్డి, మేడగం గంగాధర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, కాశిరెడ్డి, మేడగం శివారెడ్డి, డాక్టర్ మేడగం లక్ష్మీనారాయణరెడ్డిలు అందజేశారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండవారిపాలెం గ్రామానికి చెందిన పెద్ది మురళీకృష్ణకు చెందిన ఎడ్లజత 2305.6 అడుగుల దూరం లాగి 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు. కొనబడును సంప్ర॥ ✆ 87907 41166

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు.తీసుకుంటాం ✆ 83338 33368

WANTED

■ గుంటూరులో ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు వైద్య పరిజ్ఞానము గల కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఫోన్ : 99083 38379

■ గుంటూరు సిటిలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, హౌస్ వైఫ్స్, 10th పాస్, 50సం॥ వయస్సు వారు కావలెను. 7036761665

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు SR Construction Site Inchargesగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35,000/- నుండి 45,000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు : 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించ గలరు. ఫోన్ నెంబర్ : 8978480429

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్ వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు : 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించ గలరు. ఫోన్ నెంబర్ : 8978480435

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పని చేయుటకు సేల్స్ అడ్వైజర్ కావలెను. అర్హత 10th ఆపైన, వయస్సు 18 సం॥ఆపైన. Cont: 89788 55399

■ సిటీ జంబో జిరాక్స్ 8/1 అరండల్‌పేట గుంటూరు నందు జిరాక్స్ తీయుటకు యువకులు మరియు కంప్యూటర్ ఆపరేటర్స్ గుంటూరు లోకల్ వారు మాత్రమే సంప్ర॥ 9441065559

■ మా సంస్థ నందు పనిచేయుటకు టెలీ కాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లేడీస్ కావలెను. 10th పాస్/ ఫెయిల్ to PG ఫోన్: 7386485962, 7330711162

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18–28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్ 9640729906

■ Vishal Singh Bais Security Agency Required Ex-servicemen Gunmen with Gun and License to work at PGCIL Chilakaluripeta on DGR Minimum Wages C city, Interested persons Cont : 9246812289, 9246812250

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు, కావలెను. జీ: 16,000 to 24,000, రూం+మీల్స్ ఫ్రీ. Ph: 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు 7075167663 7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని ఉచితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేసేముందు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

తాగునీటి వృథాకు చెక్

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి ప్రభుత్వ పాఠశాల వద్ద తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై 'తాగు నీరు రోడ్డుపాలు!' శీర్షికన సాక్షిలో సోమవారం కథనం వెలువడింది. స్పందించిన ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా తాగునీటి సరఫరా సిబ్బందితో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయించారు. తాగునీరు వృథా కాకుండా మరమ్మతులు చేసినందుకు అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా భావనారుషి కల్యాణం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పద్మశాలీ బజారులో వేంచేసి యున్న శ్రీశ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు తాడేపల్లి పట్టణ పరిధిలోని పాతూరు, కొత్తూరులో ఆలయ కమిటీ సభ్యులు స్వామివారిని ప్రత్యేక వాహనంలో అలంకరించి డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, జానపద నృత్యాల మధ్య గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో రేషన్ షాపుల తనిఖీలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పలుచోట్ల రేషన్ షాపులపై సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూబొమ్మ సెంటర్ 13వ నంబరు షాపు, కేఎల్‌రావు కాలనీలో 14వ నంబరు షాపులను తనిఖీ చేశామని.. 14వ నంబరు షాపులో 20 క్వింటాళ్ల వరకు వేరియేషన్ ఉందని వివరించారు. షాపు నిర్వహిస్తున్న పద్మపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. రేషన్‌లో ఎటువంటి అవకతవకలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని.. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పట్టణంలో రోడ్డు ప్రమాదం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలోని ఆర్అండ్ బీ బంగ్లా వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళుతున్న కారును విజయవాడ వైపు నుంచి గుంటూరు వైపు ఉల్లిపాయల లోడ్‌తో వెళుతున్న ట్రాలీ ఆటో ఆర్అండ్ బీ బంగ్లా వద్ద గౌతమబుద్ధ రోడ్డుపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు.

చేనేతకు కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయం

మంగళగిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్‌లో చేనేత రంగానికి తీరని అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో విషయాలు వెల్లడించారు. జౌళిశాఖకు మొత్తం రూ.5,272 కోట్లు కేటాయించగా, అందులో చేనేతకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడం దుర్మార్గమైన, నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మగ్గాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయని, చేనేత పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 8 కోట్ల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. బడ్జెట్‌ను వెంటనే సవరించి చేనేత రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెనుమూలిలో వరికుప్ప దగ్ధం

దుగ్గిరాల: గుర్తుతెలియని వ్యక్తులు పెనుమూలి గ్రామంలో 1.40 ఎకరాల వరి కుప్పను దగ్ధం చేశారు. సోమవారం దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో నాయుడు సీతయ్య పొలంలో ఉన్న వరికుప్పకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటిచారు. దీంతో వరి కుప్ప పూర్తిగా బూడిదైయ్యింది. గుంటూరు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వచ్చి సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్నారు. ఎస్సై వెంకటరవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

తాడేపల్లి పట్టణ పరిధిలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తాడేపల్లి రూరల్: ఈనెల 12వ తేదీన దేశవ్యాప్తంగా జరుగనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో సీఐటీయూ కార్యాలయం ఆవరణలో 'లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాడుదాం' పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కార్మికవర్గానికి నష్టదాయకమైన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో కార్మికవర్గం మనుగడకే ప్రమాదం ఏర్పడనున్నదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు టి.వెంకటయ్య, వైఎస్సార్ టీయూ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, నాయకులు బాబూరావు, అంకయ్య, యేసయ్య, వెంకన్న, రామయ్య, చంటి, వెంగమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి..

ఫిరంగిపురం: దేశవ్యాప్తంగా ఈనెల 12న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ముద్రించిన సమ్మె వాల్ పోస్టర్లను సోమవారం సంఘ నాయకులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతులకు నష్టం కలిగించే విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాడి గెలుచుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే నల్లచట్టాలను తీసుకురావడం, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకానికి ఉన్న గాంధీపేరు తొలగించి జీరామ్‌జీ అని పెట్టడం సిగ్గుచేటన్నారు. నూతన చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ 12న మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.కోటేశ్వరరావు, షేక్.మస్తాన్‌వలి, ఆటో కార్మికులు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి..

తాడికొండ: ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి కోరారు. ఈ మేరకు సోమవారం తుళ్లూరులో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలు, లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిర 20వ వార్షికోత్సవం నేడు

70 వేల మందికి అన్నదానం ఏర్పాట్లు

అన్నదాన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగభూషణం

మంగళగిరి టౌన్: పెదవడ్లపూడిలోని భగవాన్ శ్రీ సత్య షిర్డీ సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, సుమారు లక్ష మంది భక్తులు రానున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, సుమారు 70 వేల మందికి అన్నదానం నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం అవుతాయని, కాగడ హారతి, క్షీరాభిషేకం, అన్నాభిషేకం పూజా కార్యక్రమాల అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరై బాబా వారిని దర్శించుకోనున్నారని తెలిపారు. వార్షికోత్సవ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి బాబా కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పూల మొక్కలతో శోభ

ఫిరంగిపురం: పాఠశాల ఆవరణలో పూల మొక్కలు పెంచడం ద్వారా శోభను చేకూర్చుతాయని ఎంఈవోలు షేక్.మహబూబ్ సుభాని, రవికాంత్‌లు అన్నారు. మండలంలోని వేమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం పూల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పలురకాల పూల మొక్కలను ఎంఈవోలు నాటారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జె.సుబ్బయ్య, హెచ్ఎం శ్రీనివాస కార్తీక్, ఉపాధ్యాయులు దివి కమల్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

తాడికొండ: తాడికొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2026–27 సంవత్సరానికి గానూ 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ టి.హనుమంతరావు తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఫిబ్రవరి 19 అన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో apfpcet.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 99080 12752 నంబరును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు బండ్లు పంపిణీ

తాడికొండ: తుళ్లూరు మండలం టీడీపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ ఆర్థిక సహకారంతో సోమవారం వెలగపూడి గ్రామానికి చెందిన 30 మంది చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు, ఇస్త్రీ బండ్లు, తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు జమ్ముల అనిల్ కుమార్, వెలగపూడి గ్రామపార్టీ అధ్యక్షుడు ఇడుపులపాటి వెంకయ్య, కారుమంచి నరేంద్ర, జొన్నలగడ్డ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన తిరునాళ్లు

దుగ్గిరాల: పారుపూడి వీరమ్మ పేరంటాలు, చింతయ్య దేవస్థానంలో తిరునాళ్లు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన సోమవారం గ్రామంలో సిరిమాను ఊరేగించారు. మొదటి రోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కొలకలూరు, దుగ్గిరాల, కంఠంరాజుకొండూరు గ్రామాల్లో ఊరేగించారు. రెండో రోజు కల్యాణం జరిపించారు. చివరి రోజు నిర్వహించిన సిరిమాను ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సిరిమానుకు ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లును దేవాలయ కమిటీ పర్యవేక్షించారు.

అంబటి ఇంటిపై దాడి అమానుషం

ఫిరంగిపురం: తిరుపతి లడ్డూ విషయంలో కల్తీ లేదనే విషయం సీబీఐ చెప్పిన తరువాత వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆలయంలో పూజలు చేసేందుకు వెళుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుపై టీడీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ నాయకులపై దాడులు అధికం అవుతున్నాయని చెప్పారు. లడ్డూ విషయంలో ఎటువంటి తప్పిదాలు లేకున్నా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రభుత్వం ప్రయతించడం తగదన్నారు. దాడులు జరుగుతున్న సమయంలో రక్షణ కల్పించాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సహేతుకం కాదని అన్నారు. అంబటి రాంబాబు ఇంటిపై, కార్యాలయంపై టీడీపీ నాయకులు చేసిన దాడులను పార్టీ మండల నాయకులు ఖండిస్తున్నామన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని పేర్కొన్నారు.

ఓబీసీలను నిరాశ పరిచిన కేంద్ర బడ్జెట్

కేశన శంకరరావు

మంగళగిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓబీసీలను నిరాశ పరిచిందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర రావు విమర్శించారు. సోమవారం ఒక ప్రకటనలో ఆయన విషయాలను వెల్లడించారు. అనేక దశాబ్దాలుగా ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి సబ్ ప్లాన్ రూపొందించి ఆ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి ప్రత్యేక నోడల్ ఏజన్సీల ద్వారా పథకాలు, రాయితీలను సక్రమంగా అమలు పరచాలని కోరుతూనే వస్తున్నామని, నేటికీ ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడం బాధాకరమని అన్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్లకు, భూస్వాములకు పెద్దపీట వేసి పేద, బడుగు వర్గాలకు మొండిచెయ్యి చూపినట్లు ఉందని విమర్శించారు.

ఘనంగా వార్షిక పూజా ఉత్సవం

నిత్య సహాయమాత తేరు ప్రదర్శన

తెనాలి: ప్రపంచంలో మరియమ్మ అనేక ప్రాంతాల్లో వివిధ పేర్లతో దర్శనమిస్తారని తెలిసిందే. ఆ క్రమంలో తెనాలిలో నిత్యసహాయమాతగా పూజలను అందుకుంటున్నారు. చెంచుపేటలోని నిత్యసహాయమాత దేవాలయంలో ఏటా ఫిబ్రవరి 2న జరిగే పండుగను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. 20 ఏళ్లుగా గురుత్వ సేవలో ఉన్న యూఏస్‌కు చెందిన రెవరెండ్ నూతలపాటి జయబాబు నిర్వహణలో ఉదయం సమిష్టి దివ్యబలిపూజతో కార్యక్రమాలను ఆరంభించారు. అనంతరం నిత్యసహాయమాత స్వరూపంతో తేరు ప్రదక్షణ చేశారు. సాయంత్రం రక్షకసభ బెంగళూరు ప్రావిన్స్‌కు చెందిన ప్రావిన్షియల్ సుపీరియర్ గురుశ్రీ రెవరెండ్ ఫాదర్ ఎడ్వర్డ్ జోసఫ్‌రాజు నిర్వహణలో సమిష్టి దివ్యబలిపూజను చేశారు. విజయవాడ పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ గురుశ్రీ రెవరెండ విజయరాజు బావను వాక్య పరిచర్య చేశారు. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు రాత్రి పొద్దుపోయేవరకు కొనసాగాయి. కోయ స్లీవ, గురుశ్రీ ఆంతోనీ విన్సెంట్, గురుశ్రీ గోటివాడ విజయకుమార్, కన్యా స్త్రీలు, ఉపదేశులు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. తొమ్మిదిరోజులు జరిగే ఈ పర్వదినం తొలి రోజైన గత నెల 24వ తేదీన అంతోని విన్సెంట్ నిత్యసహాయమాత పతాకావిష్కరణతో ఉత్సవాలను ప్రారంభించారు.

ప్రథమ ఫలముల పండుగ...

ఏటా ఫిబ్రవరి 2న జరిగే నిత్యసహాయమాత పూజా ఉత్సవానికో విశేషముంది. బైబిలు ప్రకారం కొత్త పంట రైతుల చేతికొచ్చే శుభతరుణాన్ని పురస్కరించుకుని దైవార్పితం చేయడానికి ఏర్పడిన పండుగ ఇది. దీన్ని కోత పండుగ, ప్రథమ ఫలముల పండుగ అని అంటారు. పండుగ కేవలం పంటకు, వ్యవసాయానికి సంబంధించినది. అందువల్ల పేదలు, అన్నార్తులు, వితంతువులు, ఆధారంలేని పిల్లలకు దానంచేసి ఆదరించే పండుగ ఇది. రిడంప్టరిస్ట్ అనే రక్షక గురువులతో ఏర్పడిన సంస్థ ద్వారా పండుగను నిర్వహిస్తారు. దైవసేవ, సామాజిక సేవతో తెనాలి, పరిసర గ్రామాలకు విస్తరించిన ఈ దేవాలయంలో ఫిబ్రవరి 2న జరిగిన పూజా ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు.

దాడులతో వైఎస్సార్ సీపీ శ్రేణులను భయపెట్టలేరు

తెనాలి: దాడులు, దమనకాండలతో వైఎస్సార్ సీపీ శ్రేణులను చంద్రబాబు ప్రభుత్వం భయపెట్టలేదని ఆ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గుంటూరు కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు వాస్తవం కాదనీ, సీబీఐ చార్జిషీటు సాక్షిగా బహిర్గతమైందని తెలిపారు. ఈ అంశం నుంచి ప్రజలను పక్కదారి పట్టించడానికి పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపైనా, ఆయన ఇంటిపైనా టీడీపీ మూకలు దాడిచేసినట్టు ఆరోపించారు. అదేవిధంగా మాజీమంత్రి జోగి రమేష్ నివాసంపైనా పెట్రోలు బాంబులతో దాడి చేశారని తెలిపారు. తాను ఏ పరిస్థితుల్లో అభ్యంతకర పదాలను వాడాల్సి వచ్చిందో మాజీమంత్రి అంబటి వివరిస్తూ, అలా వాడకుండా ఉండాల్సింది కాదని చెప్పినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం ఆయనపై కేసులు పెట్టి, జైలుకు పంపించటం అప్రజాస్వామికమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరుగుతున్న హింస, దాడులను చూస్తుంటే అరాచక పాలనకు అద్దం పడుతున్నట్టుగా ఉందన్నారు. పాలకులకు ఇది తగదని, భవిష్యత్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే దీటైన చర్యలు ఉంటాయని కృష్ణ హెచ్చరించారు.

అక్రమ వసూళ్లకు 'డ్రంక్ అండ్ డ్రైవ్'

తెనాలి పోలీసులకు వరంగా డ్రంక్ అండ్ డ్రైవ్

తెనాలిరూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలను నివారించడం, ప్రజల ప్రాణాలను రక్షించే లక్ష్యంగా పోలీసులు జరిపే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు తెనాలి పోలీసులకు కాసులు తెచ్చి పెడుతున్నాయి. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారిపై ఏ కేసులు పెట్టకుండా, వాహనాన్ని స్టేషన్‌లో ఉంచి రోజుల తరబడి వ్యక్తులను స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. ఆపై రూ. వేలల్లో వసూలు చేసి కేసు లేకుండా పంపుతున్నారు. తెనాలి మండలం మల్లెపాడుకు చెందిన యువకుడు మూడు రోజుల క్రితం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేయవద్దని వేడుకున్నాడు. అతని బైక్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు మూడు రోజులు తిప్పుకొన్నారు. చివరకు రూ.5 వేలు తీసుకుని సోమవారం పంపారు. మరో వ్యక్తి బైక్‌ను వదిలేసి వెళ్లాడని, అతని ఆచూకీ లభించినప్పుడు ఇద్దరికీ కలిపి కేసు పెడతామన్నది పోలీసులు యువకుడితో చెప్పారు. నేరాల నియంత్రణ, మద్యం మత్తులో వాహనాలను నడపడాన్ని అరికట్టేందుకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు, నాకాబందీ వంటివి టార్గెట్‌లు ఇచ్చి మరీ సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నారు.

యువత అంబేడ్కర్ చరిత్ర తెలుసుకోవాలి

సమావేశంలో పాల్గొన్న నాయకులు

మంగళగిరి టౌన్: నేటి యువత, ప్రజలు అంబేడ్కర్ చరిత్ర గురించి తెలుసుకోవాలని పలువురు సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళగిరి పట్టణ కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై పాలకులు తీవ్ర దాడి చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన జీవిత చరిత్రను నాటక రూపంలో మంగళవారం ప్రదర్శించనున్నట్లు వివరించారు. పట్టణంలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ అభిమానులు, కేవీపీఎస్, అభ్యుదవాదులు, దళిత సంఘాలు, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ప్రదర్శించనుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బాలాజీ, ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కమలాకర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ రాష్ట్ర పరిరక్షణ కమిటీ కార్యదర్శి కారుమంచి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

కార్మికులకు మద్దతు తెలుపుతున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను మంత్రి నారా లోకేష్ పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, గురవయ్య, సుభాని, సాంబశివరావు, టి.నాగేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కార్మికులు తమ సమస్యను విన్నవించుకున్నారని, స్పందించిన ఆయన తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలుపుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో దామవరపు నాగేశ్వరరావు, నరసింహారావు, నవనీతమ్మ, విజయశ్రీ, ఆదినారాయణ, సుబ్బారావు, హగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నిత్య సహాయమాత ఆలయ వార్షికోత్సవం

ప్రత్యేక పూజ నిర్వహిస్తున్న విచారణ గురువు చంద్రమోహన్

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు గ్రామంలోని నిత్య సహాయ మాత ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామంలో కుల మతాలకు అతీతంగా పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పండుగ ప్రత్యేక దివ్య పూజాబలిని ఆలయంలో విచారణ గురువు సుదురుపాటి చంద్రమోహన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సర్వ మానవాళి పాపపరిహారార్థం క్రీస్తు మరియమ్మ గర్భమున పుట్టారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక దైవభక్తి పాటలు ఆలపించి కోలాటాలు చేపట్టారు. అనంతరం విశ్వాసులు కొవ్వొత్తుల సమర్పణ చేశారు. రాత్రికి గ్రామ పురవీధుల్లో మేళతాళాల నడుమ ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. సమీప గ్రామాల విశ్వాసులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. విచారణల గురువులు ముప్పల రవి, దోనే ప్రతాప్, పలువురు ఫాదర్లు, మత కన్యలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆంజనేయులు

తాడికొండ: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణాత్మక ఆలోచనలను అభివృద్ధి చేయాలని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ విభాగం ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఇంజినీర్స్ అండ్ బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సహకారంతో నిర్వహిస్తున్న అమరావతి సెంట్రలైజ్డ్ హ్యాకథాన్–2026 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏఐ భవిష్యత్ ప్రపంచాన్ని మలుపు తిప్పే కీలక రంగమని, ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలవు పెంపొందిస్తాయన్నారు. ఫ్యూచర్ ఇంజినీర్స్, బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ డైరెక్టర్ మోనికా ఆర్కే, వ్యవస్థాపకులు మహన్ ఆర్కేలు మాట్లాడుతూ.. హ్యాకథాన్‌లు ఇంజినీరింగ్ విద్యార్థుల వృత్తి, భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొల్లా నాగ శ్రీనివాస రావు, ప్రోగ్రామ్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, ఏఐ విభాగాధిపతి సుంకర శాంతిప్రియ, డీన్‌లు డాక్టర్ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా

బోల్తా పడిన లారీని పరిశీలిస్తున్న పోలీసులు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు కొబ్బరి పీచు(చిట్టు) తీసుకువస్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ సంఘటన మండల కేంద్రంలో బ్రహ్మంగారి దేవాలయం సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రి నుంచి కొబ్బరి పీచుతో వస్తున్న లారీ మండలంలోని సుదురుపాడుకు వస్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొంది. దీంతో లారీ బోల్తాపడింది. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. కాగా లారీ పూర్తిగా దెబ్బతింది. రోడ్డుకు లారీ అడ్డుగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మార్షల్ అకాడమీ విద్యార్థులకు బంగారు పతకాలు

పతకాలు సాధించిన విద్యార్థులు

తెనాలి: ఒంగోలులో జరిగిన జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో తమ విద్యార్థులు పలు పతకాలను సాధించినట్టు హరిహంసిక మాస్టర్ ఆర్ట్స్ నిర్వాహకుడు చిన్న మాస్టర్ తెలియజేశారు. బోధిధర్మ మార్షల్ ఆర్ట్స్‌అకాడమీ ఆధ్వర్యంలో, అకాడమీ వ్యవస్థాపకులు బోధిధర్మ డి.వెంకటేష్ నాయకత్వంలో జాతీయస్థాయి కరాటే, కుంగ్ ఫూ పోటీలు ఆదివారం ఒంగోలులోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్‌లో జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో తెనాలికి చెందిన హరి హంసక మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు. కటాస్ విభాగంలో వివిధ బెల్ట్ కేటగిరీల్లో వర్షిత, నిధి, రిత్విక, నిహస్వి, భాను ప్రసాద్, కార్తికేయ బంగారు పతకాలు సాధించారు. కుమిటేలోని వివిధ విభాగాల్లో సి.హెచ్. హర్షిత్, ఓ. కీర్తన సాయి, ఎస్. శాలిక,ఎస్. సాయి, చరణ్ సాయిరెడ్డి బంగారు పతకాలు సాధించినట్టు వివరించారు. అకాడమీ ప్రధాన శిక్షకులు ఎం.సత్యనారాయణ (చిన్నా మాస్టార్) తెలియజేసి, విద్యార్థులను అభినందించారు.

క్లుప్తంగా...

క్రిస్టియన్లపై దాడులను అరికట్టండి

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద క్రైస్తవ సంఘాల ధర్నా

నిరసన తెలుపుతున్న ఆల్ ఇండియా క్రిస్టియన్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో క్రిస్టియన్లపై దాడులను అరికట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలు క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రోజూ క్రిస్టియన్లపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కొన్ని సంఘాలు పాస్టర్లను టార్గెట్‌గా చేసుకుని దాడులకు తెగబడుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆల్ ఇండియా క్రిస్టియన్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్, ది నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్స్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐసీఎస్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు హ్యారీ డిసౌజ మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో భారత రాజ్యాంగం ఆర్టికల్–25లో పేర్కొన్న మత స్వేచ్ఛకు వ్యతిరేకంగా మత నిరోధక కఠిన చట్టాలు తెచ్చి అమాయక పాస్టర్లు, క్రైస్తవులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. క్రైస్తవులను అడ్డగోలుగా జైళ్లలో నిర్బంధిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే కేంద్రం స్పందించి క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. క్రైస్తవ సంఘాల నాయకులు డేనియల్ ఆడమ్స్, జెరుసలేం మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కంటకంగా కూటమి పాలన

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేశ్

గుణదల (విజయవాడ తూర్పు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కనుమరుగైందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ విజయవాడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందన్నారు. ప్రజా ప్రతినిధులే రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. బీసీలను వినియోగించుకున్న కూటమి నేతలు అవసరం తీరాక దాడులకు తెగబడుతున్నారని వాపోయారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ అరాచకాలకు, దౌర్జన్యాలకు, వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనకు సిద్ధమవుతున్నామని తెలిపారు.

రెడ్‌బుక్ నుంచి బ్లడ్‌బుక్‌కు..

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర

సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం మరింత దిగజారి బ్లడ్‌బుక్ రాజ్యాంగంగా మారిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికార పార్టీ అరాచకాలు పరాకాష్టకు చేరాయని, వ్యక్తులపై దాడులు దాటిపోయి ఇప్పుడు ఇళ్లను తగులబెట్టడం, హత్యాయత్నాలకు పాల్పడే స్థాయికి పాలన చేరిందన్నారు. భవిష్యత్తులో కాపులంతా ఏకమై టీడీపీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. నాడు వంగవీటి రంగాను అత్యంత దారుణంగా అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హతమార్చిందని.. ఆ తర్వాత ముద్రగడను, ఆయన కుటుంబ సభ్యులను ఎలా అవమానించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. నేడు కాపు నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబుపై రాజకీయ కక్షసాధింపులకు తెగబడుతున్నారన్నారు. తిరుమల లడ్డూపై చంద్రబాబు చెప్పిందే నిజమన్నట్లుగా వ్యవహరించడాన్ని ప్రశ్నిస్తే వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేస్తున్నారని నరేంద్ర చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు సంస్కారం గురించి మాట్లాడడం విచిత్రంగా ఉందన్నారు.

దివ్యాంగుల బాధలు వర్ణనాతీతం

- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై బీజేపీ మండిపాటు

సాక్షి, అమరావతి: దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి సోమవారం బీజేపీ రాష్ట్ర శాఖ నిర్వహించే 'జనతా వారధి' కార్యక్రమంలో దివ్యాంగుల నుంచి ధ్రువపత్రాలు అందడం లేదని లెక్కకు మించి ఫిర్యాదులు రావడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పందించినట్టు ఆ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. 'దివ్యాంగుల నుంచి బీజేపీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. వారి ఆవేదన మా మనసులను కలచివేసింది. సదరం సర్టిఫికెట్ల కోసం వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. సర్టిఫికెట్ ఎప్పుడు వస్తుందో తెలీదు... దరఖాస్తు ఎందుకు రిజెక్ట్ అయ్యిందో తెలీదు... ఈ సర్టిఫికెట్ కోసం ఓ దివ్యాంగుడు కనీసం 6 నుంచి 9 మంది అధికారుల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తోంది. దివ్యాంగుడిగా గుర్తింపు పొందడానికి ఇన్ని తలుపులు తట్టాల్సి రావడం మన ప్రభుత్వ వైఫల్యమే' అని పేర్కొన్నారు.

ఖజానాకు గండికొట్టి పచ్చజేబులు నింపుకొంటూ..

రాష్ట్రంలో యథేచ్ఛగా కల్తీ, అక్రమ మద్యం విక్రయిస్తున్న పచ్చబాబులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో కల్తీ, అక్రమ మద్యం యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం షాపులు, వాటికి అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను, బెల్టుషాపులను టీడీపీ సిండికేట్, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు నడుపుతున్నారు. ఈ కల్తీ, నకిలీ మద్యం పచ్చ నేతల జేబులు నింపుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీనికితోడు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఫలితంగా మందుబాబుల ఆరోగ్యం క్షీణించడంతోపాటు రాష్ట్ర ఖజానాకు భారీగా గండిపడుతోంది. అదే సమయంలో పచ్చ చొక్కాల జేబులు మాత్రం కాసులతో ఫుల్‌గా నిండుతున్నాయి. గతంతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ప్రభుత్వ ఖజానాకు ఎక్సైజ్ రాబడి ఏకంగా 13 శాతం క్షీణించడమే ఇందుకు నిదర్శనం. ఇటీవల ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతుల సమావేశంలో స్వయంగా ఆర్థిక శాఖ ప్రజెంటేషన్ ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. అంతే కాకుండా పొరుగు రాష్ట్రాల్లో ఎక్సైజ్ రాబడి పెరుగుతుండగా అందుకు పూర్తి విరుద్ధంగా రాష్ట్రంలో మద్యం ఆదాయం తగ్గిపోతోందని ఆర్థిక శాఖ పేర్కొంది. ఈ ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎక్సైజ్ రాబడులు ఝార్ఖండ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో భారీ వృద్ధి సాధించగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎక్సైజ్ ఆదాయం తిరోగమనంలో ఉంది.

'పెద్దల' మనసెరిగి.. ఎక్సైజ్‌శాఖ మౌనం

మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరగకపోగా తగ్గిపోవడానికి ప్రధాన కారణం పచ్చబాబులు కల్తీ, అక్రమ మద్యం యథేచ్ఛగా విక్రయించి సొమ్ము చేసుకోవడమేనని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పడం గమనార్హం. అయితే అక్రమ మద్యం తయారీ విషయం ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారులకు తెలిసినప్పటికీ ప్రభుత్వ పెద్దల మనసెరిగి మౌనం వహిస్తున్నారనే

అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఎక్సైజ్ ద్వారా రాబడి రూ.14,380 కోట్లుండగా ఈ ఆర్థిక ఏడాది (2025–26) ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎక్సైజ్ రాబడి రూ.13,114 కోట్లే వచ్చింది. అంటే రూ.1266 కోట్ల మేర ఖజానాకు గండిపడింది. ఈ మొత్తం పచ్చ బాబుల జేబుల్లోకి వెళ్లినట్లేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే జీఎస్టీ రాబడులు కూడా పొరుగు రాష్ట్రాలతో పోల్చితే రాష్ట్రంలో తక్కువగా ఉన్నట్లు ఆర్థిక శాఖ ప్రజెంటేషన్‌లో స్పష్టం చేసింది. ఈ ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు జీఎస్టీ రాబడులు బీహార్, కర్ణాటక, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ వృద్ధి నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 0.04 శాతం క్షీణత నెలకొందని ఆర్థిక శాఖ పేర్కొంది.

ఏపీతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఈ ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎక్సైజ్ రాబడుల వృద్ధి ఇలా...

రాష్ట్రం పేరు	ఎక్సైజ్ రాబడి వృద్ధి
ఝార్ఖండ్	45 శాతం
తెలంగాణ	22 శాతం
మధ్యప్రదేశ్	17 శాతం
ఉత్తరప్రదేశ్	16 శాతం
ఆంధ్రప్రదేశ్	-13 శాతం

ఏపీతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు జీఎస్టీ రాబడుల వృద్ధి ఇలా...

రాష్ట్రం పేరు	జీఎస్టీ రాబడి వృద్ధి
బీహార్	6.04 శాతం
కర్ణాటక	9.73 శాతం
పశ్చిమబెంగాల్	7.54 శాతం
మధ్యప్రదేశ్	5.74 శాతం
ఆంధ్రప్రదేశ్	-0.04 శాతం

బందిపోట్ల తరహాలో దాడులు

వీటిని ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటాం: సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని, బందిపోట్ల తరహాలో టీడీపీ కార్యకర్తలు పోలీసుల సాయంతో తమ నేతల ఇళ్లలోకి చొరబడి దాడులు చేయడమే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఆదివారం టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన మాజీమంత్రి జోగి రమేష్ ఇంటిని పార్టీ నేతలతో కలిసి సజ్జల రామకృష్ణారెడ్డి సందర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ.. ఈ దాడుల్ని ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటామని, అధికారంలోకి వచ్చాక చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతామని హెచ్చరించారు.

టీడీపీ వ్యవస్థీకృత నేరగాళ్ల దాడులు..

ఇంకా సజ్జల ఏమన్నారంటే.. ''రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే బాధ కలుగుతోంది. గుంటూరులో అంబటి రాంబాబు ఇంటి దగ్గర పోలీసులు ప్రేక్షకుల్లా వ్యవహరిస్తూ టీడీపీ గూండాలు, చంద్రబాబు, లోకేశ్ పంపిన వ్యవస్థీకృత నేరగాళ్లు పెట్రోల్ బాంబులు వేస్తూ ఏం చేశారో అంతా చూశారు. పోలీసు ఉన్నతాధికారిని మా నేతలు సంప్రదిస్తే ఫోన్ ఎత్తలేదు. పైగా.. గేటు లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నారు. నిన్న మరో నాయకుడు జోగి

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

రమేష్ ఇంటి మీద పెట్రోల్ బాంబులు విసిరారు. టీడీపీకి రాజకీయ పార్టీగా ఉండే అర్హతలేదు. పూర్వకాలంలో బందిపోటు ముఠాల తరహాలో ఇళ్ల మీద పడి నేలమట్టం చేసిన దానికీ, దీనికీ ఏం తేడాలేదు. టీడీపీ అరాచకాలపై జాతీయ స్థాయిలో మా గొంతు వినిపిస్తాం. కేంద్ర హోంశాఖ కార్యదర్శిని మా ఎంపీ కలవబోతున్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కూడా ఆశ్రయిస్తాం. మీ గొయ్యి మీరు తవ్వుకోండి. మా మీద చేసే ప్రతీ దాడికీ రికార్డు ఉంటుంది. మేం అధికారంలోకి వచ్చాక చట్టబద్ధంగా వడ్డీతో చెల్లిస్తాం. చంద్రబాబు ఎన్ని అడ్డంకులు కల్పించినా ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటాం'' అని తెలిపారు.

కాపుల అణచివేతకు టీడీపీ కుట్రలు

- అంబటి, ఆయన ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం
- కాపుల విషయంలో వైఖరి మార్చుకోకపోతే టీడీపీకి గుణపాఠం చెబుతాం
- ఆంధ్రప్రదేశ్ కాపునాడు, హైదరాబాద్ సిటీ కాపు సంఘాల హెచ్చరిక లేఖ

సాక్షి, అమరావతి: కాపు సామాజిక వర్గీయులే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ సాగిస్తున్న దమనకాండను ఆంధ్రప్రదేశ్ కాపునాడు, హైదరాబాద్ సిటీ కాపు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడి, దౌర్జన్యకర సంఘటనలను తప్పుబట్టాయి. టీడీపీ కాపుల విషయంలో వైఖరి మార్చుకోకపోతే, సరైన సమయంలో గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తూ సోమవారం ఓ లేఖను విడుదల చేశాయి. ఆ లేఖలో ఏముందంటే...

కాపు నాయకులను నిర్మూలించే కుట్రలో భాగమే...

అధికారంలో ఉన్న పార్టీలు పోలీసు బలగంతో ప్రతిపక్ష పార్టీలను టార్గెట్ చేయడం పరిపాటయ్యింది. కాపుల ఓట్లతో అధికారంలోకి వచ్చినప్పటికీ కాపులను అధికారంలో భాగస్వాములను కానివ్వడం లేదు. మరోవైపు కాపు రాజకీయ నాయకులను అణచి వేయడం, లేదా భౌతికంగా నిర్మూలించేందుకు కుట్రలు చేస్తున్నారు. వంగవీటి రంగాను నాటి తెలుగుదేశం ప్రభుత్వం బాంబులతో దాడులు చేసి పాశవికంగా హత్య చేశారు.

కాపులపై దురాగతాల్లో టీడీపీ టాప్

- కాపులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల కోసం గాంధేయ మార్గంలో ముద్రగడ నిరాహార దీక్ష చేస్తే, వారి ఇంటిపై 100 మంది పోలీసులతో దాడులు చేసి మహిళలు, ముద్రగడ కుమారుడు గిరిబాబుపై దాడిని కాపులు మరిచిపోగలరా?
- గుంటూరులో వీపురి శ్రీదేవి ఇంటిపై, ఖండవల్లి కో – ఆపరేటివ్ సొసైటీలో జరిగిన అవినీతి అక్రమాలపై పోరాటం చేసిన అడ్వకేట్ కోటిపల్లి అయ్యప్ప ఇంటిపై టీడీపీ అల్లరి మూకలు దాడులు చేశాయి. కొట్టే కావ్య అనే జనసేన కార్యకర్త భూమిని కబ్జా చేసి తిరిగి బాధితులపైనే రెండు తప్పుడు కేసులు నమోదు చేశారు.
- కందుకూరు ఘటనలో లక్ష్మీ నాయుడు, అతని సోదరులను ఒక కమ్మ కుల దురహంకారి కారుతో తొక్కించేసి, దాడి చేయగా లక్ష్మీ నాయుడు అక్కడికక్కడే చనిపోయాడు. అతని సోదరులు శాశ్వత వికలాంగులయ్యారు.
- పశ్చిమ గోదావరి జిల్లా సానా రుద్రవరంలో విన్నకోట రామకృష్ణపై స్థానిక టీడీపీ నాయకుడు శ్రీనివాస చౌదరి బజారులో కొట్టి దుర్భాషలాడడంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఏపీలో అరాచక పాలన

- శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి
- రాష్ట్రంలో 'రాష్ట్రపతి పాలన' విధించండి
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్
- కేంద్రం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలోని ప్రస్తుత పరిస్థితులను ఎండగట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయన్నారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేసి తగులబెట్టారని ఆరోపించారు. వందల మంది తమ పార్టీ కార్యకర్తలను పొట్టనబెట్టుకున్నారని, ఇళ్లను దహనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తమకు మద్దతుగా ఉందన్న ధీమాతోనే చంద్రబాబు ప్రభుత్వం ఇంతటి అరాచకానికి తెగబడుతోందని విమర్శించారు. ఏపీలో కనీసం ఆరు నెలల పాటు రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రిని కోరారు.

రైతులకు తీరని అన్యాయం.. పీఎం కిసాన్‌ను పెంచండి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సం

క్షేమ పథకాలను చంద్రబాబు ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దు చేసిందని మండిపడ్డారు. దేశంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, 2019 నుంచి రైతులకు ఇస్తున్న రూ.6 వేలు 'పీఎం కిసాన్' సాయం ఏమాత్రం సరిపోవడం లేదని బోస్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని కనీసం రూ.9 వేలకు పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

బాబు మోసం.. పథకాలన్నీ బంద్!

గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందించి ఆదుకుందని, కానీ ప్రస్తుత సీఎం చంద్రబాబు ఎన్నికల్లో రూ.20 వేలు ఇస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు మొండి చేయి చూపించారని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రీమియం చెల్లించి అమలు చేసిన 'ఉచిత పంటల బీమా' పథకాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని, దీనివల్ల 74 శాతం మంది రైతులు బీమా అర్హత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతులకు వరంలా ఉన్న ఉచిత బోరు బావుల పథకాన్ని కూడా నిలిపివేశారని, పాడి రైతులకు ఇచ్చే లీటరుకు రూ.4 బోనస్‌ను, కోల్డ్ స్టోరేజీల సబ్సిడీలను ఎత్తేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించేందుకు (పీపీపీ మోడల్) చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, దీనిపై కోటి సంతకాలతో గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని, కేంద్రం తక్షణం జోక్యం చేసుకుని ప్రైవేటీకరణను ఆపాలని పిల్లి సుభాష్ చంద్రబోస్ కోరారు.

ఆ డబ్బులు వెనక్కి ఇచ్చేయండి

డిస్కంలకు ఏపీఈఆర్‌సీ ఆదేశం

- కొత్త మీటర్లు పెట్టాక రెట్టింపు విద్యుత్ బిల్లులు
- అదనపు కెపాసిటర్ల వల్ల స్మార్ట్ మీటర్లలో రీడింగ్ నమోదవుతుందంటున్న డిస్కంలు
- స్మార్ట్‌మీటర్లలో మార్పులు చేయాలన్న ఏపీఈఆర్‌సీ
- అదనంగా వసూలు చేసిన డబ్బులు బిల్లుల్లో సర్దుబాటు చేయాలని ఆదేశం

సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగదారుల నుంచి స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత అదనంగా వసూలు చేసిన చార్జీలను వెనక్కి ఇచ్చేయాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆదేశించింది. ఇకపై కెపాసిటర్లు ఎన్ని ఉన్నా లోడ్‌కి ఎన్ని అవసరమో వాటినే విద్యుత్ బిల్లు వేసేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. విద్యుత్ పంపిణీ రంగంలో సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను మెరుగుపరచడానికి ఆధునిక మీటరింగ్ సాంకేతిక పరిజ్ఞానాలకు మద్దతు ఇస్తూనే వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటానికి కట్టుబడి ఉన్నామని కమిషన్ స్పష్టం చేసింది.

మేం కట్టలేం

''స్మార్ట్ మీటర్లు పెడతామని ఎవరైనా వస్తే వాటిని పగలగొట్టండి అని ఎన్నికల ముందు టీడీపీ

నాయకులు పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం, అవవసరమైతే తగ్గిస్తాం అన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక వినియోగదారుల సమ్మతితోనే విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామంటూ మాట మార్చారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టుకోకపోతే ఉన్న సర్వీసులు తొలగిస్తామంటూ నోటీసులు ఇస్తున్నారు. వీటికి తోడు ప్రజలపై దాదాపు రూ.20 వేల కోట్లకుపైగా విద్యుత్ చార్జీల భారం మోపారు. స్మార్ట్ మీటర్లు పెట్టడంతో విద్యుత్ బిల్లులు రెండు, మూడింతలు పెరిగిపోయాయి. ఇలా అయితే మేమెలా బిల్లులు కట్టాలి ? వినియోగించని విద్యుత్‌కు చార్జీలు ఎందుకు చెల్లించాలి.'' అంటూ విద్యుత్ వినియోగదారులు ఏపీఈఆర్‌సీకి ఇటీవల మొర పెట్టుకున్నారు. బహిరంగ విచారణలో, ఈమెయిళ్ల ద్వారా, నేరుగానూ తమ సమస్యలను మండలికి చెప్పుకున్నారు.

అందుకే ఎక్కువ బిల్లు

వినియోగదారుల ఆందోళనను సీరియస్‌గా తీసుకున్న మండలి ఈ సమస్యకు తమ వంతు పరిష్కారాన్ని అన్వేషించింది. పాత ఎలక్ట్రోమెకానికల్, స్టాటిక్ మీటర్లతో పోలిస్తే కొంతమంది వినియోగదారులకు అధిక విద్యుత్ బిల్లులు వచ్చాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో మూడు సూచనలతో సోమవారం ఆదేశాలు జారీ చేసింది. లో టెన్షన్(ఎల్‌టీ) విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చిన తర్వాత విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి. దీనికి కెపాసిటర్లు కారణమంటూ ఏపీఈఆర్‌సీకి డిస్కంలు వెల్లడించాయి. వినియోగదారులు అవసరమైన దానికంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న కెపాసిటర్లను పెట్టుకోవడం వల్ల స్మార్ట్ మీటర్లు అదనపు లోడ్‌కి తగ్గట్టుగా యూనిట్లు లెక్కిస్తున్నాయని వివరించాయి. ఈ విషయాన్ని పరిశీలించిన తర్వాత వినియోగదారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ మీటరింగ్ ప్రోగ్రామ్‌కు అనుకూలమైన వాతావరణం కల్పించాల్సి ఉందని భావించినట్లు ఏపీఈఆర్‌సీ వెల్లడించింది.

ఏపీఈఆర్‌సీ ఆదేశాలు ఇవీ

- స్మార్ట్ మీటర్లలో కెపాసిటర్ల ఆధారంగా బిల్లు లెక్కింపు విధానం ఉండాలని గతంలో తాము ఇచ్చిన ఆదేశాలు నిలిపివేస్తున్నట్లు మండలి తెలిపింది.
- స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత లీడింగ్ రియాక్టివ్ ఎనర్జీ (కెపాసిటర్) కారణంగా వినియోగదారులు ఇప్పటికే చెల్లించిన అదనపు బిల్లులను ఉపసంహరించుకోవాలని డిస్కంలను ఆదేశించింది.
- అలా వసూలు చేసిన అదనపు మొత్తాలను సంబంధిత వినియోగదారులకు తర్వాతి నెలల విద్యుత్ వినియోగ బిల్లులలో సర్దుబాటు చేయాలని సూచించింది.

కొత్త లైనూ లేదు.. రైలూ లేదు

పాత ప్రాజెక్టుల పాటనే వినిపించిన కేంద్రం

సాక్షి, అమరావతి: కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చక్రం తిరగలేదు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి ఈసారీ మొండిచెయ్యే మిగిలింది. ఆంధ్రప్రదేశ్‌కు రెడ్ సిగ్నల్ చూపిస్తూ కేంద్ర రైల్వే బడ్జెట్ బైపాస్‌లో వెళ్లిపోయింది. కేంద్రంలో చక్రం తిప్పుతున్నామని గొప్పగా చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు రాష్ట్రానికి కొత్త రైల్వే ప్రాజెక్టుల సాధనలో మాత్రం చేతులెత్తేశారు. ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టును కూడా రాష్ట్రానికి సాధించలేకపోయారు. రాష్ట్రం నుంచి ఎన్డీఏకు చెందిన 21 మంది లోక్‌సభ సభ్యులు ఉన్నప్పటికీ రైల్వే ప్రాజెక్టుల సాధనలో పూర్తిగా విఫలమయ్యారు. 2026–27 వార్షిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ10,134 కోట్లు కేటాయించినట్టు రైల్వే శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గత బడ్జెట్ కంటే ఇది కేవలం రూ.717 కోట్లు మాత్రమే అధికం. పెరిగిన వ్యయంతో పోలిస్తే.. ఆ నిధులు కూడా ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులను నత్తనడకన సాగించేందుకే సరిపోతాయి. అంతేగానీ ప్రాజెక్టులను పూర్తి చేయడంగానీ.. కొత్త ప్రాజెక్టుల పనులు మొదలు పెట్టడంకానీ సాధ్యం కాదనే విషయం స్పష్టమైంది. బడ్జెట్ కేటాయింపుల్లో కనికట్టు చేసేందుకు రైల్వే శాఖ యత్నించింది. 2009–10 వార్షిక బడ్జెట్ కంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించినట్టు రైల్వే శాఖ చెప్పుకోవడం విశేషం. పదేళ్ల క్రితం నాటి బడ్జెట్ కేటాయింపులతో పోలుస్తూ ప్రస్తుత బడ్జెట్‌లో కొత్త ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపలేదనే విషయాన్ని మరుగుపరిచేందుకు యత్నించింది. బడ్జెట్ కేటాయింపులను వివరిస్తూ రైల్వే శాఖ పింక్ బుక్ విడుదల చేస్తేనే కొంత స్పష్టత వస్తుంది.

పాత పాటే.. కొత్తగా పాడి..

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల విషయంలో రైల్వే శాఖ ఎలాంటి ప్రకటనా చేయలేదు. రాష్ట్రంలో 73 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొనడం గమనార్హం. వాస్తవానికి అమృత్ భారత్ పథకం కింద ఆ 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితమే రూ.3,418 కోట్ల వ్యయంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయి. సూళ్లూరుపేట, రాయనపాడు (విజయవాడ శివారు), కాకినాడ టౌన్, మంగళగిరి, తుని రైల్వేస్టేషన్ల పనులు పూర్తయ్యాయి. ఆ విషయాన్నే రైల్వే శాఖ కనికట్టు చేసేందుకు యత్నించింది. 2014 నుంచి రాష్ట్రంలో 1,700 కి.మీ. మేర రైల్వే ట్రాక్‌లను నిర్మించినట్టు తెలిపింది. కవచ్ ప్రాజెక్టు కింద గతంలోనే ఆమోదించిన 3,137 కి.మీ. పనుల్లో 130 కి.మీ. పనులు పూర్తయ్యాయి. మరో 2,507 కి.మీ. పనులు కొనసాగుతున్నాయని వెల్లడించింది.

కొత్త డిమాండ్లు బేఖాతరు

కొత్త ప్రాజెక్టును కూడా కేంద్రం పరిశీలించలేదు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైనప్పటికీ ప్రతిపాదనల దశలోనే మగ్గిపోవాల్సిన అనివార్యత ఏర్పడిన ప్రాజెక్టులు ఇవీ..

- విజయవాడ–ఖరగ్‌పూర్, విజయవాడ–నాగ్‌పూర్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు
- తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు
- విజయవాడ–గూడూరు మధ్య నాలుగో లైన్ నిర్మాణం
- కడప–బెంగళూరు రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పు

కొత్త రైళ్లు లేవు

- రాష్ట్రానికి కొత్త రైళ్ల కేటాయింపులోనూ రెడ్ సిగ్నలే చూపించింది. ఒక్క కొత్త రైలు కూడా వేయలేదు. రాష్ట్రం మీదుగా ఇప్పటికే నాలుగు వందే భారత్ రైళ్లు, 4 అమృత్ భారత్ రైళ్లు నిర్వహిస్తున్న విషయాన్నే రైల్వే శాఖ ప్రస్తావించింది. అంటే కొత్త రైళ్లు కేటాయించడం లేదని తేల్చి చెప్పింది.

ఈ ప్రాజెక్టులు ప్రశ్నార్థకమే

- రాష్ట్రంలో ఇతర కీలక రైల్వే లైన్ల నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దాంతో నత్తనడకను తలపిస్తున్న ఆ లైన్ల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందన్నది అగమ్యగోచరంగా మారింది.
- కాకినాడ–పిఠాపురం, మాచర్ల–నల్గొండ, కంభం–ప్రొద్దుటూరు, గూడూరు–దుగరాజపట్నం, కొండపల్లి–కొత్తగూడెం, భద్రాచలం–కొవ్వూరు, జగ్గయ్యపేట–మేళ్లచెరువు రైల్వే లైన్లకు నిధుల కేటాయింపుపై కేంద్రం చిత్తశుద్ధి చూపించలేదు.
- అమరావతి రైల్వే లైన్ గురించి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నది సుస్పష్టం. రూ.2,245 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదించినట్టు 2024 అక్టోబర్‌లో ప్రకటించినా నిధుల కేటాయింపుపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.
- అత్యంత కీలకమైన కడప–బెంగళూరు (255 కి.మీ.) రైల్వే లైన్‌పై కూడా కేంద్ర ప్రభుత్వం మొహం చాటేసింది.
- కోటిపల్లి–నర్సాపురం, నడికుడి–శ్రీకాళహస్తి, డోన్–అంకోలా రైల్వే లైన్ల గురించి కూడా పట్టించుకోలేదు.

STARS TWINKLE WHILE THE PLANETS DO NOT. WHY?

HUMAN EYE AND COLOURFUL WORLD

KEY WORDS

- **Prism:** A triangular object that can bend Light and split it into different colours.
- **Spectrum:** A band of colours produced when light is split by a prism.
- **Dispersion:** The process of splitting white light into it component colours.
- **Rainbow:** A natural phenomenon caused by the Dispersion of sunlight by water droplets in the air.
- **Dispersion:** The splitting of white light into colours is called dispersion.
- **Scattering of light:** The process of reemission of absorbed light in all directions with different intensities by the atom or molecule is called scattering of light.
- **Least distance of clear vision:** It is the least distance at which a person can see an object comfortably and distinctly.
- **Accommodation of eye lens:** The ability of eye lens to change its focal length is called accommodation of eye lens.
- **Angle of vision:** The maximum angle at which we are able to see the whole object is called angle of vision.
- **Myopia:** The defect in which people cannot see objects beyond far point is called Myopia.
- **Power of lens:** The degree of convergence or divergence of light rays that can be achieved by a lens is expressed in terms of its power.
  $P = \frac{1}{f}$
- **Prism:** A prism is a transparent medium separated from the surrounding medium by at least two plane surfaces which are inclined at certain angle in such a way that, light incident on one of the plane surfaces emerges from the other plane surface.
- **Angle of prism or refracting angle of prism:** The angle between the plane surfaces PQ and PR is called the angle of the prism or refracting angle of prism.
- **Angle of minimum deviation:** It is the minimum angle which the emergent ray makes with the incident ray. It depends upon angle of prism.
- **Hypermetropia:** The defect in which people cannot see objects before near point is called Hypermetropia.

1 MARK QUESTIONS

1. **Why does the sun appear white at noon.**
A. Light is Least Scattered.
2. **Why does clear sky appear blue.**
A. Violet and blue lights get scattered more than the lights of all other colours.
3. **What is the phenomenon of splitting white light into its constituent Colours called.**
A. Dispersion of light.
4. **What is the minimum distance of clear vision for human eye.**
A. (+) 25 cm.
5. **Name the part of the eye that controls the amount of light entering into the eye.**
A. Pupil
6. **State the colour of sunlight scattered by air molecules in the atmosphere.**
A. Blue
7. **Mention the name of a structure found in human eye that control size of the pupil.**
A. Iris
8. **Identify the part of human eye where image of an object is formed.**
A. Retina
9. **What kind of lens is present in the human eye?**
A. convex lens
10. **What is the scientific name of the near sightedness?**
A. Myopia

2 MARKS QUESTIONS

1. **Why do stars twinkle.**
A. *i.* Stars produce their own light and appear to twinkle because of how light bends in Earth's atmosphere.
ii. Because stars are distant they seems like tiny point of light.
iii. When star light passes through Earth's atmosphere it bends differently depending on the atmosphere layer (called atmospheric refraction)
iv. This causes stars to seem like they are twinkling Sometimes shining brighter and other times appearing fainter.
2. **Why does the sky sometimes appear white?**
A. i) In a hot day due to rise in the temperature. Water vapour enters into atmosphere which leads to abundant presence of water molecules in atmosphere.
ii) These water molecules scatter the colours of other frequencies (other than blue).
iii) All such colours of other frequencies reaches your eye and white colour is appeared.
3. **If a white sheet of paper is stained with oil, the paper turns transparent. Why?**
A. Paper material is made up of fibre. It has some refractive index. The paper is stained with oil. If the refractive index of oil is similar to that of paper, light passes from oil to paper. The light will not scatter and the paper become transparent.

4 MARKS QUESTIONS

1. **Give the differences between myopia and hyper metropia.**
Myopia
1. In Myopia one can see near by objects but cannot See distant objects clearly.
2. Image is formed infornt of retina.
3. The size of eye ball increases.
4. Focal length of eye lens decreases.
5. It can be corrected by Concave lens.
Hypermetropia.
1. In hypermetropia one can see distant objects but cannot see near by Objects clearly.
2. Image is formed behind retina.
3. The size of eyeball decreases.
4. Focal length of eye lens increases.
5. It can be corrected by using convex lens.
2. **Why does the sun appear reddish early in the morning?**
A. It is due to scattering of light. Light near the horizons passes thicker layers of air and larger distance of atmosphere. Hence most of the blue light is scattered away and longer wavelength reach our eyes giving rise to reddish colour of sun.
3. **Stars twinkle while the planets do not. Why?**
A. Continuously changing atmosphere refract light from the stars by different amounts from one moment to the other. When atmosphere refracts more starlight towards us the stars appears to be bright and when the atmosphere refracts less starlight then the stars appear to be dim. However the planets are nearer to us than the stars they appears to be comparatively bigger to us so they can not be considered as a point source, hence no twinkling is seen.
4. **Explain briefly the reason for the blue of the sky.**
A. i) Scattering of sunlight through molecules of atmosphere is the reason for the blue of the sky.
ii) Our atmosphere contains atoms and molecules of different sizes.
iii) According to their sizes they are able to scatter different wavelength of light.
iv) For example the size of the water molecule is greater than the size of the N_2 or O_2.
v) It acts as scattering centre for other frequencies which are lower than the frequency of blue light.
vi) Blue colour scatters more than other colours.
vii) That is why sky appears blue.
5. **How do you appreciate the working of ciliary muscles in the eye?**
A. i) The ciliary muscle to which eye lens is attached helps the eye lens to change its focal length by changing radii of curvature of eye lens.
ii) When the eye is focussed on a distant object, the ciliary muscles are relaxed so that the focal length of eye lens has its maximum value which is equal to its distance from the retina.
iii) When the eye is focused on a closer object the ciliary muscles are strained and focal length of eye lens decreases. The ciliary muscles adjust the focal length in a such a way that the image is formed on retina.
iv) This process of adjusting focal length is called accommodation.
v) Ciliary muscles are useful to see distant, closer objects clearly.

8 MARKS QUESTIONS

1. **Explain the correction of the eye defect Hypermetropia.**

Continued on next page..

A.



(a), (b) The myopic eye, and (c) correction for myopia with a concave lens

i) Eye lens can form a clear image on the retina when any object is placed beyond near point.

ii) To correct the defect of hypermetropia, we need to use a lens which forms an image of an object beyond near point. When the object is between near point (H) and least distance of distinct vision (L).

iii) This is possible only when a double convex lens is used.

2. Explain the formation of rainbow.



Rainbow formation

A. i) The rainbow is a spectrum of sunlight in nature.

ii) The rainbow is formed due to the dispersion of sunlight by water droplets suspended in the atmosphere after rainfall.

iii) This phenomenon is due to the combination of the refraction of sunlight by spherical water droplets. Which act as prisms and internal reflection occurs.

iv) Parallel beams of light coming from sun getting dispersed at different angles of deviation produce a cone of rays at the observer's eye.

v) Therefore the rainbow appears as an arc of a circle for an observer on the earth.

3. Explain the refraction of Light through prism with the help of neat diagram.

A. Aim: To Study the refraction of ray of light through a glass prism, measure the angle of incidence, angle of prism, angle of deviation and angle of emergence and hence establish the relation between these angles.

Apparatus required: A glass prism, a drawing sheet, drawing pins, a drawing board and geometry box



PE – Incident ray
EF – Refracted ray
FS – Emergent ray
$\angle A$ – Angle of the prism
$\angle i$ – Angle of incidence
$\angle r$ – Angle of refraction
$\angle e$ – Angle of emergence
$\angle D$ – Angle of deviation

Refraction of light through a triangular glass prism

Refraction of light through a triangular glass prism

Procedure:

1) Fix a Sheet of white paper on a drawing board using drawing pins.

2) Place a glass prism on it in such a way that it rests on its triangular base. Trace the one time of the prism using a pencil.

3) Draw a straight line PE inclined to one of the refracting surfaces, Say AB of the prism.

4) Fix two pins say at points P and Q on the line PE as shown in Figure

5) Look for the images of the pins fixed at P and Q through the other face AC.

6) Fix two more pins at points R and S such that the pins at R and S and the images of the pins at P and Q line on the same straight line.

7) Remove the PE meets the boundary of the prism at point E (See figure) similarly join and produce the points R and S. Let these lines meet the boundary of the prism E and F respectively. join E and F.

8) Draw perpendiculars to the refracting surfaces AB and AC of the prism at points E and F respectively.

9) Mark the angle of incidence $\angle i$ the angle of refraction $\angle r$ and the angle of emergence $\angle e$ as shown in figure.

Observations and conclusions:- As this incident ray PE Suffers refraction from air to glass at face AB, it bends towards the normal NN' along the path EF. Again as the ray EF Suffers refraction from glass to air at face AC, it bends away from the normal MM'. Thus the a emergent ray FS bends towards the base of the prism. we measure the angle of incidence i, angle of prism A, angle of emergence e and the angle of deviation D. It will be seen that

$i + \alpha = A + D$

4. Explain the following

a) Scattering of Light

b) Tyndall effect

A. a) Scattering of Light:

Scattering of Light is a Complex phenomena atoms or molecules that are exposed to light absorb light energy and emit some part of the light energy in different directions. This phenomenon is called the scattering of light.

Explanation :

Let us Consider that the free atom or free molecule is Some where in Space. Light of certain frequency faces on that atom or molecule. This atom or molecule respond to the light whenever the size of the atom or molecule is Comparable to the wave Length of Light. If this condition is satisfied, the atom absorbs light and vibrates. Due to these vibrations the atom reemits a certain fraction of absorbed energy in all direction with different intensities. The Re-emitted light is called scattering light and the process of re- emission of light in all directions with different intensities is called scattering of light. The atoms or molecules are called scattering centers.

b) Tyndall effect :

When light passes through a colloid its path becomes visible this is called the Tyndall effect.

Ex: The path of light becomes visible when light enters a dark and dusty room through a slit or ventilator.

Ex:

1) The path of light becomes visible when light enters a dark and dusty room through a slit or ventilator.

2) The path of light becomes visible when light passes through dense canopy of trees in a forest.

5. What is myopia, Explain the correction of the defect myopia?

A. Myopia:

1) The point of maximum distance at which the eye lens can form an image on the Retina is called for point.

2) The defect in which people cannot see objects beyond the for point is called myopia.

3) The eye lens Can form clear image on the retina, only when an object is placed between for point and point of least distance of distinct vision.

4) If we are able to bring the image of the object kept beyond far point, between for point and the point of least distance of distinct vision using lens, this image acts as an image object for the eye lens.



(a), (b) The myopic eye, and (c) correction for myopia with a concave lens

Correction of myopia:

1) This can be possible only when a Concave lens is used.

2) To correct one's myopia, we need to select a lens which forms an image at the for point for an object at infinity.

AV Sudhakar
School Assistant (PS),
ZPPHS Chennarayunipalem,
Bogole (M), SPSR Nellore

Daily Quiz

1. The main reason electrons produce heat while flowing through a conductor is..

A) Move in circular paths
B) Collide with lattice ions
C) Gain charge from the battery
D) Stop permanently

2. Why does electric shock become more dangerous if current flows for a longer time?

A) Body temperature decreases
B) Body resistance increases
C) Body tissues get damaged and resistance decreases
D) Voltage of supply reduces

3. In which direction do electrons move when an electric field is applied?

A) Same as the electric field
B) Perpendicular to the electric field
C) Opposite to the electric field
D) Randomly

4. Which device does NOT obey Ohm's law?

A) Copper wire
B) Iron rod
C) Nichrome wire
D) LED

5. Why does household appliances get damaged during overloading?

A) Low potential difference
B) Excess heating in wires
C) Increase in resistance of appliances
D) Decrease in current

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ రీసెర్చ్’ 2024 అధ్యయనం ప్రకారం మన దేశంలో 25 లక్షల మంది క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. గత ముప్పై ఏళ్లలో క్యాన్సర్ బాధితుల సంఖ్య 24 శాతం పెరగడమే ఇంత భారీ సంఖ్యకు కారణం. అయితే క్యాన్సర్ నయం చేయడంలో వైద్యంతో పాటు మనసును దృఢం చేయడం కూడా చాలా ముఖ్యం అంటున్నారు సైకో అంకాలజిస్ట్‌లు. క్యాన్సర్ పోరాటంలో బాధితునికి సైకో ఆంకాలజిస్ట్‌లు అందించే సహాయం ఏమిటి?

పోరాటానికి సిద్ధం చేసే సైకో ఆంకాలజీ

‘ఇటీవల మా అధ్యయనం ఏం చెబుతున్నదంటే క్యాన్సర్ ట్యూమర్‌తో పాటు మనసుకు కూడా వైద్యం చేయడం వల్ల క్లినికల్‌గా మంచి ఫలితాలు వస్తాయని. ఆంకాలజీ విభాగంలో సైకాలజీ ఇక ఎంత మాత్రం ఆప్షనల్ కాదు. తప్పనిసరి అవసరం’ అన్నారు న్యూఢిల్లీలోని ఎంఏసి క్యాన్సర్ కేర్ సెంటర్ వైద్యుడు డాక్టర్ నిఖిల్ హింతాని. ‘అందుకే దేశంలోని క్యాన్సర్ సెంటర్లలో సైకో ఆంకాలజిస్ట్‌ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది’ అన్నారాయన.

క్యాన్సర్ బారిన పడటం ఎవరికైనా కుంగదీసే విషయమే. క్యాన్సర్ నిర్ధారణ అయ్యాక ప్రతి పేషంట్‌కు తనవైన భావోద్వేగ సవాళ్లు ఉంటాయి. వాటిని ఎదుర్కొనడంతో పాటు వ్యాధిని ఎదుర్కొనాలి... ఈ రెంటి సమన్వయానికి కౌన్సిలింగ్ తప్పనిసరి అంటున్నారు క్యాన్సర్ నిపుణులు. అందుకే ఇప్పుడు క్యాన్సర్ మీద పోరాటంలో సైకో ఆంకాలజిస్ట్‌ల ప్రాధాన్యం పెరిగింది.

ఎవరీ సైకో ఆంకాలజిస్టులు?

క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించే నిపుణులను ‘ఆంకాలజిస్టు’ అంటారని తెలిసిందే. ఆ విభాగంలోనిదే ఈ ‘సైకో–ఆంకాలజీ’. సైకాలజీలో మాస్టర్స్ లేదా పిహెచ్‌డి చేసి, సైకో ఆంకాలజీని ప్రత్యేకంగా అధ్యయనం చేసిన వారు ‘సైకో ఆంకాలజిస్ట్‌లు’గా విధులకు సిద్ధమవుతారు. ఆంకాలజిస్ట్‌లతోటి, పేషంట్స్‌తోటి సమన్వయం చేసుకుంటూ పేషంట్ మనసుకు స్వాంతన ఇస్తూ వారిలో ధైర్యం నూరిపోయడం, క్యాన్సర్‌ను గెలవగలననే భరోసాను ఇవ్వడం వీరి ప్రధాన పని.

మానసిక ధైర్యమే కొండంత అండ

సైకో ఆంకాలజీలో పేషంట్‌కు అవసరాన్ని బట్టి ‘కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ’, ‘స్ట్రెస్ రిడక్షన్ టెక్నిక్స్’, ‘యాక్సెప్టెన్స్ అండ్ కమిట్‌మెంట్ థెరపీ’, ‘సపోర్టివ్ ఎక్స్‌ప్రెసివ్ థెరపీ’, ‘సైకో థెరపీ’, ‘ఫ్యామిలీ అండ్ కపుల్స్ థెరపీ’, ‘ట్రామా ఇన్‌ఫార్మ్‌డ్ థెరపీ’... వంటి అనేక థెరపీలు సైకో ఆంకాలజిస్టులు అందిస్తారు. ఎన్ని మందులు ఉన్నా వైద్యులు ఇచ్చే భరోసా వారిలో కొండంత బలాన్ని నింపుతుంది. క్యాన్సర్ మీద ఉన్న అనేక అపోహల కారణంగా ఈ వ్యాధికి గురైన వారు తీవ్ర మానసిక వేదనతో పాటు చుట్టూ ఉన్న వారి జాలిచూపులు, చికిత్స సమయంలో నొప్పి, తమకేమవుతుందోనన్న ఆందోళన, డబ్బు కోసం కుటుంబ సభ్యులు పడే ఆరాటం.. వీటన్నింటితో సతమతం అవుతుంటారు. సైకో–ఆంకాలజిస్టులు వారితో మాట్లాడి బతుకు మీద ఆశ కలిగించేందుకు ప్రయత్నిస్తారు.

క్యాన్సర్ నయమైన వారికీ అండగా..

క్యాన్సర్ నయమైన తర్వాత కూడా క్యాన్సర్ విజేతలకు అనేక ఆందోళనలు ఉంటాయి. చికిత్స వల్ల వారి శరీరంలో అనేక మార్పులు వస్తాయి. వాటిని తట్టుకోలేక కొందరు కుంగిపోతుంటారు. అటువంటి వారికీ ‘సైకో–ఆంకాలజీ’ అండగా ఉంటుంది. తిరిగి మేలైన జీవితాన్ని ఎలా ప్రారంభించాలో, ఎలా సహజంగా జీవించాలో నేర్పుతుంది. మానసిక ప్రశాంతత, ఆరోగ్య సూత్రాలు, ఒత్తిడి లేని జీవనాన్ని పాటించేలా సూచనలు చేస్తారు సైకో–ఆంకాలజిస్టులు. క్యాన్సర్ నయం కాగానే అంతా మామూలైపోయిందని చాలామంది భావిస్తుంటారు. అక్కడి నుంచే అసలైన సవాళ్లు మొదలవుతాయని నిపుణులు అంటున్నారు. ఆ మార్పులకు అనుగుణంగా వారిని సంసిద్ధం చేయడం అత్యవసరమని, దానికి ‘సైకో– ఆంకాలజీ’ తోడ్పడుతుందని అంటున్నారు.

దశాబ్ద కాలంగా ‘సైకో-ఆంకాలజీ’పై పెరుగుతున్న అవగాహన

మనదేశంలో ఎక్కువగా రొమ్ము, గొంతు, ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు ఉన్నారు. ఇందులో పురుషులు, స్త్రీలు బాధితులుగా ఉంటారు. వీరిలో ఒక్కొక్కరి ఒక్కో నేపథ్యం. పేద, మధ్యతరగతి ప్రజలు క్యాన్సర్ బారిన పడితే ఇక ఆ కుటుంబంలో నెలకొనే ఆందోళన గురించి చెప్పనక్కర్లేదు. ఈ క్రమంలో క్యాన్సర్‌కు గురైన వారు ధైర్యంగా ఉంటే మిగిలినవారూ ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. అందుకు ‘సైకో–ఆంకాలజీ’ కీలక భూమిక పోషిస్తుంది. గత పదేళ్లుగా దీనిపై అవగాహన పెరుగుతోంది. ‘క్యాన్సర్‌ని ఎదుర్కొవడం మాత్రమే కాదు, జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలునూ ఎదుర్కొనేలా వారిని సిద్ధం చేయడమే మా బాధ్యత’ అంటున్నారు ‘సైకో–ఆంకాలజిస్టులు’.

కోమలమైన చర్మానికి..

కొబ్బరి నూనెలో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ చర్మానికి మంచి తేమను అందిస్తాయి. ఇది పొడి చర్మం ఉన్నవారికి వరంలాంటిది. రాత్రి పూట నిద్రపోయేముందు ముఖాన్ని శుభ్రం చేసుకుని, నాలుగు చుక్కల కొబ్బరి నూనెను అరచేతిలో వేసుకుని ఫేస్‌కి సున్నితంగా మసాజ్ చేయాలి. దీనివల్ల నూనె చర్మంలోకి ఇంకి ఉదయానికి మృదువుగా మారుతుంది.

బాడీ స్క్రబ్: చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించడానికి ఈ నూనె పనిచేస్తుంది. కొబ్బరి నూనెలో కొంచెం పంచదార లేదా కాఫీ పొడి కలిపి స్క్రబ్‌లా చేసి చర్మానికి మసాజ్ చేస్తే కాంతివంతంగా మారుతుంది.

పగిలిన మడమలకు: రాత్రి పడుకునే ముందు మడమలకు కొబ్బరి నూనె రాసి, సాక్స్‌లు వేసుకుంటే వారం రోజుల్లోనే మంచి మార్పు కనిపిస్తుంది.

గోళ్ల సంరక్షణ: పొడి చర్మం వల్ల గోళ్ల చుట్టూ ఉండే చర్మం ఊడిపోతూ నొప్పిగా ఉంటుంది. రోజుకు ఒకసారి కొద్ది మొత్తంలో నూనెను గోళ్ల చుట్టూ రాస్తే సమస్య పరిష్కారమవుతుంది.

మేకప్ రిమూవర్: వాటర్ ప్రూఫ్ మేకప్‌ను కూడా కొబ్బరి నూనె సులభంగా తొలగిస్తుంది. రసాయనాలు లేని సహజసిద్ధమైన క్లెన్సర్‌గా పనిచేస్తుంది.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ: ఎగ్జిమా, చర్మంపై మంట వంటి సమస్యలు ఉన్నప్పుడు ఈ నూనె ఉపశమనాన్ని కలిగిస్తుంది.



యాంటీ బ్యాక్టీరియల్: ఇందులో ఉండే లారిక్ యాసిడ్ చర్మంపై ఉండే హానికర బ్యాక్టీరియాతో పోరాడుతూ చర్మాన్ని రక్షిస్తుంది.

సంగీతంలో ఆమె స్వరం

సంగీతం అంటే కాస్త కాలక్షేపం కాదు. మనసును కాంతిమంతం చేసే అద్భుతమైన అమృతం. ఒత్తిడి, దుఃఖాన్ని దూరం చేసే మంత్రదండం. స్వర విన్యాసాలతో సంగీత సాగరంలో తమదైన సంతకం చేసిన మహిళలు ఎంతోమంది ఉన్నారు. నేటి కాలంలో మహిళలు ఏ మేరకు సంగీతానికి ప్రాధాన్యత ఇస్తున్నారు? కెరీర్ అవకాశాల నుంచి పనిప్రదేశంలో భద్రత వరకు సంగీత రంగంలో మహిళలకు సంబంధించిన వివిధ విషయాల గురించి సంక్షిప్తంగా...

27.7 శాతం ఆర్టిస్టులు

12.5 శాతం సాంగ్ రైటర్స్

2.6 శాతం ప్రొడ్యూసర్‌లు

84.73% భారతదేశంలో 84.73 శాతం మంది మహిళలు ఒత్తిడిని తగ్గించే ప్రధాన సాధనంగా సంగీతాన్ని చూస్తున్నారు.

57% పురుషులతో (47 శాతం) పోలిస్తే మహిళలు (57 శాతం) తమ మ్యూజిక్ స్ట్రీమింగ్, పాడ్‌కాస్ట్ వినియోగాన్ని పెంచుకోవాలనుకుంటున్నారు.

52% 52 శాతం మంది మహిళలు మరింత ఎక్కువ సమయం సంగీతాన్ని వినాలనుకుంటున్నారు.

2.8% పాపులర్ మ్యూజిక్ రంగంలో కేవలం 2.8 శాతం మాత్రమే మహిళా మ్యూజిక్ ప్రొడ్యూసర్‌లు ఉన్నారు

58% భారతీయ సంగీత పరిశ్రమలో 58 మంది మహిళలు లింగ వివక్షను ఎదుర్కొంటున్నారు.

31% మహిళా నేపథ్య గాయనీమణులకు ప్రజాదరణ ఉన్నప్పటికీ, సంగీతానికి సంబంధించి మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. 31 శాతం మంది మహిళా నిపుణులు మాత్రమే తమ కెరీర్ గురించి సానుకూలంగా ఉన్నారు.

56% సంగీతం రంగంలో మహిళల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని 56 శాతం మంది అభిప్రాయపడుతున్నారు.

36% స్పాటిఫై ఇండియా నిర్వహించిన సర్వే ప్రకారం... 36 పని ప్రదేశాల్లో అభద్రతను ఎదుర్కొన్నామని 36 శాతం మంది మహిళలు చెప్పారు.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
ఫిబ్రవరి 2న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,52,920	1,52,000	1,47,170	1,52,640	1,49,000	1,52,180
బంగారం (22 క్యారెట్లు)	1,47,680	1,47,200	1,34,900	1,43,060	1,37,080	1,39,500
వెండి	2,60,000	2,69,000	3,00,000	2,69,000	2,50,000	3,00,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

విరిసిన సేద్య పద్మాలు!

వ్యవసాయం, పశుపోషణ, సహకార రంగాల్లో విశేష కృషి చేసిన 9 మందికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది. వీరిలో ఐదుగురు శాస్త్రవేత్తలు, ముగ్గురు రైతు శాస్త్రవేత్తలు, ఒకరు ప్రముఖ సహకార వేత్త.

భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ, పూసా) మాజీ సంచాలకులు డా. అశోక్ కుమార్ సింగ్ (బాస్మతి వరి రకాల అభివృద్ధి), జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ, మొక్కల రకాలు రైతుల హక్కుల ప్రాధికార సంస్థల మాజీ చైర్మన్ డా. పి.ఎల్. గౌతమ్ (జీవవైవిధ్య పరిరక్షణ చట్టం, రైతుల విత్తన హక్కుల రక్షణ చట్టం రూపశిల్పి), తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ మాజీ వైస్ చాన్స్‌లర్ డా. కె.రామస్వామి (క్లైమేట్ ఒత్తిళ్లను తట్టుకునే వ్యవసాయ పద్ధతులపై పరిశోధన), రాజేంద్ర ప్రసాద్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ డా. జి.ఎల్. త్రివేది (ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయాభివృద్ధి), తమిళనాడు వెటర్నరీ యూనివర్సిటీ మాజీ డీన్ డా. ఎన్. పుణ్యమూర్తి (ఎత్నో–వెటర్నరీ మెడిసిన్) పద్మశ్రీకి ఎంపికయ్యారు.

వీరితో పాటు రైతు శాస్త్రవేత్తలు దివంగత రఘుపత్ సింగ్ (ఉత్తరప్రదేశ్), జోగేష్ ద్యూరి (అస్సాం), శ్రీరంగ్ దేవబా లాడ్ (మహారాష్ట్ర), దివంగత సహకార వేత్త మామిడి రామారెడ్డి (తెలంగాణ) పద్మశ్రీ 2026 పురస్కారాలకు ఎంపికయ్యారు.

మాక్స్ చట్టం రూపశిల్పి రామారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమలో సహకార సంఘాల పాత్రను బలోపేతం చేసేందుకు 50 ఏళ్లపాటు పాటుపడిన దార్శనిక సహకార నేత మామిడి రామారెడ్డి(83)కి మరణానంతరం కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేయనుంది. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన స్వగ్రామం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సర్పంచ్‌గా, రాజేంద్రనగర్ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. సహకార సమాఖ్య, కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్‌ల ద్వారా సహకార వ్యవస్థ పటిష్టతకు రాజకీయాలకు అతీతంగా, స్వతంత్ర సహకార వేత్తగా నిబద్ధతతో సేవలందించారు. మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ (ఎంపీసీఎస్)లను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్‌లలో ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యాన్ని నిరోధించేందుకు జాతీయ స్థాయిలో ఉద్యమించి, చట్ట సవరణ సాధించారు. 1995లో మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(మాక్స్) చట్టం రూపకల్పనలో రామారెడ్డి కీలకపాత్ర పోషించారని 5 దశాబ్దాలుగా రామారెడ్డితో కలసి నడుస్తున్న సహకార ధర్మపీఠం వ్యవస్థాపక ధర్మకర్త సంభారపు భూమయ్య ‘సాక్షి సాగుబడి’తో చెప్పారు. సహకార రంగంలో పద్మశ్రీ పురస్కారాన్ని గెల్చుకున్న తొలి నేత రామారెడ్డి కావటం సంతోషదాయకమన్నారు. ముఖ్యంగా మహిళల నేతృత్వంలోని సహకార సంస్థలను, స్వయం సహాయక బృందాలను ఇతోధికంగా ప్రోత్సహించారు. వరంగల్, కరీంనగర్ ప్రాంత మహిళా సహకార డెయిరీ ఏర్పాటులో చోదక శక్తిగా నిలిచారని ఆయన తెలిపారు.

దూరదృష్టి గల నేత: ఎన్‌డీడీబీ

సహకార సంస్థలను బలోపేతం చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన దూరదృష్టి గల నాయకుడు మామిడి రామారెడ్డి పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక కావటం హర్షణీయమని జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ) పేర్కొంది. సహవికాస – సహకార అభివృద్ధి ఫౌండేషన్ ద్వారా మహిళా సాధికారతపై బలమైన దృష్టితో తెలంగాణ అంతటా గ్రామీణ జీవనోపాధి అవకాశాలను కల్పించారు. సహకార చట్టాలను రూపొందించడంలో, జాతీయ స్థాయి విధాన సంస్కరణల్లో కీలక పాత్ర పోషించారు. వేలాది మంది సభ్యుల యాజమాన్యంలోని స్వావలంబనతో కూడిన సహకార సంస్థలను ఆయన వారసత్వం విశ్వాసం, గౌరవం, స్థిరమైన గ్రామీణాభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళుతుందని ఎన్‌డీడీబీ ఆకాంక్షించింది.

శ్రీరంగ్ దేవబా లాడ్ (మహారాష్ట్ర)

వ్యవసాయ ఆవిష్కరణలతో ప్రసిద్ధి చెందిన రైతు శాస్త్రవేత్త శ్రీరంగ్ దేవబా లాడ్ (మహారాష్ట్ర). పత్తి ఉత్పత్తిని పెంచే ‘దాదా లాడ్ పద్ధతి’ని ఆయన అభివృద్ధి చేసినందుకు పద్మశ్రీ అందుకోనున్నారు. అధిక సాంద్రతలో పత్తి విత్తటం, మొక్కను 3 దశల్లో కొమ్మలు, పిలకలను కత్తిరించటం ద్వారా దిగుబడిని పెంచటం దాదా లాడ్ టెక్నిక్ ప్రత్యేకత. పత్తి పంట కాలాన్ని కుదించటం ద్వారా గులాబీ పురుగు బెడద నష్టాన్ని నివారించటం మరో ప్రయోజనం. నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ (సీఐసీఆర్) లాడ్ టెక్నిక్‌లో ప్రయోజకత్వాన్ని గుర్తించి, అధికారికంగా రైతులకు సిఫారసు చేయటం విశేషం. వర్షాధార, నీటిపారుదల సాగు పద్ధతుల్లోనూ సీఐసీఆర్ విస్తృత స్థాయిలో క్షేత్ర ప్రయోగాలు జరిపింది. ఈ టెక్నిక్ ద్వారా సగటున 48 నుంచి 76% వరకు పత్తి దిగుబడి పెరిగినట్లు రుజువైందని సీఐసీఆర్ ప్రకటించింది.

రఘుపత్ సింగ్ (ఉత్తరప్రదేశ్)

మొరాదాబాద్ జిల్లాలోని బిలారి ప్రాంతానికి చెందిన అభ్యుదయ రైతు రఘుపత్ సింగ్‌కు మరణానంతరం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేయనున్నారు. 55 పైగా అంతరించిపోతున్న కూరగాయల వంగడాలను సంరక్షించి రైతులకు తిరిగి పరిచయం చేశారు. దాదాపు 100 కొత్త రకాలను అభివృద్ధి చేశారు.

జోగేష్ ద్యూరి (అస్సాం)

ముగా పట్టు పరిరక్షణలో కీలక పాత్ర పోషించిన జోగేష్ ద్యూరి పద్మశ్రీని అందుకోనున్నారు. ఆయన కృషి వేలాది గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని పెంచింది. ముగా పట్టుకు ప్రపంచ గుర్తింపు తెచ్చిపెట్టింది.

హైదరాబాద్‌లో ‘రైతు బడి అగ్రి షో’

రైతులకు సరికొత్త నూతన వ్యవసాయ యంత్ర పరికరాలు, ఆధునిక సాగు పద్ధతులను పరిచయం చేసే లక్ష్యంతో ‘రైతు బడి అగ్రి షో’ పేరుతో భారీ వ్యవసాయ ప్రదర్శన జరగనుంది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో ఈ కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు రాజేందర్ రెడ్డి తెలిపారు. తమ వ్యవసాయాన్ని నవీకరించుకోవాలనే ఆలోచనతో ఉన్న రైతులు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఈ అగ్రి షో నిర్వహిస్తున్నామన్నారు. 500కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అనేక ప్రాంతాల నుంచి లక్ష మందికి పైగా రైతులు ఈ కార్యక్రమాన్ని సందర్శించే అవకాశం ఉందన్నారు. వివరాలకు.. 88971 19694.
www.rbagrishow.com

మైసూరులో నుంచి కిసాన్ స్వరాజ్ సమ్మేళనం

ఫిబ్రవరి 27, 28, మార్చి 1 తేదీల్లో కర్ణాటకలోని మైసూరులో దక్షిణ భారత కిసాన్ స్వరాజ్ సమ్మేళనం జరగనుంది. కర్ణాటక స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ సహకారంతో అలయన్స్ ఫర్ సస్టయినబుల్ హోలిస్టిక్ అగ్రికల్చర్ (ఆశా) ఈ ఆరవ సమ్మేళనాన్ని నిర్వహిస్తోంది. రెండేళ్లకోసారి ఈ ఉత్సవం జరుగుతుంది. 2022లోనూ మైసూరులోనే జరిగిన సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది పాల్గొన్నారు. పర్యావరణహితమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించే రైతులు, కార్యకర్తలు, శాస్త్రవేత్తలు, వినియోగదారులను ఒకచోట చేర్చే అఖిల భారత అనధికారిక, పౌర–స్వచ్ఛంద సేవకుల సమ్మేళనం ఇది. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, రైతుల హక్కులు, దేశీ వంగడాలు, వ్యవసాయ సంస్కృతి, కళల పరిరక్షణ లక్ష్యంతో చర్చాగోష్ఠులు, సదస్సులు నిర్వహిస్తారు. విత్తన సార్వభౌమత్వం, గడ్డి మందులను తట్టుకునే జన్యుమార్పిడి పంటలు/ కలుపు యాజమాన్యం, వ్యవసాయంలో శ్రమశక్తి, అడవి జంతువులతో పంటలకు ముప్పును తట్టుకునేదెలా?.. తదితర అంశాలపై లోతైన చర్చ జరుగుతుంది. పాల్గొనదలచిన వారు ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలి. 3 రోజులకు వసతి, భోజనం అన్నీ కలిపి రైతులు, విద్యార్థులకు రుసుము రూ. 1,500. మహిళా రైతులకు రూ. 800. ఇతరులకు 2,500–3,500. చివరి తేదీ ఫిబ్రవరి 15. ఇతర వివరాలకు.. 81055 79839.
kisanswarajsammelan2026@gmail.com

పశువైద్యంలో యాంటీబయాటిక్స్‌కు ప్రత్యామ్నాయం

పశువ్యాధుల చికిత్సలో యాంటీబయాటిక్స్ వాడకాన్ని 90% వరకు తగ్గించే సాంప్రదాయ మూలికా చికిత్స పద్ధతులను అభివృద్ధి చేసిన తమిళనాడు వెటర్నరీ యూనివర్సిటీ మాజీ డీన్ డా. ఎన్. పుణ్యమూర్తి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. సంప్రదాయ విజ్ఞానంతో కూడిన ఎత్నో–వెటర్నరీ మెడిసిన్ (ఈవీఎం)లకు శాస్త్రీయ ప్రామాణికతను నిరూపించటంలో, రైతుల చెంతకు చేర్చటంలో డా. పుణ్యమూర్తి విశేష కృషి చేశారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) మహమ్మారికి అసలైన పరిష్కారం ఈవీఎం చికిత్సలేనని డా. పుణ్యమూర్తి తెలిపారు. యాంటీబయాటిక్స్ అవసరం లేకుండానే పొదుగువాపు, గాలికుంటు వ్యాధి వంటి తీవ్ర జబ్బులను ఈవీఎం చికిత్సలతో సమర్థవంతంగా అరికట్టవచ్చని శాస్త్రీయ పరీక్షలతో పాటు రైతుల అనుభవంలోనూ రుజువైందన్నారు.

తమిళనాడు తంజావూరు సమీపంలోని వల్లం గ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన ఆయన పశువైద్యంలో డాక్టరేట్ చేసి, తమిళనాడు వెటర్నరీ యూనివర్సిటీ డీన్‌గా పనిచేసిన ఆయన 2001లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఆ తర్వాత కూడా బెంగళూరులోని టీడీయూ హెల్త్‌సైన్సెస్ అండ్ టెక్నాలజీతో కలిసి పరిశోధనలు కొనసాగించారు. యాంటీబయాటిక్స్ తదితర రసాయన ఔషధాలపై ఆధారపడకుండా తమ ఇంట్లోని దినుసులతోనే పశువ్యాధులకు రైతులే స్వయంగా చికిత్స చేసుకోవటానికి వీలుగా ఉండటం ఈవీఎంల ప్రత్యేకత. సిద్ధ వైద్య సూత్రాల ఆధారంగా సుమారు 50కి పైగా పశు వ్యాధులకు ఈవీఎం పద్ధతులను ఆయన రూపొందించారు. వీటి పనితీరును నిర్ధారించుకున్న జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ) దేశవ్యాప్తంగా పశుపోషకులకు కొన్ని సంవత్సరాల క్రితం నుంచే సిఫారసు చేస్తూ సత్ఫలితాలను నమోదు చేసింది. సంబంధిత చికిత్సల వీడియోలను తెలుగు సహా అన్ని ప్రాంతీయ భాషల్లో ఎన్‌డీడీబీ యూట్యూబ్ చానల్‌లో అందుబాటులో ఉన్నాయి.

‘మన దేశంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో స్వచ్ఛమైన పాలు, గుడ్లు, శుద్ధమైన పేడ, మూత్రం ఉత్పత్తికి ఈవీఎం చికిత్సల వ్యాప్తి ద్వారా కృషి చెయ్యటమే’ తన లక్ష్యమని డా. పుణ్యమూర్తి ‘సాక్షి సాగుబడి’తో చెప్పారు. పశువులు, కోళ్లకు వ్యాధులు రాకుండా చూడటం కోసం ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై ప్రస్తుతం తాను పరిశోధనలు చేస్తున్నానని తెలిపారు. యాంటీబయాటిక్ రహిత, రసాయన రహిత పశుపోషణ దిశగా తాను చేస్తున్న కృషికి పద్మశ్రీ పురస్కారం మరింత దోహదపడుతుందని ఆశిస్తున్నానన్నారు.

స్వచ్ఛమైన పాలు, గుడ్లు, పేడ, మూత్రం ఉత్పత్తే లక్ష్యం: డా. పుణ్యమూర్తి

ఈవీఎం చికిత్సలంటే?

పశువ్యాధులకు డా. పుణ్యమూర్తి సూచిస్తున్న ఎత్నో–వెటర్నరీ మెడిసిన్ (ఈవీఎం) చికిత్సల వివరాలను, ఆయన ఇంటర్వ్యూను తెలుగునాట పశుపోషకుల సౌకర్యార్థం 2026 జనవరి 30వ తేదీ నాటి ‘సాక్షి ఈ–పేపర్’లోని ‘సాగుబడి ప్లస్’ (22వ) పేజీలో ప్రచురించాం. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చెయ్యొచ్చు.

‘ఫైర్ ఓపెన్’ విజేత అనాహత్ సింగ్

భారత స్క్వాష్ యువ సంచలనం అనాహత్ సింగ్ తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకుంది. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) సర్క్యూట్‌లో భాగంగా జరిగిన ‘ఫైర్ ఓపెన్’ అంతర్జాతీయ టోర్నీలో అనాహత్ చాంపియన్‌గా అవతరించింది. 15 ఏళ్ల అనాహత్‌కు ఇదే తొలి ‘బ్రాంజ్ లెవెల్’ టైటిల్ కావడం విశేషం. టాప్ సీడ్, ప్రపంచ పదో ర్యాంకర్ జార్జినా కెన్నెడీ (ఇంగ్లండ్)తో జరిగిన తుది పోరులో ప్రపంచ 31వ ర్యాంకర్ అనాహత్ 12-10, 11-5, 11-7తో సంచలన విజయం నమోదు చేసింది. ఓవరాల్‌గా పీఎస్ఏ టూర్‌లో అనాహత్‌కిది 15వ సింగిల్స్ టైటిల్. గతంలో జార్జినాతో తలపడిన ఏకైకసారి ఓటమి పాలైన అనాహత్... ఈసారి మాత్రం ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా సాధికారిక ఆటతీరుతో అదరగొట్టింది. తొలి గేమ్‌లో ఒకదశలో 8-10తో వెనుకబడిన అనాహత్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 12-10తో గేమ్‌ను సొంతం చేసుకుంది. తొలి గేమ్ నెగ్గిన ఉత్సాహంతో మరింత జోరు పెంచిన ఈ ఢిల్లీ ప్లేయర్ వరుసగా మరో రెండు గేమ్‌లు గెలిచి టైటిల్‌ను దక్కించుకుంది. ‘చాలా సంతోషంగా ఉంది. అనుకున్న ప్రణాళికలను ఆచరణలో పెట్టి మంచి ఫలితం సాధించినందుకు ఆనందంగా ఉంది’ అని అనాహత్ వ్యాఖ్యానించింది.

తిలక్ వర్మకు బ్యాటింగ్ ప్రాక్టీస్

- 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38
- ‘వార్మప్’ మ్యాచ్‌లో అమెరికాపై భారత్ ‘ఎ’ జట్టు గెలుపు

ముంబై: భారత టి20 వరల్డ్ కప్ జట్టు సభ్యుడు, హైదరాబాదీ బ్యాటర్ ఠాకూర్ తిలక్ వర్మ పూర్తిగా కోలుకున్నాడు. శస్త్రచికిత్స అనంతరం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్న తిలక్ మ్యాచ్ ఫిట్‌గా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. దాంతో ప్రపంచకప్ అసలు పోరుకు ముందు జరిగే రెండు వార్మప్ మ్యాచ్‌ల ద్వారా అతనికి ప్రాక్టీస్ కల్పించాలని భావించిన సెలక్టర్లు భారత ‘ఎ’ జట్టులో చోటు కల్పించారు. సోమవారం అమెరికా జట్టుతో జరిగిన తొలి వార్మప్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన తిలక్ 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38 పరుగులు చేశాడు. బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లోనూ తిలక్ ఆడతాడు. వార్మప్ మ్యాచ్‌ల కోసం ప్రకటించిన భారత ‘ఎ’ జట్టులో తిలక్ మినహా మిగతా వారంతా వరల్డ్ కప్ టీమ్‌లో చోటు లేనివారే కావడం గమనార్హం! అమెరికాతో పోరులో భారత్ ‘ఎ’ 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. నారాయణ్ జగదీశన్ (55 బంతుల్లో 104; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) ‘శత’క్కొట్టగా... కెప్టెన్ ఆయుశ్ బదోని (26 బంతుల్లో 60 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా మెరిశాడు. దాంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. అనంతరం అమెరికా 19.4 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. ఆండ్రీస్ గూస్ (44), సంజయ్ కృష్ణమూర్తి (41) పర్వాలేదనిపించారు. భారత ‘ఎ’ బౌలర్లలో రవి బిష్ణోయ్ 3 వికెట్లు... ఖలీల్ అహ్మద్, నమన్ ధీర్ 2 వికెట్ల చొప్పున తీశారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

‘ఆడకుంటే మీకే నష్టం’

పాకిస్తాన్ బోర్డుకు ఐసీసీ హెచ్చరిక ● పరిష్కార మార్గం చూడాలని సూచన

సోమవారం కొలంబో విమానాశ్రయంలో పాక్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, షాదాబ్ ఖాన్

దుబాయ్: టి20 వరల్డ్ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడమంటూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీసుకున్న నిర్ణయంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్పందించింది. ఇప్పటికిప్పుడే దీనిపై తీవ్రంగా జవాబివ్వకపోయినా... వాస్తవ పరిస్థితులు వెల్లడిస్తూ పాక్‌కు ఒక రకమైన హెచ్చరిక జారీ చేసింది. వరల్డ్ కప్ మ్యాచ్ నుంచి అర్ధాంతరంగా తప్పుకుంటే ముమ్ముందు పాక్ క్రికెట్‌కే నష్టం జరుగుతుందని స్పష్టం చేసింది. ‘క్రీడా స్ఫూర్తి, పోటీతత్వం, పారదర్శకతపై ఆధారపడి ఐసీసీ టోర్నీలు జరుగుతాయి. ఎంపిక చేసుకున్న మ్యాచ్‌లలో ఆడతామంటే దాని విశ్వసనీయత దెబ్బ తింటుంది. పోటీకి అర్హత సాధించిన అన్ని జట్లూ ఒకే తరహా నిబంధనల ప్రకారం బరిలోకి దిగాలని ఐసీసీ ఆశిస్తోంది. జాతీయ విధానాల ప్రకారం ప్రభుత్వ జోక్యం ఉండటాన్ని మేం గౌరవిస్తాం కానీ ఇది ఆటకే కాకుండా క్రికెట్ వ్యవస్థ ద్వారా ప్రయోజనం పొందే పాక్ క్రికెట్‌కు కూడా మంచిది కాదు. జట్టుపై ఇది దీర్ఘ కాలం ప్రభావం చూపిస్తుందనే విషయాన్ని పీసీబీ అర్థం చేసుకోవాలి. ప్రపంచకప్‌ను సమర్థంగా నిర్వహించడంలో ఐసీసీతో పాటు పీసీబీకి కూడా బాధ్యత ఉంది. అందరికీ ఆమోదయోగ్యమయ్యే పరిష్కార మార్గాన్ని పాక్ కనుక్కుంటే అందరికీ మేలు చేస్తుంది’ అని ఐసీసీ ప్రకటన జారీ చేసింది. అయితే తాజా పరిణామాలపై చర్చించేందుకు ఐసీసీ బోర్డు సమావేశమయ్యే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. 12 శాశ్వత దేశాల ప్రతినిధులు, 3 అసోసియేట్ జట్లకు చెందిన ప్రతినిధులు ఐసీసీ బోర్డులో భాగంగా ఉన్నారు. ఇప్పటి వరకైతే ఐసీసీ అత్యవసర సమావేశంపై ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఈ అంశంపై చర్చ జరిగినా లేదా ఏదైనా చర్య తీసుకునేందుకు సిఫారసు చేసినా ఈ బోర్డు సమావేశంలోనే జరుగుతుంది.

భారీ నష్టానికి అవకాశం...

భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటే కేవలం ప్రసారకర్తలు, ప్రకటనల గురించే కాదు... ఆ మ్యాచ్ కారణంగా ప్రభావం చూపించే ఇతర అంశాలన్నీ కలిపితే మ్యాచ్ విలువ సుమారు 250 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2200 కోట్లు) ఉంటుందని అంచనా. 10 సెకన్ల ప్రకటన విలువ సుమారు రూ. 40 లక్షల వరకు ఉంటుంది కాబట్టి ప్రసారకర్తలకు నేరుగా రూ.250 కోట్ల వరకు నష్టం వాటిల్లవచ్చు. పీసీబీ వార్షిక ఆదాయం 35.5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.324 కోట్లు) మాత్రమే. ఇలాంటి స్థితిలో ఐసీసీ చర్య తీసుకుంటే పాక్ కోలుకునే అవకాశం ఉండదు. టోర్నీలో కూడా మ్యాచ్ ఆడకుండా 2 పాయింట్లు కోల్పోయేందుకు పాక్ సిద్ధమవుతున్నా... ఐసీసీ మ్యాచ్ నిబంధనల ప్రకారం పాయింట్లు మాత్రమే కాదు, రన్‌రేట్‌లో కూడా ఆ జట్టు పూర్తిగా వెనుకబడిపోతుంది.

సల్మాన్ ఆగా

మా ప్రభుత్వ నిర్ణయమది: సల్మాన్

భారత్‌తో మ్యాచ్ ఆడరాదని తమ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఇందులో ఆటగాళ్లు చేసేదేమీ లేదని పాకిస్తాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సల్మాన్ ఆగా అన్నాడు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశానికి కట్టుబడి ఉండాల్సిందేనని అతను వ్యాఖ్యానించాడు. ‘మేం బోర్డుతో కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లం. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మేం కట్టుబడి ఉండాల్సిందే. ప్రపంచకప్ అంటే భారత్‌తో మ్యాచ్ మాత్రమే కాదు కదా. లీగ్ దశలో మరో మూడు మ్యాచ్‌లు కూడా ఉన్నాయి. వాటన్నింటినీ గెలిచి ముందంజ వేసేందుకు ప్రయత్నిస్తాం’ అని సల్మాన్ చెప్పాడు. భారత్‌తో ఆడరాదనే పీసీబీ నిర్ణయానికి పాక్ మాజీ క్రికెటర్లు అఫ్రిది, యూసుఫ్, రషీద్ లతీఫ్, మొయిన్ ఖాన్, సర్ఫరాజ్ అహ్మద్ మద్దతు పలికారు.

పాక్ వెనక్కి తగ్గుతుంది: గావస్కర్



భారత్‌తో మ్యాచ్ ఆడబోమంటూ పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం త్వరలోనే మారిపోతుందని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అంచనా వేస్తున్నారు. పాక్ క్రికెట్‌లో ఇలాంటివి కొత్త కాదని, నాలుగు రోజుల తర్వాత అంతా సాధారణ స్థితికి వస్తుందని ఆయన అన్నారు. ‘నాలుగు రోజుల పాటు ఈ అంశంపై స్పందనలు చూసిన తర్వాత పీసీబీ తమ నిర్ణయం మార్చుకుంటుంది. ఇందులో కొత్తేమీ లేదు. పాక్ క్రికెటర్లంతా రిటైర్మెంట్ ప్రకటించడం... కొద్ది రోజులకే అభిమానులు మా ఆటను ఇంకా చూడాలనుకుంటున్నారు అంటూ రిటైర్మెంట్ ప్రకటన వెనక్కి తీసుకోవడం ఎన్నోసార్లు జరిగింది. పీసీబీ నిర్ణయంపై ఐసీసీ చర్య కూడా తీసుకోవచ్చు’ అని గావస్కర్ అభిప్రాయపడ్డారు. మరోవైపు పాక్ ఆడబోమని చెబుతున్నా...నిబంధనల ప్రకారం భారత జట్టు మ్యాచ్ కోసం కొలంబోకు ప్రయాణించాల్సి ఉంటుంది. మైదానానికి వెళ్లిన తర్వాత మరో జట్టు ఆడటం లేదని నిర్ధారణ అయ్యాకే ఐసీసీ రిఫరీ అధికారిక ప్రకటనతో మ్యాచ్ రద్దు అవుతుంది.

గుజరాత్ జెయింట్స్ బృందం

ఎవరిదో ‘ఫైనల్’ బెర్త్?

- నేడు డబ్ల్యూపీఎల్ ‘ఎలిమినేటర్’ మ్యాచ్
- ఢిల్లీ క్యాపిటల్స్‌తో గుజరాత్ జెయింట్స్ ‘ఢీ’
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

జెమీమా, శ్రీచరణి

వడోదర: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఇప్పటి వరకు మూడు సీజన్లు జరగ్గా ఢిల్లీ క్యాపిటల్స్ మూడు సార్లూ ఫైనల్‌కు చేరింది. అయితే దురదృష్టవశాత్తూ ప్రతీసారి ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇప్పుడు మరోసారి ఫైనల్ చేరాలని ఆ జట్టు పట్టుదలగా ఉంది. మరోవైపు గుజరాత్ జెయింట్స్ తొలి రెండు సీజన్లలో ఆఖరి స్థానానికే పరిమితం కాగా... గత ఏడాది మాత్రం రెండో స్థానంతో ఎలిమినేటర్‌కు అర్హత సాధించినా... అదే మ్యాచ్‌లో ఓడి నిష్క్రమించింది. ఈసారైనా ఆ దశను దాటి తొలిసారి తుది పోరుకు చేరాలని జట్టు భావిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు ఢిల్లీ, గుజరాత్ జట్ల మధ్య ‘ఎలిమినేటర్’ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో గురువారం జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తలపడుతుంది.

స్పిన్నర్లు కీలకం...

గత మూడు సీజన్లలో గ్రూప్ దశలో అగ్ర స్థానంతో ఢిల్లీ ఫైనల్‌కు చేరింది. ఈసారి కాస్త తడబాటును ప్రదర్శించిన జట్టు ఇప్పుడు ఫైనల్ కోసం ఎలిమినేటర్‌లో ఆడుతోంది. బ్యాటింగ్ పరంగా చూస్తే టాప్-5తో జట్టు మెరుగ్గా కనిపిస్తోంది. ఓపెనర్లు లిజెల్ లీ, షఫాలీ వర్మ శుభారంభం అందిస్తే జట్టుకు విజయావకాశాలు మెండుగా ఉంటాయి. తర్వాతి బ్యాటర్లలో లారా వోల్వార్ట్, కెప్టెన్ జెమీమా, మరిజాన్ కాప్ చకచకా పరుగులు రాబట్టగలరు. అయితే టీమ్ ప్రధానంగా స్పిన్నర్లపై ఆధారపడుతోంది. శ్రీచరణి, స్నేహ్ రాణా, నందిని శర్మ ప్రత్యర్థి బ్యాటర్లను నిలువరించగల సమర్థులు.

సమష్టి ప్రదర్శనపై భారం...

విదేశీ క్రికెటర్ల ప్రదర్శనతోనే తాజా సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ ముందంజ వేసిందనడంలో సందేహం లేదు. ముగ్గురు ఆస్ట్రేలియన్లు కెప్టెన్ యాష్లీ గార్డ్‌నర్, బెత్ మూనీ, జార్జియా వేర్‌హామ్ తమ ఆటతో ప్రతీసారి ప్రభావం చూపించగా, న్యూజిలాండ్ సీనియర్ స్టార్ ప్లేయర్ సోఫీ డివైన్ ఆల్‌రౌండర్‌గా సత్తా చాటింది. మరోసారి జెయింట్స్ ఈ ప్లేయర్లపైనే ఆధారపడుతోంది. భారత ఆటగాళ్లలో అనుష్క శర్మ మాత్రమే మూడో స్థానంలో చెప్పుకోదగ్గ రీతిలో రాణించింది. గుజరాత్ ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు గెలవగా... ఐదుసార్లు తొలుత బ్యాటింగ్ చేసి విజయాన్నందుకోవడం విశేషం.

సాక్షి సినిమా

జోడీ రిపీట్

సాయి పల్లవి, ధనుష్

ధనుష్, సాయిపల్లవి జోడీ రిపీట్ అవుతోంది. ధనుష్ హీరోగా ‘అమరన్’ ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ‘డీ 55’(వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కనుంది. వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్ టెక్ స్టూడియోస్ సంస్థలు నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది. ఈ మూవీలో ఓ హీరోయిన్‌గా శ్రీలీల నటించనున్న విషయం తెలిసిందే. మరో హీరోయిన్‌గా సాయిపల్లవి నటించనున్నట్లుగా సోమవారం ప్రకటించారు మేకర్స్. గతంలో ‘మారి 2’ (2018) చిత్రంలో ధనుష్, సాయిపల్లవి జోడీగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రంలోని ‘రౌడీ బేబీ...’ సాంగ్ కూడా అప్పట్లో బాగా పాపులర్ అయ్యింది. అలాగే ‘అమరన్’ వంటి హిట్ మూవీ తర్వాత దర్శకుడు రాజ్‌కుమార్ పెరియ సామితో సాయిపల్లవి చేస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారట ధనుష్ అండ్ టీమ్. ఈ సినిమాకు సంగీతం: సాయి అభ్యంకర్.

ముంబైకి ముత్తువేల్ పాండ్యన్

రజనీకాంత్

ముంబై వెళ్లనున్నారట ముత్తువేల్ పాండ్యన్. హీరో రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రూపొందిన సినిమా ‘జైలర్’. 2023లో విడుదలైన ఈ మూవీ సూపర్‌హిట్‌గా నిలిచింది. వీరి కాంబినేషన్‌లోనే ‘జైలర్’కి సీక్వెల్‌గా ‘జైలర్ 2’ తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ ముత్తువేల్ పాండ్యన్ పాత్రలో నటిస్తున్నారు రజనీకాంత్. రమ్యకృష్ణ, యోగిబాబు, ఎస్‌జే సూర్య, విజయ్‌సేతుపతి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ అతి త్వరలోనే ముంబైలో ప్రారంభం కానుందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్-షారుక్‌ఖాన్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట నెల్సన్ దిలీప్ కుమార్. ఈ సినిమాలో రజనీకాంత్ స్నేహితుడు పాత్రలో షారుక్‌ఖాన్ నటిస్తున్నారని సమాచారం. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ‘జైలర్ 2’ ఈ జూన్‌లో విడుదల కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... రజనీకాంత్ 173వ సినిమాకు సిబి చక్రవర్తి దర్శకత్వం వహించనున్నారు. అయితే ఆయన 174వ చిత్రానికి నెల్సన్ దిలీప్ కుమార్, 175వ మూవీకి అట్లీ దర్శకత్వం వహిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే ఈ చిత్రాలపై అధికారిక ప్రకటన రావాలి.

బరాబర్ ప్రేమిస్తాని ఆదరించాలి

- జేడీ చక్రవర్తి

ఆది, పూజా బేడి, చంద్రహాస్, మేఘన, జేడీ చక్రవర్తి

‘‘**కా**నిస్టేబుల్‌గా తన జీవితం ప్రారంభించి బుల్లితెరపై స్టార్‌గా ఎదిగాడు ప్రభాకర్. తన కుమారుడు చంద్రహాస్ నటించిన ‘బరాబర్ ప్రేమిస్తా’ని ప్రభాకర్ కోసం కచ్చితంగా చూస్తాను. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని నటుడు జేడీ చక్రవర్తి తెలిపారు. చంద్రహాస్, మేఘనా ముఖర్జీ జోడీగా నటించిన చిత్రం ‘బరాబర్ ప్రేమిస్తా’. సంపత్ రుద్ర దర్శకత్వం వహించారు. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సీసీ క్రియేషన్స్, ఏవీఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మించారు. ఈ మూవీ ఈ నెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకుడు జయంత్ సి. పరాన్జీ, హీరోలు జేడీ చక్రవర్తి, ఆది సాయి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జయంత్ సి. పరాన్జీ మాట్లాడుతూ-‘‘బరాబర్ ప్రేమిస్తా’ అనే టైటిల్‌లోనే యాటిట్యూడ్, కాన్ఫిడెన్స్, పొగరు ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది’’ అని చెప్పారు. ఆది సాయి కుమార్ మాట్లాడుతూ- ‘‘బరాబర్ ప్రేమిస్తా’ తో చంద్రహాస్‌కి మంచి బ్రేక్ రావాలి’’ అని పేర్కొన్నారు. ‘‘మా సినిమా అద్భుతంగా ఉంటుంది’’ అన్నారు చంద్రహాస్. ‘‘తెలంగాణ నేపథ్యంలో ఇప్పటి వరకు మాలాంటి చిత్రం రాలేదు’’ అని సంపత్ రుద్ర పేర్కొన్నారు. ‘‘మా చిత్రాన్ని అందరూ సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం’’ అని నిర్మాతలు చందు, చిన్ని, వెంకీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి, హీరోయిన్ మేఘన ముఖర్జీ, నటీనటులు పూజా బేడి, ప్రభాకర్, అర్జున్ మహి, మ్యూజిక్ డైరెక్టర్ ధ్రువన్ మాట్లాడారు.

ది ఇండియా హౌస్‌తో ఎంట్రీ



శాశ్వత్ సచ్‌దేవ్

నిఖిల్ సిద్ధార్థ హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం ‘ది ఇండియా హౌస్’. రామ్ వంశీ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సయీ మంజ్రేకర్ కథానాయికగా, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. రామ్ చరణ్ సమర్పణలో వి మెగా పిక్చర్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్లపై అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ కంపోజర్ శాశ్వత్ సచ్‌దేవ్ ‘ది ఇండియా హౌస్’ ద్వారా తెలుగులోకి అడుగుపెడుతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ‘‘ధురంధర్, ఉరి: ది సర్జికల్ స్ట్రైక్, ఆర్టికల్ 370’ చిత్రాలతో పాపులర్ అయిన శాశ్వత్ సచ్‌దేవ్ మా సినిమా ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. ఇప్పటికే ఐదు ఆకట్టుకునే పాటలను కంపోజ్ చేశారాయన. 1905 నాటి రాజకీయ నేపథ్యంలో రూపొందుతోన్న ‘ది ఇండియా హౌస్’ విప్లవం, ప్రేమ, త్యాగం.. వంటి భావోద్వేగాలో అద్భుతంగా ఉండబోతోంది. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: మయాంక్ సింఘానియా, కెమెరా: కేకే సెంథిల్ కుమార్.

ధీరజ్, అశ్విన్, మానస, సంతోష్ శోభన్, అజయ్‌కుమార్

నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది

- సంతోష్ శోభన్

‘‘**నే**ను చిన్న విరామం తీసుకున్న మాట నిజమే. నేను చూపించబోయే కథ ఇరవై ఏళ్ల పాటు ప్రేక్షకులకు గుర్తుండిపోవాలనుకుని ‘కపుల్ ఫ్రెండ్లీ’ సినిమా చేశాను. ఈ మూవీలో నేను చేసిన శివ పాత్రలో మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తాను. ఒక జెన్యూన్ ఇంటెన్షన్, హానెస్ట్‌గా చేసిన ‘కపుల్ ఫ్రెండ్లీ’ నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది’’ అని సంతోష్ శోభన్ తెలిపారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం ‘కపుల్ ఫ్రెండ్లీ’. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. అజయ్ కుమార్ రాజు.పి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 14న తెలుగు, తమిళంలో విడుదలవుతోంది. ఈ మూవీని ఏపీ, తెలంగాణలో ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని రిలీజ్ చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అశ్విన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ- ‘‘కపుల్ ఫ్రెండ్లీ’ చూస్తున్నప్పుడు ఒక నిజాయితీ ప్రయత్నం చేశారనే అనుభూతి ప్రేక్షకుల్లో కలుగుతుంది’’ అని చెప్పారు. ‘‘ఈ చిత్రంలో మిత్ర అనే అందమైన పాత్ర చేయడం సంతోషంగా ఉంది’’ అన్నారు మానస వారణాసి. ‘‘కపుల్ ఫ్రెండ్లీ’ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమా తర్వాత సంతోష్ శోభన్ స్టార్ అవుతారు’’ అని ధీరజ్ మొగిలినేని పేర్కొన్నారు. కో ప్రొడ్యూసర్ అజయ్ కుమార్ రాజు, ‘ఆదిత్య’ మ్యూజిక్ నిరంజన్ మాట్లాడారు.

మహిళల కోసం...

పళని, వెంకటేష్, రంజన

వెంకటేష్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్, హీనా సోని హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘వన్ బై ఫోర్’. ‘బాహుబలి’ పళని దర్శకత్వంలో రంజన రాజేష్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ నిర్మించిన ఈ సినిమా జనవరి 30న విడుదలైంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ-‘‘ఈ సినిమా కోసం మేమంతా ఎంతో కష్టపడ్డాం. మంచి సినిమా చేశారని అంటున్నారు. మహిళలు చూడాల్సిన చిత్రం ఇది’’ అన్నారు. ‘‘కంటెంట్ బాగుంటే చిన్న చిత్రానికి కూడా విజయం చేకూరుతుందని మరోసారి ప్రేక్షకులు నిరూపించారు’’ అని ‘బాహుబలి’ పళని తెలిపారు. ‘‘బ్లాక్ మెయిలింగ్ వల్ల ఓ మహిళ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంది? అన్నదే ఈ సినిమా కథ’’ అని చెప్పారు రంజన రాజేష్. ‘‘మా సినిమా హీరోయిన్లు ప్రమోషన్స్‌లో పాల్గొనకపోవడంతో నష్టం జరిగింది’’ అని రోహిత్ రాందాస్ గుంజల్ పేర్కొన్నారు.

వింటర్ ఆరంభం

కుసుమ, రామ్

రామ్, ఆదిత్య సూరజ్ సింగ్, రిజ్వాన్ అలీ, కుసుమ చందక, శశికళ, శ్రీ జిత ఘోష్ ప్రధాన పాత్రల్లో రూపొందనున్న చిత్రం ‘వింటర్’. ‘రాచరికం’ మూవీ ఫేమ్ సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో రియాజ్ అహ్మద్, టి. శ్రీనివాసరావు నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ‘‘కశ్మీర్‌లో జరిగిన వాస్తవ ఘటనలతో రూపొందుతున్న సినిమా ‘వింటర్’’ అని యూనిట్ పేర్కొంది.

భక్తి నేపథ్యంలో...

సత్యవాణి, సుబ్బు, తోట కృష్ణ

సుబ్బు, ప్రియాంక జంటగా, అర్చన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘దక్షిణ కాళీ’. తోట కృష్ణ దర్శకత్వం వహించారు. శ్రీనిధీ క్రియేషన్స్‌పై సత్యవాణి మీసాల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న తెలుగు, తమిళ, కన్నడలో విడుదలవుతోంది. రాజేందర్ ఫిలింస్ ఈ చిత్రాన్ని తెలుగులో పంపిణీ చేస్తోంది. ఘంటాడి కృష్ణ సంగీతం అందించిన ఈ మూవీ ఆడియో లాంచ్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దర్శకుడు వి. సముద్ర, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ హాజరై, ‘‘దక్షిణ కాళీ’ పాటలు, ట్రైలర్ బాగున్నాయి. సినిమా మంచి విజయం సాధించాలి’’ అని తెలిపారు. ‘‘అమ్మవారి మహిమలు తెలిపేలా భక్తి నేపథ్యంలో ఈ సినిమా తీశాం’’ అన్నారు తోట కృష్ణ. ‘‘దక్షిణ కాళీ అమ్మవారి గొప్పదనం, మహిమలు తెలిపేందుకే ఈ సినిమా నిర్మించాం’’ అని సత్యవాణి మీసాల చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు ఆజాద్ మాట్లాడారు.

మహా శివరాత్రికి...

విరాట్ కర్ణ

విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న చిత్రం ‘నాగబంధం’. నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లు. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీ టీజర్‌ను మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 15న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ పేర్కొంది. ‘‘ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది’’ అని మేకర్స్ తెలిపారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
3-2-2026

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
944	263
81,666	25,088

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	23,651	▲	189
డోజోన్స్	49,393	▲	501
ఎఫ్‌టీఎస్ఈ 100	10,336	▲	112
డాక్స్	24,844	▲	305
షాంఘై	4,016	▼	102
నికాయ్	52,655	▼	668

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భామస్‌కుక్	90.15	93.17
£	బ్రిటన్ పౌండ్	భామస్‌కుక్	124.16	128.62
€	యూరో	భామస్‌కుక్	107.47	111.49
¥	జపాన్ యెన్ (100)	భామస్‌కుక్	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భామస్‌కుక్	62.07	66.00
S$	సింగపూర్ డాలర్	భామస్‌కుక్	70.23	73.99
SAR	సౌదీ రియాల్	భామస్‌కుక్	23.63	25.14
UAE D	యూఏఈ దిర్హామ్	భామస్‌కుక్	24.15	25.42
¥	చైనా యువాన్	భామస్‌కుక్	12.36	14.18

తయారీ రికవరీ

- జనవరిలో పీఎంఐ 55
- పెరిగిన కొత్త ఆర్డర్లు

న్యూఢిల్లీ: దేశ తయారీ రంగం జనవరిలో కాస్తంత పుంజుకుంది. వ్యాపార విశ్వాసం మూడున్నరేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయినప్పటికీ.. కొత్త ఆర్డర్ల రాక పెరగడం పనితీరు మెరుగుదలకు దారితీసింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జనవరిలో 55.4 పాయింట్లకు చేరింది. గత డిసెంబర్‌లో ఇది 55గా ఉంది. సాధారణంగా 50 పాయింట్లకు పైన విస్తరణగా, అంతకు దిగువన తగ్గుదలగా పరిగణిస్తుంటారు. ''కొత్త ఆర్డర్ల రాక పెరగడం, ఉత్పత్తి, ఉపాధి కల్పన ఫలితంగా తయారీ రంగం జనవరిలో పుంజుకుంది. ముడి సరుకుల వ్యయాలు మోస్తరుగా, నాలుగు నెలల్లో అత్యధికంగా పెరిగాయి. ఫ్యాక్టరీ ధరల పెరుగుదల నెమ్మదించింది. దీంతో తయారీదారుల మార్జిన్లపై స్వల్పంగా ఒత్తిడి నెలకొంది''అని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు.

హ్యుందాయ్ లాభం అప్

క్యూ3లో రూ. 1,234 కోట్లు

న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతంపైగా పుంజుకుని రూ. 1,234 కోట్లను అధిగమించింది. జీఎస్‌టీ సంస్కరణలకుతోడు పండుగల సీజన్ డిమాండ్ అమ్మకాలు పుంజుకునేందుకు సహకరించాయి. దీంతో ఫలితాలపై సానుకూల ప్రభావం పడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,161 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 16,648 కోట్ల నుంచి రూ. 17,973 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 15,330 కోట్ల నుంచి రూ. 16,551 కోట్లకు పెరిగాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
టాప్‌గేర్‌లో ఆటో సేల్స్ | స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో ఐఫోన్‌దే రాజ్యం

గ్లోబల్ అనిశ్చితి వల్లే గోల్డ్ రష్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: వినియోగాన్ని పెంచుతూ, వృద్ధికి దోహదపడే సాధనంగా పెట్టుబడులను ప్రభుత్వం పరిగణిస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కొత్త ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఈ ధోరణినే ప్రతిఫలిస్తోందని పేర్కొన్నారు. నిర్దేశిత ద్రవ్య లోటు లక్ష్యాన్ని చూస్తే వృద్ధి సాధనకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. 2026–27 బడ్జెట్‌పై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితి వల్లే పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయని, అనేక సెంట్రల్ బ్యాంకులు కూడా బంగారంలో ఇన్వెస్ట్ చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇన్వెస్టర్లకు ఏ కరెన్సీపైనా నమ్మకం లేకపోవడాన్ని, అందుకే పసిడి వైపు మొగ్గుచూపడాన్ని ఇది తెలియజేస్తోందని ఆమె వివరించారు.

స్పెక్యులేటివ్ డెరివేటివ్ ట్రేడింగ్ జోలికి వెళ్లకుండా సామాన్యులను నిలువరించేందుకే ఎఫ్అండ్‌వోపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ)ని పెంచినట్లు వివరించారు. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అధ్యయనం ప్రకారం 90 శాతం మంది పైగా రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్అండ్‌వో సెగ్మెంట్లో తీవ్ర నష్టాల పాలవుతున్నారని వెల్లడైన నేపథ్యంలో ఎస్‌టీటీ పెంపు నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకున్న సంగతి తెలిసిందే. 'స్పెక్యులేషన్ అత్యధికంగా ఉంటున్న ఎఫ్అండ్‌వో ట్రేడింగ్‌తో తమ పిల్లలు తీవ్రంగా డబ్బు నష్టపోతున్నారని, ప్రభుత్వమే జోక్యం చేసుకోవాలని కోరుతూ చాలా మంది తల్లిదండ్రుల నుంచి నాకు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఎస్‌టీటీని పెంచడం వల్ల ఎఫ్అండ్‌వో ట్రేడింగ్ చేయకుండా కొంత నిరోధించేందుకు వీలవుతుంది' అని మంత్రి చెప్పారు.

ఆర్థిక పరిస్థితిని బట్టి ద్రవ్యలోటు లక్ష్యం ఒక్కో సంవత్సరంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను బట్టి **ద్రవ్య లోటు** లక్ష్యాలు ఆధారపడి **ఉంటాయని** నిర్మలా సీతారామన్ చె**ప్పారు. గతం**లో క్రితం ఆర్థిక సంవ**త్సరం కన్నా** కాస్త తక్కువ ఉండేలా **ప్రతి ఏటా** ద్రవ్య లోటు లక్ష్యాలు **విధించుకునే** విధానం ఉండేదని ఆమె **తెలిపారు.** ఈసారి వృద్ధికి **మరింత** ప్రాధాన్యమిస్తున్నందున **4.3** శాతం ద్రవ్య లోటు **సౌకర్యవంత**మైన స్థాయే అనే ప్రభు**త్వం భావి**స్తోందని మంత్రి వివ**రించారు.** డిజిన్వెస్ట్‌మెంట్, అసెట్ **మానిటై**జేషన్ యథాప్రకారంగా**నే కొన**సాగుతాయన్నారు. **పన్నుయే**తర ఆదాయాలను **బట్టి** ప్రభుత్వ రంగ **బ్యాంకుల్లో** వాటాల విక్రయ పరిస్థి**తి ఆధా**రపడి ఉంటుందని **నిర్మలా** సీతారామన్ చెప్పారు.

వెండి వికెట్ డౌన్

మరో రూ.52,000 పతనం ● రూ. 2.60 లక్షలకు చేరిక

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా బలహీన ట్రెండ్స్, డాలరు బలపడుతుండటంలాంటి అంశాల కారణంగా వెండి ధరల పతనం వరుసగా మూడో రోజూ కొనసాగింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలోకి రూ. 52,000 క్షీణించి రూ. 2.60 లక్షలకు తగ్గింది. అటు 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం 10 గ్రాముల రేటు కూడా మరో రూ. 12,800 తగ్గి రూ. 1,52,700కి దిగి వచ్చింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో గత మూడు సెషన్స్‌లో వెండి రూ. 1,44,500 (సుమారు 36 శాతం), పసిడి రూ. 30,300 (దాదాపు 17 శాతం) క్షీణించాయి. టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెత్తబడుతుండటం, అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, అమెరికా షట్‌డౌన్‌పై ఆందోళనలు తగ్గుముఖం పట్టడంలాంటి సానుకూలాంశాల వల్ల డాలరు బలపడటంతో వెండి, బంగారం తగ్గుతున్నాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోదీ తెలిపారు. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో బంగారం ఔన్సుకి (31.1 గ్రాములు) 83.75 డాలర్లు క్షీణించి 4,781.60 డాలర్లకు దిగి వచ్చింది. వెండి ధర సైతం 1.2 డాలర్లు తగ్గి 83.49 డాలర్లకు పరిమితమైంది.

ఫ్యూచర్స్‌లో రికవరీ.. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ఇంట్రాడేలో రూ. 10,688 పతనమైనప్పటికీ, తర్వాత పుంజుకుని క్రితం ముగింపుతో పోలిస్తే రూ. 258 పెరిగింది. రూ. 1,48,012కి చేరింది. వెండి కూడా ఇంట్రాడేలో రూ. 39,847 (15 శాతం) క్షీణించి రూ. 2,25,805 వద్ద లోయర్ సర్క్యూట్‌ని తాకింది. తర్వాత కొంత పుంజుకుని రూ. 2,50,242కి రికవర్ అయ్యింది.

ప్రభుత్వ బ్యాంకులకు పెట్టుబడుల పుష్

49 శాతానికి ఎఫ్‌డీఐ పరిమితి పెంపు యోచనలో ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: పీఎస్‌యూ బ్యాంకులలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐలు) పరిమితిని పెంచే యోచనలో ఆర్థిక శాఖ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత 20 శాతం పరిమితిని 49 శాతానికి పెంచాలని చూస్తున్నట్లు ఆర్థిక సర్వీసుల కార్యదర్శి ఎం.నాగరాజు పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల మూలధనస్థాయిని బలపరిచేందుకు వీలుంటుందని తెలియజేశారు. ఇందుకు అంతర్మంత్రిత్వ శాఖలతో చర్చిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం పీఎస్‌యూ బ్యాంకు(పీఎస్‌బీ)లలో ఎఫ్‌డీఐ పరిమితి 20 శాతంకాగా.. ప్రయివేట్ రంగ బ్యాంకులకు 74 శాతంగా అమలవుతోంది. అయితే 49 శాతంవరకూ ఆటోమేటిక్ మార్గంలో అను మతిస్తారు. ఆపై 74 శాతంవరకూ ప్రభుత్వ అనుమతిని పొందవలసి ఉంటుంది. నిజానికి 2020 నుంచి 12 పీఎస్‌బీలలో ప్రభు త్వం వద్దగల షేర్ల సంఖ్యలో మార్పులేనప్పటికీ కొన్ని బ్యాంకులలో వాటా శాతాలు మార్పులకు లోనయ్యాయి. ఆయా బ్యాంకులు మూలధన సమీకరణకు కొత్తగా షేర్లను జారీ చేయడం ప్రభావం చూపింది. కాగా.. ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా విక్రయానికి సంబంధించి ఈ నెల లో లేదా వచ్చే నెలలో ఫైనాన్షియల్ బిడ్స్ ను ఆహ్వానించనున్నట్లు నాగరాజు తెలియజేశారు.

సెన్సెక్స్ రివర్స్ ర్యాలీ

944 పాయింట్లు జూమ్

ముంబై: బడ్జెట్ రోజు పతనంలో భాగంగా కనిష్ట స్థాయిలకు దిగి వచ్చిన నాణ్యమైన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం 1% లాభపడింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగిరావడం, ఫారెక్స్ మార్కెట్లో పుంజుకున్న రూపాయి అంశాలు కలిసొచ్చింది. ఫలితంగా సెన్సెక్స్ 944 పాయింట్లు పెరిగి 81,666 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 263 పాయింట్లు బలపడి 25,088 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు కాసేపు లాభనష్టాల మధ్య ఊగిసలాడాయి. తదుపరి నష్టాల నుంచి తేరుకొని... స్థిరమైన లాభాలతో ముందుకెళ్లాయి. ఆయిల్అండ్‌గ్యాస్, బ్యాంకులు, ఆటో రంగాలకు చెందిన అధిక వెయిటేజీ షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,009 పాయింట్లు ఎగసి 81,732 వద్ద, నిఫ్టీ 283 పాయింట్లు పెరిగి 25,108 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. ఆసియా మార్కెట్లలో కొరియా 5.55%, ఇండోనేసియా 5.14%, చైనా 2.54%, హాంగ్‌కాంగ్ 2.44%, జపాన్ 1.27%, సింగపూర్ 0.26% పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు 0.50% నుంచి 1% లాభపడ్డాయి. అమెరికా సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

➜ మార్కెట్ బౌన్స్‌బ్యాక్‌లో అధిక వెయిటేజీ షేర్లు ప్రధాన పాత్ర పోషించాయి. ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.28%, ఎల్అండ్‌టీ 2.26%, ఐసీఐసీఐ బ్యాంకు 1.40%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 0.77%, ఎంఅండ్‌ఎం 2.97% రాణించాయి. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 641 పాయింట్లు కావడం విశేషం. ➜ సెక్యూరిటీల లావాదేవీల పన్ను విధింపుతో బడ్జెట్ రోజు డీలా పడిన స్టాక్ బ్రోకింగ్ సంస్థల షేర్లు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి.

44 పైసలు బలపడిన రూపాయి

గరిష్ట స్థాయిల నుంచి క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 44 పైసలు పెరిగి 91.49 వద్ద ముగిసింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ఆర్‌బీఐ జోక్యం తీసుకున్నట్లు ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. మరో వైపు, డాలరుతో రూపాయి మారకం కదలికలను, నియంత్రణ సంస్థతో కలిసి ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి అనురాధా ఠాకూర్ తెలిపారు. పరిస్థితి మరింత తీవ్రతరమైన పక్షంలో తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పీఎఫ్‌సీ, ఆర్ఈసీ విలీనం

న్యూఢిల్లీ: విద్యుత్ రంగ ఫైనాన్షియల్ నవరత్నాలు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), ఆర్ఈసీ(గతంలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్) మధ్య విలీన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ రెండు పీఎస్‌యూలను విలీనం చేసే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీ ప్రాజెక్టులకు రుణాలు సమకూర్చడంలో రెండు సంస్థలు కీలక పాత్ర పోషించే సంగతి తెలిసిందే. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన తాజా(2026–27) బడ్జెట్‌లో ఈ రెండు ప్రభుత్వ రంగ ఫైనాన్షియల్ సంస్థల పునర్వ్యవస్థీకరణకు ప్రతిపాదించారు. తద్వారా వీటికి మరింత బలాన్ని చేకూర్చే యోచనలో ఆర్థిక శాఖ ఉన్నట్లు పరిశ్రమవర్గాలు తెలియజేశాయి. కాగా.. ఆర్ఈసీలో మెజారిటీ వాటాను 2019 మార్చిలో పీఎఫ్‌సీ కొనుగోలు చేసింది. దీంతో 2019–20లో వీటి మధ్య విలీనానికి తెరతీయనున్నట్లు అంచనాలు వెలువడినప్పటికీ ఆచరణలోకి రాకపోవడం గమనార్హం!

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: మెథడాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం:ఇండియన్ జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ నాలెడ్జ్

ఇంటర్మీడియెట్.. కెరీర్ క్రాస్ రోడ్స్‌లో కీలకమైన దశ. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించడం భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు వారధిగా నిలుస్తుంది. పలు ప్రవేశ పరీక్షల్లో ఇంటర్మీడియెట్‌లో కనీస మార్కుల శాతాన్ని నిర్దేశిస్తున్న పరిస్థితి. ముఖ్యంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందాలంటే.. ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సన్నాహకాలు తుది దశకు చేరుకున్నాయి. ఏపీలో ఫిబ్రవరి 23 నుంచి.. తెలంగాణలో ఫిబ్రవరి 25 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. ఇంటర్ పరీక్షల్లో బెస్ట్ స్కోర్‌కు మార్గాలు..

» ఏపీలో 23 నుంచి, తెలంగాణలో 25 నుంచి పరీక్షలు
» భవిష్యత్తులో కీలకంగా మారుతున్న ఇంటర్ మార్కులు
» అన్వయ దృక్పథం, విశ్లేషణ సామర్థ్యంతో బెస్ట్ స్కోర్

ఇలా చదివితే టాప్ స్కోర్

ఇంటర్ స్పెషల్

మ్యాథమెటిక్స్

ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి ఉంటారు. కాబట్టి ప్రస్తుతమున్న సమయంలో షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్‌పై దృష్టి పెట్టాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడే జేఈఈ, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆయా సిలబస్‌కు అనుగుణంగా.. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు–సమాధానాల రూపంలో ప్రిపరేషన్ సాగించడం ప్రయోజనకరంగా ఉంటుంది. జేఈఈ వంటి పరీక్షలకు పోటీ పడే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫిబ్రవరి నెల మొత్తం పూర్తిగా ఇంటర్మీడియెట్ ప్రిపరేషన్‌కే సమయం కేటాయించాలి. తెలుగు అకాడమీ పుస్తకాల్లోని అన్ని ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేస్తూ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ద్విపద సిద్ధాంతం, ప్రస్తారాలు–సంయోగాలు, సంభావ్యత, వృత్తాలు, సమాకలనులు, నిశ్చిత సమాకలనులు, అవకలన సమీకరణాలు, డిమూవర్స్ సిద్ధాంతం, వర్గ సమీకరణాలు, పరావలయం వంటి అంశాలను బాగా పునశ్చరణ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు వెక్టార్ అల్జీబ్రా, మాత్రికలు, సరళరేఖలు, సరళరేఖ యుగ్మాలు, అవకలనాలు, అప్లికేషన్స్ అండ్ డెరివేషన్స్‌పై ఎక్కువ సమయం కేటాయించాలి.

ఫిజిక్స్

ఫిజిక్స్ సబ్జెక్ట్‌కు సంబంధించి విద్యార్థులు ఫిబ్రవరి నెల మొత్తాన్ని రివిజన్‌కు, ప్రాక్టికల్స్‌లో నైపుణ్యం సాధించడానికి కేటాయించాలి. ఫిజిక్స్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి.. మూవింగ్ ఛార్జెస్ అండ్ మ్యాగ్నటిజం, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, పరమాణువు, వేవ్స్, సెమీ కండక్టర్ ఎలిమెంట్స్ వంటి అంశాల్లో పట్టు సాధించే విధంగా రివిజన్ చేయాలి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. రొటేటరీ మోషన్, యూనివర్సల్ గ్రావిటేషన్ లా, ఎస్కేప్ వెలాసిటీ, సింపుల్ హార్మోనిక్ మోషన్, సర్ఫేస్ టెన్షన్, థర్మో డైనమిక్స్ వంటి అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఫిజిక్స్‌లో లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌ను సాధన చేసేటప్పుడు అంచెలవారీ పరిష్కార విధానాన్ని అనుసరించాలి. ఫలితంగా సదరు సమస్యకు సంబంధించి ప్రాథమిక భావనలపైనా పట్టు సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది.

కెమిస్ట్రీ

కెమిస్ట్రీ ప్రిపరేషన్‌లో భాగంగా ముఖ్యాంశాలను నోట్ చేసుకుంటూ చదవాలి. ప్రస్తుత సమయంలో దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. వీటికి సంబంధించి గతంలో అడిగిన ప్రశ్నలను సాధన చేయాలి. అలాగే మోడల్ టెస్ట్‌లకు హాజరవడం ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థులు జనవరి చివరి నాటికి సబ్జెక్ట్ ప్రిపరేషన్‌ను పూర్తిచేసుకుని, ఫిబ్రవరి నెల మొత్తాన్ని రివిజన్‌కు కేటాయించేలా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి. ద్వితీయ సంవత్సరంలో విద్యుత్ రసాయన శాస్త్రం, పి–బ్లాక్ మూలకాలు, డి.ఎఫ్–బ్లాక్ మూలకాలు, లోహ శాస్త్రం, సాలిడ్ స్టేట్ వంటి అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీలోని ముఖ్యాంశాలతో నోట్స్ రాసుకోవడం మేలు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. కర్బన రసాయన శాస్త్రం, ఆవర్తన పట్టిక, పరమాణు నిర్మాణం, రసాయన బంధం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

బోటనీ

బైపీసీ విద్యార్థులు బోటనీ సబ్జెక్ట్‌కు సంబంధించి అనలిటికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఒక ప్రశ్నకు సమాధానం సాధించే క్రమంలో ఇమిడి ఉన్న అనువర్తిత అంశాలను నిజ జీవితంలోని పరిస్థితులతో బేరీజు వేస్తూ సాగాలి. ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్స్ వేయడం ప్రాక్టీస్ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు.. మొక్కల నిర్మాణాత్మక సంవిధానం–స్వరూప శాస్త్రం, జీవ ప్రపంచంలో వైవిధ్యం, కణ నిర్మాణం, విధులు; మొక్కల అంతర్ నిర్మాణ సంవిధానం, మొక్కల్లో ప్రత్యుత్పత్తి యూనిట్లపై ఎక్కువ దృష్టి పెట్టాలి. దీనికి సంబంధించి డయాగ్రమ్స్ వేయడం బాగా ప్రాక్టీస్ చేయాలి. డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్ (మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ(బ్యాక్టీరియా,వైరస్), జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయోటెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ టాపిక్స్‌పైనా అవగాహన పెంచుకోవాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొక్కల శరీర ధర్మశాస్త్రం, బయో టెక్నాలజీ, మైక్రోబ్స్, అణు జీవశాస్త్రం యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి.

జువాలజీ

జువాలజీలో విద్యార్థులు.. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి సంబంధిత ఆరోగ్యం, అంతస్రావక వ్యవస్థ, నాడీ నియంత్రణ–సమన్వయం, శరీర ద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు, జన్యు శాస్త్రాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. జంతుదేహ నిర్మాణం, గమనం, ప్రత్యుత్పత్తి, జీవావరణం, పర్యావరణం, బొద్దింక జీవ వ్యవస్థ వంటి అంశాలపై పట్టు సాధించాలి. ఈ సబ్జెక్ట్‌లో గ్రాఫికల్ ప్రజంటేషన్ మార్కుల సాధనలో కీలకంగా ఉంటుంది. కాబట్టి డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయాలి. ఈ సబ్జెక్ట్‌లో రెండు సంవత్సరాలకు సంబంధించి డెవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటొజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనెటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీలపై ప్రత్యేక దృష్టితో చదవాలి.

సీఈసీకి ఇలా

సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్ట్‌ల సమ్మేళంగా ఉండే సీఈసీ గ్రూప్‌నకు ప్రాధాన్యం పెరుగుతోంది. కారణం.. పలు ప్రొఫెషనల్ కోర్సులకు ఈ గ్రూప్ సబ్జెక్ట్‌లు బేసిక్స్‌గా ఉపయోగపడుతుండటమే. అయితే ఇదే సమయంలో మూడు సబ్జెక్ట్‌లు కూడా విస్తృతంగా, గణాంకాల పరిజ్ఞానం అవసరమైన రీతిలో ఉంటాయి. దీంతో విద్యార్థులు విశ్లేషణాత్మకంగా, తులనాత్మకంగా ప్రిపరేషన్ సాగించాల్సిన ఆవశ్యకత నెలకొంది. థియరీ సబ్జెక్ట్‌లుగా ఉండే సివిక్స్, ఎకనామిక్స్‌కు సంబంధించి విశ్లేషణ ఎంతో అవసరం. కామర్స్ సబ్జెక్ట్ విషయంలో తులనాత్మక అధ్యయనం మేలు చేస్తుంది. ప్రస్తుత సమయాన్ని ప్రాక్టీస్, రివిజన్‌కు కేటాయించాలి. సైన్స్ విద్యార్థులతో పోల్చితే సీఈసీ విద్యార్థులకు సమయం పరంగా కలిసొచ్చే అంశం ప్రాక్టికల్స్ లేకపోవడం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సివిక్స్

భారత రాజ్యాంగం– శాఖలు–రాజ్యాంగ సంస్థలు తదితర అంశాలతో ఉండే సివిక్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. రాజ్యాంగం, సమకాలీన రాజకీయ అంశాలపై అవగాహన ఎంతో అవసరం. మొదటి సంవత్సరానికి సంబంధించి.. రాజ్యాంగం స్వభావం, తీరు తెన్నులపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. ద్వితీయ సంవత్సరం సివిక్స్‌కు సంబంధించి.. భారత రాజ్యాంగం, ప్రభుత్వం, పరిపాలన అనే అంశాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలు. విద్యార్థులు రాజ్యాంగ సంస్థలు (పార్లమెంట్, సర్వీస్ కమిషన్‌లు తదితర) గురించి పూర్తి అవగాహన పెంచుకోవాలి.

కామర్స్.. ప్రాక్టీస్

కామర్స్‌లో మంచి మార్కులు పొందాలంటే ప్రాక్టీస్ ప్రధానం. మొదటి సంవత్సరం విద్యార్థులు పార్ట్–1కు సంబంధించి వ్యాపారం–భావనలు, స్వరూపాలు, వ్యవస్థాపన –వ్యవస్థాపకులు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అకాడమీ పుస్తకాల్లో పేర్కొన్న అంశాలను సునిశితంగా అధ్యయనం చేయాలి. పార్ట్–2కు సంబంధించి స్టాటిస్టిక్స్, కంప్యుటేషనల్ నైపుణ్యాలు, తులనాత్మక అధ్యయన నైపుణ్యం పెంచుకోవాలి. ఫైనల్ అకౌంట్స్, ప్రాఫిట్ అండ్ లాస్ షీట్, బ్యాంకింగ్ రీకన్సిలియేషన్ సిస్టమ్‌లపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటిలో పట్టు కోసం ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి.

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. పార్ట్–1గా పేర్కొనే థియరీ ఆధారిత వాణిజ్య శాస్త్రం కోసం మార్కెటింగ్, వ్యాపారం, స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యకలాపాలు, కంప్యూటర్ అవగాహనలో ముందుండాలి. పార్ట్–2గా పేర్కొనే వ్యాపార గణాంక శాస్త్రానికి సంబంధించి ట్రేడింగ్, కన్‌సైన్‌మెంట్, నాన్–ప్రాఫిట్ ఆర్గనైజేషన్స్ తదితర అంశాలపై పట్టు సాధించాలి.

ఎకనామిక్స్

ఎకానామిక్స్‌కు సంబంధించి సబ్జెక్ట్‌లోని అంశాల మూల భావనలను వాస్తవ పరిస్థితులకు అన్వయిస్తూ చదవాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు.. ఆర్థిక భావనలు, ఆర్థిక సూత్రాలు–వాటి నిర్వచనాలు, పట్టికలు, రేఖా పటాలు, ప్రమేయాలు, ప్రాముఖ్యత తదితర అంశాలను చదవాలి. బ్యాంకింగ్–ద్రవ్యోల్బణం, జాతీయాదాయం వంటివి కీలక అంశాలు. విద్యార్థులు రీడింగ్‌తోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆర్థిక సమస్యలు –కారణాలు–నివారణ చర్యలు, గణాంక వివరాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. జాతీయాదాయం, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, నూతన ఆర్థిక సంస్కరణలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి

ఎంఈసీ గ్రూప్

మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్ట్‌ల సమ్మేళంగా ఉండే ఎంఈసీ గ్రూప్‌లో అత్యధిక మార్కులు సాధించాలంటే.. పరిశీలనాత్మక నైపుణ్యం, వాస్తవ ఆలోచన దృక్పథం, ప్రాక్టీస్ ఓరియెంటేషన్ పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. మ్యాథమెటిక్స్ 1ఏలో.. ప్రమేయాలు, గణితానుగమనం, మాత్రికలు, సదిశల గుణనం, త్రికోణమితీయ నిష్పత్తులు- పరివర్తనలు, త్రిభుజ ధర్మాలుకు ప్రాధాన్యం ఇవ్వాలి. మ్యాథమెటిక్స్ 1బిలో.. సరళరేఖలు; సరళరేఖా యుగ్మాలు, అవకలనం, అవకలజాల అనువర్తనాలు, అవధులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. మ్యాథమెటిక్స్ 2ఎలో డిమోయర్ సిద్ధాంతం, సమీకరణవాదం, ద్విపద సిద్ధాంతం, విస్తరణ కొలతలు, సంభావ్యత అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. మ్యాథమెటిక్స్ 2బి (ద్వితీయ సంవత్సరం): ఆయా వెయిటేజీలకు అనుగుణంగా సమాకలనం, నిశ్చిత సమాకలనాలు, వృత్తం, అవకలన సమీకరణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 2,273 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సర్కిళ్లలో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 2,273.
» **సర్కిళ్ల వారీగా ఖాళీలు:** హైదరాబాద్–80, అమరావతి–101, భోపాల్–118, భువనేశ్వర్–85, చండీగఢ్–108, చెన్నై–208, గాంధీ నగర్–249, గువాహటి–85, బెంగళూరు–236, జైపూర్–113, కోల్‌కతా–242, లక్నో–221, మహారాష్ట్ర–204, ముంబై మెట్రో–152, న్యూఢిల్లీ–83, తిరువనంతపురం–83.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. స్థానిక భాషలో రాయడం, చదవడం వచ్చి ఉండాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 31.12.2025 నాటికి 21–30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి 85,590.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, స్క్రీనింగ్, ఇంటర్వ్యూ, స్థానిక భాష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.02.2026
» **వెబ్‌సైట్:** https://sbi.bank.in

వీఎన్ఐటీ, నాగ్‌పూర్‌లో 45 నాన్ టీచింగ్ పోస్టులు

నాగ్‌పూర్‌లోని విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఎన్ఐటీ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 45
» **పోస్టుల వివరాలు:** లైబ్రేరియన్–01, సీనియర్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్–02, సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్–03, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్–01, సూపరింటెండెంట్–05, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, జూనియర్ ఇంజనీర్–01, టెక్నికల్ అసిస్టెంట్–08, సీనియర్ అసిస్టెంట్–02, సీనియర్ టెక్నీషియన్–03, జూనియర్ అసిస్టెంట్–03, టెక్నీషియన్–10, ఆఫీస్ అటెండెంట్/ల్యాబ్ అటెండెంట్–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.18,000 నుంచి 1,44,200
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.03.2026.
» **వెబ్‌సైట్:** https://vnit.ac.in

క్లుప్తంగా...

గాల్లో జెట్ విమానం చక్కర్లు

వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో సోమవారం ఓ జెట్ విమానం తక్కువ ఎత్తులో గాల్లో చక్కర్లు కొట్టింది. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వెలుగొండ కొండలు, రాపూరు, పెంచలకోన, గూడూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి, వెంకటగిరి ప్రాంతాలను చుడుతూ జెట్ విమానం గాలిలో మూడు రౌండ్లు తిరిగింది.

5న ఏపీజేఏసీ 4వ రాష్ట్ర మహాసభలు

జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ప్రభుత్వోద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీజేఏసీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని 5న విజయవాడలో ఏపీ జేఏసీ, అమరావతి నాలుగో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఈ మహాసభలకు వేలాదిగా ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడలో మహాసభల వాల్ పోస్టర్‌ను చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మహాసభల సందర్భంగా ప్రభుత్వం 4, 5 తేదీల్లో స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసిందన్నారు. దీనిని వినియోగించుకుని ఉద్యోగులంతా తరలి వచ్చి మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈనెల 5న భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. మహాసభల్లో 21 మందితో నూతన రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని తెలిపారు.

18,19 తేదీల్లో విశాఖలో ఐఎఫ్ఆర్, మిలాన్-2026

అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో ఈనెల 18న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), 19న మిలాన్–2026 జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లపై సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం తూర్పు నావికాదళం చీఫ్ ఆఫ్ నేవల్ కమాండ్ వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్, ఇతర నౌకాదళ అధికారులతో సమీక్షించారు. ఐఎఫ్ఆర్‌కు శ్రీలంక, ఇరాన్ తదితర 19 దేశాలకు చెందిన నౌకలు, సుమారు 4వేల మంది వరకూ ప్రతినిధులు హాజరవుతారని నేవీ అధికారులు తెలిపారు. అలాగే అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలకు చెందిన మూడు నౌకలు, 150 మంది వరకూ ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. మన దేశానికి సంబంధించి 90 నౌకలు,45 ఎయిర్ క్రాఫ్టులు, సుమారు 600 మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. 18న విశాఖ సముద్రతీరంలో జరిగే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని వెల్లడించారు. 19న జరిగే మిలాన్–2026కు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌కు సీఎం చంద్రబాబు తదితర ప్రముఖులు హాజరవుతారని వివరించారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎస్ విజయానంద్ సూచించారు.

'గీతం' కబ్జా భూమి క్రమబద్ధీకరణను అడ్డుకోండి

హైకోర్టులో న్యాయవాది పిటిషన్

సాక్షి, అమరావతి: విశాఖపట్నం నడిబొడ్డున రూ.5 వేల కోట్ల విలువ చేసే 54.79 ఎకరాల భూమిని సీఎం చంద్రబాబు వియ్యంకుడైన బాలకృష్ణ చిన్నల్లుడు, మంత్రి లోకేశ్ తోడల్లుడు ఎంపీ శ్రీరత్‌కు చెందిన గీతం విద్యాసంస్థకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అది ప్రభుత్వ భూమి అని, రికార్డుల్లో రాస్తా, కొండ, కాలువ భూమిగా ఉందని, అయినా దీనిని గీతంకు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని అడ్డుకోవాలని విశాఖపట్నానికి చెందిన న్యాయవాది నిమ్మి గ్రేస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 54.79 ఎకరాల్లో ఆక్రమణలు తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆమె హైకోర్టును కోరారు. ఓ ప్రైవేటు సంస్థకు చట్ట విరుద్ధంగా ప్రభుత్వ భూమిని కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న యత్నాలపై జోక్యం చేసుకోవాలని కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, విశాఖపట్నం కలెక్టర్, గ్రామీణ తహసీల్దార్, గీతం ప్రెసిడెంట్ శ్రీభరత్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరపనున్నారు.

భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం!

టారిఫ్‌లు 18 శాతానికి తగ్గింపు: ట్రంప్ / అమెరికాపై భారత్ సుంకాల ఎత్తివేత!

న్యూఢిల్లీ: కొంతకాలంగా ఒడిదుడుకుల్లో పడ్డ భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం కొలిక్కి వచ్చినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అందులో భాగంగా భారత్‌పై సుంకాల భారాన్ని తగ్గిస్తున్నట్టు కూడా వెల్లడించారు. గతేడాది తాను విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలు 18 శాతానికి తగ్గుతాయని ప్రకటించారు. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రస్తుతం 50 శాతం టారిఫ్‌లు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీతో సోమవారం ట్రంప్ ఫోన్‌లో సంభాషించారు. ఆ వెంటనే వాణిజ్య ఒప్పందం, సుంకాల తగ్గింపుపై ప్రకటన చేశారు. ''మోదీతో నా స్నేహం, ఆయనపై గౌరవం దృష్ట్యా, ఆయన విజ్ఞప్తి మేరకు ఇరు దేశాల నడుమ ఒప్పందం కుదిరింది. ఇది తక్షణం అమల్లోకి వచ్చింది''అని ట్రంప్ వెల్లడించారు. తన సోషల్ మీడియా ట్రూత్‌సోషల్‌లో ఈ మేరకు పోస్టు పెట్టారు. అంతేకాదు, ''అమెరికాపై టారిఫ్, టారిఫేతర అడ్డంకులన్నింటినీ సున్నాకు తగ్గించే దిశగా భారత్ చర్యలు చేపట్టనుంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ పూర్తిగా నిలిపేయనుంది. ఇకపై వెనెజువెలా, అమెరికా నుంచి చమురును దిగుమతి చేసుకుంటుంది''అని కూడా ట్రంప్ పేర్కొన్నారు. ఈ పరిణామం ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి తెర దించేందుకు దోహదపడుతుందని హర్షం వెలిబుచ్చారు. ''నేను, మోదీ మాటల మనుషులం కాదు. పక్కా చేతల వ్యక్తులం. కనుక భారత్, అమెరికా నడుమ ఇప్పటికే ఉన్న అద్భుత సంబంధాలు ముమ్మందు మరింత బలోపేతం కానున్నాయి''అని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు. మోదీని తన అత్యుత్తమ మిత్రుల్లో ఒకరిగా అభివర్ణించారు! ''వర్తకం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించడంతో పాటు పలు అంశాలపై మోదీతో సుదీర్ఘంగా చర్చించా. ఇకపై అమెరికా వస్తువులను భారత్ మరింత భారీ పరిమాణంలో కొనుగోలు చేస్తుందని మోదీ నాకు హామీ ఇచ్చారు. 500 బిలియన్ డాలర్లకు పైగా విలువ చేసే చమురు, టెక్నాలజీ, వ్యవసాయ, బొగ్గు తదితర ఉత్పత్తులను అమెరికా నుంచి దిగుమతి చేసుకునేందుకు అంగీకరించారు''అని చెప్పుకొచ్చారు.

తుది టారిఫ్ 18 శాతమే: గోర్

సోమవారం ట్రంప్, మోదీ ఇరువురూ ఫోన్లో సంభాషించుకున్నారని అమెరికా నూతన రాయబారి సెర్గియో గోర్ వెల్లడించిన కాసేపటికే వెంటవెంటనే కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ''ప్రెసిడెంట్ ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. (ఏం జరగనుందో) వేచి చూడండి''అంటూ గోర్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్నందుకు భారత్‌పై అదనంగా విధించిన మరో 25 శాతం టారిఫ్ గురించి మాత్రం ట్రంప్ ప్రస్తావించలేదు. రష్యా నుంచి భారత చమురు కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయని వ్యాఖ్యానించి సరిపెట్టారు. ఆ టారిఫ్‌ను తొలగిస్తున్నదీ లేనిదీ స్పష్టత ఇవ్వలేదు. అయితే గోర్ ఇండియా టుడే వార్తా సంస్థతో మాట్లాడుతూ 'భారత్‌పై అమెరికా తుది టారిఫ్‌లు 18 శాతం మాత్రమే'అంటూ స్పష్టత ఇచ్చారు. తద్వారా, రష్యా చమురు టారిఫ్‌ను తొలగించినట్టేనని అన్యాపదేశంగా చెప్పారు. ఇక అమెరికాపై టారిఫ్‌లను దశలవారీగా పూర్తిగా ఎత్తేసే విషయమై ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ అధికారికంగా స్పందించలేదు.

ఒప్పందంపై మోదీ మౌనం

ఈ పరిణామంపై మోదీ కూడా స్పందించారు. భారత వస్తువులపై అమెరికా ఇకపై 18 శాతం సుంకమే విధిస్తుందని చెప్పేందుకు ఎంతో సంతోషిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ''ఇంత గొప్ప ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రెసిడెంట్ ట్రంప్‌కు ఎంతగానో కృతజ్ఞతలు. ప్రపంచ శాంతి, సుస్థిరత, ప్రగతికి ఆయన సారథ్యం ఎంతో కీలకం''అంటూ కొనియాడారు. శాంతిసాధన దిశగా ఆయన ప్రయత్నాలకు భారత్ పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. ''ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆర్థిక, ప్రజాస్వామిక వ్యవస్థలు కలసికట్టుగా పని చేస్తే అంతిమంగా ప్రజలకు ఎనలేని మేలు కలుగుతుంది. ఇరు పక్షాలకూ లాభదాయంగా అపారమైన అవకాశాలకు తలుపులు తెరుచుకుంటాయి. భారత్, అమెరికా సంబంధాలను నూతన శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ట్రంప్‌తో కలిసి పని చేసేందుకు ఎదురు చూస్తున్నా''అని పేర్కొన్నారు. అయితే ట్రంప్ చెప్పిన భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై మాత్రం మోదీ ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం!

రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీశారు.. బిహార్‌లా మార్చారు

చంద్రబాబుపై మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజం

సాక్షి, అమరావతి: చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం, అరాచక పాలనతో రాష్ట్రానికి ఉన్న పేరు, ప్రతిష్టలను దెబ్బతీసి, రాష్ట్రాన్ని బిహార్‌లా మార్చేశారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. తెలుగు ప్రజలకు దేశంలోనే సౌమ్యులుగా, చట్టాన్ని గౌరవిస్తారనే పేరుందని, చంద్రబాబు కారణంగా ఆ పేరు కాస్తా పోయిందని తెలిపారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు టీడీపీ గూండాలతో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై దాడులు చేయిస్తున్నారని చెప్పారు. పోలీసులు కూడా టీడీపీ మూకలకు దగ్గరుండి వత్తాసు పలుకుతున్నారని అన్నారు. జరగకూడనిది జరిగితే ఎవరు బాధ్యులని, డీజీపీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డీజీపీ చేస్తున్నది ఉద్యోగమని, చంద్రబాబు దగ్గర ఊడిగం కాదని, ఆ విషయాన్ని డీజీపీ గుర్తించాలని స్పష్టం చేశారు. వ్యవస్థ పట్ల ఉన్న గౌరవాన్ని అధికారులు కాపాడాలని కోరారు. చంద్రబాబు చెప్తే ఏదైనా చేసేస్తారా అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై జరుగుతున్న దాడులపై జాతీయ స్థాయిలో పోరాడతామని, పార్టీ అధినేత వైఎస్ జగన్‌తో మాట్లాడి కార్యాచరణ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

సిట్ రిపోర్టుపై నమ్మకం లేకపోతే ఈవోను ఎందుకు బదిలీ చేశారు?

'తిరుమల లడ్డూలో వాడే నెయ్యిపై అప్పటి ఈవో శ్యామలరావుతో ఎన్డీడీబీ రిపోర్టు తెప్పించామని చంద్రబాబే చెప్పారు కదా! సీబీఐ కూడా చెప్పింది. సుప్రీం కోర్టు వేసిన సిట్ రిపోర్ట్‌పైన మీకు నమ్మకం లేదు. వ్యవస్థపై మీకు నమ్మకం లేదు. మరి టీటీడీ ఈవోను ఎందుకు బదిలీ చేశారు? ' అని బొత్స ప్రశ్నించారు.

వాస్తవాలను దాచిపెట్టి బాబు రాజకీయం

లడ్డూపై దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మకపోవడంతో సీఎం చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్: భూమన కరుణాకరరెడ్డి

- సీబీఐ నివేదిక నుంచి దృష్టి మళ్లించేందుకే టీడీపీ హింసా రాజకీయాలు
- అంబటి రాంబాబుపై హత్యాయత్నం
- జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి
- జంతు కొవ్వు లేదని ఎన్‌డీడీబీ-ఎన్‌డీఆర్ఐ నివేదికల్లో స్పష్టం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు వాస్తవాలను దాచిపెట్టి భక్తుల విశ్వాసాలతో రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌డీడీబీ నివేదికను వక్రీకరిస్తూ చంద్రబాబు దుష్ప్రచార కుట్రలకు పాల్పడటాన్ని తప్పుబట్టారు. ఎన్‌డీడీబీ నివేదికలో జంతు కొవ్వు లేదని సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో తేలడంతో ఆత్మరక్షణలో పడ్డ సీఎం, టీడీపీ–జనసేన నేతలు హింసాత్మక రాజకీయాలను ప్రోత్సహిస్తూ ఎదురుదాడికి దిగారని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పుల్లయ్యతో కలిసి భూమన సోమవారం మీడియాతో మాట్లాడారు.

దుష్ప్రచారాన్ని నమ్మకపోవడంతో దాడులు..

యానిమల్ ఫ్యాట్ కలిసే అవకాశం లేదని ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టులో ఉందని చార్జిషీట్‌లో సీబీఐ చాలా స్పష్టంగా పేర్కొంది. ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిపై కూడా ఎన్‌డీఆర్ఐ తన నివేదికలో జంతుకొవ్వు లేదన్న విషయాన్ని స్పష్టం చేసింది. 2024 జులైలో నాటి ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్‌డీడీబీ నివేదికలో వెజిటబుల్ ఆయిల్ కలిపారని నివేదిక వచ్చిందన్నారు. అనంతరం సెప్టెంబరు 23న.. ఎన్‌డీఆర్ఐ రిపోర్టులో జంతు కొవ్వు కలిసిందని వచ్చిందంటూ చంద్రబాబు ఒత్తిడితో ఈవో మాట మార్చారు. ప్రజలు తమ దుష్ప్రచారాన్ని నమ్మకపోవడంతో నెయ్యిలో కల్తీ దొంగలు అంటూ టీడీపీ నేతలు ఫ్లెక్సీలతో దుష్ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు ముఠా 3 వేల మంది రౌడీ మూకలతో అంబటి ఇంటిపై దాడికి దిగి హత్యాయత్నానికి పాల్పడింది. అసాంఘిక శక్తులను ఉసిగొల్పి పెట్రోలు బాంబులు విసిరి జోగి రమేశ్ నివాసానికి నిప్పంటించారు. రాష్ట్రమంతటా ఇదే విధ్వంసకర రాజకీయాలకు సన్నద్ధం అవుతున్నారు.

బాబు హయాంలోనే భోలేబాబాకు అనుమతి..

నెయ్యిలో జంతుకొవ్వు కల్తీ జరగలేదని సీబీఐ నివేదికలో తేల్చి చెప్పింది. ఈ వ్యవహారంలో అప్పటి పాలకమండలి అధ్యక్షుడు, సభ్యులు, ఉన్నతాధికారుల ప్రమేయం లేదని పేర్కొంది. టీడీపీ హయాం నుంచి ఉన్న కొద్ది మంది సాంకేతిక నిపుణులు నెయ్యి సరఫరాదారులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని అదే నివేదికలో స్పష్టం చేసింది. భోలేబాబా డెయిరీ 2018 వరకు హర్ష్ ఫ్రెష్ పేరుతో టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే ఈ కంపెనీకి నెయ్యి సరఫరా టెక్నికల్ శాంక్షన్ ఇచ్చారు. కేజీ నెయ్యి రూ.291 చొప్పున సరఫరాకు అనుమతించారు. ఇక ప్రీమియర్ డెయిరీకి కూడా చంద్రబాబు హయాంలోనే అత్యధిక పర్యాయాలు నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత భోలేబాబాను డిస్‌క్వాలిఫై చేశాం. నాణ్యమైన నెయ్యిని సరఫరా చేసేలా కఠినమైన నిబంధనలు అనుసరించాం.

టీటీడీ సొంతంగా నెయ్యి ఉత్పత్తి చేసేలా..

సాహి, గిర్ లాంటి ఉత్తమ ఆవులను దాతల విరాళాల ద్వారా టీటీడీకి సమకూర్చింది వైఎస్ జగన్ ప్రభుత్వమే. ఆవుల ఉత్పత్తి కేంద్రంలో పెయ్య దూడలు జన్మించేలా, టీటీడీ సొంతంగా నెయ్యి ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎన్‌డీడీబీ సహకారంతో అప్పటివరకు అందుబాటులో లేని బీటా సైట్స్ టెరాలసిస్ టెస్ట్ మిషనరీ ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేసి టెండర్లు పిలిచాం. కల్తీ జరిగిందని ఈవో శ్యామలరావు వెనక్కి పంపినవి.. యానిమల్ ఫ్యాట్ కలిసిందని చంద్రబాబు చెబుతున్న నాలుగు ట్యాంకర్ల నెయ్యిని కూటమి ప్రభుత్వంలోనే వాడారు. అంటే మీరు చెబుతున్నట్లుగా.. మీ ప్రభుత్వ హయాంలోనే పందికొవ్వు నెయ్యితో తయారు చేసిన లడ్డూలు తయారు చేశారా? ఆ నాలుగు ట్యాంకర్లలో కలిసింది పందికొవ్వు కాదని సీబీఐ తేల్చి చెప్పినా.. చంద్రబాబు మాత్రం పదే పదే జంతు కొవ్వులు కలిశాయని ఆరోపణలు చేస్తున్నారు. మీ అబద్ధాలను ప్రజలు నమ్మడం లేదని హింసను ప్రేరేపించడం ఎంతవరకు సమంజసం? మీకంటే దైవ ద్రోహి ఇంకెవరు చంద్రబాబూ?.

ఉద్యోగం నుంచి తొలగించడం పెద్ద శిక్ష

హైకోర్టు ధర్మాసనం తీర్పు.. విద్యాశాఖ అధికారుల అప్పీల్ కొట్టివేత

సాక్షి, అమరావతి: ఓ ఉద్యోగిని సర్వీసు నుంచి తొలగించడమనేది పెద్ద శిక్షే అవుతుందని హైకోర్టు తెలిపింది.సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ముందుస్తు నోటీసు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు చెల్లవని తేల్చి చెప్పింది. పశ్చిమ గోదావరి జిల్లా దుంపగడపలోని ఏకేపీఎస్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కేవీఆర్ శ్రీనివాసు, జి.శ్రీనివాసాచార్యులు రికార్డు అసిస్టెంట్లుగా, ఐ.నాగరాజు నైట్ వాచ్‌మెన్‌గా 1996లో నియమితులయ్యారు. ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో వారు 1997లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు పిటిషనర్లకు జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ విద్యాశాఖ అధికారులు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేయగా.. దానిని కొట్టేసిన హైకోర్టు పైవిధంగా తీర్పునిచ్చింది. ఉద్యోగులను తొలగిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ 2005 ఫిబ్రవరి 7న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేస్తూ 2023 డిసెంబర్ 14న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ధర్మాసనం గత వారం తీర్పునిచ్చింది.

రాజకీయ విమర్శలపై ఇష్టారాజ్యంగా కేసులు పెట్టలేరు

సోషల్ మీడియాలో పోస్టులపై కేసుల నమోదులో పోలీసులు హైకోర్టు మార్గదర్శకాలు పాటించాల్సిందే: సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: సోషల్ మీడియా పోస్టులు, రాజకీయ విమర్శలకు సంబంధించి ఎడాపెడా కేసులు నమోదు చేస్తున్న పోలీసుల తీరుకు అడ్డుకట్ట వేయడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. సోషల్ మీడియా పోస్టులపై కేసులు నమోదు చేసే సమయంలో పోలీసులు పాటించాల్సిన విధివిధానాలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ప్రాథమిక హక్కుల రక్షణ కోసమే హైకోర్టు ఆ నిబంధనలు పెట్టిందని.. వాటిని పోలీసులు కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది.

అసలేం జరిగింది?

సామాజిక మాధ్యమాల్లో నెటిజన్ల పోస్టుల ఆధారంగా యాంత్రికంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని తప్పుబడుతూ హైకోర్టు గతంలో తీర్పునిచ్చింది. ప్రజల భావప్రకటనా స్వేచ్ఛను హరించేలా వ్యవహరించరాదని సూచించింది. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు పాటించాల్సిన మార్గదర్శకాలను తీర్పులో పొందుపరిచింది. అయితే ఈ మార్గదర్శకాలు దర్యాప్తు సంస్థల విధులకు ఆటంకం కలిగిస్తున్నాయంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై సోమవారం సుప్రీం ధర్మాసనం ముందు వాడీవేడిగా వాదనలు జరిగాయి. విచారణ ప్రారంభం కాగానే తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. కేసు మెరిట్స్‌పై తాము వాదించడం లేదని.. హైకోర్టు విధించిన కొన్ని షరతులు ఇబ్బందికరంగా ఉన్నాయని వాటిని కోర్టు దృష్టికి తెచ్చారు.దీనిపై జస్టిస్ పార్దీవాలా జోక్యం చేసుకుంటూ 'అసలు హైకోర్టు గైడ్‌లైన్స్ ఇవ్వడంలో తప్పేముంది? పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటానికి, యాంత్రికంగా కేసులు పెట్టకుండా ఉండటానికి ఆ మాత్రం జాగ్రత్తలు అవసరం లేదా? ఒక హైకోర్టు జ్యుడీషియల్ ఆర్డర్ ద్వారా కొన్ని మార్గదర్శకాలు ఇస్తే సంబంధిత అధికారులు వాటిని పాటించాల్సిందే. మార్గదర్శకాల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం మాకు కనిపించడం లేదు. చాలా కోర్టులు ఇలాంటి మార్గదర్శకాల కోసమే ఎదురుచూస్తున్నాయి కూడా. హైకోర్టు కేవలం విస్తృతమైన మార్గదర్శకాలనే జారీ చేసింది. వాటిని పాటించండి' అని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేస్తూ ప్రభుత్వ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

పోలీసులకు హైకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు ఇవీ..

ముందస్తు పరిశీలన: సోషల్ మీడియా పోస్టులపై ఫిర్యాదు రాగానే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. ముందుగా ప్రాథమిక విచారణ జరపాలి.

న్యాయ సలహా: రాజకీయ విమర్శలు, సున్నితమైన అంశాలకు సంబంధించిన పోస్టుల విషయంలో కేసు నమోదు చేసే ముందు తప్పనిసరిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నుంచి న్యాయ సలహా తీసుకోవాలి.

నిరాధారమైతే రద్దు: విచారణలో ఫిర్యాదు నిరాధారమైనదిగా లేదా దురుద్దేశపూర్వకమైనదిగా తేలితే వెంటనే కేసు మూసేయాలి.

చిరుతల దాడిలో నలుగురికి గాయాలు

- నార్పల మండలం బొందలవాడలో ముగ్గురు, సంజీవపురంలో మహిళపై చిరుతల దాడి
- అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చిరుత దాడిలో గాయపడిన కొనంకి నాయుడు, లక్ష్మీదేవి

నారాయణస్వామి

ఆదిలక్ష్మమ్మ

శింగనమల(నార్పల): మూడు చిరుతలు ఒకే రోజు వేర్వేరుగా దాడులు చేయడంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన అనంతపురం జిల్లాలో వెలుగుచూసింది. వివరాలు.. శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన ఆదిలక్ష్మమ్మ పొలం వద్దకు వెళ్లగా చిరుత దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో పారిపోయింది. స్థానికులు బాధితురాలిని 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అలాగే నార్పల మండలం బొందలవాడకు చెందిన కొనంకి నాయుడు తోటలో డ్రిప్పు మందు వదులుతుండగా చిరుత దాడి చేసింది. గట్టిగా కేకలు వేయడంతో అది పారిపోయింది. ఇదే గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, గంగరాజు పొలం వద్దకు వెళ్తుండగా దాడి చేయగా గట్టిగా కేకలు వేయడంతో పారిపోయింది. లక్ష్మీదేవి గాయపడింది. మరో ప్రాంతంలో ఇదే గ్రామానికి చెందిన నారాయణస్వామి గొర్రెలు కాస్తుండగా చిరుత దాడికి దిగగా.. తప్పించుకుని సమీపంలోని వ్యక్తుల వద్దకు పరుగెత్తికెళ్లాడు. గ్రామస్తులు వెళ్లి చూడగా మూడు చిరుతలు పారిపోవడాన్ని గుర్తించారు. ఈ క్రమంలోనే అడవిపిల్లి కనిపించడంతో స్థానికులు చిరుత అనుకుని దాడి చేసి చంపేశారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ అక్బర్, సిబ్బంది బొందలవాడ పరిసరాల్లో పర్యటించారు. చిరుతలను పట్టుకోవడానికి చర్యలు తీసుకుంటామని, ఎవరూ భయపడవద్దని ప్రజలకు సూచించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

హెయిర్‌తో వార్!

●మహిళల్లో అవాంఛిత రోమాలు

తలపై జుట్టు బాగా పెరగాలని మహిళలు కోరుకోవడం ఎంతో సాధారణమో... దేహంలోని కొన్ని భాగాల్లో అంటే... పైపెదవీ, గదమ మీద జుట్టు పెరగకూడదని కోరుకోవడం కూడా అంతే సహజం. అలా జుట్టు పెదవులపైనా గడ్డంపైనా పెరగడాన్ని వారు ఎంతమాత్రమూ ఇష్టపడరు. అలాంటి అవాంఛిత రోమాలను అనేక విధాల తొలగించుకోడానికి మహిళలు ప్రయత్నిస్తుంటారు. ఇలా వారు కోరుకోని ప్రదేశాల్లో వెంట్రుకలు పెరగడాన్ని **అవాంఛిత రోమాలు** అనీ... అదే వైద్యపరిభాషలో **హిర్సుటిజమ్** అని చెబుతారు. అవాంఛిత రోమాలు వచ్చేందుకు కారణాలు, వాటికి పరిష్కారాలేమిటన్నది తెలుసుకుందాం...

డాక్టర్ పి. నీలిమ
సీనియర్ గైనకాలజిస్ట్ & అబ్‌స్టెట్రీషియన్

కొందరు మహిళల్లో వెంట్రుకలు పలుచబడటం కూడా...

మహిళల్లో అవాంఛిత రోమాలు ఎంత సహజమో... అలాగే కొంతమంది స్త్రీలలో వెంట్రుకలు పలచబారడమూ కనిపిస్తుంది. ఇది ప్రధానంగా పాపిట తీసే చోట కనిపించడం చాలా సాధారణం. అక్కడ వెంట్రుకలు మరింతగా పలచబారిపోయి పాపిట ఉండాల్సిన దానికంటే చాలా వెడల్పుగా కనిపిస్తుంటుంది. ఇలా జరగడాన్ని 'ఫిమేల్ ప్యాటరన్ హెయిర్ లాస్'' అంటారు. కొందరిలో ఈ సమస్యను గుర్తించాక... వీలైనంత త్వరగా చికిత్స తీసుకుంటే (సాధారణంగా ఆర్నెల్లలోపు) ఈ సమస్యను మందులతో అధిగమించవచ్చు. అంటే కోల్పోయిన వెంట్రుకలను తిరిగి పొందవచ్చు. అది కుదరకపోయినా మరిన్ని వెంట్రుకలు రాలిపోకుండా జాగ్రత్త పడవచ్చు. అయితే వెంట్రుకలు మరింతగా రాలిపోయి పూర్తిగా పలచబడితే హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ మాత్రమే ప్రత్యామ్నాయమవుతుంది.

సాధారణంగా మానవుల శరీరమంతటా రోమాలు ఉండనే ఉంటాయి. మనం క్షీరదాల కోవకు చెందినవాళ్లం కావడం వల్ల... క్షీరదాల్లో ఇలా ఒళ్లంతా వెంట్రుకలు ఉండటం ఒక లక్షణం కావడం వల్ల ఒంటి నిండా రోమాలు ఉండటం సహజం. కాకపోతే దేహంలోని కొన్ని చోట్ల అవి అవి ఉండాల్సినట్టుగా ఉండకుండా పెరగడాన్ని అవాంఛిత రోమాలుగా చెప్పవచ్చు. ఉదాహరణకు పురుషుల్లో గడ్డం, మీసం ఉండటం సహజం. కానీ మహిళల్లో అవి ఉండవు. ఉన్నప్పటికీ ప్రస్ఫుటంగా కనిపించకుండా... నూగుగా... ఉండీ ఉండకుండా కనిపిస్తుంటాయి. అయితే కొందరిలో అవి పురుషుల్లో మాదిరిగా పెరుగుతూ స్పష్టంగా కనిపించే అవకాశముంటుంది.

అవాంఛిత రోమాలంటే...

మహిళల్లో చెంపలూ, చుబుకం, పై పెదవుల వంటి చోట్ల కూడా కనీ కనిపించకుండా రోమాలు ఉన్నప్పటికీ వాటిని గుర్తించడం అంత సులభం కాదు. సాధారణంగా మహిళలందరి విషయంలోలా కాకుండా భిన్నంగా కనిపించేవాటిని అసహజమైన వెంట్రుకలుగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు గదమ, చెంపలు, పెదవులపైన వెంట్రుకలు పెరుగుతూ... అవి మరీ గుబురుగా పెరుగుతుంటే వాటిని అవాంఛిత రోమాలుగా పేర్కొనవచ్చు. ఒక అంచనా ప్రకారం దాదాపు ఎనిమిది శాతం మహిళల్లో... పురుషుల్లో మాదిరిగానే గడ్డంపైనా, పెదవులపైనా వెంట్రుకలు కనిపిస్తాయన్నది వైద్య నిపుణుల మాట.

హిర్సుటిజం, హైపర్‌ట్రైకోసిస్ అంటే...?

మహిళల్లో కనిపించే ఈ అవాంఛిత రోమాలను హిర్సుటిజమ్ అనీ అలాగే హైపర్‌ట్రైకోసిస్ అని రెండు రకాలుగా చెప్పవచ్చు. స్త్రీలలోనూ పురుషుల మాదిరిగానే వెంట్రుకలు పెరగడాన్ని 'హిర్సుటిజమ్'గా చెప్పవచ్చు.

అయితే హైపర్‌ట్రైకోసిస్ కండిషన్‌లోనూ వెంట్రుకలు పెరిగినప్పటికీ... అవి పురుషుల్లో లాగా ఉండవు. ఉదాహరణకు మహిళల హార్మోన్లలో ఏవైనా తేడాలు వచ్చి పురుషుల్లోలా వెంట్రుకలు పెరగడాన్ని హిర్సుటిజమ్‌గా చెప్పవచ్చు. కానీ వాళ్ల దేహంపైనా వెంట్రుకలు ఉన్నప్పటికీ అవి ఉండాల్సినంతగా కాకుండా చాలా ఎక్కువగా పెరగడాన్ని 'హైపర్ ట్రైకోసిస్' అంటారు. జన్యుపరమైన కారణాలతో ఇలా జరుగుతుంది. ఇక కొందరిలో అంతకుముందు లేకపోయినా... కొన్ని రకాల మందులు వాడాక దేహంపైన రోమాలు రావచ్చు. అలా మునుపు లేనివీ... అటు తర్వాత ఏదైనా కారణాలతో రోమాలు పెరగడాన్ని కూడా 'హైపర్ ట్రైకోసిస్'గా చెప్పవచ్చు.



కారణాలు

మహిళల్లో అవాంఛిత రోమాలు పెరగడానికి అనేక అంశాలు కారణమవుతాయి. అవి...

● **హార్మోన్లలో తేడాలు...**

మహిళల్లో స్రవించే హార్మోన్లలో పురుష హార్మోన్ అయిన టెస్టోస్టెరాన్ అవసరమైన మోతాదు కంటే మించి స్రవించినప్పుడు... ఆ అంశం మహిళల్లో అవాంఛిత రోమాలకు దారితీయవచ్చు.

● **పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్...**

మహిళల్లో పురుషుల్లోలా వెంట్రుకలు పెరిగేందుకు 'పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్' (పీసీవోడీ) కూడా ఒక కారణం. హిర్సుటిజమ్ ఉన్న మహిళలలో వైద్యపరీక్షలు చేసినప్పుడు వాళ్లలో చాలామందికి (దాదాపు 70% మందిలో) పీసీవోఎస్ ఉన్నట్లుగా ఫలితాలు రావడం చాలా సహజం. పీసీఓఎస్ ఉన్న మహిళల అండాశయాలు (ఓవరీస్) పురుష హార్మోన్ అయిన టెస్టోస్టెరాన్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేస్తాయి. దాంతో ఆ హార్మోన్ మహిళల్లో సాధారణంగా ఉండాల్సిన మోతాదు కంటే ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా అవాంఛిత రోమాలు పెరగడం కనిపిస్తుంది. ఈ సమస్యతో బాధపడేవాళ్లలో మొటిమలు కూడా ఎక్కువగానే వస్తుంటాయి. యుక్తవయసు దాటిపోయాక కూడా మొటిమలు రావడం, అవాంఛితమైన రోమాలు ఉంటే పీసీవోఎస్ ఉందేమో అని అనుమానించాలి.

పాలి సిస్టిక్ ఒవేరియన్ డిసీజ్ (పీసీవోడీ) సమస్య ఉన్నప్పుడు నిపుణులైన గైనకాలజిస్టును సంప్రదించాలి. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడటం ద్వారా నెలసరి సమస్యలు సరయ్యేలా చూసుకోవడం, చికిత్సను మధ్యలో ఆపకుండా సమస్య పరిష్కారమయ్యేవరకు / పూర్తిగా తగ్గేవరకు వైద్యుల పర్యవేక్షణలో ట్రీట్‌మెంట్‌ను కొనసాగించాలి.

కొన్ని రకాల గ్రంథుల సమస్య ఉన్నప్పుడు...

కొందరు మహిళల్లో థైరాయిడ్ గ్రంథి సమస్యగానీ, పిట్యూటరీ గ్రంథి సమస్య ఉన్నప్పుడు కూడా వారిలో పురుషుల్లోలాగానే వెంట్రుకలు పెరగవచ్చు. అందుకే... అవాంఛిత రోమాలు ఉన్నప్పుడు నిపుణులను సంప్రదించి దానికి అసలు కారణాలు తెలుసుకుని చికిత్స తీసుకోవడం అవసరం.

ఇడియోపథిక్ హిర్సుటిజమ్ అంటే...

కొద్దిమంది మహిళల్లో పురుషహార్మోన్ స్రావాలు చాలా తక్కువ మోతాదులో ఉన్నప్పటికీ... వెంట్రుకల పెరుగుదల మాత్రం అసాధారణంగా ఉండవచ్చు. ఇలాంటి కండిషన్‌ను 'ఇడియోపథిక్ హిర్సుటిజమ్'గా చెబుతారు. వీళ్లలో రుతుక్రమం మామూలుగానే ఉంటుంది. గర్భం రావడానికి ఎలాంటి అడ్డంకులు ఉండవు. కాకపోతే వెంట్రుకల పెరుగుదల మాత్రం చాలా ఎక్కువగా ఉంటుంది.

అవాంఛిత రోమాలున్న మహిళల్లో కనిపించే ఇతర లక్షణాలు

అవాంఛిత రోమాలున్న మహిళల్లో కనిపించే ఇతర లక్షణాలు ఈ కింది విధంగా ఉంటాయి.

● సాధారణంగా వీళ్లు ఉండాల్సిన బరువు కంటే ఎక్కువగా ఉంటారు. అంటే స్థూలకాయం / ఊబకాయంతో ఉండవచ్చు.

● పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం.

● మెడ దగ్గర ప్రధానంగా మెడ వెనక భాగంలోనూ, చర్మం ముడతలు పడే ప్రదేశాల్లో చర్మం మరింతగా నల్లగా, మందంగా కనిపించవచ్చు. ఇలా చర్మం మందంగా, నల్లగా కనిపించే కండిషన్‌ను 'ఎకాంథోసిస్ నైగ్రికాన్స్' అంటారు.

డయాబెటిస్ వచ్చే ముప్పు ఎక్కువ...

అవాంఛిత రోమాల సమస్యతో బాధపడేవాళ్ల రక్తంలో సాధారణంగా చక్కెర మోతాదులను అదుపులో పెట్టేందుకు మరింత ఎక్కువగా 'ఇన్సులిన్' హార్మోను అవసరమవుతుంది. అందుకే ఇలాంటి వాళ్లు చాలాకాలంపాటు ఎలాంటి చికిత్సా తీసుకోకపోతే ఇన్సులిన్ రెసిస్టెన్స్ వచ్చి, అది క్రమంగా డయాబెటిస్ సమస్యకు దారితీసేందుకు అవకాశాలెక్కువ.

ఈ వైద్యనిపుణుల సహాయంతో...

అవాంఛిత రోమాలు వచ్చే మహిళల్లో రుతుక్రమం సరిగా ఉండదు. అంటే వీళ్లలో నెలసరి (పీరియడ్స్) సక్రమంగా రావు. బరువు ఎక్కువగా పెరగడం, చర్మంలో ముడతలు ఉండే మెడ, బాహుమూలాలు వంటి చోట్ల చర్మం దళసరిగా మారడం, మొటిమలు ఎక్కువగా వస్తుండటం వంటి లక్షణాలతో పాటు ఒకవేళ మాడుపై తగినన్ని వెంట్రుకలు లేకపోవడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు ఆ బాధితులు... ఎండోక్రైనాలజిస్ట్ (హార్మోన్ల నిపుణులు)ను, డెర్మటాలజిస్ట్ (చర్మవ్యాధుల నిపుణుల)ను సంప్రదించాలి. ఈ లక్షణాలున్నవారు తాము ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్నప్పుడు గైనకాలజిస్ట్‌ను తప్పనిసరిగా సంప్రదించాలి. కొన్ని సందర్భాల్లో ఎండోక్రైనాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, గైనకాలజిస్ట్... ఈ ముగ్గురూ ఒక టీమ్‌గా చికిత్స అందిస్తే మరింత మంచి ఫలితాలు ఉంటాయి. ఒకవేళ పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్)తో బాధపడుతున్న మహిళలైతే వారు తమ జీవనశైలిని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. సమతులాహారం తీసుకుంటూ వ్యాయామం చేయడం వంటి అలవాట్లను కొనసాగించాలి. ఇవి చేస్తూ తమ బరువును తగ్గించుకోవడం లేదా నియంత్రణలో ఉంచుకోవడం చేస్తూ... వాటితో పాటు అవాంఛిత రోమాలను తొలగించుకోడానికి తాత్కాలిక ప్రక్రియలనో లేదా శాశ్వత పద్ధతులనో అవలంబించాలి.

అవాంఛిత రోమాల తొలగింపునకు తాత్కాలిక ప్రక్రియలు

● **థ్రెడ్డింగ్ అండ్ వ్యాక్సింగ్ ...**

సాధారణంగా చాలామంది మహిళలు తమ అవాంఛిత రోమాలను తొలగించుకోడానికి ముఖ్యంగా థ్రెడింగ్, వ్యాక్సింగ్ లాంటి తాత్కాలిక ప్రక్రియలను అనుసరిస్తుంటారు. ఇవి తరచూ చేస్తున్న క్రమంలో కొందరిలో వెంట్రుకమూలంలో / రోమం అంకురంలో ఇన్ఫెక్షన్స్ రావడం (ఫాలిక్యులైటిస్) వంటి ముప్పులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అప్పుడక్కడ రోమం కుదురు దగ్గర ఒక గడ్డలా మారి అక్కడ చీమూ పట్టే అవకాశాలెక్కువ. అలాంటి సందర్భాల్లో నొప్పి కూడా రావచ్చు. ఈ థ్రెడ్డింగ్, వ్యాక్సింగ్ ప్రక్రియలను అనురించేవారి చర్మం నల్లబడవచ్చు. తగినంత పరిశుభ్రత పాటించకపోతే థ్రెడ్డింగ్‌తో ఒక్కోసారి పులిపిరులతో కూడిన వైరల్ వార్ట్స్ రావచ్చు. కొందరు మహిళలు అవాంఛిత రోమాలను తొలగించుకోడానికి హెయిర్ రిమూవల్ క్రీమ్స్ ఉపయోగిస్తుంటారు. వాటిని ఉపయోగించేప్పుడు అలర్జీలు రాకపోతే వాటిని సురక్షితమైనవిగా భావించి, వాటిని వాడుకోవచ్చు. అయితే హెయిర్ రిమూవల్ క్రీమ్‌ను ఉపయోగించే ముందు అది సురక్షితమా, కాదా అని తెలుసుకోడానికి చర్మంపై ఎక్కడైనా కొద్దిగా ఉపయోగించి చూడటం (ప్యాచ్ టెస్ట్) అవసరం.

● **షేవింగ్... అపోహలు...**

అవాంఛిత రోమాలను తొలగించుకోడానికి సాధారణంగా భారతీయ మహిళలు షేవింగ్‌ను అంతగా ఇష్టపడరు. షేవింగ్ తర్వాత మరింత గుబురుగా వెంట్రుకలు వస్తాయన్న అపోహ ఉండటం, షేవింగ్ వల్ల చర్మం మరింత గరుగ్గా, మందంగా మారుతుందనే అభిప్రాయాలు ఉండటంతో తమ లుక్స్‌ను కాపాడుకునే క్రమంలో దాన్ని ఒక సురక్షితమైన, నమ్మదగిన ప్రక్రియ అనుకోరు. అయితే అవి అపోహలే. అయినప్పటికీ షేవ్ చేసిన మర్నాడో లేదా వెంటవెంటనో వెంట్రుకలు పెరుగుతుండటం మామూలే కావడం, షేవ్ చేసిన మేర చర్మం రంగు ఒకింత మారడం వంటి కారణాల వల్ల ఇలా అపోహ పడటానికి అవకాశముంది.

ఇవిగాక... అవాంఛితమైన రోమాలను తొలగించుకునేందుకు ఇప్పుడు ఎన్నో రకాల వైద్యప్రక్రియలూ అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు లేజర్ ప్రక్రియలూ, ఎలక్ట్రొలైసిస్ మార్గాల వంటి అధునాతన చికిత్సలూ ఉన్నాయి. అయితే వైద్య సంబంధితమైన ఎలాంటి విద్యార్హతలు లేకుండా తమను తాము బ్యూటీషియన్లు, కాస్మటాలజిస్టులమని చెప్పుకునే వారి దగ్గరకు వెళ్లడం కంటే... వైద్యపరమైన విద్యార్హతలు (క్వాలిఫైడ్) వైద్యనిపుణులై డర్మటాలజిస్టులు /ట్రైకాలజిస్టులను సంప్రదించడం చాలా మంచిది. ఇక ఇలాంటివారైతే... మహిళల్లో ఏవైనా ఇతర ఆరోగ్య సమస్యలు (అండర్‌లైయింగ్ కాజెస్) ఉండటం వల్ల అవాంఛిత రోమాలు వస్తే... తగిన మందులు ఇవ్వడం లేదా సమస్య మూలాలను తెలుసుకుని సంబంధిత వైద్యనిపుణులను సంప్రదించమంటూ సలహా ఇవ్వడం వంటివి చేస్తారు.

నిర్వహణ: యాసీన్



బిజినెస్ రీల్

ఏబీసీ గ్రూప్ విస్తరణ

హైదరాబాద్: ప్రీమియం హోమ్ సొల్యూషన్స్‌కి సంబంధించి దక్షిణాదిలోనే అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అయిన ఏబీసీ స్పేసరీని శంషాబాద్‌లో ప్రారంభించినట్లు ఏబీసీ గ్రూప్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు ముహమ్మద్ మదాని తెలిపారు. పటేల్ మార్కెటింగ్ గ్రూప్, శుభగృహ గ్రూప్ భాగస్వామ్యంతో 75,000 చ.అ. విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో టైల్స్, బాత్ ఫిటింగ్స్, కిచెన్స్, శానిటరీ వేర్, ఫర్నిచర్, లైటింగ్ నుంచి స్మార్ట్ హోమ్ టెక్నాలజీ వరకు వివిధ సొల్యూషన్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పేరొందిన దేశ, విదేశీ బ్రాండ్లు వీటిలో ఉన్నాయని మదాని చెప్పారు.

‘లోకల్లీ యువర్స్’పై కోకా కోలా ఫోకస్

ముంబై: స్థానిక కమ్యూనిటీలకు ప్రయోజనం చేకూర్చే ‘లోకల్లీ యువర్స్’ కార్యక్రమంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు కోకా కోలా ఇండియా వైస్ ప్రెసిడెంట్ కరణ్ అచ్వాల్ తెలిపారు. ఇందులో భాగంగా బాట్లింగ్ భాగస్వామి హిందుస్తాన్ కోకా కోలా బెవరేజెస్‌తో కలిసి మేడారం జాతర సందర్భంగా కూలింగ్ మౌలిక సదుపాయాలు, తాత్కాలిక స్టాల్స్, మొబైల్ హైడ్రేషన్ కార్టులు మొదలైనవి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానికంగా ఉపాధి కల్పనకు, రిటైల్ వ్యాపారాలను పటిష్టం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడుతున్నట్లు వివరించారు.

ఎఫ్‌పీఐల అమ్మకాల స్పీడ్

జనవరిలో రూ. 36,000 కోట్లు

న్యూఢిల్లీ: దేశీ స్టాక్స్‌లో కొద్ది రోజులుగా అమ్మకాలకే ప్రాధాన్యత ఇస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత నెలలోనూ ఇదే పంథా అనుసరించారు. నికరంగా రూ. 36,000 కోట్ల పెట్టుబడుల(3.97 బిలియన్ డాలర్లు)ను వెనక్కి తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు పెరుగుతున్న నేపథ్యంలో ఎఫ్‌పీఐలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. దీనికితోడు తాజా బడ్జెట్‌లో సెక్యూరిటీ లావాదేవీల పన్ను పెంపు ప్రతిపాదించడంతో విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు మరింత ఊపందుకోవచ్చని అభిప్రాయపడ్డారు. నిజానికి 2025 కేలండర్ ఏడాదిలో ఎఫ్‌పీఐలు దేశీ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అత్యధికంగా 18.9 బిలియన్ డాలర్ల విలువైన స్టాక్స్ నికరంగా విక్రయించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-2-2026

విశాఖ	490-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	641.7	7.99
BEL	277.5	3.6
SBILIFE	1,515.35	2.89
SHRIRAMFIN	546.95	2.58
ADANIPORTS	1,154.05	2.23

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,230.00	-2.51
DRREDDY	1,307.00	-2.26
HCLTECH	1,790.15	-1.95
TATACONSUM	938	-1.84
INFY	1,920.05	-1.52

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,108
ఎన్ఎస్ఈ	95,671
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,59,450
ఎఫ్ఐఐ	- 4,342
డీఐఐ	+ 2,929

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	77.56	$ 78.71
బ్రెంట్	81.08	$ 82.03

టాప్‌గేర్‌లో ఆటో సేల్స్

- కొనసాగిన జీఎస్‌టీ సంస్కరణల వృద్ధి ధోరణి
- పెరిగిన మారుతీ, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, హ్యుందాయ్ విక్రయాలు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలతో బలపడిన వృద్ధి ధోరణిని ఆసరాగా చేసుకొని ప్రముఖ ఆటో సంస్థలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం, హ్యుందాయ్ మోటార్‌లు జనవరిలోనూ గణనీయమైన వాహన అమ్మకాలను నమోదు చేశాయి. మారుతీ సుజుకీ జనవరిలో 1,74,529 వాహనాలు విక్రయించింది. గత ఏడాది ఇదే ఏడాది అమ్ముడైన 1,73,599 వాహనాలతో పోలిస్తే 0.50% అధికంగా ఉన్నాయి. విదేశాలకు చేసిన ఎగుమతులు(51,020), ఇతర సంస్థలకు అమ్మకాలు(7,643) కలిపి మొత్తం విక్రయాలు 2,36,963 యూనిట్లుగా నమోదయ్యాయి. ‘‘మునుపెన్నడూ లేనంతంగా నెలవారీ ప్రాతిపదికన మొత్తం 2,36,963 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ప్రతిరోజూ 9,000 నుంచి 10,000 బుకింగ్స్ నమోదవుతూ..., మొత్తం 2.78 లక్షలకు మించి బుకింగ్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి వార్షిక ప్రతిపాదికన ఇవి 25% అధికం. కంపెనీ కొత్తగా విడుదల చేసిన ఎస్‌యూవీ విక్టోరిస్ అయిదు నెలల్లో 50వేల యూనిట్ల అమ్మకాల మైలురాయిని అధిగమించింది’’ అని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. ఉత్పత్తి కొరతపై స్పందిస్తూ..., కొత్త ఉత్పత్తి సామర్థ్యాలు అందుబాటులోకి వచ్చే వరకు కంపెనీకి కొరత కష్టాలు తప్పవన్నారు.

- టాటా ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ జనవరిలో మొత్తం 61,295 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో 48,423 యూనిట్లతో పోలిస్తే విక్రయాల్లో 46% వృద్ధి నమోదైంది.
- మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయంగా 63,510 వాహనాలను విక్రయించింది. గతేడాది ఇదే అక్టోబర్ అమ్మకాలు 50,659 యూనిట్లతో పోలిస్తే ఇవి 25% అధికంగా ఉన్నాయి.
- హ్యుందాయ్ మోటార్ ఇండియా మొత్తం 59,107 వాహనాలను విక్రయించింది. గతేడాది ఇదే జనవరిలో అమ్మిన 54,003 యూనిట్లతో పోలిస్తే ఇవి 9% అధికం.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాల వృద్ధి 17% పెరిగి 26,178 నుంచి 30,630 యూనిట్లకు చేరింది.
- రెనో ఇండియా డీలర్ల పంపిణీ 34% పెరిగి 3,715 యూనిట్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో అమ్మకాలు 2,780 యూనిట్లుగా ఉన్నాయి.
- కియా ఇండియా వార్షిక అమ్మకాల వృద్ధి 10% పెరిగి 27,603 యూనిట్లుగా నమోదయ్యాయి. ‘‘కొత్త ఏడాది (2026) ప్రోత్సాహకర ప్రారంభం కియా బ్రాండ్‌పై కస్టమర్ల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. కొత్త తరం సెల్టోస్‌కు లభిస్తున్న సానుకూల స్పందన, సోనెట్‌కు కొనసాగుతున్న స్థిరమైన డిమాండ్, అలాగే కారెన్స్ క్లావిస్, క్లావిస్ ఈవీ మోడళ్లకు పెరుగుతున్న ఆదరణ పరిశీలిస్తే కియా ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో బలం, సమతుల్యతకు అద్దం పడుతుంది’’ అని కియా ఇండియా సీనియర్ వైస్-ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు.

సెజ్‌ల దేశీ విక్రయాలు ఒక్కసారికే

రెవెన్యూ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ వివరణ

న్యూఢిల్లీ: ప్రత్యేక ఆర్థిక మండళ్లలోని (సెజ్) యూనిట్లు స్థానికంగా చేసే విక్రయాలపై మినహాయింపులన్నవి పరిమిత కాలానికి ఉద్దేశించినవిగా కేంద్ర రెవెన్యూ విభాగం కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ వెల్లడించారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులను సెజ్‌లలోని ఎగుమతి ఆధారిత యూనిట్లు అధిగమించే ఉద్దేశ్యంతోనే బడ్జెట్‌లో దీన్ని ప్రతిపాదించినట్టు వివరించారు. ‘‘సెజ్‌ల ప్రధాన దృష్టి ఎగుమతులపైనే. అవి ఎగుమతి ఆధారిత యూనిట్లుగానే కొనసాగుతాయి. కనుక ప్రత్యేకంగా ఏర్పాటు చేసే విండో ఒక్క విడత పరిమితం కాలం కోసం తీసుకొస్తున్నదే. ఈ కాలంలో అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న ఆటుపోట్లు, అస్థిరతలు సమసిపోతాయని భావిస్తున్నాం. దీంతో స్థిరత్వం ఏర్పడుతుంది’’అని సీఐఐ నిర్వహించిన బడ్జెట్ అనంతర కార్యక్రమంలో భాగంగా శ్రీవాస్తవ తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితుల నేపథ్యంలో సెజ్‌లలోని యూనిట్లు తమ పూర్తి స్థాయి సామర్థ్యాన్ని వినియోగించలేకుండా ఉన్నాయి. దీంతో ఆయా యూనిట్లను దేశీ మార్కెట్లో (డొమెస్టిక్ టారిఫ్ ఏర్పియా) రాయితీ రేట్లపై విక్రయించుకునేందుకు అనుమతిస్తున్నట్టు బడ్జెట్‌లో భాగంగా మంత్రి సీతారామన్ ప్రకటించడం గమనార్హం. దేశీ విక్రయాలపై మినహాయింపులన్నవి ఆయా యూనిట్ల ఎగుమతి సామర్థ్యాలకు లోబడే ఉంటాయని పేర్కొన్నారు.

రెవెన్యూ గ్రాంట్ల ముగింపు రాష్ట్రాలపై ప్రభావం చూపదు

- 2025-26లో రూ.13,000 కోట్లకు పరిమితం
- వ్యయ విభాగం కార్యదర్శి ఉల్నమ్

న్యూఢిల్లీ: రాష్ట్రాలకు ఇంతకాలంగా అందిస్తున్న రెవెన్యూ లోటు గ్రాంట్లను నిలిపివేయాలంటూ 16వ ఆర్థిక సంఘం చేసిన సిఫారసు ఆర్థిక వ్యవస్థలపై ఎలాంటి ప్రభావం చూపించదని కేంద్ర ఆర్థిక శాఖ వ్యయ విభాగం కార్యదర్శి వి.ఉల్నమ్ స్పష్టం చేశారు. కేవలం కొన్ని రాష్ట్రాలే ప్రస్తుతం ఈ గ్రాంట్‌ను అందుకుంటున్నాయంటూ, 2025-26లో రూ.13,000 కోట్లకు తగ్గిపోయినట్టు చెప్పారు. వాస్తవానికి 15వ ఆర్థిక సంఘం సిఫారసు ప్రకారం ఇది 2025-26తో నిలిచిపోవాలన్నారు. రెవెన్యూ లోటు గ్రాంట్‌ను క్రమంగా తగ్గించుకుంటూ వెళ్లాలని 15వ ఆర్థిక సంఘం సూచించినట్టు గుర్తు చేస్తూ ఆ ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.13 వేల కోట్లకు పరిమితం అవుతున్నట్టు చెప్పారు. 2026 ఏప్రిల్ 1 నుంచి ఐదు సంవత్సరాల పాటు కేంద్రం పన్నుల్లో 41 శాతాన్ని రాష్ట్రాలకు వాటా కింద పంపిణీ చేయాలంటూ అరవింద్ పనగరియా అధ్యక్షతన గల 16వ ఆర్థిక సంఘం సూచించడం తెలిసిందే. వికేంద్రీకరణ అనంతరం రెవెన్యూ లోటు గ్రాంట్లను ఎత్తివేసి, స్థానిక సంస్థలకు అందించే నిధులను రెట్టింపు చేయాలని సిఫారసు చేసింది.ఆర్థిక సంఘం వికేంద్రీకరణ సూత్రం ప్రకారం రాష్ట్రాల పన్నుల వాటా రూ.14 లక్షల కోట్లుగా ఉంటుందని ఉల్నమ్ తెలిపారు. గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల వాటా కూడా కలుపుకుంటే ఈ మొత్తం రూ.25 లక్షల కోట్లకు చేరుకుంటుందన్నారు.

ఎల్ఐసీ ఎఫ్‌పీవో వచ్చే ఏడాది

న్యూఢిల్లీ: బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)లో మరింత వాటా విక్రయానికి ప్రభుత్వం వచ్చే ఏడాది(2026-27) ఫాలోఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పీవో) చేపట్టే వీలున్నట్లు నాగరాజు వెల్లడించారు. 2022 మే నెలలో ప్రభుత్వం పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎల్ఐసీలో 3.5 శాతం వాటా అమ్మిన సంగతి తెలిసిందే. షేరుకి రూ. 949 ధరలో వాటా విక్రయించడం ద్వారా రూ. 21,000 కోట్లు సమకూర్చుకుంది. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వ వాటా 96.5 శాతంగా ఉంది. దీంతో 2027 మే నెలకల్లా పబ్లిక్‌కు కనీసం 10 శాతం వాటా నిబంధన అమలు చేసేందుకు మరో 6.5 శాతం వాటా ఆఫర్ చేయవలసి ఉంది. వెరసి ఎల్ఐసీలో ప్రభుత్వ వాటా విక్రయించేందుకు వీలుగా ఎఫ్‌పీవోను పరిశీలించవలసిందిగా దీపమ్‌ను కోరినట్లు నాగరాజు తెలియజేశారు. అయితే అనుమతులు, మార్కెట్ పరిస్థితుల ఆధారంగా వచ్చే ఏడాది ఎల్ఐసీ ఎఫ్‌పీవోకు అవకాశమున్నట్లు వివరించారు.

స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో ఐఫోన్‌దే రాజ్యం

అమ్మకాల్లో యాపిల్‌దే హవా

- గతేడాది విలువపరంగా 28 శాతానికి మార్కెట్ వాటా అప్
- దేశీయంగా ప్రీమియం ఫోన్లకు పెరుగుతున్న డిమాండ్
- కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా ప్రీమియం ఫోన్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ హవా కొనసాగుతోంది. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం 2025లో అమ్మకాల విలువ పరంగా యాపిల్ మార్కెట్ వాటా 28 శాతానికి పెరిగింది. 2024లో ఇది 23 శాతంగా నమోదైంది. అమ్మకాల పరిమాణంపరంగా వృద్ధి స్థిరంగానే ఉన్నప్పటికీ, కొనుగోలుదారులు ఖరీదైన మోడల్స్ కోసం ఫోన్లను ఎక్స్ఛేంజ్ చేసుకునే ధోరణి పెరుగుతుండటంతో విలువపరంగా మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది. ఐఫోన్ 16 సిరీస్ విజయవంతం కావడం, ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ స్కీములు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు మొదలైన అంశాల కారణంగా 2025లో 28 శాతం వాటాతో మార్కెట్‌పై యాపిల్ ఆధిపత్యం దక్కించుకుంది. పండుగల సందర్భంగా ప్రచార కార్యక్రమాలు, నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడం కూడా ఇందుకు దోహదపడ్డాయి. నివేదిక ప్రకారం 2025లో దేశీ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ పరిమాణంపరంగా 1 శాతం, విలువపరంగా 8 శాతం వృద్ధి చెందింది.

నివేదికలో మరిన్ని ముఖ్యాంశాలు

- గతేడాది ఆఫ్‌లైన్ రిటైల్ మార్కెట్లో పరిమాణంపరంగా 40 శాతం స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఫైనాన్సింగ్ మార్గంలో జరిగాయి. రూ. 30,000కు పైన ఉండే ప్రీమియం సెగ్మెంట్లో మూడింట రెండొంతుల విక్రయాలు రుణాల రూపంలో నమోదయ్యాయి. కస్టమర్లు ఖరీదైన డివైజ్‌లకు అప్‌గ్రేడ్ కావడంలో ఈఎంఐ ఆప్షన్లు కీలక పాత్ర పోషిస్తుండటాన్ని ఇది సూచిస్తోంది.
- గతంలో దేశీ మార్కెట్ వృద్ధికి ఎంట్రీ, బడ్జెట్ సెగ్మెంట్ల ఫోన్లు ప్రధాన చోదకాలుగా ఉండేవి. కానీ ప్రీమియమైజేషన్ వైపు వినియోగదారులు మొగ్గు చూపుతుండటంతో ప్రీమియం ఫోన్ల విభాగం ఈ రెండు సెగ్మెంట్లకు మించి వృద్ధి చెందుతోంది.
- గతేడాది రూ. 30,000 పైగా ఖరీదు చేసే ప్రీమియం సెగ్మెంట్ అత్యధికంగా వృద్ధి చెందింది.
- ఫోల్డబుల్ సెగ్మెంట్లో పరిమాణంపరంగా 88 శాతం మార్కెట్ వాటా, వార్షికంగా 28 శాతం వృద్ధితో శాంసంగ్ అగ్రస్థానంలో నిల్చింది.
- వాల్యూమ్స్‌పరంగా అత్యంత వేగంగా ఎదుగుతున్న బ్రాండ్‌గా మోటరోలా (54 శాతం వృద్ధి), సబ్-బ్రాండ్‌గా సీఎంఎఫ్ (83 శాతం వృద్ధి) నిల్చాయి.
- 2026లో విలువపరంగా మార్కెట్ విస్తరణకు ప్రీమియం ఉత్పత్తులే దోహదపడనున్నాయి. ఎంట్రీ లెవెల్ విభాగంపై ఒత్తిడి కొనసాగనుంది.
- మెమొరీ, విడిభాగాల వ్యయాలు పెరిగి, డిమాండ్ తగ్గడం వల్ల 2026లో అమ్మకాల పరిమాణం నెమ్మదించనుంది. రూ. 15,000 లోపు సెగ్మెంట్లో ఇది ఎక్కువగా కనిపించవచ్చు. ధరలు సగటున 5-7 శాతం వృద్ధి చెందనున్నాయి.

క్యూ3 ఫలితాలు

ఏథర్ ఎనర్జీ నష్టాలు తగ్గాయ్

క్యూ3లో రూ. 85 కోట్లు

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగ దిగ్గజం ఏథర్ ఎనర్జీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం భారీగా తగ్గి రూ. 85 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 198 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 650 కోట్ల నుంచి రూ. 996 కోట్లకు జంప్‌చేసింది. ఈ కాలంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 67,851 వాహనాలను విక్రయించింది. ఇది 50 శాతం వార్షిక వృద్ధికాగా.. 45 శాతం తక్కువగా రూ. 30 కోట్ల నిర్వహణ(ఇబిటా) నష్టం నమోదైంది. పండుగల పటిష్ట డిమాండ్, పుంజుకున్న అమ్మకాల పరిమాణం, మెరుగుపడిన మార్కెట్ వాటా నేపథ్యంలో రికార్డ్ ఆదాయం, ఇబిటా సాధించినట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో తరుణ్ మెహతా పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 607 వద్ద ముగిసింది.

యూపీఎల్ లాభం నేలచూపు

క్యూ3లో రూ. 490 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: పెస్టిసైడ్స్, ఆగ్రోకెమికల్ రంగ దిగ్గజం యూపీఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 43 శాతం క్షీణించి రూ. 490 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 853 కోట్లు ఆర్జించింది. అయితే ఇందుకు రూ. 499 కోట్లమేర ట్యాక్స్ రిఫండ్స్ సహకరించాయి. వెరసి గత త్రైమాసికంలో నమోదైన హైబేస్ ఈ క్యూ3 ఫలితాలపై ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. కాగా.. మొత్తం ఆదాయం 12 శాతం ఎగసి రూ. 12,361 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 11,077 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 10,369 కోట్ల నుంచి రూ. 11,553 కోట్లకు పెరిగాయి. 2025 డిసెంబర్‌కల్లా నికర రుణ భారం రూ. 23,317 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో యూపీఎల్ షేరు బీఎస్ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 699 వద్ద ముగిసింది.

క్యాంపస్ యాక్టివేర్ లాభం జూమ్

క్యూ3లో రూ. 64 కోట్లు

న్యూఢిల్లీ: క్రీడా రంగ ఫుట్‌వేర్, దుస్తుల తయారీ కంపెనీ క్యాంపస్ యాక్టివేర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 37 శాతం జంప్‌చేసి రూ. 64 కోట్లకు చేరింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 46 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 515 కోట్ల నుంచి రూ. 589 కోట్లకు బలపడింది. ఇది 14 శాతం వృద్ధికాగా.. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 15 శాతం వృద్ధితో రూ. 594 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతంపైగా పెరిగి రూ. 508 కోట్లను దాటాయి. ఈ కాలంలో 9 శాతం అధికంగా 8.3 మిలియన్ జతల బూట్లు విక్రయించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 6 శాతం జంప్‌చేసి రూ. 270 వద్ద ముగిసింది.

చలామణిలో రూ.5,609 కోట్ల నోట్లు

ముంబై: వ్యవస్థ నుంచి 98.42 శాతం మేర రూ.2,000 నోట్లు వెనక్కి వచ్చినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. 2023 మే 19న రూ.2,000 నోట్లను ఉపసంహరించుకునే నాటికి.. రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు చలామణిలో ఉండగా, 2026 జనవరి 31 నాటికి రూ.5,609 కోట్లకు తగ్గిపోయినట్టు ఆర్‌బీఐ తాజాగా వెల్లడించింది. అంటే, ఇంకా 1.58 శాతానికి సమానమైన పెద్ద నోట్లు వ్యవస్థలోనే ఉన్నట్టు తెలుస్తోంది. తొలుత 2023 అక్టోబర్ 7 వరకు అన్ని బ్యాంకుల్లో రూ.2,000 నోట్ల డిపాజిట్, మార్పిడికి ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఆ తర్వాత నుంచి దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీసుల్లో రూ.2,000 నోట్లను మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. ఇప్పటికీ తమ వద్ద రూ.2,000 నోట్లు ఉంటే, ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీసుల్లో దేనికి అయినా స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపుకోవచ్చు. పంపించే వారు దరఖాస్తుతోపాటు కేవైసీ డాక్యుమెంట్లు, బ్యాంక్ ఖాతా వివరాలను కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడు అంత విలువ మేర బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది.

త్వరలో మారుతీ కార్ల ధరల పెంపు..?

- భారీగా పెరుగుతున్న కమోడిటీ ధరలు
- కస్టమర్లకు కొంత భారం బదలీ యోచన
- వాహన ధరల పెంపు నిర్ణయంపై సమీక్ష
- కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ

ముంబై: ఆటో మొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ త్వరలో కార్ల ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. వాహన ధరల పెంపు అంశాన్ని పరిశీలిస్తున్నామని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు తర్వాత మార్కెట్‌లో నెలకొన్న బలమైన డిమాండ్, పెరుగుతున్న ముడి సరుకుల వ్యయాల దృష్ట్యా ధరల పెంపు అంశాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు వివరించారు. ‘‘కమోడిటీల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా విలువైన లోహాల (ప్రెషస్ మెటల్స్) ధరల పెరుగుదల అసాధారణంగా ఉంది. భౌగోళిక-రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాము. రాబోయే రోజుల్లో వాహనాల ధరల పెంపుపై సమీక్ష చేయనున్నాము’’ అన్నారు.

ధరల పెంపుపై త్వరలో నిర్ణయం: మార్కెట్ లీడర్‌గా ఉండటం వల్ల, ఖర్చు పెరుగుదల లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సాధ్యమైనంత వరకు కస్టమర్ల మీద భారం పడకుండా ప్రయత్నిస్తాం. కొంత వరకు మేం ఖర్చులను భరించగలం. కానీ, పెద్ద మొత్తంలో భరించలేని పరిస్థితి నెలకొంది. కచ్చితంగా కొనుగోలుదారుల మీదకి బదిలీ చేయక తప్పని పరిస్థితి నెలకొంది. అందుకే, త్వరలో ధరల పెరుగుదల గురించి కీలక నిర్ణయం వెలువరిస్తాం’’అని బెనర్జీ అన్నారు.

ప్రైజ్ ప్రొటెక్షన్ స్కీమ్: అటు ఉత్పత్తి పరిమితుల కారణంగా ఆలస్యంగా డెలివరీలు తీసుకుంటున్న కస్టమర్ల కోసం మారుతి సుజుకి జనవరిలో ప్రైజ్ ప్రొటెక్షన్ స్కీమ్ ను ప్రవేశపెట్టింది. ‘‘ఫోర్ వీలర్ విభాగానికి వస్తున్న మొదటిసారి కస్టమర్లను మేం గమనిస్తున్నాం. వారిని అప్‌గ్రేడ్ చేయడానికి అవకాశం ఇవ్వాలి. అందువల్ల, మేము ప్రైజ్ ప్రొటెక్షన్ స్కీమ్ ను తీసుకొచ్చాం. అందుకే, ధరల పెరుగుదల అనేది వారికి ఉండదు’’ అని బెనర్జీ చెప్పుకొచ్చారు.

పెండింగ్‌లో 1.75 లక్షల ఆర్డర్లు: జనవరిలో 2.78 లక్షల బుకింగ్‌లు వచ్చాయి. అయితే పరిమితమైన ఉత్పత్తి సామర్థ్యం కారణంగా కంపెనీకి ప్రస్తుతం 1.75 లక్షల ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే రోజుకు 9,000-10,000 ఆర్డర్లు వస్తున్నయన్నారు. అందుకు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి కృషి చేస్తోందన్నారు. గతేడాది జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో ఎంట్రీ లెవల్ మోడళ్లలో ధరలను తగ్గించింది. సెప్టెంబర్ 2025లో ఎస్-ప్రెస్సో ధరలను రూ. 1.29 లక్షల వరకు, ఆల్టో కే10 ధరలను రూ. 1.07 లక్షల వరకు, సెలెరియో ధరలను రూ. 94,100, వ్యాగన్ ఆర్ ధరలను రూ. 79,600 వరకు తగ్గించింది.

పతకాలే లక్ష్యంగా బరిలోకి...

నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్

కింగ్‌డావో: స్టార్ ప్లేయర్ పీవీ సింధు గైర్హాజరీలో ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. నేటి నుంచి ఆరు రోజులపాటు ఈ మెగా ఈవెంట్‌కు చైనా ఆతిథ్యమిస్తోంది. బుధవారం భారత జట్లు తమ తొలి లీగ్ మ్యాచ్‌లను ఆడతాయి. భారత పురుషుల జట్టు తమ తొలి మ్యాచ్‌ను సింగపూర్‌తో.. భారత మహిళల జట్టు తమ తొలి మ్యాచ్‌ను మయాన్మార్‌తో ఆడతాయి. గ్రూప్ 'వై'లో ఉన్న భారత మహిళల జట్టు మయాన్మార్‌పై గెలిస్తే క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది. 'వై' గ్రూప్‌లోని మూడో జట్టు థాయ్‌లాండ్‌తో భారత్ గురువారం ఆడుతుంది. .

భారత మహిళల జట్టు: మాళవిక బన్సోద్, తనీషా క్రాస్టో, ఉన్నతి హుడా, ట్రెసా జాలీ, ప్రియ, శ్రుతి మిశ్రా, పుల్లెల గాయత్రి, రక్షిత శ్రీ, తన్వీ శర్మ, తామిరి సూర్య చరిష్మా. **భారత పురుషుల జట్టు:** లక్ష్య సేన్, ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ఆయుశ్ శెట్టి, హరిహరన్, పృథ్వీ కృష్ణమూర్తి రాయ్, తరుణ్ మన్నేపల్లి, సాయిప్రతీక్.

భారత్‌లో మళ్లీ ఫార్ములావన్?

పునరుద్ధరణకు చర్యలు చేపట్టిన కేంద్ర క్రీడాశాఖ

న్యూఢిల్లీ: సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఢిల్లీలోని బుద్ధ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో 'రయ్... రయ్' మోత మోగింది. రేస్ ప్రియుల ఫేవరెట్ 'ఫార్ములావన్ గ్రాండ్‌ప్రి' జరిగింది. 2011లో మొదలైన ఈ ఎఫ్1 రేసు మూడేళ్ల పాటు జరిగింది. 2013 రేసు అనంతరం మనకు ఈ 'ఫార్ములా' దూరమైంది! కారణాలు ఏవైనా మళ్లీ ప్రతిష్టాత్మక ఫార్ములావన్ ఆతిథ్య భాగ్యం భారత్‌కు దక్కలేదు. ఇప్పుడు పుష్కరకాలం తర్వాత 'రయ్ రయ్' మోత మోగించాలని కేంద్ర క్రీడాశాఖ చొరవ చూపిస్తోంది. గ్రేటర్ నోయిడాలోని బుద్ధ సర్క్యూట్‌ను ఇటీవలే క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సందర్శించారు. అంతేకాదు, సంబంధిత వర్గాలతోనూ చర్చించినట్లు క్రీడాశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. బుద్ధ సర్క్యూట్ యజమాని జేపీ గ్రూప్. ఈ కార్పొరేట్ సంస్థ దివాళా తీసింది. ఇప్పుడు సర్క్యూట్ బాధ్యతల్ని 'యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ' చూస్తోంది. ఈ అథారిటీ వర్గాలతోనే క్రీడల మంత్రి భేటీ అయినట్లు తెలిసింది. అప్పుల్లో కూరుకుపోయిన జేపీ గ్రూప్ నుంచి బుద్ధ సర్క్యూట్‌ను అదానీ గ్రూప్ కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తోంది. ప్రాథమిక దశలో చర్చలు జరిగినట్లు తెలిసింది. ఈ యాజమాన్య బదిలీ ప్రక్రియ పూర్తయితే తిరిగి భారత్‌లో 'ఫార్ములావన్' రేసుకు చేపట్టాల్సిన కార్యాచరణ మొత్తం చకచకా జరిగిపోతుందని భావిస్తున్నారు. అయితే యాజమాన్య బదిలీ జరగకపోయినా... కనీసం రెండు, మూడేళ్లు ఈ ట్రాక్ బాధ్యతల్ని క్రీడా సమాఖ్యకు అప్పగించాలని మంత్రి మాండవీయ సంబంధిత వర్గాలను కోరినట్లు తెలిసింది. పన్ను, అధికారిక సమస్యల్ని పరిష్కరించి సాధ్యమైనంత తొందరగా ఫార్ములావన్‌ను తిరిగి భారత్ ట్రాక్‌లో నిర్వహించే ప్రణాళికతో క్రీడాశాఖ ఉంది. భారత మోటార్‌స్పోర్ట్స్ సమాఖ్య (ఎఫ్ఎంఎస్‌సీఐ) మాజీ అధ్యక్షుడు విక్కీ చందోక్ తాజా ప్రభుత్వ చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. తిరిగి ఎఫ్1 భారత్‌కు తిరిగొస్తే అంతకుమించిన ఆనందం మరొకటి ఉండదని అన్నారు. ఆయన కృషివల్లే 2011లో ఫార్ములావన్ జరిగింది.

విజేత వరుణి జైస్వాల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ (టీటీ) లీగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో వరుణి జైస్వాల్ చాంపియన్‌గా అవతరించింది. సికింద్రాబాద్‌లోని గుజరాతీ సేవా మండల్ (జీఎస్ఎం) టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహించిన ఈ టోర్నీ సోమవారం ముగిసింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో వరుణి 11–5, 8–11, 9–11, 11–9, 11–9తో శ్రీ శాన్వి (స్పార్స్)పై విజయం సాధించింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో దేవీప్రీ (జీఎస్ఎం) 13–11, 9–11, 11–9, 9–11, 11–8తో ప్రణీత (హెచ్‌వీఎస్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో స్వర్ణేందు (ఏవీఏస్ఈ) టైటిల్ సొంతం చేసుకున్నాడు. తుది పోరులో స్వర్ణేందు 11–6, 7–11, 11–8, 9–11, 11–8తో త్రిశూల్ మెహ్రా (హెచ్‌డీటీటీ)పై నెగ్గాడు. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో అలీ మొహమ్మద్ (హెచ్‌డీటీటీ) 11–5, 11–4, 8–11, 11–9తో వత్సిన్ (జీటీటీఏ)ను ఓడించాడు.

ఐఎస్ఎల్ మ్యాచ్ ఫీజుల్లో కోత

అంగీకరించిన సునీల్ ఛెత్రి సారథ్యంలోని బెంగళూరు ఎఫ్‌సీ

న్యూఢిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహణ కోసం ఆటగాళ్లు ఓ మెట్టు దిగారు. సునీల్ ఛెత్రి నేతృత్వంలోని బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఆటగాళ్లు తమ మ్యాచ్ ఫీజుల తగ్గింపునకు సమ్మతించారు. పలు సమస్యలతో ఐఎస్ఎల్ గతేడాది జరగలేదు. ఏడాది విరామం తర్వాత మొత్తానికి సమస్యలు పరిష్కరించుకొని ఇటు లీగ్ నిర్వాహకులు, ఫ్రాంచైజీ యాజమాన్యాలు ఈ ఏడాది నుంచి తిరిగి ఎప్పటిలాగే టోర్నీని నిర్వహించాలనే ఒప్పందానికి వచ్చారు. ఈ నెల 14 నుంచే ఫుట్‌బాల్ లీగ్ జరుగుతుంది. సజావుగా టోర్నీ నిర్వహణకు ఫుట్‌బాలర్లు సైతం తమ మ్యాచ్ ఫీజుల కోతకు అంగీకరించారు. దీనిపై బెంగళూరు యజమాని పార్థ్ జిందాల్ సంతోషం వ్యక్తం చేశారు. లీగ్ ఒడిదొడుకులను అర్థం చేసుకొని టోర్నీ నిర్వహణ కోసం తమ ఫీజుల్ని తగ్గించుకున్న ఆటగాళ్లను ఆయన అభినందించారు.

'ఫ్యాన్‌కోడ్'లో మ్యాచ్‌ల ప్రసారం

ఐఎస్ఎల్ ప్రసార హక్కుల్ని చాలా తక్కువ మొత్తానికే 'ఫ్యాన్‌కోడ్' యాప్ చేజిక్కించుకుంది. మొత్తం 91 మ్యాచ్‌లున్న ఫుట్‌బాల్ ఈవెంట్ ప్రపంచవ్యాప్త ప్రసార హక్కుల్ని రూ. 8.62 కోట్లకే దక్కించుకుంది. అంటే ఒక్కో మ్యాచ్‌కు సగటున రూ.9.5 లక్షలకే గ్లోబల్ మీడియా రైట్స్ పొందింది. 2024–25 సీజన్‌లో రూ.275 కోట్లు రాగా అప్పుడు 163 మ్యాచ్‌లు జరిగాయి. అంటే మ్యాచ్‌కు రూ. 1.68 కోట్లు వచ్చాయి. కానీ ప్రస్తుత సీజన్‌కు వచ్చేసరికి రూ.కోట్లు పోయి రూ.9.5 లక్షలకు పడిపోయింది.

చాంపియన్ శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర ఓపెన్ క్యారమ్ చాలెంజర్స్ ట్రోఫీ టోర్నీలో తెలంగాణకు చెందిన కె.శ్రీనివాస్ టైటిల్ సాధించాడు. ముంబైలో జరిగిన ఈ టోర్నీలో శ్రీనివాస్ తన ఉద్యోగ సంస్థ పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ) జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఫైనల్లో శ్రీనివాస్ 9–20, 23–0, 25–4తో అభిషేక్ చవాన్ (మహారాష్ట్ర)పై గెలుపొందాడు. టైటిల్ నెగ్గిన శ్రీనివాస్‌కు రూ. 1 లక్ష 50 వేలు ప్రైజ్‌మనీ లభించగా... రన్నరప్ అభిషేక్ ఖాతాలో రూ. 1 లక్ష చేరాయి. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మొహమ్మద్ ఆరిఫ్ (ఉత్తరప్రదేశ్) 27–8, 16–12తో చాంద్ యూసుఫ్ షేక్ (మహారాష్ట్ర)ను ఓడించాడు. ఆరిఫ్‌కు రూ. 75 వేలు ప్రైజ్‌మనీ దక్కింది. గతంలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన శ్రీనివాస్ నాలుగు సార్లు జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించాడు. ఇటీవల జరిగిన ప్రపంచకప్‌లో అతను రజత పతకం సాధించాడు.

భారత జట్టు ఓటమి

పొఖర (నేపాల్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–19 మహిళల చాంపియన్‌షిప్‌లో పోటీపడుతున్న భారత యువ జట్టుకు బంగ్లాదేశ్ చేతిలో చుక్కెదురైంది. ఏఎఫ్‌సీ అండర్–17 మహిళల ఆసియా కప్‌కు సన్నద్ధమయ్యేందుకు ఈ అండర్–19 టోర్నీలో భారత్ అండర్–17 జట్టును బరిలోకి దింపింది. టీనేజ్ జట్టు తొలి మ్యాచ్‌లో 1–0తో ఆతిథ్య నేపాల్‌పై గెలిచింది. కానీ సోమవారం జరిగిన పోరులో భారత అమ్మాయిల జట్టు 0–2 స్కోరుతో బంగ్లాదేశ్ చేతిలో కంగుతింది. ఈ మ్యాచ్‌లో భారత్ అసలు ఖాతానే తెరువలేదు. బంగ్లా జట్టులో అర్పిత బిస్వాస్ (29వ నిమిషంలో), అల్పి అక్తర్ (40వ ని.) చెరో గోల్ చేశారు.

'బాక్సమ్' బాక్సింగ్ టోర్నీకి హుసాముద్దీన్

న్యూఢిల్లీ: స్పెయిన్ ఆతిథ్యమిచ్చే బాక్సమ్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో భారత్ నుంచి భారీ బృందం బరిలోకి దిగనుంది. నేడు మొదలయ్యే సీజన్ తొలి టోర్నమెంట్‌లో భారత్ నుంచి ఏకంగా 33 మంది బాక్సర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కొన్ని కేటగిరీల్లో భారత్ నుంచి ఇద్దరు చొప్పున బాక్సర్లు బరిలో ఉన్నారు. పురుషుల 57 కేజీల విభాగంలో తెలంగాణకు చెందిన మొహమ్మద్ హుసాముద్దీన్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన 31 ఏళ్ల హుసాముద్దీన్ ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ (2023లో) కాంస్యం, కామన్వెల్త్ గేమ్స్‌లో (2018, 2022) రెండు కాంస్యాలు, ఆసియా చాంపియన్‌షిప్‌లో (2022లో) కాంస్యం సాధించాడు. 2023లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'అర్జున అవార్డు' పొందిన హుసాముద్దీన్ దేశవాళీ టోర్నీల్లో సర్వీసెస్ జట్టుకు ఆడతాడు. ప్రస్తుతం ఇండియన్ ఆర్మీలో సుబేదార్‌గా పని చేస్తున్నాడు.



భారత పురుషుల జట్టు: రిషి (50 కేజీలు), జాదుమణి సింగ్, పవన్ బార్త్‌వల్ (55 కేజీలు), హుసాముద్దీన్, సచిన్ సివాచ్ (57 కేజీలు), ఆదిత్య ప్రతాప్ యాదవ్, అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), హితేశ్ గులియా, దీపక్ (70 కేజీలు), ఆకాశ్ (75 కేజీలు), అంకుశ్, మాల్సాంలువాంగా (80 కేజీలు), జుగ్నూ (85 కేజీలు), హర్ష్, నమన్ తన్వర్ (90 కేజీలు), సావన్ గిల్ (90 ప్లస్ కేజీలు). **భారత మహిళల జట్టు:** మంజు రాణి (48 కేజీలు), నీతూ, కుసుమ్ (51 కేజీలు), ప్రీతి (54 కేజీలు), ప్రాచీ, వింకా (57 కేజీలు), ప్రియ, దిశ విజయ్ పాటివల్ (60 కేజీలు), ప్రాంజల్, కాజల్ (65 కేజీలు), స్నేహ, అరుంధతి చౌధరీ (70 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), సనమచ చాను (75 కేజీలు), నైనా (80 కేజీలు), మన్‌కీరత్ కౌర్ (90 ప్లస్ కేజీలు).

ముంబై జట్టులో యశస్వి జైస్వాల్

6 నుంచి కర్ణాటకతో రంజీ క్వార్టర్ ఫైనల్

ముంబై: టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ తిరిగి ముంబై రంజీ జట్టులోకి వచ్చారు. సొంతగడ్డపై ఈ నెల 6 నుంచి కర్ణాటకతో జరిగే క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌కు జైస్వాల్‌తోపాటు ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ అందుబాటులో ఉంటారని ముంబై జట్టు వర్గాలు తెలిపాయి. ఈ సీజన్‌లో జైస్వాల్ ఇదివరకే రాజస్తాన్‌తో జరిగిన తొలిరౌండ్ రంజీ మ్యాచ్‌లు ఆడాడు. విజయ్ హజారే ట్రోఫీ సందర్భంగా రెగ్యులర్ కెప్టెన్ శార్దుల్ గాయపడటంతో సిద్దేశ్ లాడ్ ముంబైని నడిపించాడు. ఇప్పుడు కోలుకోవడంతో శార్దుల్ మరోసారి జట్టు పగ్గాలు చేపట్టాడు. గ్రూప్ 'డి' టాపర్‌గా ముంబై నాకౌట్ దశకు అర్హత సాధించింది. నాలుగు విజయాలు, మూడు 'డ్రా' ఫలితాలున్నాయి. మరోవైపు కర్ణాటక గ్రూప్ 'ఎ' ఆఖరి పోరులో పంజాబ్‌పై గెలిచి క్వార్టర్స్‌కు చేరుకుంది. ఇప్పుడు ఇరు జట్ల మధ్య 6 నుంచి 10 వరకు ఇక్కడి ఎంసీఏ–బీకేసీ గ్రౌండ్‌లో రంజీ క్వార్టర్స్ పోరు జరుగుతుంది. సాధారణంగా వాంఖడే స్టేడియంలో మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే 7న టి20 ప్రపంచకప్ మొదలవుతుండటంతో రంజీ పోటీలను బాంద్రాకుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో నిర్వహిస్తున్నారు.

ముంబై రంజీ జట్టు: శార్దుల్ ఠాకూర్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, సిద్ధేశ్ లాడ్, అఖిల్, ఆకాశ్, హార్దిక్ తోమరె, సాయిరాజ్, షమ్స్ ములానీ, తనుశ్ కొటియన్, తుషార్ దేశ్‌పాండే, మోహిత్, ఓంకార్, దివ్యాన్ష్, సూర్యాన్ష్.

రాంచీలో ఫెడ్ కప్ అథ్లెటిక్స్ మీట్

కామన్వెల్త్ క్రీడలకు ఆఖరి సెలక్షన్ టోర్నీ అదే

తిరువనంతపురం: ఈ ఏడాది జాతీయ సీనియర్ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ పోటీలను రాంచీలో నిర్వహించనున్నారు. మే 22 నుంచి 25 వరకు ఈ పోటీలు జరుగుతాయి. ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడలకు అర్హత సాధించాలనుకునే భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లకు అదే చివరి అవకాశం కానుంది. రాంచీ పోటీల్లో క్వాలిఫికేషన్ మార్క్‌ను సాధిస్తే గ్లాస్గో మెగా ఈవెంట్‌కు అర్హత పొందుతారు. ఈ ఏడాది జూలై 23 నుంచి గ్లాస్గోలో కామన్వెల్త్ క్రీడలు జరుగుతాయి. కామన్వెల్త్ క్రీడల నిర్వాహక కమిటీ ప్రొటోకాల్ ప్రకారం అథ్లెట్ల బృందం 32 మంది క్రీడాకారులను మించడానికి వీలులేదు. ఈ 32 మందిలో 16 మంది మహిళా అథ్లెట్లు ఉండాల్సిందేనని భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) ఉపాధ్యక్షురాలు అంజూ బాబీ జార్జి తెలిపింది. 'గ్లాస్గోలో పరిమిత సంఖ్యలోనే ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత క్రీడాంశాల్లో కనబరిచిన మెరుగైన ప్రదర్శన, అర్హత మార్క్ దాటిన వారే గ్లాస్గో ఈవెంట్ భాగ్యం దక్కించుకుంటారు' అని ఆమె మీడియాకు వివరించారు. 32 మంది అంటే కేవలం అతికొద్ది మందికే కామన్వెల్త్ అర్హత దక్కుతుంది. అంటే మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో చాంపియన్ తెలుగుతేజం జ్యోతి యర్రాజీ, పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో తేజస్ లాంటి వారే మెగా ఈవెంట్‌కు అర్హత పొందే అవకాశముంది. జ్యోతి యర్రాజీ గత 2022 కామన్వెల్త్ పోటీల్లో పాల్గొన్నప్పటికీ హీట్స్‌ను దాటలేకపోయింది. ఈసారి పతకంపై ఆశలు పెట్టుకున్న ఆమె తన శిక్షణను మొదలుపెట్టింది. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈ ఏడాది జరిగే కామన్వెల్త్‌తో పాటు ఆసియా క్రీడల్లోనూ పాల్గొంటాడని జాతీయ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ రాధాకృష్ణన్ నాయర్ తెలిపారు. చోప్రా గాయంతో 2022 కామన్వెల్త్‌కు దూరంగా ఉన్నాడు.

మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీకి ఐర్లాండ్, స్కాట్లాండ్ అర్హత

కీర్తిపూర్ (నేపాల్): ఐసీసీ మహిళల టి20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌కు ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు అర్హత సాధించాయి. ఈ ఏడాది జూన్ –జులైలో ఈ మెగా టోర్నమెంట్ ఇంగ్లండ్‌లో జరుగుతుంది. గ్లోబల్ క్వాలిఫయిర్ టోర్నీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లలో థాయ్‌లాండ్‌ను ఓడించి ఐర్లాండ్... అమెరికాను ఓడించి స్కాట్లాండ్ ముందంజ వేశాయి. ఈ టోర్నీ ద్వారా ఇప్పటికే నెదర్లాండ్స్, బంగ్లాదేశ్ క్వాలిఫై అయ్యాయి. దాంతో వరల్డ్ కప్‌లో పాల్గొనే మొత్తం 12 జట్లు ఖరారయ్యాయి. టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు పాకిస్తాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా పాల్గొంటున్నాయి. థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 62 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా ఐర్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. గాబీ లూయిస్ (25), ఎమీ హంటర్ (24), ఒర్లా ప్రెండర్‌గాస్ట్ (24) రాణించగా...థాయిలాండ్ బౌలర్లలో సలీపాన్ లవొమి 4 వికెట్లు పడగొట్టింది. అనంతరం థాయిలాండ్ 16.1 ఓవర్లలో 59 పరుగులకే కుప్పకూలింది. నరుమొయి చల్‌వాల్ (22) మినహా అంతా విఫలమయ్యారు. ఎర్లెనా కెలీ 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బతీసింది. మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్ 41 పరుగులతో అమెరికాను ఓడించింది. ముందుగా స్కాట్లాండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 178 పరుగులు సాధించింది. డార్సీ కార్టర్ (52) అర్ధ సెంచరీ సాధించగా... ఎయిల్‌సా లిస్టర్ (43), ప్రియాంజ్ ఛటర్జీ (39) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆ తర్వాత అమెరికా 19 ఓవర్లలో 137 పరుగులకే ఆలౌటైంది. ఎలా క్లారిడ్జ్ (35) రాణించగా, ఇతర బ్యాటర్లంతా విఫలం కావడంతో యూఎస్‌కు ఓటమి తప్పలేదు.

ఇంటికి చేరుకున్న లియామ్

కోర్టు ఆదేశించిన మరునాడే విడుదల

వాషింగ్టన్: అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధంలోకి తీసుకున్న అయిదేళ్ల లియామ్ కొనెజో రమోస్, తండ్రితోపాటు మినియాపొలిస్‌లోని సొంతింటికి చేరుకున్నాడు. వారిద్దరినీ వెంటనే విడుదల చేయాలంటూ టెక్సాస్ డిస్ట్రిక్ట్ ఫెడరల్ కోర్టు జడ్జి ఫ్రెడ్ బియెరీ ఆదేశించిన మరునాడే ఈ పరిణామం చోటుచేసుకుంది. కుమారుడితోపాటు తండ్రిని శనివారం రాత్రి డిటెన్షన్ సెంటర్ నుంచి తీసుకువచ్చి, ఆదివారం వారి ఇంటి వద్ద వదిలిపెట్టానని టెక్సాస్ డెమోక్రాట్ జోక్విన్ కాస్ట్రో తెలిపారు. వీరి విడుదలను మిన్నెసొటా కాంగ్రెస్ సభ్యురాలు ఇల్హామ్ ఒమర్ స్వాగతించారు. ఆడ్రియన్ అలెగ్జాండర్ కొనెజో రమోస్, అతడి కుమారుడు లియామ్‌ను పది రోజుల తర్వాత ఆదివారం విడిచిపెట్టిన విషయాన్ని హోమ్‌లాండ్ సెక్యూరిటీ అసిస్టెంట్ సెక్రటరీ ట్రిసియా మెక్‌లాఫ్లిన్ ధ్రువీకరించారు. 'ఈ కేసులోని వాస్తవాల్లో ఎటువంటి మార్పు లేదు. ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) ఒక చిన్నారిని లక్ష్యంగా చేసుకోలేదు, అరెస్టు చేయలేదు'అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇమిగ్రేషన్ వ్యవస్థలో చట్టబద్ధతను, విచక్షణను పునరుద్ధరించడానికి ట్రంప్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ దేశంలో ఉండే హక్కు లేని విదేశీయుల అరెస్ట్, నిర్బంధం, బహిష్కరణ కోసం మా పోరాటం కొనసాగుతుంది'అని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి ఆదేశాలపై అప్పీలుకు వెళతామని డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్రాంచె చెప్పారు. ఇమిగ్రేషన్ చట్టాలు, నిబంధనలు సాధారణ క్రిమినల్ ప్రక్రియ కంటే చాలా భిన్నంగా ఉంటాయన్నారు. జనవరి 20వ తేదీన లియామ్‌ను, అతడిని తండ్రిని అదుపులోకి తీసుకున్న అధికారులు అక్కడి 1,300 కిలోమీటర్ల దూరంలో డిల్లే డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఈక్వెడార్‌కు చెందిన లియామ్ కుటుంబానికి అమెరికాలో ఉండేందుకు అవసరమైన ఎలాంటి అనుమతిపత్రాలు లేవని ఇమిగ్రేషన్ అధికారులు అంటున్నారు. ఆ రోజున తాము అరెస్ట్ చేసేందుకు యత్నించగా బాలుడిని కారులో వదలి ఆడ్రియన్ పరారయ్యాడని చెప్పారు. దీంతో, లియామ్‌ను స్కూలు బ్యాగుతో సహా ఇమిగ్రేషన్ అధికారులు తమ కారు వద్దకు తీసుకెళ్తున్నప్పటి ఫొటో సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీసింది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై జనం దుమ్మెత్తిపోశారు.

తండ్రితో చిన్నారి లియామ్

స్వేచ్ఛగా లియామ్...

ఢిల్లీలో బంగభవన్ వద్ద ఉద్రిక్తత

- బందోబస్తుగా వచ్చిన పోలీసులతో మమతా బెనర్జీ వాగ్వాదం
- బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరిట కుటుంబాలను వేధిస్తున్నారని మమత మండిపాటు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే పేరిట అధికారులు తమ రాష్ట్రంలో కుటుంబాలను వేధిస్తున్నారని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే విషయమై ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కలిసేందుకు ఢిల్లీకి వచ్చిన మమత సోమవారం బంగభవన్ వద్ద బందోబస్తు కోసం వచ్చిన ఢిల్లీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ఓటర్ల సమస్యలను ఈసీ ముందు ఏకరవు పెట్టేందుకు వచ్చిన తనను ధర్నా చేస్తాననే ఉద్దేశంతో అడ్డుకోవడం ఏమాత్రం సబబుగా లేదంటూ ఆమె ఢిల్లీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ ప్రాంతంలో భారీ స్థాయిలో పోలీసులను మోహరించారు. తర్వాత అక్కడికి చేరుకున్న మీడియా ప్రతినిధులతో మమత ఘటన వివరాలను వెల్లడించారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ బాధితులుగా మిగిలిపోయిన వారిలో దాదాపు 50 కుటుంబాలను మమత ఢిల్లీకి తరలించారు. కొందరు చాణక్యపురిలోని రాష్ట్ర ప్రభుత్వ భవనం అయిన బంగ భవన్‌లో, మరికొందరి వేర్వేరు చోట్ల విడిది ఏర్పాటు చేశారు. వీళ్లను కలిసేందుకు మమత బంగభవన్‌కు చేరుకోగానే అక్కడ మోహరించిన భారీ బందోబస్తును చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ''బెంగాల్‌లో ఎస్ఐఆర్ బాధిత కుటుంబాలు మీడియాతో మాట్లాడకూడదా? వాళ్ల గోడు వెళ్లబోసుకోవద్దా?''అని పోలీసులను మమత నిలదీశారు. ''బంగభవన్‌కు పోలీసులొచ్చి బాధిత కుటుంబాలను బెదిరించారు. మా కేసు ఇప్పుడు సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. ఎలక్షన్ కమిషన్‌తో మాకు సమావేశముంది. అధికారికంగా అపాయింట్‌మెంట్ తీసుకున్నాకే ఇక్కడికొచ్చాం. ఎస్ఐఆర్ వేధింపులకు బెంగాల్‌లో చాలా మంది చనిపోయారు. వాళ్ల కుటుంబాలు మీడియాతో మాట్లాడకూడదా?''అని పోలీసులను మమత నిలదీశారు.

అప్పుడెక్కడికి పోయారు?

''బెంగాల్ కుటుంబాలు బసచేసిన ప్రతి చోటుకు పోలీసులు ఎందుకొస్తున్నారు? ఇప్పుడొచ్చిన ఇదే పోలీసులు ఎర్రకోటవద్ద బాంబు పేలినప్పుడు ఎక్కడికి పోయారు?. క్షేత్రస్థాయిలో ఉన్న పోలీసులను నేను తప్పుబట్టలేదు. పోలీస్‌బాస్‌లను నిలదీస్తున్నా. మీకు దమ్ములేదు. దేశాన్ని రక్షించే సత్తా లేదు. బెంగాలీలు, జనాన్ని పీడించడమే మీకు తెలుసు. ఎస్ఐఆర్ పేరిట అరాచకాలకు పాల్పడుతున్నారు. ఢిల్లీకి నేనొస్తే వీళ్లకు భయం పట్టుకుంటోంది. నేనేమైనా లక్షల మందిని వెంటేసుకొచ్చానా?. పేదలకు ఢిల్లీలో స్థలం లేదా? ఢిల్లీ జమీందారీలా తయారైంది. నేనేమీ ఇక్కడకు వీళ్లతో కలిసి ధర్నా చేపట్టేందుకు రాలేదు. మేమంతా న్యాయంకోసం ఇక్కడికొచ్చాం'' అని మమత అన్నారు. ఢిల్లీ పోలీసుల ప్రశ్నల పరంపర నుంచి కుటుంబాలను రక్షించేందుకు వాళ్లు ఉంటున్న ప్రాంతాలకు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు సాకేత్ గోఖలే, దోలా సేన్, కకోలీ ఘోష్ దస్తీదార్, బాపీ దల్దార్‌లు వెళ్లారు. ఢిల్లీ కైలాశ్ కాలనీలోని పశ్చిమబెంగాల్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గెస్ట్‌హౌస్‌లో ఉన్న 20 మందికి రక్షణగా సాకేత్ గోఖలే వెళ్లగా అక్కడికి చేరుకున్న పోలీసులతో ఆయన వాగ్వాదానికి దిగారు. హేలీ రోడ్‌లోని బంగభవన్‌కు చేరుకున్న బాధితులతో తర్వాత మమత, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ భేటీ అయి వాళ్ల సమస్యలను అడిగి తెల్సుకున్నారు. తర్వాత వాళ్లను వెంటబెట్టుకుని మమత ఈసీ కార్యాలయానికి వెళ్లారు.

యువతను రెచ్చగొట్టారు

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం తేవాలని ప్రయత్నించారు
- సోనమ్ వాంగ్‌చుక్‌పై సుప్రీంలో కేంద్రం వాదన

న్యూఢిల్లీ: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ యువతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని కేంద్రం ఆరోపించింది. పొరుగునున్న నేపాల్, బంగ్లాదేశ్‌లలో మాదిరిగా జెన్ జెడ్ నిరసనలకు పిలుపునిచ్చారని పేర్కొంది. తన నిజ స్వరూపం బయటపడకుండా ఉండేందుకు గాను ఆయన మహాత్మాగాంధీ ప్రసంగాలను ఉపయోగించుకున్నారని తెలిపింది. జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద వాంగ్‌చుక్‌ను నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ ఆయన భార్య గీతాంజలి అంగ్మో వేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎన్ఎస్ఏ కింద అరెస్ట్ చేసిన వ్యక్తులను ఎలాంటి విచారణ లేకుండా గరిష్టంగా 12 నెలలపాటు నిర్బంధించే హక్కు అధికారులకు ఉంటుంది. కేంద్రం, లద్దాక్ యంత్రాంగం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కేంద్రాన్ని వాళ్లు అని, లద్దాఖ్ ప్రజలను మనం అని వేరుగా చూపిస్తూ మాట్లాడారని వాంగ్‌చుక్ ప్రసంగించే వారని ఆయన పేర్కొన్నారు. గతంలో జమ్మూ కశ్మీర్‌లో వచ్చినట్లుగా ప్రజాభిప్రాయ సేకరణ, రెఫరెండం చేపట్టాలంటూ డిమాండ్ చేశారన్నారు. చైనా, పాకిస్తాన్‌లతో సరిహద్దులు కలిగిన లద్దాఖ్ ప్రాంతం అత్యంత సున్నితమైందన్న మెహతా..అక్కడి ప్రజలను ఉద్దేశిస్తూ వాంగ్‌చుక్ చేసిన ప్రసంగాలను తప్పనిసరిగా గణనలోకి తీసుకోవాలని కోరారు. 'ప్రసంగాల వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన తర్వాతే జిల్లా మేజిస్ట్రేట్ వాంగ్‌చుక్ నిర్బంధానికి ఆదేశాలు జారీ చేశారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు డీఐజీ స్థాయి అధికారి ముందుగా వాంగ్‌చుక్ వద్దకు వెళ్లి ఆయన ప్రసంగాల వీడియోలను, ఇతర ఆధారాలను చూపారు. నిర్బంధంలోకి తీసుకునేందుకు గల కారణాలను వివరించారు'అని ధర్మాసనానికి మెహతా తెలిపారు. మేజిస్ట్రేట్ కృత్రిమ ఆధారాలతోనే వాంగ్‌చుక్‌ను నిర్బంధించాలంటూ ఆదేశాలు జారీ చేశారన్న వాదనలను ఆయన తోసిపుచ్చారు. వాంగ్‌చుక్ చేసిన ప్రసంగాలను విన్న అధికారులు, ఆ వీడియోలను తయారు చేసి మేజిస్ట్రేట్ ముందుంచారని వివరించారు. మంగళవారం కూడా ఈ కేసులో వాదనలు కొనసాగనున్నాయి. జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్న వాంగ్‌చుక్ అరబ్ దేశాల్లో మాదిరిగా తిరుగుబాటును లేవదీసేందుకు ప్రయత్నించినట్లు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ జనవరి 29వ తేదీన ఒక ప్రకటన వెలువరించారు. ప్రభుత్వాన్ని విమర్శించే, నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కు తనకుందని అందులో పేర్కొన్నారు. కొన్ని ఎంపిక చేసిన వీడియోలను చూపుతూ అధికారులు వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సమర్థించుకుంటున్నారంటూ ఆయన తరఫు లాయర్ కపిల్ సిబాల్ వాదిస్తున్నారు. వాంగ్‌చుక్ నిర్బంధం చట్ట విరుద్ధం, ఏకపక్ష చర్య..ఆయన ప్రాథమిక హక్కులకు భంగకరమని గీతాంజలి అంగ్మో ఆరోపిస్తున్నారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా ప్రకటించాలంటూ గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన నిరసనల్లో నలుగురు చనిపోగా, 90 మంది వరకు గాయపడ్డారు. అల్లర్లకు వాంగ్‌చుక్ రెచ్చగొట్టే ప్రసంగాలే కారణమని ఆరోపిస్తూ రెండు రోజుల తర్వాత అధికారులు జాతీయ భద్రతా చట్టం కింద ఆయన్ను నిర్బంధంలోకి తీసుకోవడం తెల్సిందే.

మణిపూర్‌లో బీజేపీ కేంద్ర పరిశీలకునిగా చుగ్

న్యూఢిల్లీ: మణిపూర్ శాసనసభాపక్ష నేత ఎన్నికల కోసం కేంద్ర పర్యవేక్షకునిగా బీజేపీ పార్టీ పార్లమెంటరీ బోర్డు సోమవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ని నియమించింది. ఈ వివరాలను జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ వెల్లడించారు. కేంద్ర పరిశీలకుని నియామకంతో త్వరలోనే మణిపూర్‌లో శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయన్న సంకేతాలు వెలువడ్డాయి. ఢిల్లీకి వచ్చి కలవాలని బీజేపీ అధిష్టానం సూచనమేరకు మణిపూర్‌లోని ఎన్డీఏ ఎమ్మెల్యేలు సోమవారం హస్తనకు విచ్చేసిన వేళ చుగ్ నియామకం జరగడం గమనార్హం. బీజేపీ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం ఢిల్లీలో జరగనుంది. కుకీలు, మైతేయీ జాతుల మధ్య విద్వేషం, హింస కారణంగా అమల్లోకి వచ్చిన రాష్ట్రపతి పాలన గడువు మరో వారంలో ముగుస్తున్న నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై నేరుగా చర్చించేందుకే ఎమ్మెల్యేలను పార్టీ అగ్రనాయకత్వం ఢిల్లీకి పిలిపించిందని వార్తలొచ్చాయి. గత ఏడాది ఫిబ్రవరి 9న మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశాక అదే నెల 13వ తేదీ నుంచి రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన అమలవుతోంది. ఘర్షణల్లో 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే.

హసీనాకు పదేళ్ల జైలు

ప్రభుత్వ గృహాల ప్రాజెక్టులో అక్రమాల కేసులో దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ కోర్టు

ఢాకా: పదవీచ్యుత బంగ్లాదేశ్ మహిళా ప్రధాన మంత్రి షేక్ హసీనాకు ఢాకా కోర్టు పదేళ్ల కారాగార శిక్ష విధించింది. ప్రభుత్వ గృహాల ప్రాజెక్టులో భూకేటాయింపుల్లో అక్రమాలు జరిగాయంటూ నమోదైన రెండు కేసుల్లో హసీనాతోపాటు ఆమె బంధువులను ఢాకా కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి దోషిగా తేల్చారు. లబ్ధిదారులకు బదులుగా హసీనా తన బంధువు, బ్రిటన్ లేబర్ పార్టీ మహిళా ఎంపీ, మాజీ బ్రిటన్ మంత్రి తులిప్ సిద్ధిఖ్‌సహా పలువురికి రెసిడెన్షియల్ ప్లాట్లను కేటాయించారన్న వాదనలతో న్యాయమూర్తి రుబియుల్ ఆలమ్ ఏకీభవించారు. ఢాకా శివారులోని పూర్బకోల్‌లోని రజూక్ న్యూ టౌన్ ప్రాజెక్టులో ఈ అక్రమాలు వెలుగుచూశాయని గతంలో కేసు నమోదైంది. శిక్ష పడిన హసీనా ఇద్దరు మేనకోడళ్లు, మేనల్లుడిని పోలీసులు వెంటనే వేర్వేరు కారాగారాలకు తరలించారు. సిద్ధిఖ్ చిన్న సోదరి ఆల

జమాన్ సిద్ధిఖ్, సోదరుడు రద్వాన్ ముజీబ్ సిద్ధిఖ్ బాబీలకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష వేస్తూ సోమవారం మధ్యాహ్నం 12. 30 గంటలకు జడ్జి తీర్పు వెలువర్చారు. 16 మంది నిందితులకు గాను ప్లాట్లు కేటాయించిన రజూక్ ప్రాజెక్టు సీనియర్ అధికారి ఖుర్షీద్ ఆలమ్ మాత్రమే కోర్టు హాలులో హాజరయ్యారు. గృహశాఖ సహాయ మాజీ మంత్రి ,అదే శాఖలో మాజీ కార్యదర్శి, రజూక్ ప్రాజెక్ట్ చైర్మన్, ఇతర అధికారులకు ఐదేళ్ల కారాగార శిక్ష పడింది. తన శిక్షపడడంపై హసీనా స్పందించారు. ''ఇలాంటి తీర్పును ముందే ఊహించాం. ఈ కేసులన్నీ మొహమ్మద్ యూనుస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం కక్షసాధింపుతో వేసిన తప్పుడు కేసులు. ఇవన్నీ కుట్రపూరితంగా తప్పుడు సాక్ష్యాలతో అల్లిన కేసులు''అని హసీనా వ్యాఖ్యానించారు. నాటి బంగ్లాదేశ్ ప్రభుత్వంతో నాకెలాంటి సంబంధం లేదు. అయినా సరే నాపై ఏడాదిన్నరగా తప్పుడు ఆరోపణలు ప్రచారంచేస్తున్నారు''అని తులిప్ సిద్ధిఖ్ అన్నారు. 2024 ఆగస్ట్ ఐదున బంగ్లాదేశ్ విద్యార్థులు, యువత సారథ్యంలో ఉవ్వెత్తున ఎగసిన 'జూలై ఉద్యమం'ధాటికి షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలిన విషయం విదితమే. ఆ తర్వాత హసీనాపై కేసుల పరంపర మొదలైంది.

హతమైన ఉగ్రవాదులు 177 మంది: పాక్

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల వేట కొనసాగుతోంది. ఆదివారం రాత్రి నుంచి కొనసాగుతున్న ఆపరేషన్లలో మరో 22 మంది హతమయ్యారని భద్రతాధికారులు తెలిపారు. దీంతో, రెండు రోజుల వ్యవధిలో 177 మంది ఉగ్రవాదులు చనిపోయినట్లయిందన్నారు. శనివారం ఉదయం ఇద్దరు మహిళా సూసైడ్ బాంబర్లు సహా బలూచిస్తాన్ సాయుధ గ్రూపులు 12 పట్టణాల్లో చేపట్టిన దాడులకు భీకర ప్రతిదాడులు మొదలుపెట్టామని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 167 మృతదేహాలను ఆస్పత్రులకు తరలించి, గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. వీరిలో అత్యధికులు బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ)కు చెందిన వారేనన్నారు. బీఎల్ఏ ఉగ్రవాదులు వివిధ ప్రాంతాల్లో 31 మంది పౌరులను కూడా చంపేశారని తెలిపారు. ఎదురు కాల్పుల ఘటనల్లో 17 మంది భద్రతా సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారన్నారు. ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతున్న వేళ ఆయా ప్రాంతాల్లో ఇంటర్నెట్, మొబైల్ సేవలను అధికారులు నిలిపివేశారు. మంగళవారం ఈ సేవలను తిరిగి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

నార్వే యువరాణి కుమారుడు అరెస్టు

రేప్ తదితర కేసుల్లో నిందితుడు

ఓస్లో: నార్వే రాజకుటుంబానికి మరో ఇబ్బందికర పరిణామం. యువరాణి మెట్టె మారిట్ పేరు వివాదాస్పద ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చోటుచేసుకున్న ఉదంతం ఓవైపు కలకలం రేపుతుండగానే, మరోవైపు ఆమె పెద్ద కుమారుడు మారియస్ బోర్గ్ హిబ్బీని పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై అత్యాచారాలు, దాడులు తదితర అభియోగాలు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై మంగళవారం ఓస్లో జిల్లా కోర్టులో విచారణ జరగాల్సి ఉండగా అరెస్టు చోటుచేసుకోవడం గమనార్హం.

మామూలోడు కాదు!

యువరాజు హాకన్‌కు హిబ్బీ సవతి కొడుకు. యువరాణి మారిట్‌కు గత సంబంధం ద్వారా జన్మించారు. ఆయనకు రాచరికపు హోదా గానీ, విధులు గానీ ఏమీ లేవు. కానీ హిబ్బీ నేరచరిత్ర అంతా ఇంతా కాదు! ఆయనపై ఇప్పటిదాకా ఏకంగా 38 రకాల అభియోగాలు దాఖలయ్యాయి. వాటిలో నాలుగు అత్యాచారాలు, సన్నిహితంగా సహజీవనం చేసిన వ్యక్తిపై తీవ్ర వేధింపులు, మరో భాగస్వామిపై హింసతో పాటు మారిజువానా రవాణా వంటివి ఉన్నాయి. వీటికి సంబంధించి 2024 నుంచి ఆయన్ను పోలీసులు పలుమార్లు అరెస్టు చేశారు. అయితే అభియోగాల నమోదు అనంతరం వదిలేశారు. హిబ్బీ సాధారణ నార్వే పౌరునితో సమానమేనని యువరాజు హాకన్ ఇటీవలే పేర్కొన్నారు.

చిక్కుల్లో రాజకుటుంబం

నార్వే రాజకుటుంబానికి ప్రజల్లో మంచి పేరుంది. కానీ హిబ్బీ నిర్వాకాలు ఆ ఇమేజీకి మచ్చ తెచ్చేవిగా మారాయి. యువరాణి మారిట్ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చోటుచేసుకోవడంతో రాజకుటుంబం ఇప్పటికే తల పట్టుకుంటోంది. అమెరికాతో పాటు పలు దేశాల రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులకు మైనర్లను, మహిళలకు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఎరగా వేసిన వైనం సంచలనం సృష్టించడం తెలిసిందే. దానికి సంబంధించి ఫైళ్లు కొద్దిరోజులుగా వెలుగు చూస్తున్నాయి. తాజా ఫైళ్లలో మారిట్ పేరు వందలసార్లు ప్రస్తావనకు రావడం నార్వేలో కలకలం రేపుతోంది! 2013లో ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో ఎప్‌స్టీన్‌కు చెందిన ఓ విలాసవంతమైన భవనంలో మారిట్ కొద్ది రోజుల పాటు ఉన్నట్టు వాటి ద్వారా వెలుగులోకి వచ్చింది. ఎప్‌స్టీన్ నేపథ్యం తెలుసుకోకుండా అతనితో సంబంధం పెట్టుకోవడం పొరపాటేనని మారిట్ చెప్పుకొచ్చారు. హాకన్ సోదరి ప్రిన్సెస్ మార్తా లూయిస్ అక్రమ వ్యాపార వ్యవహారాలు, అమెరికాకు చెందిన తంత్రవాది దురెక్ వెరెట్‌తో ఆమె వివాహం తదితరాలు కూడా నార్వే ప్రజలకు రుచించలేదు.

మయన్మార్ స్కాం సెంటర్ల దందా..

చైనాలో మరో నలుగురికి మరణ శిక్ష

తైపీ: మయన్మార్ సరిహద్దు ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని, భారీ ఎత్తున ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ, ఆరుగురు తమ పౌరుల మరణానికి కారణమైన ముఠా సభ్యులు నలుగురికి చైనా మరణశిక్షను అమలు చేసింది. ఈ విషయాన్ని షెన్‌జెన్‌లోని ఇంటర్మీడియట్ పీపుల్స్ కోర్టు సోమవారం ఉదయం ప్రకటించింది. కరడుగట్టిన నేరగాళ్ల బాయ్ కుటుంబం కాసినోలు, స్కాం సెంటర్లు నడుపుతూ 40 కోట్ల డాలర్ల మేర మోసాలకు పాల్పడినట్లు కోర్టు గతేడాది నవంబర్‌లో తేలి్చంది. ఆ తర్వాత ఈ గ్రూపు నాయకుడు బాయ్ సువోచెంగ్ జైలులోనే అనారోగ్యంతో చనిపోయాడని అధికారులు తెలిపారు. దీంతో, మిగతా నలుగురికి మరణశిక్షను అమలు చేశామన్నారు. స్కాం సెంటర్లు నడుపుతూ భారీగా మోసాలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన 11 మంది నేరగాళ్లకు చైనా కోర్టు గత వారం మరణ శిక్షను అమలు చేయడం తెల్సిందే.

సునేత్ర నియామకం వెనుక బీజేపీ హస్తం

'సంపాదకీయం'లో సామ్నా వ్యాఖ్య

ముంబై: భర్త అజిత్ పవార్ చనిపోయిన కొన్ని గంటలకే భార్య సునేత్ర మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీఠంపై ఆసీనురాలు కావడం వెనుక బీజేపీ అగ్రనేత చాణుక్యత దాగుందని ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన సారథ్యంలో ప్రచురితమయ్యే సామ్నా పత్రిక తన సంపాదకీయంలో రాసుకొచ్చింది. కమలదళ కనుసన్నల్లో పనిచేయకుండా సునేత్ర వీలైనంత త్వరగా స్వతంత్రంగా ఎదగాలని ఎడిటోరియల్‌లో సామ్నా తన అభిలాషను వ్యక్తంచేసింది. ''రెండు ఎన్సీపీ వర్గాలు విలీనమవడం బీజేపీ అగ్రనాయకత్వం, ఎన్సీపీ సునీల్ తత్కారే, ప్రఫుల్ పటేల్‌లకు అస్సలు ఇష్టంలేదు. డెప్యూటీ సీఎం పదవిలో సునేత్ర కేవలం అలంకారప్రాయంగా ఉండిపోకూడదు. కూటమి సర్కార్ చెప్పిందల్లా వినే మూగముసలావిడలా ప్రవర్తించకుండా స్వతంత్రభావాలతో ఉపముఖ్యమంత్రిగా పరిపాలించాలి''అని సామ్నా ఆశాభావం వ్యక్తంచేసింది. ''భర్త అస్థికలను గంగలో కలపడం వంటి అన్ని రకాల కర్మలను ముగించకుండానే సునేత్రతో ఉపముఖ్యమంత్రిగా ప్రమాణంచేయించడం సనాతన ధర్మ భావాలున్న బీజేపీకి ఏమాత్రం నప్పలేదు''అని సామ్నా విమర్శించింది.

తెరుచుకున్న రఫా పాయింట్... పరిమితంగానే రాకపోకలు

కాల్పుల విరమణ ఒప్పందంలో మరో అడుగు

కైరో: ఈజిప్టు– గాజా సరిహద్దుల్లోని రఫా బోర్డర్‌పాయింట్ సోమవారం తిరిగి తెరుచుకుంది. అయితే, చాలా పరిమిత సంఖ్యలోనే ప్రజల రాకపోకలకు అనుమతినిచ్చారు. సరుకుల రవాణాను ప్రస్తుతానికి అనుమతించడం లేదని ఇజ్రాయెల్ ఇప్పటికే ప్రకటించడం తెల్సిందే. అయితే, బోర్డర్ పాయింట్‌ను తిరిగి తెరవడాన్ని హమాస్–ఇజ్రాయెల్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు దిశగా మరో కీలకమైన ముందడుగు పడినట్లుగా భావిస్తున్నారు. సరిహద్దును తెరిచిన మొదటి గంట సేపటి వరకు గాజా నుంచి ఎవ్వరూ వెళ్లలేదు, గాజాలోకి ప్రవేశించలేదు. సోమవారం మొదటి రోజు గాజా నుంచి 50 మంది వరకు వచ్చేందుకు, తమ వైపు నుంచి 50 మంది వరకు వెళ్లేందుకు అనుమతిస్తామని ఈజిప్టు అధికారి ఒకరు తెలిపారు. యుద్ధంలో తీవ్రంగా గాయపడి, చికిత్స కోసం గాజా నుంచి వచ్చే పాలస్తీనియన్ల కోసం సుమారు 150 ఆస్పత్రులను సిద్ధంగా ఉంచామని ఈజిప్టు తెలిపింది.

ఈయూ రాయబారులకు ఇరాన్ సమన్లు

రివల్యూషనరీ గార్డులను ఉగ్రవాదులనడంపై నిరసన

దుబాయ్: సుప్రీం నేత ఖమేనీ కనుసన్నల్లో ఉండే పారా మిలటరీ విభాగం రివల్యూషనరీ గార్డ్స్‌ను ఉగ్రవాద గ్రూపు జాబితాలో యూరోపియన్ యూనియన్ దేశాలు చేర్చడంపై ఇరాన్ ఆగ్రహంతో ఉంది. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ సభ్యదేశాల రాయబారులకు సమన్లు జారీ చేస్తోంది. అమెరికా, కెనడాలు ఇప్పటికే రివల్యూషనరీ గార్డు విభాగాన్ని ఉగ్రగ్రూపుగా పేర్కొన్నాయి. దీనివల్ల ప్రత్యేకంగా ఎటువంటి నష్టం లేనప్పటికీ ఇరాన్ రగిలిపోతోంది. యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలకు ఆదివారం నుంచి సమన్లు జారీ చేస్తున్నామని, సోమవారం కూడా ఇది కొనసాగిందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఇస్మాయిల్ బఘీ తెలిపారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అకారణంగా, అన్యాయంగా తీసుకున్న నిర్ణయంపై మరిన్ని చర్యలకు కూడా తాము ప్రయత్నాలు చేపట్టనున్నామన్నారు. యూరోపియన్ యూనియన్ దేశాల సైన్యాలను కూడా ఉగ్ర సంస్థలుగా ప్రకటిస్తామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఆదివారం ప్రకటించడం తెల్సిందే. ఇరాన్‌లో జరుగుతున్న ప్రజాందోళనలపై జనవరి 8వ తేదీ నుంచి రివల్యూషనరీ గార్డు విభాగం ఉక్కుపాదం మోపుతోంది. ఈ విభాగం దాడుల్లో ఇప్పటి వరకు వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, పెద్ద సంఖ్యలో ప్రజలను నిర్బంధంలోకి తీసుకుంది.

'పేటెంట్ వివాదాల్లో సీసీఐ పరిధిని పరిశీలిస్తాం'

న్యూఢిల్లీ: నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్సీఎల్ఏటీ) ఇచ్చిన ఆదేశాల్లో కొన్నిటిపై సుప్రీంకోర్టు స్టే విధించింది. పేటెంట్ హక్కులకు సంబంధించి తలెత్తే వివాదాల పరిష్కారంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)గల అధికార పరిధిని పరిశీలిస్తామని ప్రకటించింది. పేటెంట్ హక్కుల దుర్వినియోగం ఆరోపణల వివాదాలకు కాంపిటీషన్ చట్టం–2002 వర్తించదని, ఇటువంటివి కేవలం పేటెంట్ చట్టం–1970 పరిధిలోకి మాత్రమే వస్తాయంటూ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. తమ ఉత్తర్వులు కేవలం న్యాయపరిధికి సంబంధించినవి మాత్రమేననీ, తీర్పులో మంచిచెడుల జోలికి తాము వెళ్లడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. 2022లో సీసీఐ వెలువరించిన నిర్ణయాన్ని ఎన్సీఎల్ఏటీ సమర్థించడంపై ఈ వివాదం తలెత్తింది. అప్పట్లో, విఫోర్ ఇంటర్నేషనల్ ఏజీ అనే స్విస్ ఫార్మా కంపెనీకి చెందిన ఫెర్రిక్ కార్బాక్సిమాల్టోస్ (ఎఫ్‌సీఎం) అనే పేటెంట్ ఔషధానికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదును సీసీఐ కొట్టివేసింది. ఈ నిర్ణయాన్ని ఎన్సీఎల్ఏటీ సమర్థించింది. అయితే, అసలు ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారమే సీసీఐకి లేదని పేర్కొంది. దీనికి సమర్థనగా కాంపిటీషన్ చట్టంలోని సెక్షన్ 3(5) నిబంధనను, మోన్‌శాంటో వర్సెస్ ఎరిక్సన్ కేసులో ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును ఎన్సీఎల్ఏటీ ప్రస్తావించింది.

పెన్నైయార్ నదీ జలాల పంపిణీకి ట్రిబ్యునల్

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: పెన్నైయార్ నదీ జలాల పంపిణీపై తమిళనాడు, కర్ణాటక మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించడానికి ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్‌ను నెల రోజుల్లోగా విడుదల చేయాలని స్పష్టం చేసింది. పెన్నైయార్ నదిపై కర్ణాటక చెక్ డ్యాములను కడుతూ, నీటిని మళ్లింపులను చేపట్టిందని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం 2018లో ఒక పిటిషన్ వేసింది. అంతర్రాష్ట్ర నదిని జాతీయ సంపదగ భావించాలని, దీనిపై ఏ ఒక్క రాష్ట్రానికీ ప్రత్యేకంగా హక్కులుండవని అందులో పేర్కొంది. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనంపై విధంగా ఆదేశాలను జారీ చేసింది.

మత మార్పిడి వ్యతిరేక చట్టాలపై.. కేంద్రం, 12 రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: మతమార్పిడి వ్యతిరేక చట్టాలపై కేంద్రంతోపాటు రాజస్తాన్, అరుణాచల్ ప్రదేశ్ తదితర 12 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ చట్టాలపై వెంటనే స్టే విధించాలంటూ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఇన్ ఇండియా(ఎన్సీసీఐ) వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ లాయర్ మీనాక్షి అరోరా వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలంటూ కేంద్రంతోపాటు 12 రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన పిటిషన్లటినీ కలిపి త్రిసభ్య ధర్మాసనం విచారిస్తుందని సీజేఐ తెలిపారు. కేంద్రంతోపాటురాష్ట్రాల ఉమ్మడి అఫిడవిట్‌ను ప్రత్యేక ధర్మాసనానికి సమర్పించాలన్నారు. సమాధానం ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సందర్భంగా నివేదించారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో.. శిరోమణి అకాలీదళ్ నేతకు సుప్రీం బెయిల్

న్యూఢిల్లీ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శిరోమణి అకాలీదళ్ నేత, పంజాబ్ మాజీ మంత్రి బిక్రమ్ సింగ్ మజీతియాకు సుప్రీంకోర్టు సోమవారం బెయిలిచ్చింది. తనకు బెయిల్ నిరాకరిస్తూ పంజాబ్ హరియాణా హైకోర్టు గతేడాది డిసెంబర్ 4వ తేదీన జారీ చేసిన ఆదేశాలను మజీతియా సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. మాదకద్రవ్యాలకు సంబంధించిన మరో కేసులో మజీతియాకు బెయిల్ మంజూరు చేసిన విషయాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. తాజా కేసులో ఆయన ఏడు నెలలుగా కస్టడీలో ఉంటున్నారని తెలిపిన ధర్మాసనం..ఆయన్ను జైలులోనే ఉంచాలని ఎందుకు అనుకుంటున్నారు? అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ లాయర్ సిద్ధార్థ దవేను ప్రశ్నించింది. మజీతియా తీవ్ర ఆరోపణలున్నాయని, ఆయనకున్న ఆస్తుల విలువ రూ.790 కోట్ల పైమాటేనని ధర్మాసనానికి వివరించారు. ఈ కేసు దర్యాప్తు జరుపుతున్న అధికారులకు బెదిరింపులు వస్తున్నాయన్నారు. అయితే, ఇదంతా రాజకీయ స్వార్థం కోసమేనంటూ మజీతియా తరఫు లాయర్ వాదించారు. ఈ కేసులో 295 మంది సాక్ష్యులున్నందున ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశాలు లేవన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం మజీతియాకు బెయిల్ ఇస్తున్నామని తెలుపుతూ..కఠినమైన బెయిల్ షరతులు విధించాలని దిగువ కోర్టును కోరవచ్చని రాష్ట్ర ప్రభుత్వ లాయర్‌కు సూచించింది.

బిట్స్ పిలానీలో విద్యార్థిని ఆత్మహత్య

గోవాలో రెండేళ్లలో ఆరో ఘటన

పనాజీ: దక్షిణ గోవాలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఇంజనీరింగ్ మూడో ఏడాది చదువుతున్న 20 ఏళ్ల వైష్ణవి జితేశ్ ఆదివారం తన హాస్టల్ గదిలో ఉరేసుకుని చనిపోయింది. వాస్కోలోని ఈ క్యాంపస్‌లో గత రెండేళ్లలో ఇది ఆరో ఆత్మహత్య! విద్యార్థిని గదిలో ఉరేసుకున్నట్టు రాత్రి 11.30 గంటలప్పుడు సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. వైష్ణవిది బెంగళూరు. ఈ ఘటనపై బిట్స్‌పిలానీ ఇప్పటిదాకా స్పందించలేదు. ఇటీవల కాలంలో బిట్స్ పిలానీ లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయి. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశా ల్లోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. పరీక్షల ఒత్తిడితోనే విద్యార్థులు ఆత్మహత్య లు చేసుకుంటున్నారని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అభిప్రాయపడ్డారు.

అజిత్ మరణంపై న్యాయ విచారణ: రౌత్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి, అజిత్ పవార్ మరణోదంతంలో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు న్యాయవిచారణ జరపాలని శివసేన(యూబీటీ) పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలోభాగంగా సోమవారం రాజ్యసభలో రౌత్ మాట్లాడారు. ''మహారాష్ట్రలో రూ.70,000 కోట్ల సాగునీటి ప్రాజెక్టుల కుంభకోణంలో అజిత్ పవార్‌ను నిందితునిగా పేర్కొంటూ గతంలో దర్యాప్తు మొదలైంది. ఒకవేళ ఆయన బీజేపీతో ముందే పొత్తు పెట్టుకుని ఉంటే ఆయనకు ఈ కళంకం అంటేదే కాదు. ఈ కుంభకోణంలో వాస్తవానికి బీజేపీ కోట్ల కొలదీ సొమ్మును వెనకేసుకుందని జనవరి 15వ తేదీన వెలువర్చిన ఒక ప్రకటనలో అజిత్ పవార్ ధ్వజమెత్తారు. ఇది జరిగిన కొన్ని రోజులకే ఆయన విమానప్రమాదంలో చనిపోయారు. ఈ కోణంలో దర్యాప్తు జరగాలి. అది కూడా స్వతంత్ర్యంగా జ్యుడీషియల్ విచారణ జరగాలి''అని రౌత్ డిమాండ్‌చేశారు.

ప్రాచీన కాలంలో ప్రధాన ఓడరేవు?

ప్రాచీన భారతదేశ పట్టణీకరణ

రాఖీగర్హ్, మొహంజొదారో, కాళీభంగన్, దోల వీరాలను పరిశీలించాక పట్టణ ప్రణాళిక విషయంలో ఆనాటి పట్టణాల్లో ఏకరూపత ఉన్నట్లు తెలుస్తోంది. నగరాల్లో పశ్చిమ వాయవ్య ప్రాంతాలు ఎత్తుగా ఉండి, తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు పల్లంగా కనిపిస్తున్నాయి. ఎత్తుగా ఉండే ప్రాంతాన్ని కోట అని పిలిచారు. కోట్‌డిజి వంటి వాటి ద్వారా కోట చుట్టూ ఆగడ్త ఉండటమే కాకుండా, కోట పై భాగంలో బురుజులున్నాయి అని తెలుస్తోంది. 12–14 అడుగుల ఎత్తు వరకు ప్రాకారాలు సురక్షితంగా ఉన్నట్లు అవగతమవుతోంది.

మొహంజొదారోలో స్నానవాటిక, రెండు స్థూపాలు, స్తంభ మండపం, కళాశాల భవనం వంటి నిర్మాణాలను గుర్తించారు. హరప్పాలో దిగువ భాగాన ఒక గ్రామం, ఒక దిబ్బ ఉండి, దిబ్బకు తూర్పు వైపున పోలీస్‌స్టేషన్ వంటి నిర్మాణ విశేషాన్ని కనుగొన్నారు. ప్రధాన వీధులు 4 నుంచి 6 మీటర్ల వరకు వెడల్పుతో ఉండేవి. రోడ్లన్నీ ఉత్తరం నుంచి దక్షిణం వైపుకు ఒకదానికొకటి లంబ కోణంలో ఉన్నాయి. లోథాల్ (గుజరాత్) వంటి పట్టణాల్లో కుమ్మరులు, లోహ కర్మ, శిలాకర్మలు చేసే వారి కార్ఖానాలు ఏర్పడ్డాయి.

పట్టణాలన్నింటిలో రోడ్ల పక్కన మురుగునీటి కాల్వలను నిర్మించారు. ఈ కాల్వల తయారీకి కాల్చిన ఇటుకలను ఉపయోగించారు. ఈ మురుగు నీటి కాల్వలను బాగు చేయడానికి అనువుగా నియమిత అంతరాల్లో మనిషి దిగడానికి కావాల్సిన రంధ్రాలను ఏర్పర్చారు. అదేవిధంగా ఎక్కువగా పారిన నీరు ఇంకడానికి చిన్న చిన్న గోతులను తవ్వారు.

ప్రత్యేక నిర్మాణాలు

మొహంజొదారోలో గొప్ప స్నాన వాటిక, స్తంభ మండపం, హరప్పాలో ధాన్యాగారాలు, లోథాల్‌లో ఓడరేవును గుర్తించారు. మొహంజొదారోలోని స్నానవాటిక 30×23×8 అడుగుల కొలతలతో నిర్మితమైంది. దీని గోడలు నీరు ఇంకకుండా ఏర్పడ్డాయి. దీనికి ఒకవైపు మెట్లవరుస, గ్యాలరీలా కూర్చోవడానికి వీలుగా నిర్మాణాలు ఉన్నాయి. దీనికి పైభాగంలో కొన్ని వరండాలు, గదులు కూడా ఉన్నాయి. హరప్పాలోని ధాన్యాగారాలను 50×20 అడుగుల కొలతతో ఆరు నిర్మాణాలను నదీ తీరాన నిర్మించారు. రెండు వరుసల్లో మొత్తం 12 ధాన్యాగారాలు ఉన్నాయి. లోథాల్ ప్రసిద్ధ ఓడరేవు. దీన్ని నదికి జతపరుస్తూ కృత్రిమ కాల్వలను తవ్వారు. ఈ నిర్మాణాలన్నింటికి ఒకే కొలతతో కూడిన కాల్చిన ఇటుకలను వాడారు. ఇటుకలు 11×5.5×2.75 అంగుళాల్లో, 4:2:1 నిష్పత్తిలో పొడవు, వెడల్పు, మందాన్ని కలిగి ఉండేవి.

నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావం

నాగరికత కాలాల్లోని కట్టడాల్లో బానిసలను అధిక సంఖ్యలో వినియోగించినట్లు వాల్టేర్ రూబెన్ అభిప్రాయం. ఇళ్ల పరిమాణాల్లోని మార్పులు, వివిధ విలాసాల ఉనికిని బట్టి కొందరు చరిత్రకారులు సమాజంలోని అంతరాలను ఊహించారు. సామాజిక ప్రక్రియలో ప్రయోజనాత్మక గమనశీలత.. పట్టణ నిర్మాణ వ్యవస్థ, ప్రణాళికలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేయగా నగర, గ్రామ సంబంధాలు పట్టణ వ్యవస్థ అస్థిత్వానికి దోహదపడ్డాయి. కానీ వ్యవసాయక వృత్తుల ప్రాముఖ్యత కలిగిన గ్రామీణ నిర్మాణాల గురించి ఎలాంటి ఆధారాలు లభించడం లేదు.

రెండో పట్టణీకరణ

క్రీ.పూ. 600–300 మధ్యకాలంలో గంగానది లోయలో చోటు చేసుకున్న పట్టణీకరణను భారత ఉపఖండంలో రెండో పట్టణీకరణగా పేర్కొంటారు. రాజ్‌గాట్, చిరంద్ తవ్వకాల్లో లభ్యమైన ఆధారాలను బట్టి ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలో, బీహార్ పశ్చిమ ప్రాంతంలో ఇనుము వినియోగం విస్తృతంగా ఉండేదని తెలుస్తోంది. ఈ ఇనుము వాడకం విశాల సామ్రాజ్య స్థాపనకు దారి తీసింది. ఈ సామ్రాజ్యాలన్నీ సైనికపరంగా ఆయుధ సంపత్తితో కూడుకొన్నవి. వీటిలో యుద్ధవీరుల వర్గం ప్రధాన పాత్ర పోషించింది. కొత్త వ్యవసాయ పనిముట్లు రైతులు అధిక ఉత్పత్తి చేయడానికి దోహదం చేశాయి. ఈ ఉత్పత్తులు పాలక వర్గ అవసరాలను తీర్చడమే కాకుండా అసంఖ్యాకమైన ఇతర నగరాలను పోషించాయి. ఈ భౌతిక వస్తు వినియోగశక్తి కోసల, మగధ సామ్రాజ్యాల విస్తరణకు దోహదం చేసింది. వైదికేతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ సామ్రాజ్యాల్లో కలిసిపోయారు. తద్వారా కొత్త సామ్రాజ్యాలు పరిపాలనా సంబంధమైన కొత్త సమస్యలను, సామాజికంగా ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొన్నాయి.

పాళీ, సంస్కృత గ్రంథాల్లో పేర్కొన్న అనేక నగరాలు కౌశాంబి, శ్రావస్తి, అయోధ్య, కపిలవస్తు, వారణాసి, వైశాలి, రాజగిరి, పాటలీపుత్రం మొదలైనవి తవ్వకాల్లో బయటపడ్డాయి. ఆవాసాలు, మట్టి నిర్మాణాల చిహ్నాలు కన్పించాయి. వాస్తవానికి ఇవి భారతదేశంలో రెండో నగరీకరణ ప్రారంభాన్ని సూచిస్తున్నాయి. మొత్తం దేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే శ్రావస్తిలాంటి పెద్ద నగరాలు దాదాపు 20 వరకు ఉంటాయి. తర్వాత కాలంలో నగరాలు గణనీయంగా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం గ్రీకు నుంచి అలెగ్జాండర్ సైన్యం భారతదేశానికి తరలి రావడమేనని గుర్తుంచుకోవాలి. దీనివల్ల అనేక వ్యాపార రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. వాయవ్య భారతదేశం, పశ్చిమ ఆసియాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడ్డాయి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

నగర ఆర్థిక వ్యవస్థ

నగరాల ఆవిర్భావానికి కారణాలు (రాజకీయ, ఆర్థిక, మతపరమైనవి) విభిన్నంగా ఉన్నప్పటికీ చివరికి ఈ నగరాలన్నీ మంచి వ్యాపార కేంద్రాలుగా ప్రసిద్ధి పొందాయి. వాటిలో రకరకాల వృత్తి నిపుణులు, వ్యాపారులు స్థిరపడ్డారు. వీరు కొన్ని సంఘాలుగా ఏర్పడ్డారు. జాతక కథల్లో అంటే బుద్ధుడి పుట్టుకకు సంబంధించిన కథల్లో ఇలాంటి సంఘాలను దాదాపు 18 వరకు పేర్కొన్నారు. అందులో నాలుగు పేర్లు (వడ్రంగులు, కుమ్మరులు, తోలుపని చేసేవారు, చిత్రకారులు) మాత్రం ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రతి సంఘం నగరంలో ఒక ప్రత్యేక ప్రాంతంలో నివసించేది. అంటే ఇలాంటి నివాసాలు, పరిశ్రమలు వృత్తుల స్థానికీకరణకు తోడ్పడటమే కాకుండా వారసత్వంగా తండ్రుల నుంచి వారి సంతానానికి సంక్రమించడానికి ఈ కళలు దోహదపడ్డాయి. సాధారణంగా వ్యాపారులంతా నగరాల్లోనే జీవించేవారు. కానీ వ్యాపారులు జీవనోపాధి కోసం రాజు జారీ చేసిన మాన్యాలు (భోగ గ్రామాలు) చేసుకోవడానికి గ్రామాలతో సంబంధం పెట్టుకోక తప్పలేదు. ఆర్థిక వ్యవస్థకు వ్యాపారులు చేస్తున్న సేవలను బట్టి పరమ నిరంకుశులైన రాజులు కూడా వారిని తగిన రీతిలో గౌరవించేవారు. వీటన్నింటినీ గమనిస్తే వృత్తి నిపుణులు, వ్యాపారులు నగరాల్లో ప్రధానమైన సామాజిక వర్గాలుగా అభివృద్ధిలోకి వచ్చారన్న విషయం అవగతమవుతోంది.

వృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువులను వ్యాపారులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. జాతక కథల్లో 500 బండ్లకు సరిపోయే వస్తువులు, వస్త్రాలు, దంతపు వస్తువులు, కుండలు మొదలైనవి తీసుకెళ్లినట్లు ప్రస్తావించారు. ఆ కాలంలో అన్ని ప్రధాన నగరాలు నదీ తీరాలకు ఆనుకునే ఉండేవి. వాటిని కలుపుతూ వ్యాపార మార్గాలు చాలా ఏర్పడ్డాయి. ఉదా॥ శ్రావస్తి పట్టణాన్ని కౌశాంబి, వారణాసి, కపిలవస్తు, కుశినార మొదలైన నగరాలతో అనుసంధానం చేశారు. లోహాలతో తయారైన నాణేలు మొట్టమొదట ఈ కాలంలోనే కన్పిస్తాయి. వైదిక గ్రంథాల్లో కనిపించే నిష్క, శతమాన అనే పదాలను నాణేల పేర్లుగానే గుర్తించినప్పటికీ అప్పటికే దొరికిన నాణేలు క్రీ.పూ. 6వ శతాబ్ది నాటి కంటే పాతవి మాత్రం కావు. ఈ కాలంలో మొట్టమొదటి దశలో నాణేలు చాలావరకు వెండితో తయారుచేశారు. కొన్ని రాగి నాణేలు కూడ లభించాయి. లోహ నాణేలపైన కొన్ని గుర్తులు అంటే.. కొండలు, చెట్లు, చేప, వృషభం మొదలైన చిహ్నాలతో రంధ్రాలు చేయడం వల్ల వీటిని రంధ్రపు గుర్తులున్న నాణేలనేవారు. పాళీ గ్రంథాలు ధనాన్ని విస్తారంగా ఉపయోగించేవారని, జీతభత్యాలు ధనరూపంలోనే చెల్లించేవారనీ పేర్కొన్నాయి.

అశోకుడికి ముందు రెండు శతాబ్దాల కిందటే ప్రారంభమైన లిపి కూడా వ్యాపారాభివృద్ధికి చాలా దోహదం చేసింది. ఈ కాలంలో గ్రంథాలన్నీ కొలతలకు సంబంధించిన సునిశిత పరిజ్ఞానాన్ని వివరించాయి. బహుశా ఇవి ఇళ్లు, భూముల సరిహద్దుల గుర్తింపులకు, నిర్మాణాలకు ఉపయోగపడి ఉంటాయి. ఆ విధంగా లేఖనం అనేది చట్టాలు, మతాచారాల సంకలనానికి మాత్రమే కాకుండా వ్యాపార వివరాలు, పన్నుల చెల్లింపు, విస్తృతమైన సైనిక ఉద్యోగుల వివరాలు రాసి పెట్టుకోవడానికి అవకాశం కల్పించింది. కానీ ఈ కాలంలో లిపి ఉండేదనే విషయానికి సంబంధించి ఎలాంటి పురావస్తు ఆధారాలు లేవు. అయితే ఈ ప్రాచీన రికార్డులను శిలలు, లోహపు ఫలకాలపై రాయకపోవడం వల్ల అవి నాశనమై ఉండొచ్చని అందుకే అవి అలభ్యాలని చెప్పొచ్చు.

మౌర్యుల తర్వాత పట్టణీకరణ

వ్యాపారం అభివృద్ధి చెందడం, ద్రవ్య ఆర్థిక విధానం విస్తరించడం పట్టణీకరణకు కారణభూతమయ్యాయి. చైనా యాత్రికులు తమ రచనల్లో పాటలీపుత్రం, వైశాలి, వారణాసి, కౌశాంబి, హస్తినాపురం, మధుర, ఇంద్రప్రస్థం మొదలైన నగరాలను పేర్కొన్నారు. కుషాణుల కాలంలో చిరండ్, సోన్‌పూర్, బక్సార్(బీహార్), తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో ఖేరత్,మాసన్,ఉత్తరప్రదేశ్‌లో సోహ్‌గౌరా, భీటా, కౌశాంబి, శృంగవేర్‌పూర్, అంత్రజిఖేరా, మీరట్, మజఫర్‌పూర్ ప్రాంతాలు సంపదలతో తులతూగేవి. అదేవిధంగా పంజాబ్‌లోని జలంధర్, లూధియానా, రూపార్‌ల్లో కూడా కుషాణుల కాలం నాటి నిర్మాణాలు బయటపడ్డాయి. మొత్తం మీద కుషాణుల కాలంలో నగరీకరణ అత్యున్నత స్థాయికి చేరుకుంది. పశ్చిమ భారతదేశంలో మాళ్వా ప్రాంతాన్ని పరిపాలించిన శకుల నగరాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. వారి ప్రధాన నగరం ఉజ్జయిని. కౌశాంబి నుంచి మధుర, మధుర నుంచి పశ్చిమ తీర ప్రాంతానికి వచ్చే రెండు ప్రధాన రహదారులు ఉజ్జయినిలో కలవడం వల్ల ఆ నగరానికి అధిక ప్రాధాన్యత లభించింది. దీనికితోడు ఉజ్జయిని అతి విలువ కలిగిన ఆగేట్, కార్నిలియన్ రాళ్ల వ్యాపారానికి కేంద్రంగా ఉండేది. క్రీ.పూ. 200 నుంచి ఇక్కడ కార్నిలియన్, జాస్పర్ రాళ్లతో పూసల్ని తయారు చేసేవారని తవ్వకాలు నిరూపిస్తున్నాయి. క్షిప్రా నదీ గర్భంలో పుష్కలంగా ముడిసరుకు లభించడం వల్ల ఈ పరిశ్రమ గొప్పగా వర్ధిల్లింది.

శకులు, కుషాణుల యుగంలా శాతవాహనుల కాలంలో టగర్, పైథాన్, ధాన్యకటకం, అమరావతి, నాగార్జునకొండ, బరూచ్, సోపారా, అరికమేడు, కావేరిపట్నం ప్రసిద్ధి చెందాయి. తెలంగాణలో ఫణిగిరి, మునుల గుట్ట, పోతన్ ప్రసిద్ధి చెందిన బౌద్ధ పట్టణాలని 'ప్లిని' అనే చరిత్రకారుడు తన రచనల్లో పేర్కొన్నారు.

గుప్తుల యుగం నాటి పట్టణీకరణ క్షీణత - ప్రభావం

6వ శతాబ్దం నుంచి వ్యాపారం తీవ్రంగా తగ్గుముఖం పట్టింది. రోమన్ సామ్రాజ్యంతో, పశ్చిమ దేశాలతో వ్యాపారం ఆగిపోయింది. 6వ శతాబ్దంలో ఇరాన్, బైజాంటియన్‌లతో పట్టువస్త్రాల వ్యాపారం ఆగిపోయింది, భారతదేశం.. చైనా, ఆగ్నేయ ఆసియాతో వ్యాపారం కొనసాగించడంలో దళారీలైన అరబ్బుల పాత్ర ప్రధానం. లాభాలు కూడా పూర్తిగా వారే పొందారు. వ్యాపారం క్రమక్రమంగా తగ్గుముఖం పట్టడంతో దేశంలో బంగారం నాణేలు పూర్తిగా తగ్గిపోయాయి. క్రమంగా పట్టణాలు శిథిలం కావడంతో మధుర, శ్రావస్తి, చరండ్, వైశాలి, పాటలీపుత్రం మొదలైన నగరాలు కాలగర్భంలో కలిసినట్లు తవ్వకాలు నిరూపిస్తున్నాయి. భారతీయ ఎగుమతులకు అవకాశాలు తగ్గడం వల్ల చేతివృత్తులవారు, వ్యాపారులు గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లి వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. 5వ శతాబ్దం చివరలో పట్టు నేసేవాళ్లు పశ్చిమ తీరం నుంచి మాళ్వా ప్రాంతంలోని మాండ్‌సోర్‌కు వలస వెళ్లారు. పట్టణాలు శిథిలం కావడం వల్ల, వ్యాపారం తగ్గుముఖం పట్టి గ్రామాలు తమకు కావలసిన నూనె, ఉప్పు, సుగంధద్రవ్యాలు, బట్టలు మొదలైన వస్తువుల్ని సమకూర్చు కోవాల్సివచ్చింది. అందువల్ల ఉత్పత్తి కేంద్రాలు చిన్నవిగా మారి, తమ అవసరాలకు మాత్రమే పరిమితంగా ఉండిపోయాయి. తర్వాత సామాజిక నిర్మాణంలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ఉత్తర భారతదేశంలో వైశ్యులను స్వతంత్ర రైతులుగా పరిగణించేవారు.

భూదానాలు రాజుకు, రైతుకు మధ్య భూస్వాములను సృష్టించాయి. అందువల్ల వైశ్యులు శూద్రులతో సమానమైపోయారు. ఈ మార్పు ఉత్తర భారతదేశం నుంచి బెంగాల్‌కు, దక్షిణ భారతదేశానికి విస్తరించింది.

వర్ణ వ్యవస్థలో మార్పులు

ధర్మశాస్త్రాల ప్రకారం వ్యక్తుల సామాజిక స్థాయి వర్ణంపై ఆధారపడి ఉండేది. ఒక వ్యక్తికి ఉన్న ఆర్థిక హక్కులు కూడా అతని వర్ణంపై ఆధారపడి ఉండేవి. పరిస్థితులు మారిన తర్వాత కొత్త భూస్వామ్య వర్గానికి ఇవ్వాల్సిన స్థానాన్ని గురించి ధర్మశాస్త్ర గ్రంథాల్లో మార్పులు చేశారు.

విద్యార్థి సామర్థ్యాన్ని సూచించేవి?

విజ్ఞానశాస్త్ర బోధన లక్ష్యాలు

- సాధారణంగా ఉద్దేశాలు, గమ్యాలు, లక్ష్యాలు అనే పదాలను పర్యాయపదాలుగా వాడతారు.
- **గమ్యాలు:** విశాలమైన, దీర్ఘకాలిక అంతిమ ప్రయోజనాన్ని తెలిపేవి గమ్యాలు.
  ఉదా: విద్యకు పరమార్థం మోక్షం. **– ఉపనిషత్తులు**
- **ఉద్దేశాలు:** గమ్యాల నుంచి ఏర్పడినవి ఉద్దేశాలు. ఇవి గమ్యాల కంటే నిర్దిష్టమైనవే కాకుండా విద్యా దిశలను కూడా సూచిస్తాయి.
  ఉదా: విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర జ్ఞానం కలిగించడం.
- **లక్ష్యాలు:** స్వల్పకాలంలో చేరగలిగే గమ్యాలను లక్ష్యాలనవచ్చు.
  ఉదా: డీఈడీ పరీక్ష పాసవడం.

విజ్ఞానశాస్త్ర అధ్యయన విలువలు:

1. సామాజిక విలువలు
2. సాంస్కృతిక విలువలు
3. నైతిక విలువలు
4. వృత్తిపరమైన విలువలు
5. ఔపయోగిక విలువలు

సామాజిక విలువలు– రకాలు:

1. బౌద్ధిక విలువ 2. సృజనాత్మక విలువ 3. సౌందర్య విలువ.

విద్యా లక్ష్యాలు
↓
స్థాయిలవారీగా విద్యా లక్ష్యాలు
↓
సబ్జెక్టుల వారీగా విద్యా లక్ష్యాలు
↓
తరగతుల వారీగా విద్యా లక్ష్యాలు

విద్యా లక్ష్యాలను ఈ కింది విధంగా చూపొచ్చు

- **గాగ్నే అనే విద్యావేత్త సూచించిన వర్గీకరణ:** గాగ్నే అభ్యసనాన్ని వివిధ రకాలుగా విడమర్చి చెప్పారు. అవి..

సూచీ అభ్యసనం– ఉద్దీపన– ప్రతిస్పందన అభ్యసనం, భావనాభ్యసనం, సూత్రాల అభ్యసనం, సమస్యా పరిష్కారం. ఇవి సరళం నుంచి సంక్లిష్టం వరకు ఒక క్రమ పద్ధతిలో అమిరి ఉంటాయి.

- **బెంజిమన్ బ్లూమ్, క్రాత్‌హోల్, డేవిడ్ సూచించిన వర్గీకరణ:** వీరు విద్యా లక్ష్యాలను మూడు వర్గాలుగా విభజించారు. అవి..
  - ఎ) జ్ఞానాత్మక రంగం
  - బి) భావావేశ రంగం
  - సి) మానసిక చలనాత్మక రంగం
- జ్ఞానాత్మక రంగంపై బెంజిమన్ బ్లూమ్, భావావేశ రంగంపై డేవిడ్.ఆర్. క్రాత్‌హోల్, మానసిక చలనాత్మక రంగంపై ఎలిబత్ సింప్సన్, ఆర్.హెచ్. దవే కృషి చేశారు.
- జ్ఞానాత్మక రంగం మెదడుకు, భావావేశ రంగం హృదయానికి, మానసిక చలనాత్మక రంగం మనసుకు, శరీరానికి సంబంధించినవి.
- ఏ అంశం గురించి అయినా ఈ మూడు రంగాల్లో విద్యార్థులను అభివృద్ధి చేయాలి.

విజ్ఞాన శాస్త్రంలో లక్ష్యాలు – స్పష్టీకరణలు –వివరణలు

ఎ. జ్ఞాన రంగంలో లక్ష్యాలు:

- జ్ఞప్తికి తెచ్చుకోవడం • గుర్తించడం

లక్ష్యం–I

1. **జ్ఞప్తికి తెచ్చుకోవడం :** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదాలు, సత్యాలు, భావనలు, సూత్రాలు, నిర్వచనాలు, నియమాలు పద్ధతులు జ్ఞప్తికి తెచ్చుకొంటాడు.
   ఉదా: చంద్ర గ్రహణం అంటే ఏమిటి?
2. **గుర్తించడం:** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన సత్యాలు, భావనలు, సూత్రాలు, నియమాలు, పద్ధతులు గుర్తిస్తాడు.
   ఉదా: కుంభాకార, పుటాకార దర్పణాల్లో భేదాలను గుర్తించడం.

లక్ష్యం–II అవగాహన:

విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదాలు, సత్యాలు, భావనలు మొదలైన వాటిని అవగాహన చేసుకుంటాడు.

స్పష్టీకరణలు:

- భావనలు, నియమాలు, సూత్రాలకు ఉదాహరణలిస్తాడు.
  ఉదా: సజీవులకు ఉదాహరణనిస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు, నియమాలను వివరిస్తాడు.
- ఇచ్చిన వాక్యంలోని దోషాన్ని సవరించి సరి చేస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు నియమాలను సరి చేస్తాడు.
- చిత్రపటాలకు, రేఖా పటాలకు, దత్తాంశాలకు వ్యాఖ్యానం రాస్తాడు.
- విజ్ఞాన సూత్ర సత్యాలను, భావాలను వర్గీకరిస్తాడు.
- సమస్యలను సాధిస్తాడు.
- విజ్ఞానశాస్త్ర పరికరాలను, రసాయనాలను ఎంపిక చేసుకుంటాడు.
- భౌతిక రాశులకు సరైన ప్రమాణాలు తెలుపుతాడు.
- శాస్త్ర సత్యాలు, భావనలను, ప్రక్రియలను సరిపోల్చుతాడు.

లక్ష్యం – III వినియోగం: విద్యార్థి తాను నేర్చుకున్న విజ్ఞానశాస్త్ర విజ్ఞానాన్ని పరిస్థితులకనుగుణంగా వినియోగిస్తాడు.

స్పష్టీకరణలు:

- భావనలు, సూత్రాలు, నియమాలు మొదలైన వాటిని విశ్లేషిస్తాడు.
- విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని నేరుగా వినియోగిస్తారు.
- శాస్త్ర ప్రక్రియలకు, దృగ్విషయాలకు కారణాలను తెలుపుతాడు.
- కారణానికి, ఫలితానికి మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తాడు.
- శాస్త్ర పరిశీలనలను వ్యాఖ్యానిస్తాడు.
- సామాన్యీకరణలను ప్రతిపాదిస్తాడు.
- సరైన ప్రయోగ విధానాలు, పరికరాలను సూచిస్తాడు.
- ప్రాగుక్తీకరించగలడు.
- దత్తాంశం ఆధారంగా నిర్ణయం తీసుకుంటాడు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మెథడాలజీ

భావావేశ రంగం లక్ష్యాలు:

లక్ష్యం I: శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
లక్ష్యం II: అభిరుచి
లక్ష్యం III: అభినందన

మానసిక చలనాత్మక రంగ లక్ష్యాలు

లక్ష్యం I: చిత్రలేఖన నైపుణ్యం
లక్ష్యం II: హస్త నైపుణ్యాలు
లక్ష్యం III: పరిశీలన నైపుణ్యాలు
లక్ష్యం IV: అభివ్యంజన నైపుణ్యాలు
లక్ష్యం V: నివేదన నైపుణ్యాలు

విజ్ఞాన శాస్త్రం– సహ సంబంధం

సహ సంబంధం ఆవశ్యకత:

- జ్ఞానాన్ని సంయుక్తపరచడం
- సమర్థవంతమైన అభ్యసనం
- శ్రమ ఆదా
- అభ్యసన బదలాయింపు

సహ సంబంధం– రకాలు:

- సహజసిద్ధం
- కృత్రిమ సహ సంబంధం
- వ్యవస్థీకృత సహ సంబంధం
- విజ్ఞానశాస్త్రానికి విద్యా ప్రణాళికలోని ఇతర పాఠ్యవిషయాలకు సంబంధం
- విజ్ఞానశాస్త్రం– భాష
  విజ్ఞానశాస్త్రం – చరిత్ర
- విజ్ఞానశాస్త్రం – భౌగోళిక శాస్త్రం
- విజ్ఞానశాస్త్రం– గణితం
- విజ్ఞానశాస్త్రం – చిత్రలేఖనం
- విజ్ఞాన శాస్త్రం – చేతిపని
- విజ్ఞాన శాస్త్రం –దైనందిన జీవితానికి సంబంధం.

విద్యా లక్ష్యాలు

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
జ్ఞానానికి సంబంధించిన వాటిని జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించడం, మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలను అభివృద్ధి పరచడం.	ఆసక్తులు, విలువల్లో మార్పులు, అభినందనను పెంపొందించడం	హస్తలాఘవ, మోటార్ నైపుణ్యాలు అభివృద్ధి చేయడం

బ్లూమ్ సూచించిన లక్ష్యాల వర్గీకరణ

శిశువు (ప్రవర్తన)

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
1. జ్ఞానం	1. గ్రహించడం	1. అనుకరణ
2. అవగాహన	2. ప్రతిస్పందించడం	2. హస్తలాఘవం
3. వినియోగం	3. విలువకట్టడం	3. సునిశితత్వం
4. విశ్లేషణ	4. వ్యవస్థాపనం	4. ఉచ్చారణ
5. సంశ్లేషణ	5. శీలస్థాపనం	5. స్వాభావీకరణం
6. మూల్యాంకనం		

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **విద్యార్థులు చేసే ప్రయోగాలకు కావాల్సిన పరికరాలను, వస్తు సామగ్రిని వారే తయారుచేసుకోవడాన్ని సూచించే విలువ? (డీఎస్సీ-2008)**
   ఎ) క్రమశిక్షణ విలువ
   బి) ఉపయోగిత విలువ
   సి) సృజనాత్మక విలువ
   డి) వృత్తిపరమైన విలువ
2. **అవగాహనలో ప్రవర్తనాత్మకమైన స్పష్టీకరణం ఎక్స్‌ట్రాపొలేషన్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)**
   ఎ) కార్యనిర్వాహక సంబంధం తెలపడం
   బి) అన్వయం చేయడం, వర్ణించడం
   సి) పోల్చడం, తేడాలు చెప్పడం
   డి) ఒక పరిష్కారం నుంచి మరొక పరిష్కారానికి
3. **సామర్థ్యాలను స్పష్టీకరించడంలో ఒక మౌలికాంశం? (డీఎస్సీ-2006)**
   ఎ) అభ్యసన ఔచిత్యం బి) పరిస్థితులు
   సి) పరిసరాల అనుగుణ్యత
   డి) పాఠ్యాంశాలు
4. **మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యాల క్రమం? (డీఎస్సీ-2006)**
   ఎ) అనుకరణ, నిర్వహణ, సునిశితత్వం, సమన్వయం, స్వాభావీకరణం
   బి) అనుకరణ, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, శీలస్థాపనం
   సి) గ్రహించడం, నిర్వహణ, సునిశితత్వం సమన్వయం, శంకుస్థాపన
   డి) గ్రహించడం, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, స్వాభావీకరణం
5. **ఇందులో ఒకటి మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యం? (డీఎస్సీ-2001)**
   ఎ) పరిసరాల్లో ఉన్న వాటిపై ఆసక్తి ప్రదర్శించడం
   బి) శాస్త్ర సంబంధమైన భావనలు గుర్తించడం
   సి) పటాలు గీయడంలో నైపుణ్యం
   డి) శాస్త్ర జ్ఞానాన్ని వినియోగించడం
6. **మన ప్రకృతి సంపదను, వనరులను సద్వినియోగం చేసుకోవడం అనేది శాస్త్రపరంగా ఏ విలువను పెంపొందిస్తుంది? (డీఎస్సీ-2001)**
   ఎ) బౌద్ధిక విలువ బి) సౌందర్య విలువ
   సి) ఉపయోగిత విలువ
   డి) వృత్తి విలువ
7. **విద్యార్థి గడించిన సామర్థ్యాలను సూచించేవి? (డీఎస్సీ-2001)**
   ఎ) ఉద్దేశాలు బి) లక్ష్యాలు
   సి) నైతిక విలువలు డి) స్పష్టీకరణలు
8. **విజ్ఞానశాస్త్రాన్ని ఇతర సబ్జెక్టులతో సహసంబంధం కలిగించడం? (డీఎస్సీ-2000)**
   ఎ) కష్టం బి) సులువు
   సి) ఇవేవీ కావు డి) మౌలికమైంది
9. **ప్రయోగాలు/ కృత్యాలు చేయడం దేనికి సంబంధించింది? (డీఎస్సీ-2000)**
   ఎ) అవగాహన బి) జ్ఞానం
   సి) నైపుణ్యం డి) అభినందన
10. **క్షేత్ర పర్యటన ఏ రంగంలోనిది? (డీఎస్సీ-1998)**
    ఎ) జ్ఞానాత్మక రంగం
    బి) మానసిక చలనాత్మక రంగం
    సి) భావావేశ రంగం డి) పైవేవీ కావు
11. **'విద్యార్థి నమ్మకంగా తన పరిశీలనలను నమోదు చేయడం' ఏ ముఖ్య లక్షణాన్ని సూచిస్తుంది? (డీఎస్సీ-1994)**
    ఎ) అవగాహన బి) వైఖరి
    సి) నైపుణ్యం డి) జ్ఞానం

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) సి; 6) సి; 7) డి; 8) డి; 9) సి; 10) సి; 11) సి.

మాదిరి ప్రశ్నలు

1. **విద్యా విషయక లక్ష్యాలను వర్గీకరించింది?**
   ఎ) R.C. రాస్ బి) C.P.S. నాయర్
   సి) బ్లూమ్ డి) స్మిత్
2. **ఎక్స్‌ట్రాపొలేషన్ దేనికి సంబంధించింది?**
   ఎ) అనునాదం బి) అవగాహన
   సి) పరికల్పన డి) హేతుకీకరణ
3. **'Taxonomy of Educational Objectives'.. ఎవరి రచన?**
   ఎ) బ్లూమ్ బి) థార్న్‌డైక్
   సి) అరిస్టాటిల్ డి) గాగ్నే
4. **ఎత్తుకు, గురుత్వ త్వరణానికి సంబంధం తెలపడం ______**
   ఎ) వినియోగం బి) జ్ఞానం
   సి) అవగాహన డి) సంశ్లేషణ
5. **బొమ్మలు గీయడం ఏ రంగానికి చెందింది?**
   ఎ) భావావేశ బి) జ్ఞానాత్మక
   సి) మానసిక చలనాత్మక
   డి) ఏదీకాదు
6. **భావావేశ రంగాన్ని వివరించినవారు?**
   ఎ) గేట్స్ బి) విలియమ్స్
   సి) క్రాత్‌హోల్ డి) బ్లూమ్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) సి; 5) సి; 6) సి.

మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్

భారతదేశం - శక్తి సంపద

శక్తి ఒక ముఖ్య వనరు మాత్రమే కాకుండా ఆధునిక కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రథమ కారకం. ఒక దేశం వ్యవసాయకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి శక్తి సంపద ఎంతో అవసరం. ప్రస్తుతం మానవ జీవితం శక్తి వనరులపై ఎంతో ఆధారపడింది. మానవ జీవితావసరానికి రూపొందించే ప్రతి వస్తు ఉత్పత్తి ఈ శక్తిపైనే ఆధారపడి ఉంటుంది. శక్తి వనరులను రెండు రకాలుగా విభజించొచ్చు. అవి

1. సంప్రదాయ శక్తి వనరులు/తరిగిపోయే శక్తి వనరులు
2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు

1. సంప్రదాయ/తరిగిపోయే శక్తి వనరులు:

- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తిని ఉత్పత్తి చేసే యురేనియం, థోరియం వంటి ఖనిజాలు మొదలైన వాటిని సంప్రదాయ శక్తి వనరులు అంటారు.
- వీటి నిల్వలు ప్రకృతిలో నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే ఉన్నందున వాడుతూ ఉంటే క్రమేణా తరిగిపోతాయి.
- ఇవి తరిగిపోతే మానవుడు పునరుద్ధరించలేడు. కాబట్టి వచ్చే తరాలను దృష్టిలో పెట్టుకొని వీటిని క్రమబద్ధంగా వినియోగించుకోవాలి.

2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు:

- నీరు, సౌరశక్తి, పవన శక్తి, వేలా తరంగాలు, భూతాప శక్తి మొదలైన వాటిని సంప్రదాయేతర శక్తి వనరులుగా పరిగణిస్తారు.
- ఇవి ప్రకృతిలో నిరంతరం లభ్యమవుతాయి. కాబట్టి తరిగిపోవడమనే సమస్యే లేదు.
- అయితే వీటిని శక్తి ఉత్పాదకతకు ఉపయోగించుకోవాలంటే సాంకేతికాభివృద్ధితో మాత్రమే సాధ్యపడుతుంది.
- మనదేశంలో నేలబొగ్గు, చమురు, కర్ర బొగ్గు, నీరు ప్రధాన శక్తి వనరులు. సూర్యరశ్మి, గాలి మొదలైన వనరుల వాడకం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దశలో ఉంది. అలాగే అణుశక్తి కూడా మంచి అభివృద్ధి దశలో ఉందని చెప్పొచ్చు. వీటన్నింటిలోనూ బొగ్గు చాలా ముఖ్యమైన శక్తి ఉత్పాదక వనరు. ఆ తర్వాత స్థానం జలశక్తి ఆక్రమిస్తుంది.
- మనదేశంలో మొదటిసారి విద్యుచ్ఛక్తి తయారీ డార్జిలింగ్ (పశ్చిమ బంగా)లో 1897లో ప్రారంభమైంది. ఆ తర్వాత 1902లో కర్ణాటకలోని శివసముద్రం వద్ద జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- స్వాతంత్ర్యానంతరం 'విద్యుచ్ఛక్తి చట్టం 1948'లో ప్రవేశపెట్టి విద్యుచ్ఛక్తిని ప్రభుత్వ రంగ పరిధిలోకి తెచ్చారు.
- 1975లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, 'నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్'ల ఏర్పాటుతో దేశంలో విద్యుచ్ఛక్తి రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది.
- మనదేశంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 1947లో 1400 మెగావాట్లు ఉంటే, 2005-06 నాటికి 1,19,607 మె.వాట్లకు చేరింది.

భారతదేశంలో సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లు

ఎస్టీపీఎస్	రాష్ట్రం
1. సింగ్రౌలి	ఉత్తరప్రదేశ్
2. దాద్రి	ఉత్తరప్రదేశ్
3. రీహండ్	ఉత్తరప్రదేశ్
4. ఫూంచహార్	ఉత్తరప్రదేశ్
5. సింహాద్రి	ఆంధ్రప్రదేశ్
6. రామగుండం	తెలంగాణ
7. వింద్యాచల్ -1	మధ్యప్రదేశ్
8. వింద్యాచల్-2	మధ్యప్రదేశ్
9. కోర్బా	ఛత్తీస్‌గఢ్
10. కహాల్‌గావ్	బీహార్
11. తాల్చేర్	ఒడిశా
12. కాయంకుళం	కేరళ
13. ఫరక్కా	పశ్చిమ బంగా

థర్మల్ విద్యుత్

- బొగ్గు, నీటి ఆవిరి ఆధారంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను థర్మల్ విద్యుత్ అంటారు. దేశంలో సుమారు 73 శాతం ఉత్పత్తితో థర్మల్ విద్యుత్ మొదటి స్థానంలో ఉంది.
- థర్మల్ విద్యుత్‌ను ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయి.
- వేయి మెగావాట్ల కంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పవర్ స్టేషన్‌ను సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటారు. ఇవి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో ఉంటాయి.
- 4000 మె.వాట్ల కంటే ఎక్కువ థర్మల్ విద్యుత్ సామర్థ్యం ఉంటే వాటిని 'అల్ట్రా మెగా పవర్ ప్లాంట్' (యూఎంపీపీ) అంటారు.

భారతదేశంలో అల్ట్రా మెగా పవర్ ప్లాంట్స్

యూఎంపీపీ	రాష్ట్రం
1. ముంద్రా	గుజరాత్
2. తాద్రి	కర్ణాటక
3. గిర్యా	మహారాష్ట్ర
4. ససన్	మధ్యప్రదేశ్
5. ఇబ్ నదీ లోయ	ఒడిశా
6. కృష్ణపట్నం (నెల్లూరు)	ఆంధ్రప్రదేశ్

భారతదేశంలో భారజల కేంద్రాలు

భారజల కేంద్రం	రాష్ట్రం
1. కోటా	రాజస్థాన్
2. తాల్చేర్	ఒడిశా
3. థాల్	మహారాష్ట్ర
4. బరోడా	గుజరాత్
5. ట్యుటికోరిన్	తమిళనాడు
6. హజీరా	మధ్యప్రదేశ్
7. మణుగూరు	తెలంగాణ

అణు విద్యుత్

అణు విద్యుదుత్పత్తికి అవసరమైన యురేనియం, థోరియం, ఇల్మనైట్, మోనజైట్ ఖనిజాలు భారతదేశంలో తగినంతగా లభిస్తున్నాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

- జార్ఖండ్‌లోని రాణి మేఖలలో, రాజస్థాన్‌లోని 'ఆరావళి' పర్వత ప్రాంతంలో యురేనియం లభిస్తోంది.
- బీహార్‌లో గయ, రాజస్థాన్‌లో జైపూర్, ఉదయ్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు జిల్లాల్లో యురేనియం నిల్వలున్నాయి.
- జార్ఖండ్‌లోని 'జాదుగూడ'లో యురేనియాన్ని శుద్ధి చేసే ప్లాంట్ ఉంది.
- కేరళ తీరం వెంట ఉన్న మోనజైట్ ఇసు కల్లో థోరియం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి.
- ప్రపంచంలోని థోరియం నిక్షేపాల్లో 50 శాతంపైగా భారతదేశంలోనే ఉన్నాయి.
- ప్రస్తుతం భారతదేశ అణు విద్యుత్ సామర్థ్యం 4780 మె.వా. ఇది దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఉత్పత్తిలో సుమారు 3 శాతం.
- ప్రపంచంలో అణు విద్యుత్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఫ్రాన్స్.

భారతదేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు

1. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం (టీఏపీఎస్) (మహారాష్ట్ర):

- భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి అణు విద్యుత్ కేంద్రం.
- 1969, అక్టోబర్ 28న దీన్ని స్థాపించారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు – అప్సర.
- ఈ కేంద్రం అణు విద్యుత్ సామర్థ్యం – 1400 మె.వాట్లు.

2. రావత్ భటా అణు విద్యుత్ కేంద్రం (ఆర్ఏపీఎస్) (రాజస్థాన్):

- ఈ కేంద్రాన్ని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు.
- 1973, డిసెంబర్ 16న రాజస్థాన్‌లో నెలకొల్పారు.
- 'కోటా అణు విద్యుత్ కేంద్రం' అని కూడా అంటారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 1180 మె.వాట్లు.

3. కల్పకం అణు విద్యుత్ కేంద్రం (ఎంఏపీఎస్) (తమిళనాడు):

- 1984, జనవరి 24న తమిళనాడులోని కల్పకం వద్ద ఏర్పాటు చేశారు.
- మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్ (ఎంఏపీఎస్) అని, 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' అని కూడా అంటారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు – కామిని, ఈ రియాక్టర్ ద్వారా ప్లాటినాన్ని ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం – 440 మె.వా.

4. నరోరా అణు విద్యుత్ కేంద్రం (ఎన్ఏపీఎస్) (ఉత్తరప్రదేశ్):

- ఉత్తరప్రదేశ్‌లోని నరోరా వద్ద 1991, జనవరి 1న దీన్ని ఏర్పాటు చేశారు.
- దీని ద్వారా ప్రధానంగా ఢిల్లీకి విద్యుత్‌ను అందిస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

5. కాక్రపార అణు విద్యుత్ కేంద్రం (కెఏపీపీ) (గుజరాత్):

- గుజరాత్‌లోని కాక్రపార ప్రాంతంలో 1993, మే 6న నెలకొల్పారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

6. కైగా అణు విద్యుత్ కేంద్రం (కెపీపీ) (కర్ణాటక):

- కర్ణాటక రాష్ట్రంలోని 'కైగా' ప్రాంతంలో 2000, నవంబర్ 16న స్థాపించారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 850 మె.వా.
- తమిళనాడులోని 'కూడంకుళం' వద్ద రష్యా సహాయంతో వేయి మెగావాట్లతో రెండు అణు రియాక్టర్లను నిర్మిస్తున్నారు.
- అణు విద్యుత్ కర్మాగారంలో మితకారిగా 'భారజలం'ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చు.
- భారతదేశంలో 1962లో మొట్టమొదటి 'భారజల కేంద్రాన్ని' 'నంగల్' (ఉత్తరప్రదేశ్)లో ఏర్పాటు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్ పేరు?
   1) ఊర్వశి 2) కామిని
   3) రోహిణి 4) అప్సర
2. యురేనియం శుద్ధి ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) ట్రాంబే 2) తారాపూర్
   3) జాదుగూడ 4) కల్పకం
3. కామిని అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
   1) కల్పక్కం అణు విద్యుత్ కేంద్రం
   2) తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం
   3) కైగా అణు విద్యుత్ కేంద్రం
   4) నరోరా అణు విద్యుత్ కేంద్రం
4. సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటే?
   1) 4000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   2) 1000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   3) 1000 మె.వా. కంటే తక్కువ గల ప్రాజెక్టు
   4) ఏదీకాదు
5. 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' ఎక్కడ ఉంది?
   1) మహారాష్ట్ర 2) ఉత్తరప్రదేశ్
   3) తమిళనాడు 4) గుజరాత్
6. వీటిలో ఏది సంప్రదాయ వనరు కాదు?
   1) బొగ్గు 2) ముడిచమురు
   3) సౌర శక్తి 4) అణు శక్తి
7. మనదేశంలో మొట్టమొదటిసారిగా (1897) విద్యుచ్ఛక్తి ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   1) శివ సముద్రం 2) డార్జిలింగ్
   3) తాల్చేర్ 4) నంగల్
8. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1948 2) 1962 3) 1980 4) 1975
9. 'రీహండ్' సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఉత్తరప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) కేరళ
10. దేశంలో నాలుగో అణు విద్యుత్ కేంద్రం 'నరోరా' ఎక్కడ ఉంది?
   1) గుజరాత్ 2) రాజస్థాన్
   3) తమిళనాడు 4) ఉత్తరప్రదేశ్
11. వీటిలో ఏ శక్తి వనరు సంప్రదాయేతర శక్తి వనరు కాదు?
   1) సూర్యరశ్మి 2) అణుశక్తి
   3) పవన శక్తి 4) వేలా తరంగాలు
12. వీటిలో థర్మల్ పవర్ స్టేషన్లల్లో సరి కానిది?
   1) ఉత్తరప్రదేశ్ – దాద్రి
   2) పశ్చిమ బెంగాల్ – ఫరక్కా
   3) ఛత్తీస్‌గఢ్ – ఫూంచహార్
   4) కేరళ – కాయంకుళం
13. ససన్ థర్మల్ ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) మహారాష్ట్ర 2) మధ్యప్రదేశ్
   3) కర్ణాటక 4) ఒడిశా
14. భారతదేశంలో మొట్టమొదటి భారజల కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1975 2) 1948 3) 1962 4) 1972
15. 'కోటా' భారజల కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
   1) రాజస్థాన్ 2) ఒడిశా
   3) మహారాష్ట్ర 4) గుజరాత్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 4; 11) 2; 12) 4; 13) 2; 14) 3; 15) 1.

The greatest capacity for data transmission..

BANK EXAMS

COMPUTER KNOWLEDGE

1. UNIVAC stands for:
   a) Universal Automatic Computer
   b) Universal Array Computer
   c) Unique Automatic Computer
   d) Unvalued Automatic Computer
   e) None of the above
2. The basic operations performed by a computer are ___
   a) Arithmetic operation
   b) Logical operation
   c) Storage and relative
   d) All of the above
   e) None of the above
3. The two major types of computer chips are ___
   a) External memory chip
   b) Primary memory chip
   c) Microprocessor chip
   d) Both b and c
   e) None of the above
4. Microprocessors as switching devices are for which generation computers?
   a) First b) Second
   c) Third d) Fourth
   e) None of the above
5. What is the main difference between a mainframe and a super computer?
   a) Super computer is much larger than mainframe computers
   b) Super computers are much smaller than mainframe computers
   c) Supercomputers are focused to execute few programs as fast as possible while mainframe uses its power to execute as many programs concurrently
   d) Supercomputers are focused to execute as many programs as possible while mainframe uses its power to execute few programs as fast as possible
   e) None of the above
6. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
   a) Extended Binary Coded Decimal Interchange Code
   b) Extended Bit Code Decimal Interchange Code
   c) Extended Bit Case Decimal Interchange Code
   d) Extended Binary Case Decimal Interchange Code
   e) None of the above
7. The brain of any computer system is ___
   a) ALU b) Memory c) CPU
   d) Control unit
   e) None of the above
8. Storage capacity of magnetic disk depends on:
   a) Tracks per inch of surface
   b) Bits per inch of tracks
   c) Disk pack in disk surface
   d) All of the above
   e) None of the above
9. The two kinds of main memory are:
   a) Primary and secondary
   b) Random and sequential
   c) ROM and RAM
   d) All of the above
   e) None of the above
10. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is ___
   a) Memory b) Buffer
   c) Accumulator d) Address
   e) None of the above
11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
   a) 30 feet b) 30 yards
   c) 30 miles d) 300 miles
   e) None of the above
12. The telephone is an example of a(n) _____ signal.
   a) Analog b) Digital
   c) Modulated d) Demodulated
   e) None of the above
13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the _______.
   a) Internal modem
   b) External modem
   c) PC Card modem
   d) Wireless modem
   e) None of the above
14. A modem that is contained within the system unit is called a(n) ______ modem.
   a) External b) Internal
   c) Wireless d) Wi-Fi
   e) None of the above
15. A modem that doesn't need to be connected to a telephone line is the ______ modem.
   a) External b) Internal
   c) Wireless d) DSL
   e) None of the above
16. A special high-speed line used by large corporations to support digital communications is known as ____
   a) satellite/air connection service lines
   b) cable modems
   c) digital subscriber lines
   d) T1, T2, T3 and T4 lines
   e) None of the above
17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called _________.
   a) ISDN b) Microwave
   c) Cable modem d) DSL
   e) None of the above
18. The capacity of a communication channel is measured in ___
   a) Bandwidth b) Bit capacity
   c) Baud rate d) Data flow
   e) None of the above
19. Voice band _______
   a) allows the user to download messages
   b) is used for standard telephone communication
   c) is used in special leased lines to connect minicomputers and mainframes
   d) provides a high-speed communication channel
   e) None of the above
20. The greatest capacity for data transmission happens in ____ devices.
   a) Voice band
   b) medium band
   c) broadband d) mega-band
   e) None of the above
21. A page fault:
   a) Is an error in a specific page
   b) Occurs when a program accesses a page of memory
   c) Is an access to a page not currently in memory
   d) None of the above
   e) All of the above
22. The process of transferring data intended for a peripheral device into a disk (or intermediate store) so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ____
   a) Multiprogramming
   b) Spooling c) Caching
   d) Virtual programming
   e) All of the above
23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling is known as ____
   a) Procedure name
   b) Macro c) Label
   d) Literal e) None

KEY:

1) a 2) d 3) d 4) d 5) c 6) a 7) c 8) d 9) c 10) b 11) a 12) a 13) c 14) b 15) c 16) d 17) d 18) a 19) b 20) c 21) c 22) b 23) b

Software

Software, simply are the computer programs. The instructions given to the computer in the form of a program is called Software. It is the set of programs, which are used for different purposes. All the programs used in computer to perform specific task is called Software.

Types of software

1. System software

a) Operating System Software

DOS, Windows XP, Windows Vista, Unix/Linux, MAC/OS X etc.

b) Utility Software

Windows Explorer (File/Folder Management), Windows Media Player, Anti-Virus Utilities, Disk Defragmentation, Disk Clean, Back Up, WinZip, Win RAR etc.

2. Application software

a) Package Software

Ms. Office 2003, Ms. Office 2007, Macromedia (Dreamweaver, lash, Free hand), Adobe (Page Maker, Photo Shop)

b) Tailored or Custom Software

SAGE (Accounting), Galileo/World span (Travel) etc.

Computer Languages & Scripting:

a) Low Level Language

i) Machine Level Language

ii) Assembly Language

Machine language: These language instructions are directly executed by CPU.

Assembly language: The endeavor of giving machine language instructions a name structure that means bit strings of instructions of machine language are given name here.

b) High Level Language

It is the user friendly language, more natural language than assembly language. Assembler is needed to convert assembly language into machine language. Complier is needed to convert high level to machine language.

COBOL (Common Business Oriented Language), FORTRAN (Formula Translation), BASIC (Beginner's All-purpose Symbolic Instruction Code), C, C++ etc. are the examples of High Level Language.

Booting

The process of loading the system files of the operating system from the disk into the computer memory to complete the circuitry requirement of the computer system is called booting.

There are two types of booting:

1. Cold Booting:

If the computer is in off state and we boot the computer by pressing the power switch 'ON' from the CPU box then it is called as cold booting.

2. Warm Booting:

If the computer is already 'ON' and we restart it by pressing the 'RESET' button from the CPU box or CTRL, ALT and DEL key simultaneously from the keyboard then it is called warm booting.